శ్రీరస్తు.

కఠోపనిషత్తు

అనుభూతిప్రకాశ, ఆత్మపురాణ సహిత

కృష్ణయజుర్వేదాంతర్గతము.

శ్రీమచ్ఛంకరభగవత్పాదభాష్యముననుసరించి

శ్రీ కనుపర్తి మార్కండేయశర్మగారిచే

వ్రాయఁబడిన

సాంద్రటీకాతాత్పర్యము.

చెన్నపురి:

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచే

ప్రకటితము.

 [వెల రు. 2—0—0

Printed by
V. VENKATESWARA SASTRULU
of V. RAMASWAMY SASTRULU & SONS
at the 'Vavilla' Press
Madras.—1945.
Reprint—500

ఉపోద్ఘాతము.

వేదములు ఋక్, యజుస్, సామ, అథర్వము లను పేరులతో ౪ అని వ్యవహరింపఁబడుచున్నవి. వేదైకదేశములగు ఉపనిషత్తులు వేదములకు శిరోభూతములగుటచేత వేదాంతములని చెప్పఁబడుచున్నవి. ప్రకృతమయిన ఈకఠోపనిషత్తు యజుర్వేదమునకుసంబంధించినది. యజుర్వేదముమఱల కృష్ణమనియు, శుక్లమనియు రెండుగా విభజింపఁబడియున్నది. కృష్ణ శుక్లాత్మకమగు యజుర్వేదమంతయు కలసి ౮౬ శాఖలని కొందఱున్నూ, ౧౦౧ శాఖలని కొందఱున్నూ తలంచుచున్నారు. ౮౬శాఖలనువారిమతమునందు కృష్ణయజుస్సునకు ౭౧ శాఖలు, శుక్లయజుస్సునకు ౧౫ శాఖలు అనియు, ౧౦౧ శాఖ లనువారిమతమునందు కృష్ణయజుర్వేదమునకు ౮౬ శాఖలనియు, శుక్లయజుర్వేదమునకు ౧౫ శాఖలనియు నెఱుంగవలయును. కృష్ణయజుర్వేదముయొక్క శాఖలలో దాదాపు ౨౭ శాఖలయొక్క పేరులు మాత్రమే తెలియవచ్చుచున్నవి. వానిలో చరకశాఖలు ౧౨, మైత్రాయణీయశాఖలు ౭, తైత్తిరీయశాఖలు ౮ మొత్తము ౨౭ శాఖలయొక్క నామములే చరణవ్యూహాది గ్రంథములందు గలవు. ప్రకృతమయిన కఠోపనిషత్తు చరకశాఖలయొక్క ౧౨ శాఖలలో నొకటియగు కఠశాఖకు చేరినదని గ్రహించవలయును.

దీనిని కఠోపనిషత్తనియు, కాఠకోపనిషత్తనియు వ్యవహరించెదరు. సుప్రసిద్ధములగు దశోపనిషత్తులలో నీకఠోపనిషత్తు మూఁడవది. ఇందు రెండధ్యాయములుగలవు. ఒక్కొక అధ్యాయమునకు మూఁడేసి వల్లులుచొప్పున మొత్తము ౬ వల్లులుగా గ్రంథము విభక్తము. ముద్రితాముద్రితగ్రంథములందు వల్లులు వేర్వేఱుగ పరిగణింపఁబడియున్నను శ్రీమచ్ఛంకరభగవత్పాదాచార్యులవారి కాఠకోపనిషద్భాష్యమునందు "సంసారకార్యవృక్షావధారణేన తన్మూలస్య బ్రహ్మణః స్వరూపావధారణాయేయం షష్ఠీ వల్ల్యారభ్యతే" అని చెప్పియుండుటచేత ప్రథమాదిపరిగణనమే భాష్యకారునకు అభిప్రేతమని తెలియవచ్చుచున్నది.

కఠోపనిషత్తు—భగవద్గీతలు—బ్రహ్మగీతలు.

బ్రహ్మసూత్రములందు ఉపనిషత్తులకు శ్రుతియనియు, భగవద్గీతలకు స్మృతియనియు తఱుచుగ వ్యవహరింపఁబడియున్నది. శ్రుతిప్రతిపాదితమయినవిషయమునే స్మృతియు ప్రతిపాదించునని శాస్త్రజ్ఞుల సిద్ధాంతము. భగవద్గీతయందు ఇతరోపనిషత్తులందు ప్రతిపాదింపఁబడినవిషయము లనేకములు చెప్పఁబడియున్నను కఠోపనిషత్తునందుగలవిషయములు చాల వఱకు సంగ్రహింపఁబడినవి. కొన్నిమంత్రములుకూడ అట్లే భగవద్గీతయందును బ్రహ్మగీతలయందును గైకొనఁబడినవి చూడుఁడు:—

ఇంద్రియేభ్యః పరాహ్యర్థా అర్థేభ్యశ్చ పరం మనః,
మనసస్తు పరాబుద్ధి ర్బుద్ధే రాత్మా మహా న్పరః. కఠ. ౧-౩-౧౦.

ఇంద్రియాణి పరాణ్యాహు రింద్రియేభ్యః పరం మనః,
మనసస్తు పరాబుద్ధి ర్యో బుద్ధేః పరతస్తు సః. భగవద్గీత. ౩-౪-౨.

ఊర్ధ్వమూలోఽవాక్ శాఖ ఏషోఽశ్వత్థస్సనాతనః,
తదేవ శుక్రం తద్బ్రహ్మ తదేవామృతముచ్యతే,
తస్మిన్ లోకాః శ్రితా స్సర్వే తదు నాత్యేతికశ్చన. కఠ. ౨-౩-౧.
ఏతద్వైతత్.

ఊర్ధ్వమూల మధశ్శాఖ మశ్వత్థం ప్రాహు రవ్యయం,
ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్. భగవద్గీత. ౧౫-౧.

న జాయతే మ్రియతే వా విపశ్చిన్నాయం కుతశ్చి న్న బభూవ కశ్చిత్,
అజో నిత్య శ్శాశ్వతో ఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే.
కఠ. ౧-౨-౧౮.

న జాయతే మ్రియతే వా కదాచి
న్నాయం భూత్వా భవితా వా న భూయః,
అజో నిత్య శ్శాశ్వతో ఽయం పురాణో
న హన్యతే హన్యమానే శరీరే. భగవద్గీత. ౨-౨౦.

హంతాచే న్మన్యతే హంతుగ్ం హతశ్చే న్మన్యతే హతం,
ఉభౌ తౌ న విజానీతో నాయం హంతి న హన్యతే. కఠ. ౧-౨-౧౯.

య ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతం,
ఉభౌ తౌ న విజానీతః నాయం హంతి న హన్యతే. భగవద్గీత. ౧-౧౯.

ఇట్లనేకమంత్రము లీయుపనిషత్తునుండి భగవద్గీతల యందు పరిగ్రహింపఁబడియున్నవి. గ్రంథవిస్తరభీతిచేత బ్రహ్మగీతలనుండి యుద్ధరింపలేదు.

కఠోపనిషత్తు—బ్రహ్మసూత్రములు.

ఈయుపనిషన్మంత్రములలో కొన్నిమంత్రములు బ్రహ్మసూత్రములందు విషయవాక్యములుగా పరిగ్రహింపఁబడినవి.

మఱికొన్ని సూత్రార్థవిమర్శయందు ప్రమాణార్థము గైకొనఁబడినవి. వానిని పాఠకులయుపయోగార్థ మిట ప్రదర్శించుచున్నాఁడను:—

౧ మం. యస్య బ్రహ్మచ క్షత్త్రంచ, కఠ. ౨-౨౦ మంత్రమును,

సూ. అత్తా చరాచరగ్రహణాత్. ౧-౨-౯ సూత్రమునందును,

౨. మం. ఋతం పిబంతౌ ౩-౧ మంత్రమును,

సూ. గుహాం ప్రవిష్టా వాత్మనౌ హి తద్దర్శనాత్. ౧-౨-౧౧ సూత్రము నందును,

౩. మం. ఇంద్రియేభ్యః పరాహ్యర్థాః. ౩-౧౦ మంత్రమును,

సూ. ఆధ్యానాయ ప్రయోజనాత్. ౩ సూత్రమునందును,

౪. మం. మహతః పరమవ్యక్తం. ౩-౧౧ మంత్రమును,

సూ. ఆనుమానిక మప్యేకేషామితిచేన్న శరీరరూపకవిన్యస్త గృహీతే ర్దర్శయతిచ. ౧-౪-౧ సూత్రమునందును,

౫. మం. న తత్ర సూర్యోభాతి, ౫-౧౫ మంత్రమును,

సూ. అనుకృతేస్తస్యచ. ౧-౩-౨౨ సూత్రమునందును,

౬. మం. అంగుష్ఠమాత్రః పురుషః, ౪-౧౨ మంత్రమును,

సూ. శబ్దాదేవ ప్రమితః. ౧-౩-౨౪ సూత్రమునందును,

౭. మం. యదిదం కించ. ౬-౨ మంత్రమును,

సూ. కంపనాత్ ౧-౩-౩౯ సూత్రమునందును,

౮. మం. అశబ్ద మస్పర్శ మరూపమవ్యయం. ౬-౧౫ మంత్రమును,

సూ. వదతీతిచేన్న ప్రాజ్ఞోహి తత్ప్రకరణాత్. ౧-౪-౫

సూ. అరూపవదేవహి తత్ప్రధానత్వాత్. ౩-౨-౫ అను సూత్రములందున్నూ

౯. మం. ౧. సత్వమగ్నిం స్వర్గ్యమధ్యేషి మృత్యో. కఠ. ౧-౧౩;

౨. యే యం ప్రేతే విచికిత్సామనుష్యే ౧-౨౦;

3. అన్యత్ర ధర్మా దన్యత్రాధర్మాత్ ౨-౧౪;
౪. లోకాదిమగ్నింతమువాచ తస్మై ౧-౧౫;
౫. న జాయతే మ్రియతే వా ౨-౧౮;
౬. హంతత ఇదం ప్రవక్ష్యామి ౫-౬;
౭. యోనిమన్యే ప్రపద్యంతే ౫-౭;
౮. స్వప్నాంతం జాగరితాంతం ౪-౪;
౯. యదేవేహ తదముత్ర ౪-౧౦;
౧౦. తం దుర్దర్శం గూఢమనుప్రవిష్టం. ౨-౧౨. అను మంత్రములను,
సూ. త్రయాణా మేవ చైవ ముపన్యాసః ప్రశ్నశ్చ ౧-౪-౬ అనుసూత్రము నందును,
౧౦. మం. ౧. బుద్ధే రాత్మా మహాన్పరః కఠ. 3-౧౦;
౨. మహాంతం విభుమాత్మానం. కఠ. ౨-౨౨. అనుమంత్రములను,
సూ. మహద్వచ్చ. ౧-౪-౭ అనుసూత్రమునందును,
౧౧. మం. బుద్ధింతు సారథిం విద్ధి. కఠ. 3-3 మంత్రమును,
సూ. అంతరావిజ్ఞానమనసీక్రమేణ తల్లింగాదితిచేన్నా విశేషాత్. ౨-3-౧౫ అనుసూత్రమునందును,
౧౨. మం. ఏకస్తథా సర్వభూతాంతరాత్మా. ౫-౧౧ మంత్రమును,
సూ. స్మరంతిచ ౨-3-౪౭ సూత్రమునందును,
౧3. మం. న సాంపరాయః ప్రతిభాతిబాలం. కఠ. ౨-౬ మంత్రమును,
సూ. సంయమనే త్వనుభూయైతరేషా మారోహావరోహౌ తద్గతిదర్శనాత్. 3-౧-౧3 సూత్రమునందును,
౧౪. మం. ౧. య ఏషసుప్తేషు జాగర్తి. ౫-౮;
౨. శతాయుషః పుత్రపౌత్రాన్. ౧-౨3;
3. కామానాం త్వాకామభాజం. ౧-౨౪ మంత్రములను,

సూ. నిర్మాతారం చైకే పుత్రాదయశ్చ. 3-౨-౨ సూత్రమునందును,

౧౫. మం. మనసైవేదమాప్తవ్యం. ౪-౧౧ మంత్రమును,

సూ. అపిచైవ మేకే. 3-౨-౧3 సూత్రమునందును,

౧౬. మం. పరాంచి ఖాని వ్యతృణత్స్వయంభూః. ౪-౧ మంత్రమును,

సూ. అపిచ సంరాధనే ప్రత్యక్షానుమానాభ్యామ్. 3-౨-౨౪ సూత్రమునందును,

౧౭. మం. ౧. సర్వేవేదా యత్పద మామనంతి. కఠ. ౨-౧౫.

౨. మహద్భయం వజ్రముద్యతం ౬-౨ మంత్రములను,

సూ. దర్శయతి చ 3-3-౪ సూత్రమునందును,

౧౮. మం. ౧. ఏష సుప్తేషు భూతేషు. కఠ. 3-౧౨;

౨. యచ్ఛే ద్వాఙ్మనసీ ప్రాజ్ఞః 3-౧3 మంత్రములను,

సూ. ఆత్మశబ్దాచ్చ. 3-3-౧౫ సూత్రమునందును,

౧౯. మం. ౧. ఋతం పిబంతౌ సుకృతస్య. కఠ. 3-౧.

౨. అన్యత్ర ధర్మా దన్యత్రాధర్మాత్. ౨-౧౪.

3. యస్సేతు రీజానానాం. 3-౨ మంత్రములను,

సూ. ఇయ దామననాత్. 3-3-3౪ సూత్రమునందును,

౨౦. మం. శ్రవణాయాపి బహుభిర్యోనలభ్యః. కఠ. ౨-౭ మంత్రమును,

సూ. ఐహిక మప్యప్రస్తుతప్రతిబంధే తద్దర్శనాత్. 3-౪-౫౧ సూత్రమునందును,

౨౧. మం. యోనిమన్యే ప్రపద్యంతే. కఠ. ౫-౭ మంత్రమును,

సూ. తదాఽపీతే స్సంసారవ్యపదేశాత్. ౪-౨-౮ సూత్రమునందును,

౨౨. మం. యథోదకం శుద్ధే శుద్ధం. కఠ. ౪-౧౫ మంత్రమును,

సూ. అవిభాగేన దృష్టత్వాత్ ౪-౪-౪ సూత్రమునందును,

౨3. మం. న తత్ర సూర్యోభాతి ౫-౧౫ మంత్రమును,

సూ. దర్శయతశ్చైవం ప్రత్యక్షానుమానే ౪-౪-౨౦ సూత్రమునందును,

౨౪. మం, ౧. తయోర్ధ్వమాయన్నమృతత్వమేతి. ౪౪. ౬-౧౬ మంత్రమును,

సూ. అనావృత్తి శ్శబ్దాదనావృత్తిశ్శబ్దాత్. ౪-౪-౨౨ సూత్రమునందును చర్చించియున్నారు.

ఈమంత్రములన్నియు ఆయాసూత్రములందు చక్కఁగా నిరూపింపబడియున్నవి.

నచికేతుఁడు—ప్రాచీనగ్రంథములు.

ఈయుపనిషత్తునందు బ్రహ్మజిజ్ఞాసతో సదాచార్యుని ఆశ్రయించి కృతార్థుఁడయిన నచికేతునియొక్క చరిత్రము చెప్పఁబడినది. కృష్ణయజుర్వేదమునందును ఇతనిచరిత్ర మిట్లు చెప్పఁబడినది:—

ఉశన్హవై వాజశ్రవస స్సర్వవేదసం దదౌ । తస్యహ నచికేతా నామ పుత్ర ఆస । తగ్ంహవై కుమారగ్ంసన్తం । దక్షిణాసు నీయమానాసు శ్రద్ధా వివేశ । సహోవాచ । తత కస్మైమాందాస్యసీతి । ద్వితీయం తృతీయం। తం హ పరీత ఉవాచ । మృత్యవేత్వా దదామీతి । తగ్ంహ స్మోత్థితం వాగభివదతి. ౪౨. గౌతమకుమార మితి । సహోవాచ । పరేహి మృత్యోర్గృహాన్। మృత్యవేవై త్వాఽదా మితి । తం వై ప్రవసన్తం గంతాఽసీతిహోవాచ । తస్యస్మతిస్రోరాత్రీ రనాశ్వాన్ గృహే వసతాత్ । స యదిత్వాపృచ్ఛేత్ । కుమార కతిరాత్రీ రవాత్సీరితి । తిస్ర ఇతి ప్రతిబ్రూతాత్ । కిం ప్రథమాగ్ం రాత్రి మాశ్నా ఇతి. ౪౩. ప్రజాంతఇతి । కింద్వితీయామితి । పశూగ్ స్తఇతి। కింతృతీయామితి । సాధుకృత్యాం తఇతి । తం వై ప్రవసన్తం జగామ । తస్య హాతిస్రోరాత్రీరనాశ్వా న్గృహ ఉవాస । తమాగత్య పప్రచ్ఛ । కుమార

కతిరాత్రీ రవాత్సీ రితి । తిస్ర ఇతి ప్రత్యువాచ. ४४. కింప్రథమాగ్ం రాత్రి మాశ్నా ఇతి । ప్రజాం త ఇతి । కిం ద్వితీయామితి । పశూగ్ స్త ఇతి । కిం తృతీయామితి । సాధుకృత్యాంత ఇతి । నమస్తే అస్తు భగవ ఇతిహోవాచ । వరం వృణీష్వేతి । పితరమేవ జీవన్నయానీతి । ద్వితీయం వృణీష్వేతి. ४౫. ఇష్టాపూర్తయోర్మే క్షితిం బ్రూహీతిహోవాచ । తస్మైహైతమగ్నిం నాచికేత మువాచ । తతో వై తస్యేష్టాపూర్తే నాక్షీయేతే । నాస్యేష్టా పూర్తే క్షీయేతే । యోఽగ్నిం నాచికేతం చినుతే । య ఉచైనమేవం వేద । తృతీయం వృణీష్వేతి । పునర్మృత్యోర్మే ఽపజితిం బ్రూహీతి హోవాచ। తస్మై హైతమగ్నిం నాచికేత మువాచ । తతో వై సోఽపపునర్మృత్యుమజయత్. ४౬. అపపునర్మృత్యుంజయతి । యోఽగ్నిం నాచికేతం చినుతే । య ఉచైన మేవం వేద.

తై. బ్రా. 3 అష్ట. ౧౧ ప్రశ్న. ౮. అనువాకము.

౧. తా. వాజశ్రవసుఁడు విశ్వజిద్యాగము చేసెను అతనికి నచికేతుఁ డనుపుత్త్రుఁ డుండెను. తండ్రి యాగదక్షిణను ఋత్విగాదుల కిచ్చునప్పుడు నాయనా! నన్ను ఎవ్వరికిచ్చెదవు? అని రెండుమూఁడుపర్యాయములు అడిగెను. ఆమాటవిని తండ్రి కోపముగలవాఁడై మృత్యుదేవత కిచ్చెదనని చెప్పెను. కుమారుఁడు సరియని మృత్యుదేవతదగ్గఱకు పోవుటకు బయలుదేరగా ఆకాశవాణి యిట్లు పలికినది. నీవు యమధర్మరాజు ఊర్లో లేనపుడు అతనియింటికిపోయి ३ రోజులు అతనియింట పస్తుపడియుండుము. అతఁ డింటికివచ్చినతర్వాత నాయింటికివచ్చి, ఎన్నాళ్లు అయినది అని యముఁడు నిన్ను అడుగును. అప్పుడు 3 రోజులు అయినది అని నీవు బదులుచెప్పుము. మొదటిరోజున ఆహారమేమి ? యని యడుగును. నీప్రజలను భక్షించితినని చెప్పుము. రెండవరోజునయేమి భుజించితివని యడుగును. నీపశు

వులను భక్షించితినని చెప్పుము. మూఁడవరోజున యేమితిన్నావని యడుగును నీవొనర్చిన సత్కార్యమును భక్షించితినని చెప్పుము. అంతట నచికేతుడు అట్లే యమధర్మరాజు గ్రామములో లేనప్పుడు అతనియింటికిపోయి ఆకాశవాణి చెప్పినప్రకారమే చేసి యముఁడువచ్చియడుగగా ఆకాశవాణి చెప్పుమనినట్లే యమునకు సమాధానము చెప్పెను. అంతట యముఁడు వినయపూర్వకముగా నచికేతునకు నమస్కరించి మూఁడువరము లొసంగుచున్నాను. వలయువానిని కోరుకొనుము అని చెప్పెను. అంతట ౧ ఈశరీరముతోడనే నేను తిరిగి నాతండ్రికడకు పోవునటులను, ౨ ఇష్టాపూర్తకర్మల నెల్లప్పుడు నేను చేయుచుండునట్లును, 3 మృత్యుజయమును అనుగ్రహింపవలయును అని కోరెను. యముఁడట్లే యొసంగెను. కనుక నాచికేతాగ్నిచయన మొనర్చినవాఁడు ఇష్టాపూర్తకర్మలతో సర్వదా ప్రకాశించుచు మృత్యువును జయించి అమృతత్వమునందును, ఈవిషయము నెఱింగిన వానికికూడ ఇట్టిఫలము లభించును.

౨. మహాభారతము అనుశాసనపర్వము ౧౦౬-వ అధ్యాయమంతయు ఈనచికేతునిగూర్చియే చెప్పఁబడినది. ఈనచికేతుఁడున్నూ ఔద్దాలకియే. కాని అచ్చట కథ మఱొకవిధముగనున్నది. తండ్రి దీక్షావంతుఁడయి నదీతీరమునందు జపాదిక మొనర్చి యింటికివచ్చెను. ఇంటికివచ్చినతర్వాత తనకమండలువు, ఇధ్మలు, దర్భలు, పుష్పములు మొదలయినవానిని నదీతీరమునందే పెట్టి మరిచివచ్చినసంగతిని గ్రహించినవాఁడయి వానిని తీసికొనిరమ్మని కుమారుఁడగు నచికేతుని పంపెను. నచికేతుఁడు నదీతీరమునకు పోవులోపలనే నదీప్రవాహమువచ్చుటచేత ఆ

కమండలువు మున్నగునవి నదిలోకొట్టుకొనిపోయెను. కుమారుఁడింటికి తిరిగివచ్చి తండ్రితో యీసంగతి చెప్పఁగా ఆకలితో మండుచున్న ఔద్దాలకి మృత్యులోకమునకుపొమ్మని కొడుకును తిట్టెను. ఆమాట అనఁగానే నచికేతుఁడు మూర్ఛితుఁడయి క్రిందపడిపోయెను. నచికేతునియాత్మ యమలోకమునకు పోఁగానే దివ్యదృష్టిగలయముఁడు నచికేతుని గౌరవించినవాఁడయి మీతండ్రి కోపముతో చెప్పినమాటప్రకారము నిన్నిచ్చటికి రప్పించితిని. నీకింకా ఆయుస్సు ఉన్నది కనుక మఱల భూలోకమునకుపొమ్ము అని నచికేతునితో చెప్పెను. అంతట పుణ్యకర్మలనొనర్చి స్వర్గలోకసౌఖ్యము ననుభవించుచున్న మహాత్ములను చూడవలయుననుకోరిక నాకు కలదని నచికేతుఁడు చెప్పఁగా అట్లే యని యముఁడు చూపించును. ఒకచోట మహావైభవముతో సౌఖ్యము ననుభవించుచున్నవారిని గాంచి వీరెవ్వరని యడుగగా గోదానమునొసంగినవారని చెప్పి యతనికి గోదానమాహాత్మ్యమును బోధించును. తర్వాత నచికేతుఁడు యమునిచేత అనుజ్ఞాతుఁడయి మఱల స్వగృహాభిముఖుఁడయినవెంటనే గృహమునందు విసంజ్ఞమయిపడియున్న నచికేతునిశరీరము చైతన్యముకలిగి లేచికూర్చుండెను. తండ్రి ఆశ్చర్యముగలవాఁడయి పుత్త్రునియడుగగా పుత్త్రుఁడు తాను యమలోకమునకు పోయినదిమొదలుకొని తిరిగి యింటికివచ్చిన వఱకుగల సమాచారమును తండ్రికి తెలిగించెను.

3. ఈయుపనిషత్తునందు చెప్పఁబడినకథ సుప్రసిద్ధమగుటచేత మఱల దాని నిచట వివరింపలేదు. తైత్తిరీయబ్రాహ్మణము

నందలికథ ఉపనిషత్ప్రతిపాదితమయినకథకు చాలవఱకు అన్ని విషయములందును సరిపోవుచున్నది. భారతోక్తము కొన్ని విషయములందుమాత్రము సరిపోవును.

కఠోపనిషత్తు—ఇతరగ్రంథములు.

ఈకఠోపనిషదర్థము ఆత్మపురాణము౯-వ అధ్యాయము నందున్నూ, అనుభూతిప్రకాశమునందు ౧౧-వ అధ్యాయము నందున్నూ వివరింపఁబడియున్నది. ఈగ్రంథాంతమునందు పై రెండధ్యాయములను చేర్చి ముద్రించియున్నారము. సూతసంహితయందుగల బ్రహ్మగీతయందు ఈకఠోపనిషద్వివరణము ౧౦-వ అధ్యాయమునందు గలదు. ఈకఠోపనిషన్మంత్రములు చాలవఱకు యథాప్రకారము గైకొనఁబడినవి.

పరమేశ్వరునియనుగ్రహాతిశయమువలన ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, తైత్తిరీయోపనిషత్తు లీవిధముగ ఆంధ్రటీకాసహితముగ ప్రకటింపఁబడినవి. శ్వేతాశ్వతరము ముద్రింపఁబడుచున్నది. ఛాందోగ్య, బృహదారణ్యకోపనిషత్తులుకూడ త్వరలో ముద్రింపఁబడును. గుణదోషజ్ఞులగు విద్వాంసులు ప్రమాదాజ్ఞానసంభవములగుదోషములను తెలిపినయెడల కృతజ్ఞతాపూర్వముగ గ్రహించి ధన్యవాదపురస్సరముగ ద్వితీయముద్రణమునందు సంస్కరించుకొందుము. ఇట్టియుద్గ్రంథములను సర్వాంగసౌష్ఠవముగ ముద్రించి ప్రకటించుచున్న శ్రీ వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండుసన్స్

సంస్థకు అధిపతులును, శ్రీ వావిళ్ల రామస్వామిశాస్త్రులవారి పుత్త్రులును మామిత్త్రులును అగు శ్రీవావిళ్ల వేంకటేశ్వరశాస్త్రి గారికి సత్కార్యప్రోత్సాహకుఁడగు పరమేశ్వరుఁడు ఇతోఽప్యధికముగ ఐశ్వర్యాద్యభివృద్ధుల నొసంగి పరిపూర్ణాయు రారోగ్యముల నొసంగుఁగాక.

ఇట్లు,

కసుపర్తి మార్కండేయశర్మ,
స్వధర్మప్రకాశినీసంపాదకుఁడు.

౨౩-౧౨-౩౨
కీలుపాకు, మదరాసు.

విషయసూచిక.

ప్రథమాధ్యాయము. ప్రథమవల్లి. పుట. ౧-౪౪.

			ప్రతి 1-కి రూ.	అ.
కాలజ్ఞానము, ఆంధ్రతాత్పర్యసహితము		...	0	4
రావణకుమారతంత్రము	,,	...	0	6
చక్రదత్త	,,	...	4	0
ఘృతతరంగము	,,	...	1	4
చికిత్సాసారము	,,	...	2	8
నాడీజ్ఞానము		...	0	4
భేషజకల్పము, సాంధ్రతాత్పర్యము		...	0	8
దేహతత్త్వనిర్ణయము	,,	...	0	6
మసూచికము (Small-Pox)		...	0	4
వైద్యశతశ్లోకి		...	0	4
రసప్రదీపిక, పద్యకావ్యము, ఆంధ్రతాత్పర్యసహితము		...	0	12
రాజమార్తాండము	,,	...	0	10
లోలింబరాజీయము, సద్వైద్యజీవనము	,,	...	0	12
హోమియోపతి గృహవైద్యము		...		10
వస్తుగుణమహోదధి, తెనుగువచనము		...	6	0
వంధ్యాతంత్రము, సాంధ్రతాత్పర్యము		...	0	8
వృక్షాయుర్వేదము	,,	...	0	6
సహదేవపశువైద్యశాస్త్రము, తాత్పర్యము		...	0	6
సర్వౌషధిగుణకల్పము	,,	...	2	0
శార్ఙ్గధరసంహిత, క్రొత్తకూర్పు	,,	...	5	8
శార్ఙ్గధరకృతత్రిశతి		...	0	8
సుశ్రుతశారీరము		...	2	8
షడ్రసనిఘంటువు, అభిధానరత్నమాల		...	0	12
సూతికాచికిత్స, డా॥ వరదప్పనాయుడు		...	1	4
మాధవనిదానము, ఆంధ్రవ్యాఖ్యానము		...	4	8

అకారాదివర్ణానుక్రమేణ
మంత్రప్రతీకసూచికా.

మంత్రప్రతీకాని.	అధ్యాయ.	వర్గ.	మంత్ర.	పుట.
అస్తీత్యేవోపలబ్ధవ్యః	౨	౩	౧౩	౧౬౨
అస్యవిస్రంసమానస్య	౨	౨	౪	౧౩౦
ఆ				
ఆత్మానం రథినం విద్ధి	౧	౩	౩	౮౭
ఆశాప్రతీక్షేసంగతగ్ం	౧	౧	౮	౧౫
ఆసీనో దూరం వ్రజతి	౧	౨	౨౧	౭౬
ఇ				
ఇంద్రియాణాం పృథగ్భావం	౨	౩	౬	౧౫౫
ఇంద్రియాణి హయానాహుః	౧	౩	౪	౮౮
ఇంద్రియేభ్యఃపరంమనః	౨	౩	౭	౧౫౬
ఇంద్రియేభ్యఃపరాః	౧	౩	౧౦	౯౩
ఇహచే దశకద్బోద్ధుం	౨	౩	౪	౧౫౨
ఉ				
ఉత్తిష్ఠతజాగ్రత	౧	౩	౧౪	౯౯
ఉశన్హవైవాజశ్రవసః	౧	౧	౧	౬
ఊ				
ఊర్ధ్వమూలోఽవాక్శాఖః	౨	౩	౧	౧౪౫
ఊర్ధ్వంప్రాణమున్నయతి	౨	౨	౩	౧౨౯
ఋ				
ఋతం పిబంతౌసుకృతం	౧	౩	౧	౮౩

మంత్రప్రతీకాని.	అధ్యాయ.	వర్గ.	మంత్ర.	పుట.
భ				
భయాదస్యాగ్ని స్తపతి	౨	౩	౩	౧౫౧
మ				
మనసైవేదమాప్తవ్యం	౨	౧	౧౧	౧౧౮
మహతః పరమవ్యక్తం	౧	౩	౧౧	౯౪
మృత్యుప్రోక్తాం నచికేతః	౨	౩	౧౮	౧౭౦
య				
య ఇమం పరమం	౧	౩	౧౭	౧౦౩
య ఇమం మధ్వదం	౨	౧	౫	౧౧౨
యఏషసుప్తేషుజాగర్తి	౨	౨	౮	౧౩౪
యచ్ఛేద్వాఙ్మనసీప్రాజ్ఞః	౧	౩	౧౩	౯౩
యతశ్చోదేతిసూర్యః	౨	౧	౯	౧౧౬
యథాఽఽదర్శేతథా	౨	౩	౫	౧౫౩
యథా పురస్తాద్భవితా	౧	౧	౧౧	౧౯
యథోదకం దుర్గేవృష్టం	౨	౧	౧౪	౧౨౨
యథోదకం శుద్ధేశుద్ధం	౨	౧	౧౫	౧౨౧
యదా పంచావతిష్ఠంతే	౨	౩	౧౦	౧౫౯
యదా సర్వే ప్రభిద్యంతే	౨	౩	౧౫	౧౧౪
యదా సర్వే ప్రముచ్యంతే	౨	౩	౧౪	౧౬౩
యదిదం కించ జగత్సర్వం	౨	౩	౨	౧౫౦
య దేవేహ తదముత్ర	౨	౧	౧౦	౧'౭
యస్తువిజ్ఞానవాన్	౨	౩	౬	౯౧
,,	౨	౩	౮	

మంత్రప్రతీకానాం అకారాదివర్ణానుక్రమణీ

సమాప్తా.

శ్రీ ర స్తు.

క ఠో ప ని ష త్తు

[కృష్ణయజుర్వేదాంతర్గతము]

ఆంధ్రటీకాతాత్పర్యవివరణసమన్వితము.

పూర్వశాంతిపాఠమంత్రము.

ఓం. సహ నా వవతు, సహ నౌ భునక్తు, సహ వీర్యం కరవావహై, తేజస్వి నావధీత మస్తు, మా విద్విషావహై.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

పద. సహ నౌ అవతు, సహ నౌ భునక్తు, సహ వీర్యం కరవావహై, తేజస్వి నౌ అధీతం అస్తు, మా విద్విషావహై, ఓం శాంతిః శాంతిః శాంతిః.

టీక. నౌ = శిష్యాచార్యులమగు మమ్ములనిద్దఱను, సహ = కూడా, అవతు = (బ్రహ్మము) సంరక్షించుఁగాక. నౌ = శిష్యాచార్యులమగు మమ్ములనిద్దఱను, సహ = కూడా, భునక్తు = (బ్రహ్మము) పరిపాలించుఁగాక. వీర్యం = విద్యానిమిత్తమగు సామర్థ్యమును, సహ = కూడా, కరవావహై = మేమిద్దఱము చేసెదముగాక. నౌ - శిష్యాచార్యులమగు మాయిద్దఱియొక్క, అధీతం=అధ్యయనముచేయఁబడిన ఉపనిషద్విద్య, తేజస్వి = తేజోవంతమైనది, అస్తు=అగుఁగాక. మావిద్విషావహై = (ప్రమాదకృతా పరాధాదికమువలన) మాయిద్దఱకు ద్వేషముకలుగకయుండుఁగాక.

ఓం=ప్రణవప్రతిపాదితమగు బ్రహ్మము మాయం దనుగ్రహముంచుఁ గాక.

శాంతిః=ఆధ్యాత్మిక తాపశాంతి యగుఁగాక.
శాంతిః=అధిభౌతిక తాపశాంతి యగుఁగాక.
శాంతిః=అధిదైవిక తాపశాంతి యగుఁగాక.

తా. శిష్యాచార్యులమగు మమ్ములనిద్దఱను పరబ్రహ్మము సంరక్షించుఁగాక. శిష్యాచార్యులమగు మాకు ఆత్మసుఖానుభవము కలుగుఁగాక. శిష్యాచార్యులమగు మాకిద్దఱకు విద్యాసంబంధమయినసామర్థ్యము చక్కఁగా నుండుఁగాక. మేము అధ్యయన మొనర్చిన బ్రహ్మవిద్య తేజోవంతమయి వెలయుఁగాక. ప్రమాదకృతాపరాధాదికమువలన శిష్యాచార్యుల మగు మాకు మాకు పరస్పరము ద్వేషము లేక యుండుఁగాక. మాయందు ప్రణవప్రతిపాదితబ్రహ్మము అనుగ్రహము కలిగియుండుఁగాక. ఆధ్యాత్మిక, అధిభౌతిక, అధిదైవికములను త్రివిధతాపములు మాకు శమించుఁగాక.

వివరణము:—శాంతియొక్క ప్రయోజన మేమనఁగా, చెప్పఁబోవునట్టి నిర్గుణసగుణరూపబ్రహ్మవిద్యోపదేశసమయమునందు విఘ్నములు కలుగకుండుటయే యగుచున్నది. బ్రహ్మవిద్యయన్నను ఆత్మవిద్యయన్నను ఒక్కటియే, ఆత్మవిద్యాప్రాప్తియే మోక్షము. అట్టి ఆత్మవిద్య నిర్విఘ్నముగ లభించుటకు శాంతిపాఠము అత్యావశ్యకమని శిష్టులు తలంచుచున్నారు.

"సహ నౌ భునక్తు భోజయతు" అని భాష్యమునం దుండుటచేతను, వ్యాఖ్యాతలు 'పాలయత్విత్యర్థః' అని వ్రాయుటచేతను 'పరిపాలించుఁగాక' యని అర్థమును వ్రాసినాఁడను "గురు వేవిధముగా ఆలస్యము లేక యుపదేశించునో, ఆయుపదేశించిన విషయమును నేను అజ్ఞానముచేత గ్రహింపలేకపోవుటగాని లేక విపరీతజ్ఞానముచేత వేఱుగా గ్రహించుటగాని లేక ఉన్నది ఉన్నట్టుగా గ్రహించునటుల చేసి మమ్ములను పరిపాలించుఁగాక" యని మఱొకవ్యాఖ్యాత వివరించెను.

వీర్యమనఁగా విద్యానిమిత్తమయిన సామర్థ్యము—అనఁగా ఊహాపోహాదికము, విషయపరిగ్రహణసామర్థ్యము మున్నగునవి యనిగ్రహించునది.

శంకరకృతకాఠకోపనిషద్భాష్యపీఠిక

షడ్గుణైశ్వర్యసంపన్నుఁడగుటచేత భగవానుఁడని వ్యవహరింపఁబడుచున్న వాఁడును, వైవస్వతుఁడును, బ్రహ్మవిద్యాచార్యుఁడును అగు యమునకు— మృత్యుదేవతకు, నచికేతసునకును నమస్కారము.

కఠోపనిషత్తుయొక్క భావార్థము సులభముగా తెలియుటకుఁగాను అల్పగ్రంథమగువృత్తిని రచించుచున్నాము.

ఉపనిషచ్ఛబ్దార్థము.

౧. ఉపనిషత్పదము 'షద్ ఌ' విశరణ గత్యవసాదనేషు, అనుధాతువునకు ఉప, ని, అను ఉపసర్గలుచేరగా క్విప్ ప్రత్యయాంతమయినప్పుడేర్పడును. ఉపనిషత్పదముచేత వ్యాఖ్యానముచేయఁదలఁచిన గ్రంథమునందు చెప్పఁబడినట్టియు, తెలిసికొనవలసినవస్తువునకు సంబంధించినట్టియు, విద్య, చెప్పఁబడుచున్నది. ఉపనిషత్తనఁగా బ్రహ్మవిద్యయని మీరెట్లు చెప్పుచున్నారను నెడల అందులకు సమాధానము నాలకింపుడు. మోక్షేచ్ఛులయిన మహానుభావులు ఇహపరలోకసుఖవిముఖులయినవారలయి ఉపనిషచ్ఛబ్దవాచ్యమయినట్టియు, వక్ష్యమాణలక్షణమయినట్టియు, బ్రహ్మవిద్యను ఆచార్యోపదేశముచేత పొంది తన్నిష్ఠులయి నిశ్చయముగా పరిశీలించినయెడల అట్టిపరిశీలనముగలవారియొక్క సంసారబీజమగు అవిద్యాదికమును సమూలముగ నశింపఁజేయుచున్నదను అర్థ సంబంధమువలన బ్రహ్మవిద్య ఉపనిషత్తని వ్యవహరింపఁబడుచున్నది. ఇదేవిషయ మీయుపనిషత్తునందే ముందు.—

“నిచాయ్య తం మృత్యుముఖాత్ప్రముచ్యతే.”

కఠ. ౧ అధ్యా. 3 వల్లీ. ౧౫ మం.

అనుమంత్రముచేత చెప్పఁబడుచున్నది.

౨. పూర్వోక్తవిశేషణముచేత ముముక్షువులగు వారిని పరబ్రహ్మమును పొందించుచున్నది కావున బ్రహ్మమును పొందించుచున్నదనుసంబంధముచేత

బ్రహ్మవిద్య ఉపనిషత్తని వ్యవహరించబడుచున్నది. కావున నీ యీ యుప నిషత్తునందే ముందు ఇట్లని చెప్పఁబడినది:—

"బ్రహ్మప్రాప్తో విరజోఽభూ ద్విమృత్యుః"

కఠ. అధ్యా. ౨. వల్లీ. 3. మం. ౧౮.

3. భూరాదిలోకములకు ఆదియును—అనఁగా ప్రథమజుఁడును, హిరణ్యగర్భునివలన జన్మించినవాఁడును అగు అగ్నియొక్క విషయికమగు నట్టియు, నచికేతసునిచేత రెండవవరముగా ప్రార్థింపఁబడినట్టియుం అగ్నివిద్యస్వర్గ లోకఫలప్రాప్తికి హేతుభూతమయి లోకాంతరములందు తఱుచుగా పొందఁ బడుచున్న గర్భవాస, జన్మ, జరాద్యుపద్రవములను సడలించి నాశన మొనర్చు చున్నది కావున ధాత్వర్థసంబంధము చేత అగ్నివిద్యసైతము ఉపనిషత్తని వ్యవ హరింప నర్హమగుచున్నది. అగ్నివిద్య ఇట్టి యమృతత్వము నొసంగుచున్నదని యీ యుపనిషత్తునందే చెప్పఁబడుచున్నది:—

"స్వర్గలోకా అమృతత్వం భజంతే"

కఠ. అధ్యా. ౧. వల్లీ. ౧. మం. ౧౩.

పూర్వ:—బ్రహ్మవిద్యాధ్యేతలు ఉపనిషత్పదమును గ్రంథపరముగా వ్యవహరించుచున్నారు. "ఉపనిషత్తులను చదువుచున్నాము. ఉపనిషత్తులను బోధించుచున్నారము" అని లోకవ్యవహారము సర్వత్ర సుప్రసిద్ధమే కదా.

సమా:—ఇదొకదోషము కాఁజాలదు. అవిద్యాది సంసారహేతునాశన రూపమగు నదిధాత్వర్థము గ్రంథమాత్రమునందసంభవము కావునను, బ్రహ్మ విద్యయందే అట్టియర్థము సంభవమగుటచేతను ముఖ్యముగా బ్రహ్మవిద్యయే ఉపనిషచ్ఛబ్దవాచ్యమయినను గ్రంథమునందట్టివిషయమే నిరూపింపఁబడి యుండుటచేత "ఆయుర్వై ఘృతం" అనుచోటవలె గ్రంథమునందు ఉప నిషచ్ఛబ్దము ప్రయోగింపఁబడినది. కావున బ్రహ్మవిద్యయందు , ముఖ్య

వృత్తిగను, గ్రంథమునందు గౌణవృత్తిగను ఉపనిషచ్ఛబ్దము ప్రయుక్తమగు చున్నది.

ఉపనిషచ్ఛబ్ద నిర్వచనముచేతనే ఉపనిషద్విద్యాధికారి యిట్టివాఁడని నిర్ణయింపఁబడినది. ప్రత్యగాత్మభూతమయిన పరబ్రహ్మమే బ్రహ్మవిద్యకు విషయమనియు, ప్రయోజనము ఆత్యంతికసంసారనివృత్తిరూపమగు బ్రహ్మప్రాప్తి యనియు, సంసారనివృత్త్యాదిప్రయోజనమే బ్రహ్మవిద్యకు సంబంధమనియు ఎఱుంగవలయును. కావున యథోక్తలక్షణములుగల అధికారి, విషయ, ప్రయోజన సంబంధములుగల బ్రహ్మవిద్యను కరతలామలకమువలె ప్రకాశింపఁజేయుటచేత నీకఠోపనిషత్తునందుఁ గల వల్లులన్నియు యథోక్త అధికారి, విషయ, ప్రయోజన సంబంధములు గలవియే కావున వానిని మాకు తెలిసినంతవఱకు వ్యాఖ్యానము నొనర్చుచున్నారము.

టీక. ఉపనిషచ్ఛబ్దము "షద్ఌ విశరణ గత్యవసాదనేషు" అను ధాతువునుండి పుట్టినది. ఆధాతువునకు.—

౧. విశరణము=హింసించుట, నశింపఁజేయుటయు,

౨. గతి=గమనము, పొందించుట.

3. అవసాదనము=సడలింపఁజేయుట.

అనునూఁడర్థములు గలవు. పైత్రివిధములగు అర్థములకు సంబంధించునటుల నీవిధమయినవ్యుత్పత్తిని భాష్యకారులవారొనర్చిరని ఎఱుంగునది.

కఠోపనిషత్తు

ప్రథమాధ్యాయము — ప్రథమవల్లీ.

౧-వ మంత్రము.

మూ. ఓం. ఉశన్హ వై వాజశ్రవస స్సర్వవేదసం దదౌ,
తస్య హ నచికేతా నామ పుత్ర ఆస. ౧

పద. ఉశన్ హ వై వాజశ్రవసః సర్వవేదసమ్ దదౌ, తస్య హ నచికేతా నామ పుత్త్రః ఆస. ౧

టీక. వాజశ్రవసః=వాజశ్రవునిపుత్త్రుఁడగు వాజశ్రవసుఁడు, ఉశన్= (విశ్వజిద్యాగాచరణమువలన లభించెడిఫలమును) అభిలషించినవాఁడై (విశ్వజిద్యాగమునొనర్చెను. ఆయాగమునం దతఁడు) సర్వవేదసం = తనయొక్క సర్వస్వమున్నూ, దదౌ=(యాగదక్షిణగా) ఇచ్చెను. తస్య=ఆవాజశ్రవసునకు, నచికేతానామ=నచికేతుఁడనుపేరుగల, పుత్త్రః=పుత్త్రుఁడు, ఆస=ఉండెను.

తా. ఉపనిషదారంభమునందు చెప్పఁదలఁచినవిషయమును ప్రథమమున తెలుపక వాజశ్రవసుఁడను ఒకమహర్షియుండెను. అతనికి నచికేతుఁడనుపుత్త్రుఁడొకఁ డుండెనని ఆఖ్యాయికను ప్రారంభించిచెప్పుట ప్రతిపాదింపఁ బోవునట్టి విద్యయొక్క స్తుత్యర్థమని యెఱుంగవలయును.—వాజశ్రవుఁడను ఒక మహర్షియుండెను. అతఁడు విశ్వజిద్యాగఫలము నభిలషించిన వాఁడయి విశ్వజిద్యాగము నొనర్చెను. ఆవిశ్వజిద్యాగము నొనర్చిన వాజశ్రవసుఁడు విశ్వజిద్యాగమునకు విహితమయిన సర్వస్వదక్షిణను ఋత్విక్కులకొసంగెను. ఆవిశ్వజిద్యాగము ననుష్ఠించిన యజమానుఁడగు వాజశ్రవసునకు నచికేతుఁడను పుత్త్రుఁడొకఁ డుండెను.

వివరణము.—వాజశ్రవసశబ్ద నిర్వచనము.—

వాజం=అన్నం, తద్దానాదినిమిత్తం శ్రవః = యశః యస్య సః వాజశ్రవాః, రూఢిశో వా, వాజశ్రవసః అపత్యం, వాజశ్రవసః.

అర్థ. వాజమనఁగా అన్నము. అట్టి అన్నముయొక్క దానాదికముచేత లభించిన శ్రవస్సు—అనఁగా కీర్తిగలవాఁడు. వాజశ్రవుఁడు (ఇది యౌగికార్థము) లేక, వాజశ్రవుఁడను రూఢినామముగలవాఁడు. వాజశ్రవుని పుత్త్రుఁడు వాజశ్రవసుఁ డనంబడును.

విశ్వజిద్యాగము.—ఈయాగము నాచరించినయజమానుఁడు తన దగ్గఱ అప్పుడు నిల్వయున్నధనమునంతయును ఋత్విక్కులకు యాగదక్షిణగా నిచ్చితీరవలయునని విధిగలదు.

౨-వ మంత్రము.

తꣳహ కుమారꣳ సన్తం దక్షిణాసు నీయమానాసు శ్రద్ధాఽఽవివేశ సోఽమన్యత. ౨

పద. తం హ కుమారం సంతం దక్షిణాసు నీయమానాసు శ్రద్ధా ఆవివేశ సః అమన్యత. ౨

టీక. దక్షిణాసు=(ఋత్విక్కులకును, సదస్యులకును విడివిడిగా విభజించి యిచ్చిన) దక్షిణలు, నీయమానాసు=తీసికొనిపోఁబడుచున్నవగుచుండఁగా, కుమారంసంతం=బాలుఁడుగానున్న, తంహ = అనచికేతసుని, శ్రద్ధా=ఆస్తిక్యబుద్ధి, ఆవివేశ = ప్రవేశించెను. (ఇటుల ఆస్తిక్యబుద్ధికలుగుటచేత) సః = అనచికేతసుఁడు, అమన్యత=(ఈచెప్పఁబోవురీతిగా) ఆలోచించెను.

తా. తండ్రియగువాజశ్రవసుఁడు విశ్వజిద్యాగమునకు సంబంధించిన ఋత్విక్కులకున్నూ సదస్యులకున్నూ వేఱువేఱుగా విభజించి దక్షిణార్థమిచ్చిన గోవులను వారు తీసికొనిపోవుచుండఁగా ఆవాజశ్రవసునిపుత్త్రుఁడగు నచికేతసుఁడు ప్రజననసామర్థ్యములేని బాల్యవయసునం దున్నను తండ్రికి మేలు

చేయవలయు ననుతలంపుతో శ్రద్ధ—అనఁగా ఆస్తిక్యబుద్ధి అనసికి కలిగెను. ఇటుల ఆస్తిక్యబుద్ధిగలవాఁడైన నచికేతసుఁ డీచెప్పఁబోవురీతిగా ఆలోచించెను.

వివరణము:—మంత్రమునందుఁ గల కుమారం, అను పదమునకు "కుమారం ప్రథమవయసం అప్రాప్తప్రజననశక్తిం బాలం ఏవ" అని భాష్యకారులవారు వివరణమొనర్చిరి. అనఁగా యౌవనముగాని బాలుఁడని తద్భావము.

3-వ మంత్రము.

మూ. పీతోదకా జగ్ధతృణా దుగ్ధదోహా నిరింద్రియాః,
అనందా నామ తే లోకా స్తాన్స గచ్ఛతి తా దదత్. 3

పద. పీతోదకాః జగ్ధతృణాః దుగ్ధదోహాః నిరింద్రియాః అనందాః నామ తే లోకాః తాన్ సః గచ్ఛతి తాః దదత్. 3

టీక. పీతోదకాః = త్రాఁగఁబడిన ఉదకములుకలిగినట్టియు, జగ్ధతృణాః = తినఁబడినగడ్డికలిగినట్టియు, దుగ్ధదోహాః = పితుకఁబడిన పాలుకలిగినట్టియు, నిరింద్రియాః=ఈనెడిశక్తినశించినట్టియు, (ఏయావులు గలవో) తాః = అట్టి గోవులను, దదత్ =దానముగా నేయజమానుఁడిచ్చునో, సః=వాఁడు, అనందాః నామ = సుఖములేనట్టి వగుటచేత 'అనందము' లని పిలువఁబడుచున్న, తే = ఆప్రసిద్ధములగు, లోకాః=ఏలోకములుగలవో, తాన్ =ఆ అనందలోకములను అనగా అసౌఖ్యప్రదములగునరకములను, గచ్ఛతి=పొందుచున్నాఁడు.

తా. నచికేతసుఁడు చింతించినవిధము చెప్పఁబడుచున్నది:—వాజశ్రవసుఁడు యజ్ఞదక్షిణగా నిచ్చినగోవు లెట్టివో చెప్పఁబడుచున్నవి. త్రాఁగఁబడిన యుదకములుగలగోవులు పీతోదకములని చెప్పఁబడుచున్నవి. తినఁబడిన తృణములుగలగోవులు జగ్ధతృణములని చెప్పఁబడుచున్నవి. పిండఁబడినపాలు గలగోవులు దుగ్ధదోహములనిచెప్పఁబడును. చూలు అగుటకు తగిన దేహదార్ఢ్యము లేనిగోవులు నిరింద్రియములని చెప్పఁబడును. ఇట్టి యావులను దక్షిణార్థ

ముగా తనతండ్రి ఋత్విక్కులకిచ్చినాఁడు. ఇట్టిగోవులను దానమొసంగిన యజమానుఁడు నిరంతరము దుఃఖమునను భవించుటకయి యేర్పడిన నరకలోకములనుపొందును. (అని చాల విచారించెను.)

వివరణము:—'పీతోదకాః'=పీతముదకం ప్రాగేవ, నోత్తర కాలం పానశక్తి రస్యాస్తీత్యర్థః. ఏవం దానోత్తరకాలే తృణభక్షణే దోహనే వత్సప్రసవేచ న శక్తి రిత్యర్థో ద్రష్టవ్యః.

అర్థము. త్రాఁగదగినయుదకముల నిదివఱకే ఆగోవులు త్రాగెను. ఇఁక మీఁదట నీళ్లుత్రాగుటకుకూడ ఆయావులకు శక్తిలేదని భావము.

ఇదేవిధముగ దానోత్తరకాలమునందు గడ్డినమలుటకుఁగాని, పాలు పిండుటకుగాని యీనుటకుగాని శక్తిలేనివని భావము.

౪-వ మంత్రము.

మూ. సహోవాచ పితరం తత కస్మై మాం దాస్యసీతి ద్వితీయం తృతీయం తꣳహోవాచ మృత్యవే త్వా దదామీతి. ౪

పద. సః హ ఉవాచ పితరం తత కస్మై మాం దాస్యసి ఇతి ద్వితీయం తృతీయం తం హ ఉవాచ మృత్యవే త్వా దదామి ఇతి.

టీక. తాత=నాయనా!, మాం=నన్ను, కస్మై=ఎవరికొఱకు, దాస్యసి= ఇవ్వగలవు. ఇతి=ఇట్లని, సః=ఆనచికేతసుఁడు, పితరం = తండ్రినిగూర్చి, ఉవాచహ= పలికెనుగదా. (ఈవిధముగా తండ్రినిసంబోధించి ఆనచికేతుఁడు అడిగినను తండ్రియగువాజశ్రవసుఁడు కుమారునిమాటను వినియు వినని వానివలె ఉపేక్షించి ఊరకయుండఁగా మఱల) ద్వితీయం=రెండవపర్యాయము, తృతీయం= మూడవపర్యాయము, ఉవాచహ=(తండ్రినిగూర్చి) పలికెను. (ఇట్లు రెండు మూడుసారులు కుమారుఁడు పలికినమాటలకు వాజశ్రవసుఁడు కోపముగలవాఁ

దై.) త్వా=నిన్ను, మృత్యవే = మృత్యుదేవతకొఱకు. దదామి ఇతి = ఇచ్చు చున్నానని, ఉవాచ=పలికెను.

తా. తండ్రియగు వాజశ్రవసుఁడు విశ్వజిద్యాగదక్షిణార్థము శల్యమాత్రావశిష్టములగు గోవులనొసంగుటచేత తనతండ్రి నేసినయాగము సంపూర్తి కాలేదనియు, అందువలన తనతండ్రికి నరకముప్రాప్తించుననియు, తండ్రిని నరకమునుండి తరింపఁజేయుటచేత పుత్త్రుఁడను పేరు సంభవించుచున్నదనియు యెఱిఁగినవాఁడు కావున పుత్త్రుఁడగుతాను ఆత్మప్రదానమొనర్చియయినను తండ్రియొక్కయాగమును పరిపూర్తిచేయవలయు ననుసత్సంకల్పము నచికేతుఁడుగలవాఁడై తండ్రికడకుఁబోయి 'నాయనా! నన్ను ఏఋత్విక్కునకు యాగదక్షిణగా నిచ్చెదవు' అని యడిగెను. పుత్త్రుఁడగు నచికేతుఁ డడిగిన యీమాటను తండ్రియగువాజశ్రవసుఁడు వినియు విననివానివలె బదులుచెప్పక ఉపేక్షించియుండఁగా నచికేతుఁ డూరకుండక 'నాయనా! నన్నేఋత్విక్కునకు యాగదక్షిణగా నిచ్చెదవు'అని రెండుమూడుసారు లడిగెను. అడిగిన మాటకు బదులుచెప్పనియెడల ఊరకుండుట బాలస్వభావము. వీఁ డిట్లూరకుండక తనకు సంబంధములేని ఇట్టివిషయములో నాకు సభలో బుద్ధిచెప్పుటకువచ్చినాఁడని వాజశ్రవసుఁడు కోపముగలవాఁడై నిన్ను మృత్యువుకొఱకు— అనఁగా వైవస్వతునికొఱకు ఇచ్చుచున్నానని పుత్త్రునకు బదులుచెప్పెను.

వివరణము:— 'తాత' యనుటకు 'తత' యని హ్రస్వముగా చెప్పుట ఛాందసము.

౫-వ మంత్రము.

అవ. ఈవిధముగా తండ్రి కోపముగలవాఁడై 'మృత్యువునకు నిన్నిచ్చుచున్నానని' పలికినమాటకు నచికేతుఁడు దుఃఖించుచున్నాఁడు.—

మూ. బహూనా మేమి ప్రథమో బహూనా మేమి మధ్యమః,
కిగ్ స్విద్యమస్య కర్తవ్యం య న్మయా ఒద్య కరిష్యతి.

పద. బహూనాం ఏమి ప్రథమః బహూనాం ఏమి మధ్యమః, కిం స్విత్ యమస్య కర్తవ్యం యత్ మయా అద్య కరిష్యతి. ౫

టీక. (అహం=నేను) బహూనాం = అనేకులయిన శిష్యులలోపల లేక పుత్త్రులలోపల, ప్రథమః = మొదటివాఁడనుగా, ఏమి = వచ్చుచున్నాను. బహూనాం = అనేకులయిన శిష్యులలోపల లేక పుత్త్రులలోపల, మధ్యమః= మధ్యముఁడనుగా, ఏమి=వచ్చుచున్నాఁడను. యమస్య=యమునకు, కర్తవ్యం= నాచేత చేయఁదగినది? కింస్విత్ = ఏమియున్నది? మయా = దానముగా నివ్వఁబడిన నాచేత, అద్య=ఇప్పుడు, (ఆయముఁడు) కింకరిష్యతి = ఏమి చేయఁగలఁడు?

తా. అనచికేతుఁడు దఃఖించినవిధాన మెట్లనఁగా.—నేను నా తండ్రికడనున్న శిష్యులలోపల శిష్యోచితవృత్తి మున్నగువాని నాచరించుట యందు అందఱికంటె మొదటివాఁడుగనే ఉంటున్నాఁడనే. కొన్నివిషయ ములందు, అనేకులయినవారిలోపల మధ్యముఁడనై మధ్యమవృత్తితో చరించు చున్నానుగాని అధమవృత్తిగా నేనెప్పుడు చరించలేదే. ఇట్టి సద్గుణవంతుఁ డను పుత్త్రుఁడను అగునన్ను నిన్ను మృత్యువున కిచ్చెదనని నాతండ్రిపల్కె—నే దక్షిణగా నొసంగఁబడినేను యమున కేమి చేయవలయును? యముఁడు నన్నెందుల కుపయోగించుకొనును? విచారించిచూడగా నాయం దేదోషము లేదు. నాతండ్రి నేను ౨-౩ పర్యాయము లడిగినదానికి ఆగ్రహముగలవాఁడై యిట్లుపలికినాఁడు అని నిర్ణయించుకొన్నవాఁడయి అయినప్పటికిన్ని తనతండ్రి పలికినమాట అబద్ధముకాఁకూడదు అని నిశ్చయించుకొని, నాయనా! నేనేమి పలికితినని దుఃఖముతో తండ్రి నడిగెను.

వివరణము.—శిష్యులప్రవర్తనము, ముఖ్య, మధ్యమ, అధమభేదములతో త్రివిధము.

౧. ముఖ్యవృత్తి=యథావసరం జ్ఞాత్వా శుశ్రూషణే ప్రవృత్తిరూపా

అర్థ. ఏయేసమయములం దేపని యొనరవలెనో యని తానే స్వయముగా తెలిసికొని ఆయాపనుల నాచరించుచుండుట ముఖ్యప్రవృత్తి.

౨. మధ్యమప్రవృత్తి=ఆజ్ఞాదివశేన శుశ్రూషణే ప్రవృత్తిః.

అర్థము. గుర్వాదుల యాజ్ఞననుసరించి వారుచెప్పినపనుల నాచరించుట మధ్యమప్రవృత్తి.

౩. అధమప్రవృత్తి=గుర్వాదిభిః కోపితస్సన్ శుశ్రూషాకరణే ప్రవృత్తి రూపా.

అర్థ. గుర్వాదులు కోపించిచెప్పఁగా వారుచెప్పినపనుల నాచరించుట అధమప్రవృత్తి.

౬-వ మంత్రము.

మూ. అనుపశ్య యథాపూర్వే ప్రతిపశ్య తథాఽపరే,
సస్యమివ మర్త్యః పచ్యతే సస్యమివాఽఽజాయతే పునః.

పద. అనుపశ్య యథా పూర్వే ప్రతిపశ్య తథా అపరే, సస్యం ఇవ మర్త్యః పచ్యతే సస్యం ఇవ ఆజాయతే పునః.

టీక. పూర్వే = మనపూర్వులగు తాతముత్తాతలు మున్నగువారలు, యథా=ఏవిధముగా ప్రవర్తించిరో, (దానిని) అనుపశ్య=దీర్ఘముగా ఆలోచించుకొనుము. తథా = అదేవిధముగా, అపరే = ఇతరులు (అనఁగా ఈకాలమునందున్న పెద్దలు ప్రవర్తించుచున్నారో, దానిని) ప్రతిపశ్య = ఆలోచించుకొనుము, మర్త్యః=మరణమే స్వభావముగాఁగలిగిన మనుష్యుఁడు, సస్యంఇవ = పైరువలె, పచ్యతే = జీర్ణుఁడయి మరణించుచున్నాఁడు. పునః=మఱల, సస్యం ఇవ=పైరువలెనే, జాయతే=పుట్టుచున్నాఁడు.

తా. నచికేతసుఁడు తనతండ్రియగు వాజశ్రవసుఁడు తన్ను (అనఁగా నచికేతసుని) మృత్యువున కిచ్చెదనని పలికినమాట ప్రయోజనము నుద్దేశించి కాదనియు, ఆగ్రహముతో పలికినాఁడనియు నిశ్చయించుకొన్నవాఁడై

ఆగ్రహముతో చెప్పినప్పటికిన్ని తనతండ్రియొక్క మాట అసత్యము కాకూడ దనుతలంపుతో అతఁ డన్నమాటను నెరవేర్పవలసినదిగా అతనికి ప్రబోధము నొనర్చుచున్నాఁడు.—ఓతండ్రీ ! ఏవిధముగా నీతండ్రి తాత మున్నగు పూర్వులు తాము పలికినపలుకులు సత్యములుగా నొనర్చినవారై ఇహలోక యాత్రను సంపూర్తిచేసికొని ఇహలోకమునుండి తరలిపోయిరో. ఆవిషయ మును బాగుగా ఆలోచించుకొని వారినిచూచి నీవున్నూ ఆదేవిధముగా సంచరిం చుటయుక్తము. అప్పుడేగాక ఈకాలమునందున్నూ గలపెద్దలు సంచరించు చున్న రీతినికూడ గమనించిచూడుము. గతించిన మనపూర్వులందుఁగాని ఇప్పుడున్న పెద్దలందుగాని అసత్యవచన మనునది లేనేలేదు. ఆడినమాటను తప్పుట యనునది దుష్టాత్ములకృత్యము. ఆడినమాటను వమ్ముచేసినంతమాత్రమున నెవ్వఁడున్నూ జరామరణవిరహితుఁడయి శాశ్వతుఁడుగా నుండఁబోవునదిలేదు గదా. ఏలయనఁగా, మర్త్యుఁడనుమాటకు మరణమే ధర్మముగాఁ గలవాఁడని అర్థము. అట్టిమర్త్యుఁడు—అనఁగా మనుష్యుఁడు పైరు పండివాడబారి యేవిధముగా నశించిపోవుచున్నదో అట్లే జరాజీర్ణదేహుఁడయి చచ్చిపోవుట తప్పనిసరి. రాలిపోయినగింజలు మఱల పైరగునటుల మరణించిన మనుష్యుఁడు మరల నీ యనిత్యమయిన ప్రాణిలోకమునందే పుట్టుచున్నాఁడు. జన్మమరణము లిట్లొందఱకు తప్పని సరిగా ఉండఁగా వ్యర్థముగా అసత్యమాడుటవలన కలిగెడి లాభ మేమి ? నివన్నమాటను కాపాడుము. అనఁగా నన్ను యమునకిచ్చెదనని పలికితివి కావున నన్ను యమునికడకుఁ బంపుము.

౭-వ మంత్రము.

మూ. వైశ్వానరః ప్రవిశత్యతిథి ర్బ్రాహ్మణో గృహాన్,
తస్యైతాగ్ం శాంతిం కుర్వంతి హార వైవస్వతోదకమ్.

పద. వైశ్వానరః ప్రవిశతి అతిథిః బ్రాహ్మణః గృహాన్, తస్య ఏతాం శాంతిం కుర్వంతి హార వైవస్వత ఉదకమ్.

టీక. వైశ్వానరః=అగ్నిహోత్రుఁడు, బ్రాహ్మణః = బ్రాహ్మణుఁడగు, అతిథిః = అతిథిరూపముగలవాఁడై, ప్రవిశతి = ఆయాగృహస్థులగువారియొక్క గృహములను) ప్రవేశించుచున్నాఁడు. తస్య = ఆబ్రాహ్మణాతిథిరూపియగు అగ్నిహోత్రునకు, ఏతాం=ఈ, శాంతిం = (పాద్య, ఆసన దానాదిరూపమగు) శాంతిని, కుర్వంతి = (గృహస్థులగువారలు చేయుచున్నారు. (కావున) వైవస్వత=ఓవైవస్వతుఁడా ! ఉదకం = పాద్యార్ఘ్యములజలమును, హర=తీసికొనిరమ్ము. (అని వైవస్వతునిభార్యగాని అమాత్యులో వైవస్వతునితోపలికిరి.)

తా. పుత్రుఁడగు నచికేతసుఁడు చెప్పినమాటను తండ్రియగు వాజశ్రవసుఁ డాలకించినవాఁడయి తనసత్యభాషణమును కాపాడుకొనుటకయి పుత్రుఁడగు నచికేతసుని యమునికడకు పంపించెను. నచికేతసుఁడు తన గృహమునుండి బయలువెడలి యమునిగృహమునకుఁబోయెను. నచికేతసుఁడు యమునియింటికిపోయినసమయమునందు యము డెచ్చటికో పోయియుండెను. 3 దినములకు తర్వాత యముఁడు యింటికి మరలివచ్చెను. నచికేతసుఁడు ఆమూడురోజులు యమునియింటనే యుండెను. ఇంటికివచ్చిన యమునితో అతని అమాత్యులో భార్యగాని ఇట్లనిపలికిరి:—బ్రాహ్మణుఁడగు అతిథి యింటికి వచ్చుచున్నాఁడనఁగా సాక్షాత్తుగ అగ్నిహోత్రుఁడే యింటికవచ్చుచున్నాఁడని తలంచవలయును. సాక్షాత్తుగ అగ్నిస్వరూపుఁడగు నతనివల్లనుండి తమగృహాదికమునకు నేవిధమగు కీడుకలుగకుండుటకయి శాంతిని చేయువారివలెనే తత్తద్గృహాధీశులగు యజమానులు పాద్యము, ఆసనదానము మున్నగుప్రకారములుగల శాంతినిచేయుచున్నారు కావున ఓవైవస్వతుఁడా! మనయింటికి అతిథిగావచ్చిన యీబ్రాహ్మణబాలునకు— నచికేతసునకు పాదప్రక్షాళనార్ఘ్యముదకమొసంగి యథోచితముగ సత్కరింపుము. కానియెడల ప్రత్యవాయముకూడ కలుగుచున్నదని శ్రుతియే చెప్పుచున్నదిగదా.

వివరణము.—గృహాగతుఁడగు అతిథిని యథోచితముగ సత్కరించుట శిష్టాచారప్రాప్తముమాత్రమే కాదనియు, శ్రుతివిహితమనియు నెఱుంగునది.

"యస్యాగ్నిహోత్ర, మదర్శ, మపౌర్ణమాస మచాతుర్మాస్య మనాగ్ర యణ, మతిథివర్జితంచ అహుతమవైశ్వదేవ మవిధినాహుత మాసప్తమాం స్తస్య లోకాన్ హినస్తి" అని శ్రుతి.

ముండకోపనిషత్, ౧ ముండకము. ౨ వ ఖండము. 3 మంత్రం.

పై శ్రుతి అతిథిపూజారహితునకు సద్గతులు నశించుచున్నవని అర్థము. యెఱుంగవలయును.

౮-వ మంత్రము.

మూ. ఆశాప్రతీక్షే సంగతగ్ం సూనృతాం
చేష్టాపూర్తే పుత్రపశూగ్ంశ్చసర్వాన్,
ఏత ద్వృంక్తే పురుషస్యాల్పమేధసో
యస్యానశ్నన్ వసతి బ్రాహ్మణో గృహే. ౮

పద. ఆశాప్రతీక్షే సంగతం సూనృతాం చ ఇష్టాపూర్తే పుత్రపశూన్ చ సర్వాన్, ఏతత్ వృంక్తే పురుషస్య అల్పమేధసః యస్య అనశ్నన్ వసతి బ్రాహ్మణః గృహే.

టీక. యస్య=ఏ, అల్పమేధసః=అల్పప్రజ్ఞగల, పురుషస్య = పురుషుని యొక్క, గృహే = గృహమునందు, బ్రాహ్మణః = బ్రాహ్మణుఁడు, అనశ్నన్ = భుజింపక, వసతి = నివసించుచున్నాఁడో, ఏతత్ = ఈవిధముగా బ్రాహ్మణుఁడొకనియింట భుజింపకయుండుట యనునది (తస్య = ఆగృహాయజమానియగు పురుషునియొక్క), ఆశాప్రతీక్షే = ఆశాప్రతీక్షలను, సంగతం=సత్పురుషుల సహవాసమువలన అంతకుముందువాఁడు సంపాదించియుంచినసత్ఫలమును, సూనృతాం = సత్యవాఙ్నియమజన్యఫలమును, ఇష్టాపూర్తే = ఇష్టాపూర్తముల నాచరించుటవలన కలిగినఫలమును, పుత్రపశూన్ చ = పుత్రపశువులను, సర్వాన్=అంతయు, వృంక్తే=నాశనమొనర్చుచున్నది.

తా. అతిథిని సత్కరింపనందువలన కలిగెడి ప్రత్యవాయమును చెప్పబడుచున్నది.—ఏ మందభాగ్యుని యొక్క గృహమునందు బ్రాహ్మణుడు భుజింపక నిలిచియుండునో అట్టి దౌర్భాగ్యుని కీవిధముగా నష్టము కలుగును.—అతని యొక్క ఆశాప్రతీక్షలు నశించును. (ఆశ యనఁగా అనేకవిధములుగా తెలియని గొప్పవస్తువు తనకు లభింపవలయునని యెడి ఇచ్ఛ. అనఁగా బంగారుకొండ తనకు దొరకవలయునని తలంచుట మున్నగునవి ప్రతీక్ష యనఁగా ప్రత్యక్షముగా తాను చూచుచున్న గొప్పపదవి తనకు లభించవలయునని కోరుట. అనగా తనకు రాజ్యము రావలయునని కోరుట మున్నగునవి) సంగత మనఁగా సత్పురుషుల సహవాసవశమువలన లభించినపుణ్యము, అదియును నశించును. సత్యవచనప్రియసంభాషణమువలన కలిగినసుకృతము నశించును. ఇష్టములనఁగా యజ్ఞయాగాదుల నాచరించుట. పూర్తమనఁగా వాపీకూపతటాకాదుల త్రవ్వించుట, సత్రములు మున్నగునవి కట్టించుట. ఇట్టి ఇష్టాపూర్తములవలన ఇతనికి కలిగియున్న సుకృతము నశించును. పశుపుత్రపౌత్రాదికములగు ఐహిక సౌఖ్యము నశించును. వేయేల వానికిసంబంధించిన శ్రేయస్సంతయు నశించును.

వివరణము.—౧. ఆశాలక్షణము = అనిర్జ్ఞాతప్రాప్యేష్టార్థప్రార్థనా ఆశా అని భాష్యము. అనిర్జ్ఞాతః=అత్యంతమజ్ఞాతః, ప్రాప్యః=ప్రాప్తుం యోగ్యః కనకాచలాదిః, తస్యప్రార్థనా=మమభూయాదితీచ్ఛా. అని గోపాలేంద్రయతిటీక. ప్రతీక్షాలక్షణము=నిర్జ్ఞాతప్రాప్యార్థప్రతీక్షణం ప్రతీక్షా, అని భాష్యము.

నితరాం ప్రత్యక్షాదినా జ్ఞాతః ప్రాప్యోఽర్థః రాజ్యాదిః యస్యాస్సా ప్రతీక్షా. అని గోపాలేంద్రయతి టీక.

౯-వ మంత్రము.

మూ. తిస్రో రాత్రీ ర్యదవాత్సీ ర్గృహే మే
ఽనశ్నన్ బ్రహ్మ న్నతిథి ర్నమస్యః,

నమః తేఽస్తు బ్రహ్మన్ స్వస్తి మేఽస్తు
తస్మాత్ ప్రతి త్రీన్ వరాన్ వృణీష్వ. ౯

పద. తిస్రః రాత్రీః యత్ అవాత్సీత్ గృహే మే అనశ్నన్ బ్రహ్మన్ అతిథిః నమస్యః, నమః తే అస్తు బ్రహ్మన్ స్వస్తి మే అస్తు తస్మాత్ ప్రతి త్రీన్ వరాన్ వృణీష్వ. ౯

టీక. బ్రహ్మన్=ఓబ్రాహ్మణోత్తముఁడా! యత్ = ఏ కారణమువలన, మే=నాయొక్క, గృహే = గృహమునందు, నమస్యః = నమస్కరించఁదగిన, అతిథిః=అతిథివిగానచ్చినవాఁడవై, అనశ్నన్ = భుజింపకయే, తిస్రః రాత్రీః = మూఁడుదినములు . ... = నివసించియున్నాఁడవో, తత్ = ఆకారణము వలన, తే=నీకు, ... మస్కారము, అస్తు = అగుఁగాక. బ్రహ్మన్ = ఓనచి కేతసుఁడా! మే=..., స్వస్తి=మంగళము, అస్తు=అగుఁగాక. తస్మాత్=అందు వలన (అనఁగా ... దినములు నాయింటభుజింపకయున్నందువలన) ప్రతి= అందులకుబ... త్రీన్ వరాన్ = మూఁడువరములను, వృణీష్వ = నావల్ల నుండి కోరుకొ...

తా. వైవస్వతునియింటియందున్న అమాత్యాదులు అతని (వైవస్వ తుని)యింటికి నచికేతుఁడు అతిథిగావచ్చి మూఁడురోజులుగా నిరాహారుఁడై యున్నవిషయమును, అతిథిపూజ నాచరింపనియెడల కలిగెడికీడును వైవస్వతు నకు విన్నవింపఁగా వైవస్వతుఁడు అర్ఘ్యపాద్యాదిపూజాద్రవ్యపురస్సరముగ నచికేతసుని సమీపించి ఓబ్రాహ్మణోత్తమా! నచికేతా! నీవు నమస్కారా ర్హుఁడవగు అతిథివి. అట్టి నీవు నాయింటికి విచ్చేసి మూఁడునాళ్లు నిరాహా రుఁడవై యుంటివి. నీకు నమస్కారముచేయుచున్నాఁడను. ఓబ్రాహ్మణోత్త ముఁడా! యోగ్యుఁడవగు నీవు ఆహారములేక నాయింటియం దుండుటచేత తద్గృహస్వామినైన నాకు సంభవించెడికీడును నానమస్కారముచేత సుప్రీతుఁ డవై నాకు కలుగకుండ ననుగ్రహింపుము. నీవనుగ్రహపూర్వకముగ నుండుట.

చేతనే నాకు క్షేమము నిరాటంకముగ కలిగినను నిన్ను మఱింత సంతోష పెట్టుటకయి నాయింట ఆహారములేక నివసించియున్న మూడురోజులకుఁగాను నీకిష్టములయిన మూడువరములను నీకిచ్చెదను. నీకభిమతములయినవానిని కోరుకొనుము.

౧౦-వ మంత్రము.

మూ. శాంతసంకల్ప స్సుమనా యథా స్యా
ద్వీతమన్యు ర్గౌతమో మాఽభిమృత్యో!,
త్వత్ప్రసృష్టం మాఽభివదేత్ప్రతీత
ఏత త్త్రయాణాం ప్రథమం వరం వృణే. ౧౦

పద. శాంతసంకల్పః సుమనాః యథా స్యాత్ వీతమన్యుః గౌతమః మా అభి మృత్యో, త్వత్ప్రసృష్టం మా అభివదేత్ ప్రతీతః ఏతత్ త్రయాణాం ప్రథమం వరం వృణే. ౧౦

టీక. మృత్యో=ఓమృత్యుదేవా! గౌతమః = గౌతమగోత్రోత్పన్నుఁడగు నాతండ్రి, మా అభి = నన్నుఁగూర్చి, శాంతసంకల్పః = నాకుమారుని యమునిదగ్గఱకు పంపితినిగదా వాఁడక్కడ యేమిచేయుచుండును ? అను మున్నగుతలంపులులేనివాఁడయి, సుమనాః = ప్రసన్నహృదయుఁడయి, మా అభి=నన్నుఁగూర్చి, వీతమన్యుః = పోయినరోషముగలవాఁడు, యథాస్యాత్= ఏవిధముగానగునో, త్వత్ప్రసృష్టం = నీచేత విడువఁబడి యింటికిపంపఁబడిన, మా = నన్నుఁగూర్చి, ప్రతీతః = పొందఁబడిన స్మృతిగలవాఁడయి. (అనఁగా ఈవచ్చినబాలుఁడు ఇదివఱకు నాచేత యమునియింటికి పంపఁబడిన నచికేతసుఁడే సుమీ యని తలంచుటయే ఇచట స్మృతియని చెప్పఁబడినది.) అభివదేత్=పలుకునో, ఏతత్=ఇదియే, త్రయాణాం=నీవు ఇచ్చెదనన్న మూఁడువరములలో, ప్రథమంవరం=మొదటివరమునుగా, వృణే=వరించుచున్నాఁడను.

తా. (అర్ఘ్యపాద్యాదిసత్కారములొనర్చిన వైవస్వతుఁడు మూఁడు వరములను నీకిచ్చెదను కోరుకొనుమని నచికేతసునితో ననియున్నాడు కావున) నచికేతసుఁ డడుగుచున్నాఁడు. ఓవైవస్వతా! నీవు వరములను నాకివ్వఁదలఁచినయెడల మాతండ్రియగు గౌతముఁడు "కోపముతో పుత్త్రుని యమునియింటికి పంపితినే, వాఁడు యమునియింటికిపోయి ఏమిచేయుచున్నాఁడో" అనిపలువిధములుగా తలంచుచుండును. కావున నాతండ్రి అట్టిచింతలేక సంతుష్టుఁడయియుండుఁగాక. నాయందు అతనికి కోపములేకపోవుఁగాక. నీచేత మఱల యింటికిపంపఁబడిన నన్నుచూచి ఈవచ్చినబాలకుఁడు నాపుత్త్రుఁడగు నచికేతసుఁడే సుమీయని అతనికి బాగుగ జ్ఞాపకశక్తి కలిగియుండునటుల అనుగ్రహింపుము. దీనిని నీవు నాకిచ్చిన ౩ వరములలో ప్రథమవరమునుగా నేను నిన్ను కోరుచున్నాఁడను. నాతండ్రిని సంతోషపెట్టుటయే నాకు మొదటివరము.

వివరణము.—యమలోకమునకుఁ బోయి తిరిగి వచ్చినవానిని జూచుట పాపము కావున వీనిని చూడఁగూడదని మాతండ్రి భీష్మించుకొని యుండక నన్నుఁగూర్చి కోపములేక సంతోషముతో నుండునటుల చేయుటయే అనఁగా తండ్రిని సంతోషపెట్టుటయే వరములలో మొదటివరము.

౧౧-వ మంత్రము.

మూ. యథా పురస్తాద్భవితా ప్రతీత
ఔద్దాలకి రారుణి ర్మత్ప్రసృష్టః,
సుఖగ్ంరాత్రీశ్శయితా వీతమన్యు
స్త్వాం దదృశివా న్మృత్యుముఖా త్ప్రముక్తమ్. ౧౧

పద. యథా పురస్తాత్ భవితా ప్రతీతః ఔద్దాలకిః ఆరుణిః మత్ప్రసృష్టః, సుఖం రాత్రీః శయితా వీతమన్యుః త్వాం దదృశివాన్ మృత్యుముఖాత్ ప్రముక్తమ్. ౧౧

టీక. (మృత్యుదేవత చెప్పుచున్నవాక్యమిది) ఔద్దాలకిః = ఔద్దాలకి యనియు, ఆరుణిః = ఆరుణియనియు పేరుగల వాజశ్రవసుఁడు, మత్ప్రసృష్టః= సాక్షేత ననుజ్ఞాతుఁడై, ప్రతీతః=ప్రీతిగలవాఁడై, యథాపురస్తాత్ =ఇదివఱకు ఏవిధముగా నీయందు ప్రీతికలిగియున్నాఁడో, తథా=ఆవిధముగా నీయందు ప్రీతిగలవాఁడు, భవితా=కాఁగలఁడు. సుఖం=సుఖముగా, రాత్రీః = రాత్రులను, శయితా=నిద్రించగలఁడు. మృత్యుముఖాత్ = మృత్యుముఖమునుండి, ప్రముక్తం=వదలఁబడిన, త్వాం=నిన్ను, దదృశివాన్ = చూచినవాఁడై, వీతమన్యుః=(నిన్నుఁగూర్చి) కోపము లేనివాఁడు, భవితా=కాఁగలఁడు.

తా. నచికేతసుఁ డడిగిన ప్రథమవరమునకు అంగీకారమును మృత్యుదేవత యొసంగుచున్నది. నీవు నన్ను కోరిన ప్రకారము నీయందు ఇదివఱకు నీతండ్రి ఎట్టి ప్రేమకలిగియుండెనో అట్టిప్రేమయే ఇఁకమీఁదకూడ నీతండ్రి నీయందు కలిగి యుండుఁగాక. నాయనుగ్రహమువలన మనస్సునం [illegible] లేక సుఖముగా రాత్రుల్లో నీతండ్రికి నిద్రపట్టుఁగాక. మృత్యుముఖమునుండి విడువఁబడి తిరిగి యింటికి వచ్చిన నిన్నుఁ గూర్చి క్రోధములేక ప్రీతిపూర్వకముగా నుండుఁగాక.

వివరణము.—మూలమునందుఁగల ఔద్దాలకిశబ్దము, ద్వివిధముగా భాష్యమునందు వ్యాఖ్యాతము.

౧. ఉద్దాలక ఏవ ఔద్దాలకిః. స్వార్థే. ఉద్దాలకుఁడే ఔద్దాలకి యనంబడును.

౨. ఉద్దాలకస్యాపత్యం పుమాన్ ఔద్దాలకిః=ఇది తద్ధితాంతము. ఉద్దాలకుని పుత్త్రుఁడని యర్థము.

ఆరుణిః=అరుణస్యాపత్యం ఆరుణిః, అరుణునిపుత్త్రుఁడు ఆరుణి.

వాజశ్రవసుని ఔద్దాలకియనియు, అనఁగా ఉద్దాలకునిపుత్త్రుఁడనియు, ఆరుణి అనియు-అనఁగా అరుణునిపుత్త్రుఁడనియు చెప్పుట అయుక్తముగదా

యని తలంచి తన్నివారణార్థము ద్వ్యాముష్యాయణుఁడు, అని భాష్యకారుల వారు సమర్థించిరి. ద్వ్యాముష్యాయణుఁ డనఁగా కన్యాదానకాలమునం దపుత్త్రుఁడయినవాఁడు తనపుత్త్రికను కన్యాదానము చేయునప్పుడు అల్లునితో ఈకన్యకకు జన్మించునట్టిపుత్త్రుఁడు నాకున్నూ పుత్త్రునివలె పారలౌకికక్రియల నాచరించవలయునను షరతును ఏర్పాటు చేసికొని అతని యంగీకారమును బడసినయెడల ఆపిల్లకు పుట్టినపుత్త్రుఁ డుభయులకు పుత్త్రుఁడగు చున్నాఁడు. ఇట్టివానిని ద్వ్యాముష్యాయణుఁ డందురు.

౧౨-వ మంత్రము.

మూ. స్వర్గే లోకే న భయం కించనాస్తి
న తత్ర త్వం న జరయా బిభేతి,
ఉభే తీర్త్వా అశనాయాపిపాసే
శోకాతిగో మోదతే స్వర్గలోకే. ౧౨

పద. స్వర్గే లోకే న భయం కించన అస్తి న తత్ర త్వం న జరయా బిభేతి, ఉభే తీర్త్వా అశనాయాపిపాసే శోకాతిగః మోదతేస్వర్గలోకే. ౧౨

టీక. (నచికేతసుఁడు రెండవవరము నడుగఁదలచి స్వర్గలోకస్థితిని వర్ణించుచున్నాఁడు.——)స్వర్గేలోకే=స్వర్గలోకమునందు, భయం = రోగాది నిమిత్తమయినభయము, కించన=కొంచెమైనను, నాస్తి = లేదు. తత్ర=ఆస్వర్గ లోకమునందు, త్వం=నీవు, న = లేదు. జరయా = ముదిమిచేతను, నబిభేతి = భయంపడుటలేదు. అశనాయాపిపాసే = ఆకలిదప్పికలను, ఉభే = రెంటిని, తీర్త్వా=దాటి, శోకాతిగః =బాహ్యమానస శోకవిరహితుఁడై, స్వర్గలోకే=స్వర్గ లోకమునందు, (ఉన్నవాఁడు) మోదతే=సంతోషించుచున్నాఁడు.

తా. (నచికేతసుఁ డడుగుచున్నాఁడు.——) స్వర్గలోకమునందు రోగాదినిమిత్తములవలన కలుగఁదగిన భయమేమియు కలుగఁజాలదు. భూలోకమునందు జరాదులచేత ఆక్రమింపఁబడినవారలు నిన్నుఁగాంచి యెటుల

భయంపడుదురో ఆవిధముగా స్వర్గలోకమునం దెవ్వరివల్లనుండియు భయ మెవ్వరికిని కలుగఁజాలదు. స్వర్గలోకమునందుండువారికి ఆఁకలిగాని దప్పికగాని యేమియు నుండఁజాలవు. వారికి బాహ్యామానసికములగు శోకము లేమియుం కలుగఁజాలవు.

వివరణము.—మొదటివరము తనతండ్రికి తనయందు కోపములేక యుండుట. ఆవరము నొసంగినతరువాత స్వర్గసాధనమగు అగ్నివిజ్ఞానమును రెండవ వరముగా అడుగఁదలఁచి ప్రథమమున స్వర్గవర్ణన మీమంత్రమునందు చెప్పఁబడినది.

౧3-వ మంత్రము.

మూ. స త్వ మగ్నిం స్వర్గ్య మధ్యేషి మృత్యో
ప్రబ్రూహి త్వగ్ం శ్రద్దధానాయ మహ్యం,
స్వర్గలోకా అమృతత్వం భజంతే
ఏత ద్ద్వితీయేన వృణే వరేణ. ౧3

పద. సః త్వం అగ్నిం స్వర్గ్యం అధ్యేషి మృత్యో ప్రబ్రూహి త్వం శ్రద్దధానాయ మహ్యం, స్వర్గలోకాః అమృతత్వం భజంతే ఏతత్ ద్వితీయేన వృణే వరేణ. ౧3

టీక. మృత్యో = ఓమృత్యుదేవా! సః = ఆ, త్వం=నీవు, స్వర్గ్యం = స్వర్గసాధనభూతమయిన, అగ్నిం=అగ్నివిజ్ఞానమును, అధ్యేషి=గుర్తెఱుంగుదువు. శ్రద్దధానాయ=శ్రద్ధగల, మహ్యం=నాకొఱకు, ప్రబ్రూహి=బోధింపుము(యేన= ఏఅగ్నిచయనమునాచరించుటచేత యజమానులయినవారలు) స్వర్గలోకాః = స్వర్గలోకమును పొందినవారలయి, అమృతత్వం=మరణరాహిత్యమును-దేవత్వ మును, భజంతే=పొందుచున్నారో, ఏతత్ =అట్టి అగ్నివిజ్ఞానమును, ద్వితీయేన =రెండవదియగు, వరేణ=వరముచేత. వృణే=వరించుచున్నాఁడను.

తా. పూర్వమంత్రోక్తములగు జరా మరణ, అశనాయా పిపాసాది బాధలులేక నిత్యసంతోషముగా నుండుటయే స్వభావముగాఁగల స్వర్గలోక ప్రాప్తికి సాధనభూతమగు అగ్నిచయనమునుగూర్చి నీవు బాగుగా నెఱింగియున్నాఁడవు కావున ఆయగ్నివిజ్ఞానమును అనఁగా అగ్నిచయనమును శ్రద్ధావంతుఁడనయి ప్రార్థించుచున్న నాకు ఉపదేశింపుము. ఏయగ్నిచయనమొనర్చిన యజమానులయినవారలు జరామరణవిరహితులయి దేవత్వమును పొందుచున్నారో అట్టి అగ్నిచయనమును నాకుపదేశింపమని రెండవవరముగా నడుగుచున్నాఁడను.

౧౪-వ మంత్రము.

మూ. ప్ర తే బ్రవీమి తదు మే నిబోధ
స్వర్గ్య మగ్నిం నాచికేతః ప్రజానన్,
అనంతలోకాప్తి మథో ప్రతిష్ఠాం
విద్ధి త్వమేతం నిహితం గుహాయామ్. ౧౪

పద. ప్ర తే బ్రవీమి తత్ ఉ మే నిబోధ స్వర్గ్యం అగ్నిం నాచికేతః ప్రజానన్, అనంతలోకాప్తిం అథో ప్రతిష్ఠాం విద్ధి త్వం ఏతం నిహితం గుహాయామ్.

టీక. నాచికేతః = ఓనచికేతసుఁడా! స్వర్గ్యం=స్వర్గప్రాప్తికి సాధనభూతమగు, అగ్నిం=అగ్నిచయనమును, ప్రజానన్ = బాగుగా నెఱింగిననేను, తే=నీకు, తత్ ఉ = ఆయగ్నిచయనవిజ్ఞానమును, ప్రబ్రవీమి = ఉపదేశించుచున్నాఁడను. మే = నాయొక్క ఉపదేశమువలన, నిబోధ = తెలిసికొనుము. ఏతం = ఈయగ్నిని, అనంతలోకాప్తిం = అంతములేనిలోకముయొక్క ప్రాప్తికి సాధనభూత మయినదానినిగను, అథో = మఱియు, ప్రతిష్ఠాం = జగత్తుయొక్కస్థితికి ఆశ్రయభూత మయినదానిగను, గుహాయాం = విద్వాం

సులయొక్క బుద్ధిగుహాయందు, నిహితం = ఉన్నదానిగను, త్వం = నీవు, విద్ధి= తెలిసికొనుము.

తా. నచికేతసుఁడడిగిన రెండవవరమును మృత్యు వొసంగుట.—— ఓనచికేతసుఁడా! నీవు నన్నుప్రార్థించిన రెండవవరమునుకూడ నేను నీకిచ్చు చున్నాఁడను. అనఁగా నీవడిగిన అగ్నివిజ్ఞానమునుగూర్చి నీకు బోధించు చున్నాఁడను. నీవేకాగ్రమయిన మనస్సుగలవాఁడవై గ్రహింపుము. స్వర్గ సాధనభూతమయిన అగ్నిచయనవిజ్ఞానమును నేను బాగుగాతెలిసి నీకుపదే శించుచున్నాఁడను. "నేనుపదేశించుచున్నాను. సావధానముగా గ్రహింపు" మనిచెప్పుట శిష్యబుద్ధి సమాధానార్థము. ఈయగ్ని విజ్ఞానము స్వర్గలోకప్రాప్తికి సాధనభూతము. మఱియు విరాడ్రూపమున జగత్తునకు ఆశ్రయభూతము. అట్టి యగ్నినిగూర్చియే నేనుపదేశించుచున్నాఁడను కావున నీవు ఆయగ్నిని ఎఱుంగుము. ఈయగ్ని మఱియు విద్వాంసులగువారియొక్క బుద్ధిగుహాయం దుండునది.

వివరణము.——'సత్రేధాఽఽత్మానం వ్యాకురుతే' అనుశ్రుతివలన సమష్టి రూపుఁడగు విరాట్పురుషుఁడే అగ్ని, వాయు, ఆదిత్యరూపములచేత వెలయుం చున్నాఁడని శ్రుతియే చెప్పుచున్నది కావున విరాడ్రూపమయిన అగ్ని జగ త్తునకు ప్రతిష్ఠయని తెలియవచ్చుచున్నది.

౧౫-వ మంత్రము.

మూ. లోకాది మగ్నిం త మువాచ తస్మై
యా ఇష్టకా యావతీర్వా యథా వా,
సచాపి తత్ప్రత్యవద ద్యథోక్త
మథాస్య మృత్యుః పునరేవాహ తుష్టః. ౧౫

పద. లోకాదిం అగ్నిం తం ఉవాచ తస్మై యాః ఇష్టకాః యావతీః వా యథా వా, సః చ అపి తత్ ప్రత్యవదత్ యథోక్తం అథ, అస్య మృత్యుః పునః ఏవ ఆహ తుష్టః. ౧౫

టీక. (యమః=యముఁడు,) లోకాదిం=విరాడ్రూపమున ప్రపంచమునకు ఆదిపురుషుఁడును, తం=నచికేతసునిచేత ప్రార్థితుఁడయినట్టివాఁడును (అగు), అగ్నిం=అగ్నినిగూర్చి-అనఁగా అగ్నిచయనవిజ్ఞానమునుగూర్చి, తస్మై=ఆనచికేతసునికొఱకు, ఉవాచ=పలికెను-ఉపదేశించెను. యాః ఇష్టకాః=ఏస్వరూపముగల ఇష్టకలుకావలయునో, యావతీః=ఎన్నిసంఖ్యకలవికావలయునో, యథావా=ఏవిధముగా ఆయిష్టకలను చయనముచేయవలయునో, (దీనిని ఆనచికేతసునకుపదేశించెను) సఃచఅపి=ఆనచికేతసుఁడున్నూ, యథోక్తం=యముఁడుపదేశించినదానిని ఉపదేశించినవిధముగా, ప్రత్యవదత్ = మఱల ఒప్పచెప్పెను. అథ=తరువాత, అస్య=ఈనచికేతసునియొక్క (ప్రత్యుచ్చారణముచేత), తుష్టః=సంతుష్టుఁడయిన, మృత్యుః=యముఁడు, పునః ఏవ=మఱల, ఆహ=(నచికేతసునిగూర్చి యీచెప్పఁబోవురీతిగ) పలికెను.

తా. (వేదపురుషునివాక్యము) అగ్నిహోత్రుఁడు విరాట్పురుషస్వరూపుఁడు కావున అతఁడు లోకాది యనంబడుచున్నాఁడు. అట్టి అగ్నినిగూర్చి అనఁగా అగ్నిచయనవిజ్ఞానమునుగూర్చి నచికేతసునిచేత ప్రార్థితుఁడయినవైవస్వతుఁడు-యముడు నచికేతసునకుపదేశించెను. మఱియు ఆయగ్నిచయనమునందేయేస్వరూపముగలఇష్టకలను, ఎన్నిసంఖ్యగలవానిని ఏవిధముగా చయనము-పేర్చుట-చేయవలయునో ఆవిషయమునుగూడ బాగుగా బోధించెను. శ్రద్ధాభక్తులుగల ఆనచికేతసుఁడు యముఁడు తనకుబోధించిన అగ్నిచయనవిజ్ఞానమును యముఁడుబోధించినదంతయు మనస్సునందవగాహనముచేసుకొని తనకు బాగుగా తెలిసినదనువిషయమును ఆచార్యుఁడగు యమునకు తెలుపుటకుగాను మఱల యమునకు ఆయగ్నిచయనమును ఒప్పగించెను. సకృచ్ఛ్రవణముచేతనే ఇటుల చక్కఁగాగ్రహించి మఱల చక్కఁగాచెప్పినందులకు యముఁడు సంతుష్టుఁడయి నచికేతసుఁడడిగిన మూడువరములకంటె వేఱయిన మఱొకవరము నివ్వఁదలచినవాఁడై ఇట్లని పలికెను.

౧౬-వ మంత్రము.

మూ. త మబ్రవీ త్ప్రీయమాణో మహాత్మా
వరం తవేహాద్య దదామి భూయః,
తవైవ నామ్నా భవితాఽయ మగ్నిః
సృంకాం చేమా మనేకరూపాం గృహాణ. ౧౬

పద. తం అబ్రవీత్ ప్రీయమాణః మహాత్మా వరం తవ ఇహ అద్య దదామి భూయః, తవ ఏవ నామ్నా భవితా అయం అగ్నిః సృంకాం చ ఇమాం అనేకరూపాం గృహాణ. ౧౬

టీక. మహాత్మా=మహాత్ముఁడగుఆయముఁడు, ప్రీయమాణః=నచికేతసునియందు ప్రీతిగలవాఁడయి, తవ = నీకు, ఇహ=ఇక్కడ, అద్య=ఇప్పుడే, భూయః=తిరిగి, వరం=(మఱొకక్రొత్త) వరమును, దదామి=ఇచ్చుచున్నాను. అని, తం=ఆనచికేతసునిగూర్చి, అబ్రవీత్=పలికెను. అయంఅగ్నిః=ఈ చయనాగ్ని, తవనామ్నా ఏవ=నీయొక్క పేరుచేతనే, భవితా=కాఁగలదు. అనేకరూపాం=అనేకరూపములుగల-అనఁగా విచిత్రమయిన, ఇమాం = ఈ, సృంకాం=రత్నమాలను, గృహాణ=గ్రహింపుము.

తా. ఆమృత్యుదేవత సంతుష్టుఁడయిపలికినవిధము చెప్పఁబడుచున్నది:- ఆనచికేతసునియందు శిష్యుఁడగువానికి ఉండవలసిన సుగుణములన్నియుం సమగ్రముగ నున్నందులకు యముఁడు సంతుష్టుఁడై ఉదారబుద్ధిగల మహానుభావుఁడు కావున శిష్యుఁడగు నచికేతసుఁడడిగిన 3 వరములకంటె అధికముగ నాల్గవవరమును తనయొక్క ప్రీతికి సూచకముగా నివ్వఁదలచినవాఁడై నీవడిగినవరము కాక మఱొకవరమును నీకిచ్చుచున్నాను అని ఇట్లనిచెప్పెను. నేను నీకుబోధించిన అగ్నిచయనము నీపేరుతోడనే లోకమునందువెలయుఁగాక. అనఁగా నాచికేతచయనమని లోకమునందు ప్రసిద్ధి నందుఁగాక. చిత్రవిచిత్రమయినట్టియు, శబ్దించుచున్నట్టియు, రత్నఖచితమును అగు నీసృంకను - అనఁగా

రత్నమాలనుకూడ స్వీకరింపుము. లేక సృంకమనఁగా అకుత్సితమయిన కర్మసంబంధమయిన విజ్ఞానమనియుం నర్థము. దానినికూడ గ్రహింపుము. అనేక ఫలహేతుభూతమయిన కర్మవిజ్ఞానమునుగూడ గ్రహింపుమని భావము.

౧౭-వ మంత్రము.

మూ. త్రిణాచికేత స్త్రిభిరేత్య సంధిం
త్రికర్మకృ త్తరతి జన్మమృత్యూ,
బ్రహ్మజజ్ఞం దేవమీడ్యం విదిత్వా
నిచాయ్యేమాగ్ం శాంతిమత్యంత మేతి. ౧౭

పద. త్రిణాచికేతః త్రిభిః ఏత్య సంధిం త్రికర్మకృత్ తరతి జన్మమృత్యూ, బ్రహ్మజజ్ఞం దేవం ఈడ్యం విదిత్వా నిచాయ్య ఇమాం శాంతిం అత్యంతం ఏతి.

టీక. (మఱల అగ్నిచయనకర్మస్తుతి చెప్పఁబడుచున్నది.) త్రిణాచికేతః =మూఁడుపర్యాయములు నాచికేతాగ్నిచయనమొనర్చినవాఁడు, లేక నాచికేతాగ్నిచయనవిధినెఱింగి తన్మంత్రాధ్యయనమొనర్చి ఆచయనవిధి ననుష్ఠించినవాఁడు. త్రిభిః = తల్లి తండ్రి ఆచార్యుఁడు అనుముగ్గురిచేత, సంధిం=సంబంధమును, ఏత్య=పొంది, త్రికర్మకృత్=యాగము స్వాధ్యాయము దానము అనుమూఁడుకర్మలనొనర్చుచున్న(యెడల)వాఁడు, జన్మమృత్యూ=జన్మమరణములను, తరతి = అతిక్రమించుచున్నాఁడు. బ్రహ్మజజ్ఞం=హిరణ్యగర్భునివల్లనుండి పుట్టినవాఁడును సర్వజ్ఞుఁడును, ఈడ్యం = కొనియాఁడదగినవాఁడును అగు, దేవం=దేవుని, విదిత్వా=తెలిసికొని, నిచాయ్య = శాస్త్రప్రమాణముతోఁ చూచి, ఇమాం=ఈ, శాంతిం=శాంతిని, అత్యంతం=మిక్కిలి, ఏతి=పొందుచున్నాఁడు.

తా. మఱల నీమంత్రమునందు కర్మస్తుతిచేయఁబడుచున్నది.-త్రిణాచికేతుఁడు అనఁగా మూఁడుపర్యాయములు నాచికేతాగ్నిచయనమొనర్చిన

వాఁడు లేక నాచికేతాగ్నిచయనవిజ్ఞానమెఱింగి, తన్మంత్రముల నధ్యయన మొనర్చి, ఆచయనము ననుష్ఠించినవాఁడు. ముగ్గుఱిచేతను అనఁగా తల్లి, తండ్రి, ఆచార్యుఁడు అనుముగ్గురిచేతను అనుశాసనమును యథావిధిగాఁబొంది, ఈవిషయమునే "మాతృమా న్పితృమా నాచార్యవాన్బ్రూయాత్," (బృహ ౪-౧-౨) అనుశ్రుతి సూచించుచున్నది. లేక వేద, స్మృతి, శిష్టులచేతను లేక ప్రత్యక్షానుమానాగమములచేతను బోధింపఁబడిమూఁడుకర్మలను అనఁగా ఇజ్యాధ్యయనదానములనొనర్చువాఁడు జన్మమృత్యువులను అతిక్రమించుచున్నాఁడు. మఱియు బ్రహ్మజజ్ఞుఁడును, (బ్రహ్మజుఁడనఁగా హిరణ్యగర్భునివల్లనుండి పుట్టినవాఁడు, జ్ఞుఁడనఁగా సర్వజ్ఞుఁడును,) ప్రకాశించుచున్న జ్ఞానాదిగుణములుగలవాఁడగుటచేత దేవశబ్దవాచ్యుఁడును, కొనియాడఁదగినవాఁడును అగువానిని శాస్త్రప్రమాణముచేత నెఱింగి ఆత్మభావముచేత స్వబుద్ధిప్రత్యక్షమైనయీ శాంతిని-అనఁగా ఉపరతిని అత్యంతము పొందుచున్నాఁడు. జ్ఞానకర్మసముచ్చయానుష్ఠానమువలన వైరాజపదమును పొందుచున్నాఁడని భావము.

వివరణము.—నాచికేతాగ్నిచయనమునకు ఇష్టకలు, ౭౨౦ సంఖ్యగలవి. సంవత్సరమునకు సాయంప్రాతఃకాలములందు చేయఁబడుచున్న అగ్నిహోత్రములుకూడ ౭౨౦ సంఖ్యగలవి యగుచున్నవి. ఇట్టి సంఖ్యగలసంవత్సరాత్మకుఁడ నగునేనున్నూ అగ్నియున్నూ ఒక్కటేయనుభావము కలిగియుండుటయే ఆత్మభావమని యెఱుంగవలయును.

౧౮-వమంత్రము.

మూ. త్రిణాచికేత స్త్రయ మేత ద్విదిత్వా
యఏవం విద్వాంశ్చినుతే నాచికేతం,
సమృత్యుపాశా న్పురతః ప్రణోద్య
శోకాతిగో మోదతే స్వర్గలోకే. ౧౮

పద. త్రిణాచికేతః త్రయం ఏతత్ విదిత్వా యః ఏవం విద్వాన్ చినుతే నాచికేతం, సః మృత్యుపాశాన్ పురతః ప్రణోద్య శోకాతిగః మోదతే స్వర్గలోకే.

టీక. త్రిణాచికేతః = త్రిణాచికేతుఁడగు, యః విద్వాన్=ఏవిద్వాంసుఁడయినవాఁడు, ఏతత్ త్రయం= ఈచెప్పఁబడినమూడింటిని, విదిత్వా= తెలుసుకొని, నాచికేతం = నాచికేతాగ్నిని, చినుతే = చయనము నొనర్చుచున్నాఁడో, సః=వాఁడు, మృత్యుపాశాన్ = మృత్యుపాశములను, (అధర్మ, అజ్ఞాన, రాగ, ద్వేషాదిగుణస్వరూపములగువానిని)పురతః=ముందుగా, ప్రణోద్య = తనశరీరమునుండి దూరముగా తీసివేసుకొన్నవాఁడై, శోకాతిగః=మానసదుఃఖరహితుఁడై, స్వర్గలోకే = వైరాజమగు స్వర్గలోకమునందు విరాడాత్మస్వరూపమును బొందుటచేతను, మోదతే=ఆనందించుచున్నాఁడు.

తా. త్రిణాచికేతుఁడగు ఏవిద్వాంసుఁడు ఈనాచికేతాగ్నిచయనమునకు ఎన్నియిష్టకలో, ఆయిష్టకలు ఏవిధముగానుండవలయునో, వానిని ఎటుల చయనమొనర్పవలయునో చక్కఁగా నెఱింగి నాచికేతాగ్నిచయన మొనర్చిన యెడల వాఁడు అధర్మ, అజ్ఞానరాగద్వేషాదిలక్షణములగు మృత్యుపాశములను ఈదేహముండగనే తీసివేసికొని శోకవిరహితుఁడై విరాడాత్మస్వరూపముగలవాఁడయి వైరాజమను స్వర్గలోకమునందు ఆనందించుచున్నాఁడు.

వివరణము.—త్రిణాచికేతుఁడనఁగా 3 పర్యాయములు నాచికేతాగ్నిచయన మొనర్చినవాఁడు లేక ఆనాచికేతాగ్నిచయన విధి నెఱింగి, తన్మంత్రములనధ్యయన మొనర్చి తత్క్రతువునొనర్చినవాఁడు. నాచికేతాగ్నిచయనమున కుపయోగించు ఇష్టక (ఇటుకరాయి) లెట్టియాకారముగలవిగా నుండునో, ఎన్నిసంఖ్యలుగల ఎన్నిఇష్టకలు కావలయునో, వానిని యెటుల క్రతువునం దుపయోగించవలయునో ఆవిషయముల నెఱుంగవలయుననిభావము. అధర్మ, అజ్ఞానాదులను మృత్యుపాశములనఁగా నిరూపించుట బాధకత్వగుణసంబంధ ముభయత్ర తుల్యమగుటచేతనని యెఱుంగవలయును.

౧౯-వ మంత్రము.

మూ. ఏష తే ఽగ్ని ర్నచికేతః స్వర్గ్యో
యమవృణీథా ద్వితీయేన వరేణ,
ఏతమగ్నిం తవైవ ప్రవక్ష్యంతి జనాస
స్తృతీయం వరం నచికేతో వృణీష్వ. ౧౯

పద. ఏషః తే అగ్నిః నచికేతః స్వర్గ్యః యం అవృణీథాః ద్వితీయేన వరేణ, ఏతం అగ్నిం తవ ఏవ ప్రవక్ష్యంతి జనాసః తృతీయం వరం నచికేతః వృణీష్వ. ౧౯

టీక. నచికేతాః=ఓనచికేతసుఁడా! ద్వితీయేన వరేణ=రెండవదియగు వరముచేత, యం = నాచికేతాగ్ని చయనరూపమగు ఏయగ్నివిజ్ఞానమును, అవృణీథాః = వరమునుగా వరించితివో, స్వర్గ్యః=స్వర్గప్రాపకమగు, ఏషః=ఈ, అగ్నిః = నాచికేతాగ్ని, తే=నీకు సంబంధించినది యగుఁగాక. జనాసః = జనులందఱు, ఏతం అగ్నిం=ఈయగ్నిచయనమును, తవఏవ=నీకు సంబంధించిన దానినిగానే, (అనఁగా నాచికేతాగ్నియని) ప్రవక్ష్యంతి = పలుకగలరు. నచికేత = ఓనచికేతుఁడా! తృతీయం వరం=మూఁడవవరమును, వృణీష్వ = వరింపుము.

తా. ఓనచికేతుఁడా రెండవవరముచేత స్వర్గప్రాపకమగు ఏనాచికేతాగ్నిచయన విజ్ఞానరూపమగు వరమును నావలన నీవు పొందియున్నాఁడవో అట్టి స్వర్గప్రాప్తిసాధనభూతమగు నాచికేతాగ్నిచయనవిజ్ఞానము నీకు సంబంధించినదే. ఇదిమొదలుకొని జనులందఱు ఈ నాచికేతాగ్నిచయనవిజ్ఞానమును నీకు సంబంధించిన దానినిగానే (నాచికేతాగ్నిచయనమని) చెప్పుచుందురు. నీకు నేను ఇచ్చెదనన్న మూఁడవవరమునుకూడ నీవునన్ను కోరుకొనుము. ఆమూఁడవ వరమును నేను నీకిచ్చువఱకు నేను నీకు ఋణపడియుందునని భావము.

వివరణము.—లోకమునందు విద్యోపదేశమును ప్రార్థితుఁడయి చేయవలయునుగాని స్వయముగా ప్రేరణమొనర్చి యుపదేశించుట అనుచితమయి. నను యముఁడు స్వయముగా అతనికి 3 వరముల నివ్వవలసినవాఁడు అగుటచేత నచికేతసునకు ఋణపడియున్నాఁడు కావున నచికేతసుఁడు త్వరపడియడుగకపోయినను యముఁడు తాను ఋణపడియున్నదానిని తీర్చుకొనుటకు, నచికేతుఁడు ఉపదేశమునకు అర్హుఁడని యెంచి ప్రేరణ మొనర్చుట ఉచితమే యగుచున్నది.

౨౦-వ మంత్రము.

అవ. ఇంతవఱకుచెప్పఁబడిన మంత్రబ్రాహ్మణరూపమయిన దానిచేత తెలియుచున్న విషయమేమనఁగా నచికేతునకు యముఁడొసంగిన రెండువరములకు సంబంధించినవిషయము ఆత్మతత్త్వవస్తుయాథాత్మ్యవిజ్ఞానమునకు సంబంధించినదికాదని తెలిసినది. విధిప్రతిషేధరూపముతో క్రియాకారకఫలాధ్యారోపలక్షణములతో ఆత్మయం దారోపితమయిన అజ్ఞానరూపసంసారబీజముయొక్క నివృత్తికొఱకు క్రియాకారక ఫలాధ్యారోప లక్షణశూన్యమును ఆత్యంతిక నిశ్శ్రేయసప్రయోజనమును అగు ఆత్మతత్త్వమును బోధించుటకు ఉత్తరగ్రంథము ప్రారంభింపఁబడుచున్నది. అట్టియాత్మతత్త్వము నచికేతుఁడడిగిన రెండవవరముయొక్క ప్రాప్తిచేతకూడ పూర్తి కాలేదనియు, తదర్థము మూఁడవవరముచేత ఆత్మజ్ఞానమును ప్రత్యేకముగా అడుగుచున్నాఁడనియుం నీఆఖ్యాయికచేత స్పష్టీకరింపఁబడుచున్నది.—

మూ. యేయం ప్రేతే విచికిత్సా మనుష్యే
ఽస్తీత్యేకే నాయమస్తీతి చైకే,
ఏతద్విద్యా మనుశిష్ట స్త్వయాఽహం
వరాణా మేష వర స్తృతీయః. ౨౦

పద. యా ఇయం ప్రేతే విచికిత్సా మనుష్యే అస్తి ఇతి ఏకే న

అయం అస్తి ఇతి చ ఏకే, ఏతత్ విద్యాం అనుశిష్టః త్వయా అహం వరాణాం ఏషః వరః తృతీయః. ౨౦

టీక. మనుష్యే=మనుష్యుఁడు, ప్రేతే=మరణించినవాఁ డగుచుండఁగా, అయం అస్తి ఇతి ఏకే = దేహేంద్రియములకు భిన్నముగ ఆత్మయనువాఁ డొకఁడు ఉన్నాఁడని కొందఱున్నూ, అయం న అస్తి ఇతి చ ఏకే=ఆత్మయనువాఁడు దేహేంద్రియములకు భిన్నముగ లేఁడని కొందఱున్నూ (పలుకుచున్నారు.) త్వయా = నీచేత, అనుశిష్టః = శాసింపఁబడిన, అహం = నేను, ఏతత్=దీనిని, విద్యాం=తెలిసికొనియెదను. వరాణాం = మీరు నాకిచ్చెదనని పలికిన మూఁడువరములలో, ఏష వరః = ఈవరము, తృతీయః = మూఁడవది యగుఁగాక.

తా. కర్మగోచరమయినట్టియు, సాధ్యసాధనలక్షణ మయినట్టియు, అనిత్యమయినట్టియు సంసారమునుండి విరక్తిని పొందినవానికే ఆత్మజ్ఞానమందు అధికారమగువిషయమును తెలుపుటకయి సంసారముయొక్క నిందను వ్యక్తీకరించుటకయి ఆసంసారసుఖముయొక్క ప్రలోభనము, తదుపరి తన్నిందమున్నగునవి ప్రథమవల్లియొక్క చివరవఱకు క్రమముగ వ్యక్తీకరింపఁబడుచున్నది.—మూఁడవవరమును కోరుకొనుము| అని యమునిచేత నాచికేతుఁడు చెప్పఁబడినవాఁడయి ఇట్లని మూఁడవవరమును అడిగెను—మనుష్యుఁడు మరణించినతరువాత శరీరేంద్రియమనోబుద్ధులకు వ్యతిరిక్తముగ నీదేహమునుండి మఱొకదేహాంతరమును పొందునట్టి ఆత్మయనువాఁ డొకఁడున్నాఁడని కొందఱున్నూ లేఁడని కొందఱున్నూ పలుకుచున్నారుగదా! ఈరెండుపక్షములలో నెయ్యది న్యాయమో ఆవిషయమును ప్రత్యక్షప్రమాణముచేతగాని అనుమానప్రమాణముచేతగాని ఎఱుంగుటకు వీలులేకయున్నది. ఈవిషయము నెఱింగినగాని తక్కినవిషయములనుగూర్చి చర్చించుటకే అవకాశములేదు. సర్వజ్ఞుఁడవగు నీవలన నాకీసంశయము నివర్తింపవలయును. నీవిచ్చెదనన్న మూఁడువరములలో మిగిలియున్న మూఁడవవరముగా నీవిషయమును నాకు బోధింపుము.

వివరణము.—ఇదివఱకు ఇచ్చిన రెండువరములలో మొదటి వరము తండ్రికి తనయందు మంచితలంపు కలుగవలయుననియు, రెండవవరము, స్వర్గలోకమునుపొందుటకు తగినసాధనమును నిరూపించుటయు అగుచున్నవి. ఈ రెండువరములున్ను సంసారమునకు సంబంధించినవిగాని, సంసారమును అతిక్రమించినవి కావు. ౩-వ వరముమాత్రము ఆత్మతత్త్వవిషయము అని గ్రహించవలయును. ఇదిమొదలుకొని యీవల్లియొక్క అంతమువఱకు ఆత్మతత్త్వమును గూర్చి తెలిసికొనుట దుశ్శకము కావున మఱొకవరమును కోరుకొనుము అని యముఁడు క్రొత్తక్రొత్త ప్రలోభనములను చెప్పుటయు, నచికేతసుఁడు ఆ ప్రలోభనములకు లోఁబడక ఆత్మతత్త్వమునే తనకు ౩-వ వరముగా బోధించుమని చివరవఱకు దృఢముగానుండి యడిగినటుల వల్లి సమాప్తమగుచున్నది. ౨-వ వల్లియొక్క ఆరంభమునుండి యముఁడు ఆత్మతత్త్వము నుపదేశించును.

౨౧-వ మంత్రము.

అవ. ఈనచికేతుఁడు నిశ్శ్రేయసమునకు సాధనభూతమగు ఆత్మజ్ఞానమునకు అర్హుఁడగునా కాఁడా యను పరీక్షణార్థము యముఁ డిట్లు పలుకుచున్నాఁడు:—

మూ. దేవైరత్రాపి విచికిత్సితం పురా
న హి సుజ్ఞేయ మణురేష ధర్మః,
అన్యం వరం నచికేతో వృణీష్వ
మా మోపరోత్సీ రతిమాసృజైనమ్. ౨౧.

పద. దేవైః అత్ర అపి విచికిత్సితం పురా న హి సుజ్ఞేయం అణుః ఏషః ధర్మః, అన్యం వరం నచికేతః వృణీష్వ మా మా ఉపరోత్సీః అతి మా సృజ ఏనమ్. ౨౧

టీక. ఓనచికేతుఁడా! అత్ర = ఈయాత్మతత్త్వముయొక్కవిషయమునందు, పురా = పూర్వకాలమునందు, దేవైః అపి = దేవతలచేతనున్ను, విచి.

చికిత్సితం=సంశయింపఁబడినది, సుజ్ఞేయం=సుఖముగా తెలిసికొనఁదగినది, నహి = కాదు. ఏషః ధర్మః=ఈ యాత్మధర్మము, అణుః = మిక్కిలిసూక్ష్మమయినది. (కావున) నచికేతః = ఓనచికేతుఁడా! అన్యం = వేఱయిన, వరం=వరమును, వృణీష్వ=వరింపుము, మా=నన్ను, మా ఉపరోత్సీః = నిర్బంధింపవలదు. మా= నన్నుఁగూర్చి, ఏనం=ఈవరమును, అతిసృజ=వదలుము.

తా. పూర్వకాలమునందు దేవతలుకూడా ఈయాత్మతత్త్వవస్తువును గూర్చి సంశయముగలవారలయి విచారించిరి. ఈవిషయము సులభముగా తెలియునదికాదు. ఈయాత్మధర్మము మిక్కిలిసూక్ష్మమయినది కావున ప్రాకృతులగుజనులకు గోచరించునదికాదు. కనుక చెప్పినను తెలుసునో తెలియదో యను సందేహముగల యీవిషయమునువదలి అసందిగ్ధఫలముగల మఱొకవరమును నీవు కోరుకొనుము. ఋణగ్రస్తుని ఉత్తమర్ణుఁడు (అప్పుయిచ్చినవాఁడు) నిర్బంధించునటుల నీవు నన్నీవరము నిమిత్తము బాధింపకుము. ఈవరమును వదలి మఱొకవరమును నన్ను అడుగుము.

వివరణము:—దేవతలు అప్రతిహతజ్ఞానులుగదా. వారికిఁగూడా ఈ విషయమునుగూర్చి సంశయముగలదా యను ఆక్షేపనిరాసార్థము 'పురా' యని చెప్పఁబడినది. అనఁగా సృష్టికాలమునందు దేవతల కిట్టిసంశయము కలిగియుండెను. తరువాత ప్రబోధితులయి వారీవిషయము నెఱింగిరి.

ఆత్మధర్మము 'అణువు' అని చెప్పఁబడినదిగదా. అణుపరమాణ మని యదర్థముకాదు. అణువనఁగా సూక్ష్మమని యిచట గ్రహించవలయును.

౨౨-వ మంత్రము.

అవ. యముఁడు చెప్పినదానికి నచికేతునియొక్క ప్రత్యుత్తరము:—

మూ. దేవైరత్రాపి విచికిత్సితం కిల
త్వం చ మృత్యో యన్న సుజ్ఞేయమాత్థ,

వక్తా చాస్య త్వాదృ గన్యో న లభ్యో
నాన్యో వర స్తుల్య ఏతస్య కశ్చిత్. ౨౨

పద. దేవైః అత్ర అపి విచికిత్సితం కిల త్వం చ మృత్యో యత్ న సుజ్ఞేయం అత్థ, వక్తా చ అస్య త్వాదృక్ అన్యః న లభ్యః న అన్యః వరః తుల్యః ఏతస్య కః చిత్." ౨౨

టీక. అత్ర = ఈయాత్మవస్తువునుగూర్చి, దేవైః అపి = దేవతలచేత కూడా, విచికిత్సితం కిల = సంశయింపఁబడినదిగదా. మృత్యో = ఓయమధర్మరాజా! యత్=ఏకారణమువలన త్వంచ=నీవున్నూ, న సుజ్ఞేయం=సుఖముగా తెలిసికొనుటకు శక్యముకానిదని, అత్థ = పలికియున్నావుగదా. అస్య=ఈఆత్మతత్త్వముయొక్క, వక్తా = చెప్పునట్టివాఁడు, త్వాదృక్ = నీవంటి, అన్యః= మఱొకఁడు, నలభ్యః=లభింపఁడు. ఏతస్య=ఈవరమునకు, తుల్యః=సమానమగు, అన్యః=మఱొక, వరః=వరము, నకశ్చిత్=ఒకటియు లేదు.

తా. ఈయాత్మధర్మమునుగూర్చి దేవతలుకూడా సంశయగ్రస్తులయి విచారణ సలిపియుండిరని నీవే చెప్పుచున్నావుగదా. ఈయాత్మతత్త్వము సులభముగా తెలియునట్టిదికాదనియు నీవే చెప్పియున్నావు. గొప్పగొప్ప పండితులకుఁగూడా యీవిషయము అనఁగా ఆత్మతత్త్వము సులభముగా తెలియునది కాదు. ఈయాత్మతత్త్వమును బోధించుటకు నీకంటె భిన్నుఁడగు మఱొకబ్రహ్మవేత్త లభింపఁజాలఁడు. నిశ్శ్రేయసప్రాప్తికి హేతుభూతమగు నీవరమునకు సమానమయిన మఱొకవరముకూడ లేదు. ఏలయనఁగా నిశ్శ్రేయసప్రాప్తికంటె భిన్నమయినసకలవరములు అనిత్యఫలప్రదములు కావున ఇతరవరములు నాకక్కరలేదని భావము.

౨౩-వ మంత్రము.

అవ. నచికేతుఁ డిట్లుచెప్పినను యముఁడు మఱల ఇట్లు ౫ మంత్రములతో ప్రలోభించుచున్నాఁడు:—

మూ. శతాయుషః పుత్రపౌత్రాన్వృణీష్వ
బహూన్పశూన్ హస్తిహిరణ్య మశ్వాన్,
భూమే ర్మహదాయతనం వృణీష్వ
స్వయంచ జీవ శరదో యావ దిచ్ఛసి. ౨౩

పద. శతాయుషః పుత్రపౌత్రాన్ వృణీష్వ బహూన్ పశూన్ హస్తిహిరణ్యం అశ్వాన్, భూమేః మహత్ ఆయతనం వృణీష్వ స్వయం చ జీవ శరదః యావత్ ఇచ్ఛసి. ౨౩

టీక. శతాయుషః = నూరుసంవత్సరములు ఆయుస్సుగల, పుత్రపౌత్రాన్=పుత్రులను పౌత్రులను, వృణీష్వ = వరింపుము. బహూన్=అనేకములగు, పశూన్ = గవాదిలక్షణములగుపశువులను, హస్తిహిరణ్యం=ఏనుఁగులను బంగారమును, అశ్వాన్ = అశ్వములను, భూమేః = భూమియొక్క, మహత్=గొప్పదయిన, ఆయతనం=ఆశ్రయమగుమండలమును లేక సామ్రాజ్యమును, వృణీష్వ=వరింపుము. స్వయం చ = స్వయముగా నీవున్నూ, యావత్ శరదః=ఎన్నిసంవత్సరములు, ఇచ్ఛసి=జీవించియుండుటకు ఇచ్ఛయించుచున్నాఁడవో (అంతకాలము) జీవ=జీవించియుండుము.

తా. (యముఁడు నచికేతసుని ప్రలోభించుటకు మఱల నిట్లుపలుకుచున్నాఁడు:—నూరుసంవత్సరములు జీవించియుండునట్టి పుత్రపౌత్రాదులు కలిగియుండవలయు ననువరమును కోరుకొనుము. అసంఖ్యాకమగు గవాదిలక్షణమగు పశుసంపదను కోరుకొనుము. ఏనుఁగులు, గుఱ్ఱములు, బంగారము మున్నగువానిని కోరుకొనుము. మఱియు నీభూతలముకంటె విస్తారమయిన రాజ్యము కావలయునని కోరుకొనుము. ఇన్నియున్నను నేను అల్పాయుస్సు కలిగియుందునేని వీనివలన నాకు కలుగఁబోవు ప్రయోజనమేమియని నీవు తలంచునెడల నీవెంతకాలము సకలేంద్రియసామర్థ్యసహితుఁడవయి జీవించియుండవలయునని తలంచెదవో అంతకాలము సుఖముగా జీవించియుండు వటుల వరమును కోరుకొనుము.

వివరణము:—ఆయతన మనఁగా మండలమని చెప్పఁబడుచున్నది. ౪౦ యోజనముల పరిమాణముగల భూభాగము మండలము. సామ్రాజ్య మనఁగా జనపదసంరక్షణమని భావము.

౨౪ -వ మంత్రము.

మూ. ఏత త్తుల్యం యది మన్యసే వరం
వృణీష్వ వి_త్తం చిరజీవికాం చ,
మహాభూమౌ నాచికేత_స్త్వమేధి
కామానాం త్వా కామ భాజం కరోమి. ౨౪

పద. ఏతత్తుల్యం యది మన్యసే వరం వృణీష్వ వి_త్తం చిరజీవికాం చ, మహాభూమౌ నాచికేతః త్వం ఏధి కామానాం త్వా కామభాజం కరోమి.

టీక. ఏతత్ తుల్యం = నేనిదివఱకుచెప్పినవానితో సమానమయిన, వరం =మఱొకవరమును, మన్యసేయది=నీవుతలంచినయెడల, వృణీష్వ = వరింపుము. వి_త్తం=విస్తారమయిన హిరణ్యరత్నాదిద్రవ్యమును, చిరజీవికాంచ = చిరజీవిత్వమునున్ను, వృణీష్వ=వరింపుము. నాచికేతః=ఓనచికేతుఁడా! మహాభూమౌ = విశాలమయిన యీభూలోకమునందు, త్వం= నీవు, ఏధి=రాజుగానుండుము. త్వాం=నిన్ను, కామానాం = దివ్యమానుషకామములలో, కామభాజం=కోరిక లన్నిటిని పొందినవానినిగా, కరోమి=చేయుచున్నాఁడను.

తా. నేనిదివఱకు నీకొసంగెదనని చెప్పిన వరములుమాత్రమేగాక ఆ వరములతో సమానమయిన మఱొకవరమునుగూడ నీవు కోరుకొనుము. మఱియుం విస్తారమగు బంగారము రత్నములు మున్నగుధనమున్ను, అట్టి సంపదతోఁగూడిన చిరజీవిత్వమునున్ను నీవు వరముగా నడుగుము. వేయి మాటలెందుకు? ఈ భూమండలమునకు సార్వభౌముఁడవయి యుండునట్టి వరమును కోరుము. నేను సత్యసంకల్పుఁడను కావున మానుషములును, దివ్యములును అగు నేయే కామములుగలవో ఆ కామములలో నేవి నీకుకావలయునో

వానిని కోరుకొనుము. నీవుకోరిన దివ్యమానుషకామముల నన్నిఁటిని నీ కొసంగెదను.

వివరణము.—ఇదివఱకు నూరుసంవత్సరములు ఆయుస్సుగల పుత్త్రపౌత్త్రాదులను, పశువులను, రాజ్యమును అని విడివిడిగా చెప్పఁబడినది. ఈ మంత్రమునందు అవన్నియు సముచ్చయముగా చెప్పఁబడినది.

౨౫-వ మంత్రము.

మూ. యే యే కామా దుర్లభా మర్త్యలోకే
సర్వా న్కామాగ్ శ్ఛందతః ప్రార్థయస్వ,
ఇమా రామా స్సరథా స్సతూర్యా
న హీదృశా లంభనీయా మనుష్యైః,
ఆభి ర్మత్ప్రత్తాభిః పరిచారయస్వ
నచికేతో మరణం మాఽనుప్రాక్షీః. ౨౫

పద. యే యే కామాః దుర్లభాః మర్త్యలోకే సర్వాన్ కామాన్ ఛందతః ప్రార్థయస్వ, ఇమాః రామాః సరథాః సతూర్యాః న హి ఈదృశాః లంభనీయాః మనుష్యైః, ఆభిః మత్ప్రత్తాభిః పరిచారయస్వ నచికేతః మరణం మా అనుప్రాక్షీః. ౨౫

టీక. మర్త్యలోకే = మనుష్యలోకమునందు, యేయేకామాః = ఏయే కోరికలు, దుర్లభాః = దుర్లభములో, సర్వాన్ కామాన్ = ఆకోరికలన్నిఁటిని, ఛందతః = నీయిష్టానుసారము, ప్రార్థయస్వ = ప్రార్థింపుము. ఇమాః = ఈ, రామాః=అప్సరసలు, సరథాః = రథముతోఁగూడుకొన్నవారున్నూ, సతూర్యాః=వాద్యధ్వనులుగలవారున్నూ (అయియున్నారు), ఈదృశాః=ఇట్టిదివ్యస్త్రీరత్నములు, మనుష్యైః = మనుష్యులచేత, న లంభనీయాః = పొందుటకు సాధ్యముకాదు, మత్ప్రత్తాభిః = నాచేత నీకొసంగఁబడిన, ఆభిః = ఈయప్సరస్త్రీరత్నములచేత, పరిచారయస్వ = పాదప్రక్షాళనాదిరూపమగు సేవను

చేయించుకొనుము. నచికేతః=ఓనచికేతుఁడా! మరణం=మరణానంతరసంబంధ మగు ప్రశ్నను గూర్చి, మానుప్రాక్షీః=అడుగవద్దు.

తా. మనుష్యలోకమునందు ఏయేకోరికలు ప్రార్థింపఁదగియుండునో, ఏ కోరికలు మనుష్యలోకమునందు దుర్లభములో ఆకోరికల నన్నిఁటిని నీవుస్వేచ్ఛ గా నడుగుము. ఇదియునుగాక పురుషులను సంతోషపెట్టునట్టి ఈదివ్యస్త్రీరత్న ములను రథములతోను, మంగళవాద్యములతోను నీకొసంగుచున్నాను. మా వంటివారి యనుగ్రహములేనియెడల ఇట్టిదివ్యస్త్రీరత్నములు మనుష్యుల కెన్న డున్నా లభింపరు. నేను నీయందనుగ్రహబుద్ధితో నిట్టిదివ్యస్త్రీరత్నముల నీకు నొసంగుచున్నాఁడను. నీకు నేనొసంగిన యీదివ్యస్త్రీలచేత పాదప్రక్షాళనాది రూపమగు పరిచర్యను చేయించుకొనుము. మరణమయినతర్వాత శరీరేంద్రియ విలక్షణముగ ఆత్మయనువస్తువు ఒకటి ఉండునా లేదా? యను 'కాకదంత పరీక్షా' తుల్యమగు ప్రశ్నమాత్రము నీవు నన్నడుగకుము.

౨౬-వ మంత్రము.

అవ. ఈవిధముగా యముఁడు ప్రలోభించుచున్నను నచికేతుఁడు ఇంచుకయినను మహాహ్రదమువలె చలింపక అట్లనే నిశ్చలుఁడయి యిట్లు బదులు చెప్పుచున్నాఁడు.—

మూ. శ్వోభావా మర్త్యస్య యదంతకైత
త్సర్వేంద్రియాణాం జరయంతి తేజః,
అపి సర్వం జీవిత మల్పమేవ
తవైవ వాహా స్తవ నృత్యగీతే. ౨౬

పద. శ్వోభావాః మర్త్యస్య యత్ అంతక ఏతత్ సర్వేంద్రియాణాం జరయంతి తేజః, అపి సర్వం జీవితం అల్పం ఏవ తవ ఏవ వాహాః తవ నృత్య గీతే.

టీక. మర్త్యస్య=ప్రాణులకు, అంతక = అంతకుఁడవగు ఓయమరాజా ! (ఈభోగములు) శ్వోభావాః=నశ్వరములు, యత్=ఏకారణమువలన, ఏతత్= ఈయప్సరసలు మున్నగుభోగజాతము, సర్వేంద్రియాణాం తేజః = సకలేంద్రియములయొక్క శక్తిని, జరయంతి=కృశింపఁజేయుచున్నవి. సర్వంజీవితమపి= సకలమయినజీవితమున్నూ అనఁగా బ్రహ్మయొక్క ఆయుస్సున్నూ, అల్పం ఏవ =అల్పమే, వాహాః=గుఱ్ఱములు మున్నగునవి, తవ ఏవ=నీకే ఉండుఁగాక. నృత్యగీతే=నాట్యము గానమున్నూ, తవ ఏవ=నీకే యుండుఁగాక.

తా. ఓయమధర్మరాజా ! నీవిప్పుడు నాకొసంగెదనని చెప్పినభోగములన్నియు శ్వోభావములే—అనఁగా నేఁడనుభవించుచున్నవి రేపుకూడ అనుభవమునకు నిలిచియుండునా ఉండవా యనుసందేహముగలవి అయియున్నవి. మఱియు అప్సరసలు మున్నగు దివ్యస్త్రీరత్నముల నొసంగెదనని చెప్పియున్నాఁడవుగదా. కాని ఇట్టిభోగమువలన ధర్మ, వీర్య, ప్రజ్ఞా, తేజో, యశః ప్రముఖములగు నవి యన్నియు నశించి పోవును. మఱియు దీర్ఘాయుస్సు నొసంగెదనని నీవు చెప్పుచున్నావు. ఇట్టిభోగముల ననుభవించుచుండుటకు బ్రహ్మదేవుని యొక్క ఆయుఃపరిమాణమంత ఆయుస్సుఅయినను అల్పముగానే తోఁచును. నావంటివారికి నీవంటివారి అనుగ్రహామువలనలభించెడి దీర్ఘాయుస్సు ఒక లెక్కయా ? కావున నీవిచ్చెదనన్నగుఱ్ఱములు రథములు, నీకేయుండుఁగాక నృత్యములు గీతములు నీకే యుండుఁగాక.

౨౭-వ మన్త్రము.

మూ. న విత్తేన తర్పణీయో మనుష్యో
లప్స్యామహే విత్త మద్రాక్ష్మ చేత్త్వా,
జీవిష్యామో యావ దీశిష్యసి త్వం
వరస్తు మే వరణీయ స్స ఏవ. ౨౭

పద. న విత్తేన తర్పణీయః మనుష్యః లప్స్యామహే విత్తం అద్రాక్ష్మ చేత్ త్వా, జీవిష్యామః యావత్ ఈశిష్యసి త్వం వరః తు మే వరణీయః సః ఏవ. ౨౭

టీక. మనుష్యః=మనుష్యుఁడు, విత్తేన = విస్తారమయినధనముచేత, నతర్పణీయః=తృప్తిపొందించఁదగినవాఁడు, న = కాఁడు. త్వా=నిన్ను, అద్రాక్ష్మచేత్ = చూచినయెడల, విత్తం = ధనమును, లప్స్యామహే=పొందఁగలము. త్వం=నీవు, యావత్=ఎంతకాలము, ఈశిష్యసి=తలంచెదవో, (అంతకాలము) జీవిష్యామః=బ్రతుకఁగలము. మే = నాకు, వరణీయః=వరించఁదగిన, వరస్తు = వరమైతే, సఃఏవ=ఆవరమే.

తా. మఱియు అధికమయినధనముచేత మనుష్యునకు సంతృప్తికలుగు ననుట అసంభవము. ద్రవ్యలాభమువలన సంతృప్తికలిగినవాఁడు లోకమునం దెవ్వఁడు గనంబడుటలేదు. మాకు ధనమే కావలసినయెడల నీవంటివారి సందర్శనమువల్లనే మాకు ధనము వలసినంత లభించును. లోకమునకు ప్రభువగునీవు మేమెంతకాలము జీవించియుండవలయుననితలంతువో అంతకాలము మేము నిరాఘాటముగ జీవించియుందుము. ఏలయనఁగా నీవంటివాని సందర్శనము లభించిన మనుష్యమాత్రునకు అల్పాయుస్సు అల్పధనము ఉండుననుట అసంభవముగదా. కనుక నాకీవరములు ఏమియుం అక్కరలేదు. నేను ఆత్మవిజ్ఞానమునుగూర్చి నిన్నడిగినవరమే నాకు కావలయును గాని వేఱువర మక్కరలేదని భావము.

వివరణము;—దేవతలయొక్క సందర్శనమువలననే సకలాభీష్టములు సిద్ధించుచుండుట శ్రుతిస్మృత్యనుభవప్రసిద్ధవిషయము. ఇట్లుండ దేవతాసందర్శనమై తదనుగ్రహమునకు పాత్రుఁడై, తత్సంభాషణాదికము నొనర్చినవానికి ధనాయుస్సులు అల్పముగా నుండఁజాలవని వేఱుగా చెప్పనక్కరలేదు కావున ఆవేవియు నాకక్కరలేదు. కనుకనే నిన్ను మొదట అడిగినవరమునే నాకొసంగుము.

౨౮-వ మంత్రము.

మూ. అజీర్యతా మమృతానా ముపేత్య
జీర్య న్మర్త్యః క్వధస్థః ప్రజానన్,
అభిధ్యాయ న్వర్ణరతిప్రమోదా
నతిదీర్ఘే జీవితే కో రమేత. ౨౮

పద. అజీర్యతాం అమృతానాం ఉపేత్య జీర్యన్ మర్త్యః క్వధస్థః ప్రజానన్, అభిధ్యాయన్ వర్ణరతిప్రమోదాన్ అతిదీర్ఘే జీవితే కః రమేత. ౨౮

టీక. అజీర్యతాం = వయోహానిలేనట్టి, అమృతానాం = దేవతల యొక్క, (అనుగ్రహమును) ఉపేత్య = పొంది, జీర్యన్ = కృశించుచున్న, మర్త్యః = మనుష్యుఁడు, క్వధస్థః = భూమియందున్నవాఁడై, వర్ణరతి ప్రమోదాన్ = నృత్యగీతసంభోగాది సుఖములను, అభిధ్యాయన్ = కోరు చున్నవాఁడై, అతిదీర్ఘే జీవితే = చిరకాలజీవితమునందు, కః = ఎవ్వఁడు ? రమేత = రమించును.

తా. ఇదియునుఁగాక వయోహానియనునది లేక అమరణధర్ములగు దేవతలయొక్క అనుగ్రహమునకు పాత్రుఁడయిన జరామరణధర్మములుగల భూలోకవాసియగు మనుష్యుఁడు తాను పొందఁదగిన శ్రేష్ఠమయిన ప్రయోజనాంతరమునకు ప్రయత్నించవలయును. లోకమునం దుండఱు తామున్న స్థితికంటె ఎక్కువస్థితికిరావలయునని కోరుకొందురుగాని తక్కువస్థితికి స్వయముగా పోవలయునని యెవ్వరును కోరుకొనరు కావున శతాయుష్షులగు పుత్రపౌత్రాదిప్రలోభనములకు ధన సామ్రాజ్యాప్సరస్త్రీజనాది ప్రలోభనములకు నేను లోఁబడఁజాలను. నిలకడలేనట్టి అప్సరస్త్రీలసౌఖ్యమును, నృత్య గీతాదికములను, దీర్ఘాయుస్సు మున్నగువానిని వివేకియగువాఁడు కోరఁ జాలఁడు కావున నాకవి అక్కరలేదని భావము.

వివరణము.—ఈమంత్రమునందు రెండవపాదమునందు "క్వతదాస్థః ప్రజానన్" అని పాఠాంతరముగలదు. అప్పుడు శ్లోకార్థము నిట్లు చెప్పుకొనవలయును:—

తేషు=పుత్త్రాదిషు, ఆస్థా=ఆస్థితిః - తాత్పర్యేణవర్తనం యస్యసః తదాస్థః, తతః అధికతరం పురుషార్థం అభిప్రేప్సుః క్వ తదాస్థో భవేత్, న కశ్చిత్తదసారాభిజ్ఞః తదర్థీ స్యాదిత్యర్థః.

ఆజీర్యతాం అమృతానాం (దేవానాం అనుగ్రహం) ఉపేత్యజీర్యన్ మర్త్యః (ఇంతవఱకు అర్థముపైవలెనే) తదాస్థః= ఆపుత్త్రదారాదులందే ఆస్థ గలవాఁడు క్వ (భవేత్) = ఎక్కడ అగును? కాదని భావము. అంతకంటె ఎక్కువ అయిన పురుషార్థము నభిలషించువాఁడు అంతకు తక్కువయినదానిని కోరడుగదా. దేనిని అసారమని యెవ్వఁడెఱుంగునో దానిని వాఁడు కోరుట లేదని భావము.

౨౯-వ మంత్రము.

మూ. యస్మి న్నిదం విచికిత్సంతి మృత్యో
యత్సాంపరాయే మహతి బ్రూహి న స్తత్,
యోఽయం వరో గూఢ మనుప్రవిష్టో
నాన్యం తస్మా న్నచికేతా వృణీతే. ౨౯

ఇతి కాఠకోపనిషది ప్రథమాధ్యాయే
ప్రథమావల్లీ సమాప్తా.

పద. యస్మిన్ ఇదం విచికిత్సంతి మృత్యో యత్ సాంపరాయే మహతి బ్రూహి నః తత్, యః అయం వరః గూఢం అనుప్రవిష్టః న అన్యం తస్మాత్ నచికేతాః వృణీతే. ౨౯

కఠోపనిషది ప్రథమాధ్యాయే ప్రథమావల్లీ సమాప్తా.

టీక. మృత్యో=ఓయమధర్మరాజా! మహతి=గొప్పదియగు సాంపరాయే=పరలోకమునందు, యస్మిన్=మరణించినతర్వాతగల యేఆత్మవిషయమై, ఇదం = ఈసంశయమునుగూర్చి, విచికిత్సంతి = సంశయితులయి విచారించుచున్నారో, తత్=ఆవిషయమునుగూర్చి, నః=మాకు, బ్రూహి = పలుకుము. యః = ఏ, అయం=ఈ, వరః=వరము, గూఢం = గూఢమని, అనుప్రవిష్టః = తెలుపఁబడినది. తస్మాత్ = అందువలన, నచికేతాః = నచికేతుఁడు, అన్యం = మఱొక, వరం=వరమును, నవృణీతే=వరింపఁడు.

తా. (వివేకియగుమనుష్యుఁడు దీర్ఘాయుస్సుమున్నగు అల్పఫలప్రదములగు కామములను కోరఁడని వెనుకమంత్రమునందు చెప్పఁబడియున్నది.) కావున అనిత్యములగు కామోపభోగములనుగూర్చి యుంపన్యసించి నన్ను పరీక్షించుటమాని మనుష్యుఁడు మరణించినపిదప దేహేంద్రియవ్యతిరిక్తముగ పరలోకమునందు అనుభవించునట్టి తత్త్వమొక్కటిగలదా లేదా యను ఏసంశయమును దేవతలుకూడా సంశయితచిత్తులయి విచారించుచుండిరో అట్టిఆత్మనిర్ణయమును—ఆవిషయమునకు గూర్చినిర్ణయమును నాకు చెప్పవలయును. ఈయాత్మవిజ్ఞానవిషయము అతిసూక్ష్మమనియుం, దుర్వివేకమనియుం నీవేచెప్పియున్నాఁడవు కావున అవివేకులగువారలు కోరునట్టి అనిత్యవిషయకములగువరములను మనస్సునందైనను నచికేతుఁడభిలాషపడఁడు కావున నేనడిగిన వరమునే నాకు ఇవ్వవలయును.

కఠోపనిషత్తు ప్రథమాధ్యాయమునందు ప్రథమవల్లి సమాప్తము.

ఈవల్లికిసంబంధించిన వివరణ గ్రంథభాగము:—

అనుభూతిప్రకాశము. ౧౧ అధ్యా. శ్లో. ౧-౬.

కఠోపనిషత్తు

ప్రథమాధ్యాయము—ద్వితీయవల్లి.

౧-వ మంత్రము.

అవ. ప్రథమవల్లియొక్క ౨౧ మంత్రము మొదలుకొని ఆవల్లియొక్క సమాప్తిపఱకుఁగల తొమ్మిదిమంత్రములచేతను శిష్యుఁడగు నచికేతుని వైవస్వతుఁడు పరీక్షించిచూడగా నచికేతుఁడు బ్రహ్మ విద్యోపదేశమునకు యోగ్యుఁడను విషయము నిర్ణయమగుటచేత వైవస్వతుఁ డిట్లు పలుకుచున్నాఁడు.—

మూ. అన్యచ్ఛ్రేయోఽన్యదుతైవ ప్రేయ
స్తే ఉభే నానార్థే పురుషగ్ంసినీతః,
తయోశ్శ్రేయ ఆదదానస్య సాధు
భవతి హీయతేఽర్థాద్య ఉ ప్రేయో వృణీతే. ౧

పద. అన్యత్ శ్రేయః అన్యత్ ఉత ఏవ ప్రేయః తే ఉభే నానార్థే పురుషం సినీతః, తయోః శ్రేయః ఆదదానస్య సాధు భవతి హీయతే అర్థాత్ యః ఉ ప్రేయః వృణీతే. ౧

టీక. శ్రేయః=నిశ్శ్రేయసము-మోక్షమనునది, అన్యత్ = వేఱయినది, ఉత ఏవ=మఱియుం, ప్రేయః = ప్రేయస్సు-అభ్యుదయమనునది, అన్యత్ = వేఱయినది, తే ఉభే=ఆశ్రేయఃప్రేయస్సులు రెండున్నూ, నానార్థే = భిన్నభిన్న ప్రయోజనములుగలవియగుచు, పురుషం = (వర్ణాశ్రమవిశిష్టుఁడును, అధికారి యగునట్టి) పురుషుని, సినీతః = బంధించుచున్నవి, తయోః = ఆశ్రేయఃప్రేయ

స్సులను రెంటిలోపల, శ్రేయః = శ్రేయస్సును, ఆదదానస్య = గ్రహించునట్టి వానికి, సాధు = శుభము, భవతి = అగుచున్నది. యః ఉ = ఎవ్వఁడు, ప్రేయః = ప్రేయస్సును, వృణీతే ఉ = వరించునో, సః=వాఁడు, అర్థాత్ = పరమపురుషార్థమునుండి, హీయతే=విడువఁబడుచున్నాఁడు.

తా. శ్రేయస్సు-అనఁగానిశ్రేయస్సు, అనునదియు, ప్రేయస్సు అనగా అభ్యుదయము అనునదియు వేఱువేఱు అయియున్నవి. ఆశ్రేయః ప్రేయస్సుల యొక్క ప్రయోజనములుకూడ వేఱువేఱుగానున్నవి. ఈశ్రేయఃప్రేయస్సులు వర్ణాశ్రమాదివిశిష్టుఁడగు అధికారియగుపురుషుని రెంటిలో ఒకదానినిచేయవలసినటుల బంధించుచున్నవి. అనఁగా నిశ్శ్రేయసము నభిలషించువాఁడు శ్రేయస్సును-అనగా మోక్షసాధనమగు జ్ఞానమును, అభ్యుదయమును-అనగా స్వర్గాది సుఖమును అభిలషించువాఁడు ప్రేయస్సును అనఁగా కర్మమార్గమును అవలంబించుచున్నాఁడు కావున శ్రేయఃప్రేయస్సులను రెంటిచేతను పురుషులందఱు బద్ధులయియున్నారని చెప్పఁబడుచున్నది. విద్యాఽవిద్యారూపములగు ఆశ్రేయః ప్రేయస్సులు రెండున్నూ భిన్నభిన్నములగు వేర్వేఱు పురుషార్థములకు సంబంధించినవగుటచేత అన్యోన్యము విరుద్ధగుణములు గలవియగుచున్నవి కావున వీటిలో ఒకదానిని వదలి మఱొకదానిని ఒక్క పురుషుఁ డాచరింపశక్యమగును కాని రెంటిని ఒక్కపురుషుఁ డాచరింపశక్యము కానందువలన ఆశ్రేయః ప్రేయస్సులను రెంటిలో అవిద్యారూపమగు ప్రేయస్సును వదలి శ్రేయస్సును మాత్రము పరిగ్రహించి ఆచరించువానికి సాధువు అనఁగా శుభమగు మోక్షము కలుగుచున్నది. ఎవ్వఁడు దూరదృష్టి విరహితుఁడయి ప్రేయస్సును మాత్రమే పరిగ్రహించునో అట్టి మూఢుఁడు శ్రేయోరూపమయినట్టియు, పారమార్థికప్రయోజనరూపమయినట్టియుం పరమపురుషార్థమునుండి తొలఁగిపోవుచున్నాఁడు.

వివరణము.—వర్ణాశ్రమాది విశిష్టుఁడగు అధికారిని శ్రేయఃప్రేయస్సులు రెండును బంధించుచున్నవనుటకు ఉదాహరణములు.

౧. వర్ణవిశిష్టత్వమున కుదాహరణము—'బ్రాహ్మణో బృహస్పతి సవేనయజేత' రాజారాజసూయేనయజేత (అర్థ. బ్రాహ్మణుఁడు బృహస్పతి సవమనుయాగము నాచరింపవలెను, రాజు రాజసూయము నాచరింపవలెను.) మున్నగు శాస్త్రప్రమాణములు.

౨. ఆశ్రమవిశిష్టత్వమున కుదాహరణము—'గృహస్థ స్సదృశీంభార్యా ముపేయాత్', (అర్థ. గృహస్థాశ్రమాభిలాషి తనజాతిగలదానిని భార్యగా పరిగ్రహింపవలయును) మున్నగునవి.

ఆదిశబ్దముచేత వయోఽవస్థాదికమునుకూడ పరిగ్రహించునది —

3. వయోవిశిష్టత్వమున కుదాహరణము.—జాతపుత్రః కృష్ణకేశోఽగ్నీనాదధీత (అర్థ. పుత్రసంతానముకలిగి నల్లని తలవెండ్రుకలుగలవాఁ డగ్నులనాధానము చేయవలయును.) మున్నగునవి.

౪. అవస్థావిశిష్టత్వమున కుదాహరణము.—'అవిచికిత్సితవ్యాధే ర్పాంప్రవేశోవా' మున్నగునవి.

శ్రేయఃప్రేయస్సులు రెండున్నూ పురుషుని బంధించుచున్నవని చెప్పఁబడియున్నది కాని పైరెంటిలో అవిద్యాకర్మరూపమగు ప్రేయస్సు జన్మాదిహేతుకమగుటచేత బంధకము కావచ్చును కాని విద్యారూపమగు శ్రేయస్సు బంధనివర్తకమగుట న్యాయమైయుండఁగా బంధకమని చెప్పుట అసంగతమని సంశయము కలుగవచ్చును కాని ఇచట విద్యయొక్క బంధకత్వము విద్యయొక్క అలాభముచేతనని ఎఱుంగవలయును.

౨-వ మంత్రము.

అవ. శ్రేయఃప్రేయస్సులురెండున్నూ ఆచరించుటకు మనుష్యునకు స్వాధీనములే అయియుండగా లోకమునం దత్యధికసంఖ్యాకులు శ్రేష్ఠమయిన శ్రేయస్సునువదలి నికృష్టమైన ప్రేయస్సునే ఆచరించుచున్నారని చెప్పఁబడుచున్నది.—

మూ. శ్రేయశ్చ ప్రేయశ్చ మనుష్య మేత
స్తౌ సంపరీత్య వివినక్తి ధీరః,
శ్రేయోహి ధీరోఽభిప్రేయసోవృణీతే
ప్రేయో మందో యోగక్షేమా ద్వృణీతే. ౨

పద. శ్రేయః చ ప్రేయః చ మనుష్యం ఏతః తౌ సంపరీత్య వివినక్తి ధీరః, శ్రేయః హి ధీరః అభి ప్రేయసః వృణీతే ప్రేయః మందః యోగక్షేమాత్ వృణీతే. ౨

టీ. శ్రేయః = శ్రేయస్సున్నూ, ప్రేయశ్చ = ప్రేయస్సున్నూ, మనుష్యం = మనుష్యుని, ఏతః = పొందుచున్నవి. ధీరః = విద్వాంసుఁడగువాఁడు, తౌ = ఆశ్రేయఃప్రేయస్సులను, సంపరీత్య = మనసుచేత బాగుగా విచారించి, వివినక్తి = ఎయ్యదిశ్రేష్ఠమో ఎయ్యది నికృష్టమో అని విభజించుచున్నాఁడు. ధీరః=ధీరుఁడగువాఁడు, ప్రేయసః = ప్రేయస్సుకంటె, శ్రేయః = శ్రేయస్సునే, అభివృణీతే=వరించుచున్నాఁడు. మందః = అల్పబుద్ధిగలవాఁడు, యోగక్షేమాత్ = దేహాదిసంరక్షణ నిమిత్తమువలన, ప్రేయః = పశుపుత్త్రాది లక్షణమగు ప్రేయస్సునే, వృణీతే=వరించుచున్నాఁడు.

తా. శ్రేయఃప్రేయస్సు లనునవి రెండున్నూ మనుష్యులకు స్వాధీనములయి వారివారి యిష్టానుసారము ఎవరికి యుక్తమనితోఁచిన దానిని వారు పొందుటకు ఆటంకమేమియు లేనివిషయము సత్యమైనప్పటికిన్ని సాధనము వల్లను ఫలమువల్లను మందబుద్ధులగువారలకు విభజించుటకు అత్యంతదుర్విజ్ఞేయములయి అన్యోన్యము కలిసియున్నవానివలె ఆశ్రేయః ప్రేయస్సులు మనుష్యుని పొందుచున్నవి. (అనఁగా మందబుద్ధిగలవారికి ఇదిశ్రేయస్సు ఇది ప్రేయస్సు అని విభజించి తెలుసుకొనుటకు వీలుకానంత క్లిష్టములయియుండు చున్నవని భావము.) కావున హంసము నీటినుండి క్షీరమును వేఱుచేసినవిధముగా విద్వాంసుఁడగువాఁడు మనస్సుతో శ్రేయఃప్రేయస్సులురెంటిని బాగుగా

ఆలోచించి నిర్ణయించుకొని ఎయ్యది గుణభూయిష్ఠమో, ఎయ్యది గుణవిహీనమో అను విషయము నెఱుంగఁగలఁడు. ఇటుల శ్రేయఃప్రేయస్సులయొక్క గురులాఘవములనెఱింగినవాఁడు ప్రేయస్సుకంటె గుణాధిక్యము కలదియగుట చేత శ్రేయస్సునే కోరుకొనుచున్నాఁడు. మందబుద్ధియగువాఁడు గురులాఘవ వివేకసామర్థ్యము లేనివాఁడగుటవలన శరీరేంద్రియాదుల సంరక్షణాది నిమిత్తము శ్రేయస్సును విడనాడి పశుపుత్త్రాదిలక్షణరూపమగు ప్రేయస్సునే కోరుకొనుచున్నాఁడు.

వివరణము——శ్రేయఃప్రేయస్సులయొక్క గురులాఘవముల నెఱుంగుట. యనఁగా——

౧. కర్మాచరణమువలన ఆయాసము అధికము. ఫలమో దుఃఖసంవలితమగు సుఖాభాసలేశము.

౨. విద్యాప్రాప్తివలన ఆయాసము అల్పము. ఫలము అనంతనిరతిశయానందప్రాప్తి. ఇటుల తారతమ్యభావము నెఱుంగుట.

౧-వ అధ్యా. ౨-వ వల్లి, ౩-వ మంత్రము.

మూ. స త్వం ప్రియా న్ప్రియరూపాంశ్చ కామా
నభిధ్యాయ న్నచికేతో ఽత్యస్రాక్షీః,
నైతాగ్ం సృంకాం విత్తమయీ మవాప్తో
యస్యాం మజ్జంతి బహవో మనుష్యాః. ౩

పద. సః త్వం ప్రియాన్ ప్రియరూపాన్ చ కామాన్ అభిధ్యాయన్ నచికేతః అత్యస్రాక్షీః, న ఏతాం సృంకాం విత్తమయీం అవాప్తః యస్యాం మజ్జంతి బహవః మనుష్యాః.

టీక. నచికేతః=ఓనచికేతుఁడా ! సః = ఆ, త్వం=నీవు, ప్రియాన్ = ప్రియులగు పుత్త్రాదులను, ప్రియరూపాన్ = మనోహరరూపిణులగు అప్సర

సలు తద్భోగములు మొదలగు, కామాన్ చ=కామములను, అభిధ్యాయన్ = బాగా ఆలోచించుకొన్నవాఁడవై, (అనఁగా ఈఅప్సరస్త్రీలు మున్నగుభోగ జాతము అనిత్యమని వివేకముచేత గ్రహించినవాఁడవై) అత్యస్రాక్షీః = వదలి నాఁడవు. బహవః = అనేకులగు, మనుష్యాః = (మూఢులగు) మనుష్యులు, యస్యాం = ఏసంసారమునందు, మజ్జంతి = మునిఁగిపోవుచున్నారో, (అట్టి) విత్తమయీం = ధనప్రాయమయినట్టి, ఏతాం=ఈ, సృంకాం = (సంసారరూప మగు) కుత్సితమార్గమును, న అవాప్తః=పొందకపోతివి.

తా. నేను 'ఇహపరలోకములందుగల భోగభాగ్యములన్నియుం నీ కొసంగుచున్నాఁడను. ఈదివ్యభోగములను యథేచ్ఛగా ననుభవింపుము' అని మాటిమాటికి నిన్ను మోహపెట్టుచున్నను నీవు వానికి లోఁబడక ప్రియం లగు పుత్త్రాదులను, ప్రియమునుకలుగఁజేయునట్టి అప్సరస్త్రీలు మున్నగులక్షణ ములుగాఁగల సకలకామములను-ఇవియన్నియుం అశాశ్వతములనియుం నిస్సా రములనియు శోధించినవాఁడవై తుచ్ఛములయిన ఆయభిలాషల నన్నిఁటిని వద లినవాఁడవైతివి. నీబుద్ధిమత్త్వమును గాంచి నాకు చాలా ఆశ్చర్యమగు చున్నది. అధికసంఖ్యాకులగు పామరజను లెట్టిసంసారమార్గమునందు వ్యామోహముకలిగి మునిఁగిపోయి దుఃఖించుచున్నారో ధనప్రాయమైన మూఢజనసేవితమయిన అట్టి ఈసంసారలక్షణమగు కుత్సితమార్గమును నీవు అనుసరింపవైతివి.

వివరణము:—'ఆత్మా వై పుత్ర నామాసి' అనుశ్రుత్యనుసారము పుత్త్రుఁడు గౌణముగ ఆత్మస్వరూపుఁడగుటచేతను, అన్నిఁటికంటె ఆత్మ అందఱకు ప్రియతమమగుటచేతను ప్రియులనఁగా పుత్రాదులని భాష్యమునందు వ్యాఖ్యా తము. ప్రియరూపశబ్దము 'అప్సరఃప్రభృతిలక్షణాన్' అని భాష్యమునందు వ్యాఖ్యాతము. ప్రియరూపాన్ = ప్రియంరూప్యతే =జన్యతే యైః, తేఽప్స రఃప్రభృతిలక్షణాః తదాదిస్వరూపాన్' అని గోపాలేంద్రయతీశ్వరకృత భాష్యటీక.

౧-వ అధ్యా. ౨-వ వల్లి, ౪-వ మంత్రము.

అవ. ఈద్వితీయవల్లియొక్క ఆరంభమునందు 'తయోః శ్రేయ ఆదదానస్యసాధు భవతి హీయతేఽర్థాద్యఉప్రేయో వృణీతే' అనిచెప్పఁబడియున్నది. అట్లుచెప్పుటకు హేతువు ఏమి? అనువిషయ మీమంత్రమునందు చెప్పఁబడుచున్నది:—

మూ. దూర మేతే విపరీతే విషూచీ
అవిద్యా యా చ విద్యేతి జ్ఞాతా,
విద్యాఽభీప్సినం నచికేతసం మన్యే
న త్వా కామా బహవో ఽలోలుపంత. ౪

పద. దూరం ఏతే విపరీతే విషూచీ అవిద్యా యా చ విద్యా ఇతి జ్ఞాతా, విద్యాఽభీప్సినం నచికేతసం మన్యే న త్వా కామాః బహవః అలోలుపంత. ౪

టీక. యా= ఎయ్యది, అవిద్యా=అవిద్యయనియు, యాచ = ఎయ్యది, విద్యాఇతి=విద్యయనియు, జ్ఞాతా= తెలిసికొనఁబడుచున్నదో, ఏతే = ఈరెండున్నూ, దూరం=దూరముగా, విపరీతే= వేఱువేఱుఅయినవియు, విషూచీ=విభిన్నప్రయోజనములుగలవియు (అగుచున్నవి). నచికేతసం = నచికేతుఁడవని పిలువఁబడుచున్ననిన్ను, విద్యాఽభీప్సినం = విద్యనుకోరుచున్నవానినిగా, మన్యే = నేను తలంచుచున్నాఁడను. (కావుననే) త్వా = నిన్ను, బహవః కామాః = అనేకములగు కోరికలు, న అలోలుపంత = లోభమును కలుగఁజేయఁజాలక పోయెను.

తా. ఈశ్రేయఃప్రేయస్సు లనునవి రెండున్నూ వివేక, అవివేకాత్మకములగుటచేత చీఁకటి వెలుతురులవలె పరస్పరము భిన్నభిన్నమయిన రూపములుగలవి, మఱియు నానాగతులుగలవి, సంసారమునకు మోక్షమునకు హేతువులగుటచేత పరస్పరము విభిన్నఫలములుగలవి. ఈశ్రేయఃప్రేయస్సులనే

పండితులగువారలు విద్యయనియుం, అవిద్యయనియుం చెప్పుచున్నారు. నేను నచికేతసుఁడ వనెడి నిన్ను ప్రలోభించుటకు అనేకవిధములగు కామములనుచూపి ఆశగొల్పినను ఆకామములకు నీవేమియుం వశుఁడవు కాలేదు. నచికేతసుఁడ వనంబడు నిన్ను విద్యాఽభీప్సుగల విద్యార్థినిగ శ్రేయోభాజనునిగ నేను తలంచుచున్నాఁడను.

౧-వ అధ్యా. ౨-వ వల్లి, ౫-వ మంత్రము.

మూ. అవిద్యాయా మంత రే వ ర్తమానాః
స్వయంధీ రాః పండితంమన్యమానాః,
దంద్రమ్యమాణాః పరియ న్తి మూఢాః
అంధేనైవ నీయమానా యథాఽంధాః. ౫

పద. అవిద్యాయాం అంతరే వ ర్తమానాః స్వయంధీరాః పండితంమన్యమానాః, దంద్రమ్యమాణాః పరియంతి మూఢాః అంధేన ఏవ నీయమానాః యథా అంధాః. ౫

టీక. అవిద్యాయాం ,అంతరే = అవిద్యయందు - సంసార మధ్యభాగమునందు, వ ర్తమానాః=ఉన్నటువంటివారై, స్వయంధీరాః=తామే బుద్ధిమంతులమనియుం, పండితంమన్యమానాః = శాస్త్రజ్ఞులమనియు తలంచుచున్నవారలయి,దంద్రమ్యమాణాః=అనేకరూపములయిన కుటిలగతులనుపొందుచున్నవారలయిన, మూఢాః=మూఢులు, అంధేన = గ్రుడ్డివానిచేత, నీయమానాః = నడిపించుకొని తీసికొనిపోఁబడుచున్న, అంధాఃయథా=గ్రుడ్డివారివలె, పరియంతి =(దుఃఖితులయి) అంతటతిరుగుచుందురు.

తా. (విద్యయందు-జ్ఞానమునందు స్థిరబుద్ధికలుగుటకుగాను అవిద్యాధికారులగువారిని వారియొక్క-గతియు నిరూపింపఁబడుచున్నది:—) ఎవ్వరు అవిద్యారూపమగు సంసారమును అభిమానించుచున్నారో వారు ఘనీభూతమయిన గాఢాంధకారమధ్యమునందువలె అవిద్యామధ్యమందు-అనఁగా సంసార

మధ్యమునం దున్నవారలయి, పుత్ర, పశ్వాద్యాశలనుపాశశతములచేత చుట్టఁబడినవారలయి తామే ప్రజ్ఞగలవారలమనియు, పండితులము-శాస్త్రజ్ఞులము అనియు తలంచుచున్నమూఢులు మిక్కిలి కుటిలమయినట్టియు అనేకరూపమయినట్టియు గతిని ప్రార్థించుచున్నవారలయి గ్రుడ్డివాఁడగుమార్గదర్శకునిచేత మిట్టపల్లములుగలమార్గమునందు పిలుచుకొని పోఁబడుచున్న గ్రుడ్డివారేవిధముగా ఆమార్గమునం దనేకకష్టములకు పాలగుచున్నారో ఆదేవిధముగా జరామరణరోగాద్యనేకదుఃఖములకు లోనగుచు అంతట తిరుగుచుందురు.

వివరణము:—అనేకరూపమయినగతిని ప్రార్థించుటయనఁగా శాస్త్రములం దచ్చటచ్చట చెప్పిన దక్షిణాయనోత్తరాయణమార్గములు మున్నగువానిని అభిలషించుట. అంతట తిరుగుటయనఁగా స్వకృతపుణ్యాపాప కర్మానుసారము స్వర్గమర్త్యాదిలోకములందు పరిభ్రమించుచుండుటయని గ్రహించవలయును.

౧-వ అధ్యా. ౨-వ వల్లి, ౬-వ మంత్రము

మూ. న సాంపరాయః ప్రతిభాతి బాలం
ప్రమాద్యంతం విత్తమోహేన మూఢం,
అయం లోకో నాస్తి పర ఇతిమానీ
పునః పునర్వశమాపద్యతే మే. ౬

పద. న సాంపరాయః ప్రతిభాతి బాలం ప్రమాద్యంతం విత్తమోహేన మూఢం, అయం లోకః న అస్తి పరః ఇతి మానీ పునః పునః వశం ఆపద్యతే మే. ౬

టీక. సాంపరాయః = పరలోకగమనసాధనవిశేషము, ప్రమాద్యంతం= (పుత్రపశ్వాదిప్రయోజనములందుగల ఆసక్తిచేత) ప్రమాదముపొందుచున్నట్టియు, విత్తమోహేన=ధనమోహముచేత, మూఢం=(అజ్ఞానముచేత) కప్పఁబడియున్న, బాలం ప్రతి = వివేకహీనునిగూర్చి, న భాతి = ప్రకాశింపదు. (వివేకరహితునకు పరలోకవిషయముస్ఫురింపదు) అయం = ఈగనంబడుచున్న

(స్త్ర్యన్నపానాదివిశిష్టమగునదియే) లోకః=లోకము, పరః = పరలోకమనునది, న అస్తి = లేదు ఇతి = ఈవిధముగా, మానీ = తలంచువాఁడు, పునః పునః= మాటిమాటికి, మే = నాయొక్క, వశం = అధీనమును, ఆపద్యతే = పొందు చున్నాఁడు.

తా. (వెనుకటిమంత్రమునందు సంసారాంధకారమునందుఁబడి కష్టముల పాలగుచున్న వారివిషయము చెప్పఁబడినది. అట్టివారలు) మూఢులు కావున వారికి సాంపరాయము ప్రకాశింపదు. 'సమ్యక్ పరే కాలే ఈయత ఇతి సంపరాయః' అనువ్యుత్పత్తిచేత దేహపాతానంతరమునందు పొందఁబడునది సంపరాయము - అనఁగాపరలోకము. అట్టిపరలోకప్రాప్తియే ప్రయోజనము గాఁగల శాస్త్రీయమగు సాధనవిశేషము సాంపరాయ మనంబడును. అట్టిసాంపరాయము బాలునకు-అనఁగా వివేకహీనునకు ప్రకాశింపదు. వివేకరహితుఁడు పరలోకప్రాప్తిసాధనమును పొందఁజాలఁడనిభావము. పుత్రపశ్వాదిప్రయోజనములం దాసక్తికలిగియుండుటచేత ప్రమాదమునుపొందుచున్నవానిని, ధననిమిత్తమయిన అవివేకముచేత మూఢుఁడయినవానిని బాలుఁడని గ్రహించుట యుక్తమేగదా. స్త్రీలు, ధనము, అన్నపానములు మున్నగువానితోఁగూడి కొనియున్న ఈలోకమే లోకముగాని ఇంతకంటెవేఱుగా అదృష్టముగా పరలోకమనునది లేదని తలంచుచున్నవాఁడు మాటిమాటికి పుట్టుచు గిట్టుచు మృత్యువునగు నాయొక్క అధీనమును పొందును.—అనఁగా జననమరణాదిలక్షణమగు దుఃఖప్రవాహమునంబడి యల్లాడుచుండుననిభావము. సాధారణముగ జనసామాన్యమంతయుం ఈవిధముగానే-అనఁగా కామాద్యాసక్తికలిగియుండుట ప్రసిద్ధమేగదా.

వివరణము;—సాంపరాయశబ్దవ్యుత్పత్తులు:—

౧. సమ్యక్పరే కాలే ఈయత ఇతి సంపరాయః. తత్ప్రయోజనః సాంపరాయః.

అర్థ. దేహపాతానంతరకాలమునందు పొందఁబడునది, సంపరాయము = పరలోకము. ఆపరలోకప్రాప్తియే ప్రయోజనముగాఁగల సాధనవిశేషము, సాంపరాయము.

౨. పరే కాలే దేహపతనా దూర్ధ్వం సమ్యగీయతే గమ్యతఇతి సంపరాయః.

అర్థ. మొదటిదానితో సమానము.

3. సమ్యక్ పరాకాల్ కాలే దేహపాతా దూర్ధ్వమేవేయతే గమ్యతఇతి సంపరాయః.

అర్థ. పైదానితో సమానము.

౪. అథవా సమ్యక్పర ఇత్యుపలక్షణం, పరాపరబ్రహ్మప్రాప్తికాలే ప్రారబ్ధవిగమనానంతర మిత్యర్థః. తత్ప్రాప్తిప్రయోజనః పరాపరబ్రహ్మప్రాప్తిః ప్రయోజనం యస్య స తథా, సాధనవిశేషశ్శోంకారధ్యానాదిః శాస్త్రీయః ప్రసిద్ధః.

అర్థ. ప్రారబ్ధఫలానుభవానంతరము యోగ్యతానుసారము పరాపరబ్రహ్మలను పొందింపఁజేయునట్టి ఓంకారధ్యానాదిరూపమగు శాస్త్రీయసాధనవిశేషము సాంపరాయమని గ్రహింపవలయును.

లోకమునందుఁగల జనులలో అధికసంఖ్యాకులు ధర్మార్థకామాసక్తులగుట వాస్తవమైనను విద్యాభిలాషులగువారలుకూడ అత్యల్పసంఖ్యాకులయినను ఉండుటసంభవము కావున తదర్థ ముపనిషత్తులు సార్థకము లనువిషయమును తెలుపుటకే తాత్పర్యమునందు 'సాధారణముగ' అనుపదముదాహృతము.

౧-వ అధ్యా. ౨-వ వల్లి, ౭-వ మంత్రము.

మూ. శ్రవణాయాపి బహుభిర్యో న లభ్యః
శృణ్వంతో ఽపి బహవో యం న విద్యుః,

ఆశ్చర్యో వక్తా కుశలో ఽస్య లబ్ధా
ఽఽశ్చర్యో జ్ఞాతా కుశలానుశిష్టః. ౭

పద. శ్రవణాయ అపి బహుభిః యః న లభ్యః శృణ్వంతః అపి బహవః యం న విద్యుః, ఆశ్చర్యః వక్తా కుశలః అస్య లబ్ధా ఆశ్చర్యః జ్ఞాతా కుశలానుశిష్టః. ౭

టీక. యః = ఏయాత్మ, బహుభిః = అనేకులచేత, శ్రవణాయఅపి= శ్రవణమునకునూన్న, న లభ్యః=పొందఁబడుటలేదు. యం = ఏయాత్మను, బహవః=అనేకులు, శృణ్వంతః అపి = వినుచున్నను. నవిద్యుః = తెలిసికొనఁజాలరు. అస్య=ఈఆత్మయొక్క, వక్తా=చెప్పువట్టివాఁడు, ఆశ్చర్యః = అరుదు. (అస్య = ఈయాత్మయొక్క) కుశలః లబ్ధా=నిపుణముగా గ్రహించినవాఁడునూన్న, ఆశ్చర్యః=అరుదు. కుశలానుశిష్టః = నిపుణుఁడయిన ఆచార్యునిచేత శిక్షితుఁడయిన, జ్ఞాతా=జ్ఞాతయును, ఆశ్చర్యః=అరుదు.

తా. లోకమునందుగల కోట్లకొలదిసంఖ్యగల జనసముదాయమునం దెవ్వఁడో యొకఁడే నీవంటివాఁడు ఆత్మజిజ్ఞాసకలవాఁడు కావున పరమాత్మను గూర్చి వినుటకుకూడ అనేకులకు అవకాశముండదు. పరమాత్మనుగూర్చి వినుచున్నవారిలో అనేకులకు - అసంస్కృతాత్ములగువారికి ఆత్మతత్త్వమునునది ఏమియో గోచరింపఁజాలదు. ఇట్టి యాత్మతత్త్వమునుగూర్చి యుపదేశించువాఁడుకూడ అనేకులలో ఒకఁడే లభించును ఇట్టియాత్మనుగూర్చి యుపదేశింపఁబడుచున్న విషయము నాలకించుచున్నవారిలో ఒక్కఁడే చక్కఁగా ఆయాత్మతత్త్వమును గ్రహించువాఁడుండును. యోగ్యుఁడగు ఆచార్యునిచేత చక్కఁగా ఆత్మతత్త్వమును బోధింపఁబడినవాఁడు కూడ ఒకఁడే యుండును.

వివరణము:—అనేకజన్మార్జిత సుకృతపరిపాకమువలన సంస్కృతచిత్తుఁడగువాఁడు కామాదిసుఖానుభవమునందు విరక్తికలిగి బ్రహ్మవిద్యాభి

ముఖుఁడగును. ఇట్టివాఁడు వేలకొలదిజనులయం దొక్కఁడే లభించును. అనేక వస్తువులందు ఆశ్చర్యకరమయినవస్తువు ఒక్కటి ఏవిధముగానుండునో అట్లే జనసముదాయమునందు బ్రహ్మవిద్యాభిముఖుఁడయినవాఁ డొక్కఁడే యుం డుట లోకప్రసిద్ధముగా నున్నది కావున ఆశ్చర్యమని చెప్పఁబడినది.

౧-వ అధ్యా. ౨-వ వల్లి, ౮-వ మంత్రము.

మూ. న నరేణావరేణ ప్రోక్త ఏష
సువిజ్ఞేయో బహుధా చింత్యమానః,
అనన్యప్రోక్తే గతి రత్ర నా
స్త్యణీయా న్హ్యతర్క్య మణుప్రమాణాత్. ౮

పద. న నరేణ అవరేణ ప్రోక్తః ఏషః సువిజ్ఞేయః బహుధా చింత్య మానః, అనన్యప్రోక్తే గతిః అత్ర న అస్తి అణీయాన్ హి అతర్క్యం అణు ప్రమాణాత్. ౮

టీక. ఏషః= ఈయాత్మ, అవరేణ = హీనుఁడైన, నరేణ=మనుష్యుని చేత, ప్రోక్తః = చెప్పఁబడినవాఁడై, బహుధా = అనేకవిధములుగా, చింత్యమానః= చింతింపఁబడుచున్నవాఁడై, సువిజ్ఞేయః = సుఖముగా తెలిసికొనఁదగినవాఁడు, న=కాఁడు. అనన్యప్రోక్తే=ఆత్మసాక్షాత్కారముగల ఆచార్యుని చేత చెప్పఁబడిన, అత్ర = ఈయాత్మయందు, గతిః = అస్తి నాస్తి ఇత్యాదికమగు వికల్పరూప మగుగతి, నాస్తి=లేదు. (ఆత్మా=ఆత్మ) అణుప్రమాణాత్ = అణుప్రమాణము కంటె, అణీయాన్ హి = అణుతరుఁడుగదా. (కావున) అతర్క్యం = (స్వబుద్ధిచేత) ఊహించుటకు అలవికాదు.

తా. నీవు నన్నడిగిన ఆత్మతత్త్వము ప్రాకృతబుద్ధిగల ఆచార్యుని చేత ఉపదేశింపఁబడినయెడల తెలిసికొనుటకు శక్యముకాదు. ఏలయనఁగా ఆ యాత్మ 'అస్తి. నాస్తి, కర్తా, అకర్తా, శుద్ధః, అశుద్ధః' మున్నగువిభేద ములతో అనేకవిధములుగా శాస్త్రజ్ఞులగువారలు పరస్పరము వాదించుకొను

చున్నారు. ఇట్లు పరస్పరము వాదించుకొనుచుండు ఆచార్యులందఱు ప్రాకృతబుద్ధులని యెఱుంగవలయును.

౧. ఎటులయినయెడల ఆత్మ సుజ్ఞేయుఁ డగుననఁగా పృథగ్దర్శనుఁడు కానట్టియు బ్రహ్మాత్మభూతుఁడయినట్టియు ఆచార్యునిచేత ఉపదిష్టమయినఆత్మయందు 'అస్తి, నాస్తి' మున్నగు వికల్పజాల ముండఁజాలదు కావున సుజ్ఞేయ మగును. సర్వవికల్పములకు అతీతమయినది ఆత్మతత్త్వమను విషయము సుప్రసిద్ధముగదా.

౨. లేక అనన్యభూతము, అనఁగా స్వాత్మభూతమగు ఆత్మమునందు జ్ఞేయాంతరము లేకపోవుటచేత గతి అనగా అన్యావగతి లేదనియు అర్థమును గ్రహింపవచ్చును. ఆత్మైకత్వవిజ్ఞానమే జ్ఞానమునకు పరాకాష్ఠగదా. అనఁగా శేషస్థితి. ఆత్మైకత్వవిజ్ఞానము దృఢమయినప్పుడు అవగంతవ్యము = పొందఁదగినది లేక తెలిసికొనఁదగినది లేకపోవుటవలన గతియనునది ఉండఁజాలదు. అనన్యమయినఆత్మ సద్గురువుచేత ఉపదేశింపఁబడినయెడల సంసారావగతి—— అనఁగా సంసారము సత్యమను తలంపు నిలువఁజాలదు.

3. లేక ఉపదేశింపఁబడనున్న బ్రహ్మముయొక్క స్వరూపుఁడగు. అనఁగా బ్రహ్మాత్మభూతుఁడగు ఆచార్యునిచేత ఉపదేశింపఁబడిన ఆత్మయందు అగతియనఁగా తెలిసికొనఁజాలకపోవుట యుండఁజాలదు. అనఁగా బ్రహ్మాత్మభూతుఁడగు ఆచార్యుఁడు 'తదనన్యోఽహం, (ఆ బ్రహ్మముకంటె నేను వేఱయినవాఁడను కాను) అని యెటుల యెఱింగెనో అట్లే శ్రోత యగు శిష్యుఁడున్నూ 'తదనన్యోఽహం' అని తెలిసికొనును.

౪. ప్రాకృతబుద్ధిగాక అగమజ్ఞుఁడు, ఉపనిషత్ప్రమాణశరణుఁడు నగు ఆచార్యునిచేత స్వాత్మకంటె వేఱుగాదని యుపదేశింపఁబడిన ఆత్మయే సువిజ్ఞేయమ్ము, సుఖముగా తెలిసికొనుటకు శక్యమయినది అగుచున్నది. లేనియెడల ఆత్మ అణుప్రమాణముకంటె అణుతరము అగుచున్నది కావున అత

ర్క్యము అగుచున్నది. అణుప్రమాణమయినవస్తువు స్వబుద్ధిచేత ఊహింపఁబడు నట్టి కేవలతర్కముచేత ఊహింపఁదగదు. లేక ఒక్కతార్కికుఁడు ఆత్మ అణుపరిమాణమని స్థాపించగా మఱొకతార్కికుఁడు అణుతరమనియు, తద్భిన్నుఁడగు తార్కికుఁడు అణుతమమనియు స్థాపించుటకు ప్రయత్నించును. ఈవిధముగా తర్కమునకు అంతములేదని గ్రహించవలయును.

అని భాష్యమునందు ౪ విధములుగా వ్యాఖ్యాతమయియున్నది.

వివరణము:—ప్రాకృతబుద్ధి యనఁగా:—

ప్రకృతిత అగలేషు పశ్వాదిషు అభిమానరూపా బుద్ధి ర్యస్య సః ప్రాకృతబుద్ధిః.

(అర్థ. ప్రకృతిసంబంధమయిన పశ్వాదిరూపమయిన సంసారమునందు అభిమానరూపమయిన బుద్ధిగలవాఁడు.

మంత్రముయొక్క మూడవపాదమునందుగల "అనన్యప్రోక్తే గతిరత్ర నాస్తి" అనుమంత్రభాగమునందు "అనన్యప్రోక్తే గతిః అత్ర న అస్తి" అని ప్రథమమున వ్యాఖ్యాతమయినది. ఇప్పుడు "అనన్యప్రోక్తే అగతిః అత్ర న అస్తి" అని పదవిభాగముచేసి భాష్యకారులవారు "అథవా ప్రోచ్యమాన బ్రహ్మాత్మభూతేన ఆచార్యేణప్రోక్తే ఆత్మని అగతిః=అనవబోధః—అపరిజ్ఞానం అత్రనాస్తి" అని వికల్పముగా వ్యాఖ్యానమొనర్చిరి.

తర్కేణజ్ఞేయః తర్క్యః, న తర్క్యః, అతర్క్యః,

(అర్థ. తర్కముచేత తెలిసికొనుటకు సాధ్యమయినదితర్క్యము. అట్లు సాధ్యముకానిది అతర్క్యము. ఆత్మఅతర్క్యమగునెడల "మంతవ్యో నిదిధ్యాసితవ్యః" అనుశ్రుతి వేదాంతములను 'మంతవ్యః' అనితర్కించుటకు అవకాశము నొసంగుచున్నదిగదా యని యందురేని అశ్రుతిశ్రుత్యనుకూలతర్కమును ప్రతిపాదించుచున్నది గాని శ్రుతివిరహితమగు కుతర్కమును నిషేధించుచున్నది.)

౧-వ అధ్యా. ౨-వ వల్లి, ౯-వ మంత్రము.

మూ. నైషా తర్కేణ మతిరాపనేయా
ప్రోక్తాఽన్యేనైవ సుజ్ఞానాయ ప్రేష్ఠ,
యాం త్వ మాపః సత్యధృతి ర్బతాసి
త్వాదృఙ్నో భూయా న్నచికేతః ప్రష్టా. ౯

పద. న ఏషా తర్కేణ మతిః ఆపనేయా ప్రోక్తా అన్యేన ఏవ సుజ్ఞానాయ ప్రేష్ఠ, యాం త్వం ఆపః సత్యధృతిః బత అసి త్వాదృక్ నః భూయాత్ నచికేతః ప్రష్టా.

టీక. ఏషా=ఈ, మతిః=బుద్ధి, (అనఁగా ఆత్మ ఆగమప్రతిపాద్యుఁడు అనుబుద్ధి) తర్కేణ = తర్కముచేతను - స్వబుద్ధిచేత ఊహించుటమాత్రము చేతను, న ఆపనేయా = పొందింపశక్యముగాదు. (లేక, ఏషా=మతిః = ఆత్మ ఆగమప్రతిపాద్యుఁడు అను) దృఢబుద్ధి, తర్కేణ=స్వబుద్ధ్యధీనతర్కముచేత, ఆపనేయా=తీసివేయఁదగినది,న=కాదు. ప్రేష్ఠ=ప్రియుఁడవయిన ఓనచికేతుఁడా! అన్యేన=(తార్కికునికంటె) అన్యుఁడయిన, ఆగమజ్ఞుఁడగు ఆచార్యుని చేతను, ప్రోక్తా ఏవ = చెప్పఁబడినదే, సుజ్ఞానాయ = సుజ్ఞానముకొఱకు, (అగుచున్నది). త్వం=నీవు, యాం=ఏబుద్ధిని, ఆపః=పొందితివో, (కనుకనే నీవు) సత్యధృతిః=సత్యమయినధృతిగలవాఁడవు, అసి=అయితివి. బత = ఆశ్చర్యము. నచికేతః=ఓనచికేతుఁడా! త్వాదృక్=నీవంటి, ప్రష్టా = పృచ్ఛకుఁడు-శిష్యుఁడు, నః=మాకు, భూయాత్=కలుగుఁగాక.

తా. ఆత్మ ఆగమప్రతిపాద్యుఁడను ఏబుద్ధి నీకు సహజముగాకలిగియున్నదో అట్టిబుద్ధి తర్కాదికముచేత లభించునది మాత్రముకాదు. లేక ఆగమప్రతిపాద్యమైన ఆత్మతత్త్వవిషయికబుద్ధిని కుతర్కముచేత నిరసింపవలదు. ఆగమమును-ఉపనిషచ్ఛాస్త్రము నెఱుంగని తార్కికుఁడు స్వబుద్ధిపరికల్పితమయిన దానినే యేదో యొకదానిని పలుకుచుండును. కనుక ఆగమోత్పన్నమయిన

యీబుద్ధి తార్కికునికంటె విభిన్నుఁడగు అగమజ్ఞుఁడగు ఆచార్యునిచేత ఉపదేశింపఁబడిననే సుజ్ఞానముకొఱకు — అనఁగా మోక్షముకొఱకు అగును. తర్కమునకు పొందశక్యముకాని ఆబుద్ధి యెట్టిదనఁగా? చెప్పఁబడుచున్నది:— నేను నీకిచ్చినవరదానముచేత నీవెట్టిబుద్ధినిపొందితివో అట్టిబుద్ధి తర్కగమ్యముకాదు. నీవు సత్యధృతివి-సత్యధృతియనఁగా-శాశ్వతమయినదానియందు బుద్ధిగలవాఁడు. బత అనునది ఆశ్చర్యమును అనుకంపనుసూచించును. ఉపదేశింపఁబోవు ఆత్మవిజ్ఞానస్తుత్యర్థము నచికేతునిగూర్చి యిటుల పలుకఁబడినది. నీవంటిశిష్యుఁడు మఱొక్కఁడు మాకులభించుగాక. అనఁగా నీవంటి సద్విషయశ్రవణాభిలాష గల పుత్త్రుఁడో శిష్యుఁడో ప్రష్ట-ప్రశ్నించువాఁడు మాకు కలుగుఁగాక.

౧-వ అధ్యా. ౨-వ వల్లి, ౧౦-వ మంత్రము.

అవ. సంతుష్టుఁడయిన వైవస్వతుఁ డీవిధముగా మఱల పలుకుచున్నాఁడు:—

మూ. జానామ్యహꣳ శేవధి రిత్యనిత్యం
న హ్యధ్రువైః ప్రాప్యతే హి ధ్రువం తత్,
తతో మయా నచికేత శ్చితోఽగ్ని
రనిత్యై ర్ద్రవ్యైః ప్రాప్తవా నస్మి నిత్యమ్. ౧౦

పద. జానామి అహం శేవధిః ఇతి అనిత్యం న హి అధ్రువైః ప్రాప్యతే హి ధ్రువం తత్, తతః మయా నచికేతః చితః అగ్నిః అనిత్యైః ద్రవ్యైః ప్రాప్తవాన్ అస్మి నిత్యమ్. ౧౦

టీక. నచికేతః = ఓనచికేతుఁడా! శేవధిః = కర్మఫలలక్షణమగు నిధి, అనిత్యంఇతి = శాశ్వతమయినదికాదని, అహంజానామి = నేనుఎఱుంగుదును. అధ్రువైః=అనిత్యములయినవానిచేత, నప్రాప్యతేహి=(ఆత్మతత్త్వము) పొందఁబడఁజాలదుగదా. తత్=ఆయాత్మతత్త్వము, ధ్రువంహి= శాశ్వతమైనదిగదా. తతః=అందువలన, మయా=నాచేత, అగ్నిఃచితః=అగ్నిచయనము చేయఁబడినది,

అనిత్యైః = అనిత్యములయిన, ద్రవ్యైః=ద్రవ్యములచేత, నిత్యం=నిత్యమయిన దానిని, ప్రాప్తవాన్ అస్మి=పొందినవాఁడనయితిని.

తా. కర్మఫలము లక్షణముగాఁగల నిధి అనిత్యమనువిషయమును నే నెఱుంగుదును. అనిత్యములగుకర్మఫలములు మున్నగుసాధనములచేత నిత్యము అయినది పొందఁబడఁజాలదుగదా. అనఁగా పరమాత్మయను నిధి అనిత్యములగు కర్మఫలసాధన రూపోపాయములచేత పొందఁబడఁజాలదు. అనిత్య సుఖాత్మకమయిన నిధియే అనిత్యద్రవ్యములచేతను పొందఁబడును. ఓనచికేతుఁడా! నిత్యమయినబ్రహ్మము అనిత్యములగు అజ్య చరు పురోడాశాది రూపసాధనములచేత పొందఁబడఁజాలదనువిషయము నెఱింగియుం నేను అనిత్యసాధనములచేత స్వర్గాది సుఖసాధనభూతమగు అగ్నిచయనము నొనర్చితిని. కావున నే నేను ఆయగ్నిచయనానుష్ఠానముచేత నిత్యమయినట్టియు, స్వర్గాఖ్యమైనట్టియుం నీయామ్యస్థానమును పొందినాఁడను. యామ్యస్థానము నిత్యమనునది ఆపేక్షిక నిత్యమని యెఱుంగవలయును.

వివరణము:—వైవస్వతుఁడు నచికేతునిచూచి సంతుష్టి నందుటకు కారణమేమనఁగా అనిత్యసాధనములచేత నిత్యమగుబ్రహ్మము లభింపఁజాలదను విషయము నెఱిఁగియుం ఆతఁడు బహ్వాయాససాధ్యమగు కర్మనొనర్చెను. అట్టి బహ్వాయాససాధ్యమగు కర్మఫలమును నీకు యిచ్చెదనని యముఁడు చెప్పుచున్నను నచికేతుఁడు పరిగ్రహింపకున్నాఁడు కనుక నాకంటె నీవే అధిక ప్రజ్ఞగలవాఁడవని యముఁడు నచికేతుని ప్రశంసించుచున్నాఁడు.

అగ్నిచయనరూపమగు సత్కర్మాచరణముచేతనే వైవస్వతుఁడు జంతువులకు తత్కృతధర్మాధర్మానుసారము ఫలము నొసంగి నియమించునట్టి యామ్యాధికారమును—యమాధికారమును పొందినాఁడు. ఈయామ్యపదవియుం అనిత్యమయినను నిత్యమనిచెప్పుట ఆపేక్షికనిత్యమేగాని నిరపేక్ష నిత్యముకాదు.

౧-వ అధ్యా. ౨-వ వల్లి, ౧౧-వ మంత్రము.

మూ. కామస్యాప్తిం జగతః ప్రతిష్ఠాం
క్రతో రనన్త్య మభయస్య పారం,
స్తోమమహ దురుగాయం ప్రతిష్ఠాం దృష్ట్వా
ధృత్యా ధీరో నచికేతోఽత్యస్రాక్షీః ౧౧.

పద. కామస్య ఆప్తిం జగతః ప్రతిష్ఠాం క్రతోః అనన్త్యం అభయస్య పారం, స్తోమమహత్ ఉరుగాయం ప్రతిష్ఠాం దృష్ట్వా ధృత్యా ధీరః నచికేతః అత్యస్రాక్షీః. ౧౧

టీక. నచికేతః=ఓనచికేతుఁడా! కామస్య=కామముయొక్క, ఆప్తిం=సమాప్తిని, జగతః=జగత్తుయొక్క, ప్రతిష్ఠాం=ప్రతిష్ఠను, క్రతోః=సత్కర్మాచరణముయొక్క, అనన్త్యం = (ఫలరూపమగు) అనన్తమైన (హిరణ్యగర్భపదవిని), అభయస్య = అభయమగుదానియొక్క, పారం = పరమమయిననిష్ఠను, స్తోమమహత్ = కొనియాడఁదగిన అణిమాద్యష్టైశ్వర్యమహిమను, ఉరుగాయం = విస్తీర్ణమయినగతిని, ప్రతిష్ఠాం=ప్రతిష్ఠను, ధీరః=ధీరుఁడవయిన, (త్వం=నీవు,) దృష్ట్వా=చూచి, ధృత్యా=ధైర్యముచేత, అత్యస్రాక్షీః=వదలినాఁడవు.

తా. నీవు కామమునకు సమాప్తిని, ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక భేదవిశిష్టమగు జగత్తుయొక్క ఆశ్రయత్వమును, ఉపాసనాదుల నాచరించుట వలనకలిగెడి అనంతమయిన హిరణ్యగర్భపదవిని, అభయముయొక్క పారమును, కొనియాడఁదగిన అణిమాద్యష్టైశ్వర్యసంపదను, విస్తీర్ణమయినగతిని, ఆత్మయొక్క శ్రేష్ఠమయినస్థితిని గాంచి ధైర్యముగలవాఁడవగుటచేత బుద్ధిమంతుఁడవై యీసిని వదలినాడవు. ఈచెప్పఁబడినదంతయుం సంసారభోగమునకు సంబంధించినదేగాని పరతత్త్వసంబంధమైనది గాదనుతలంపుతో వదలినవాఁడవైతివి. నీవంటి ఉత్తమగుణముగలవాఁడు మఱొకఁడు లభింపఁజాలఁడుగదా.

వివరణము:—కీర్త్యగర్భపదవివక్షితుఁగల సర్వవిధకామములను వదలినవాఁడే బ్రహ్మవిద్యకు ముఖ్యాధికారి యనువిషయమును సూచించుటకయి అట్టిధీరుఁడగు నచికేతుని యీమంత్రమునందు వైవస్వతుఁడు స్తుతించి యున్నాఁడు.

౧-వ అధ్యా. ౨-వ వల్లి, ౧౨-వ మంత్రము.

మూ. తం దుర్దర్శం గూఢమనుప్రవిష్టం
గుహాహితం గహ్వరేష్ఠం పురాణం,
అధ్యాత్మయోగాధిగమేన దేవం
మత్వా ధీరో హర్షశోకౌ జహాతి. ౧౨

పద. తం దుర్దర్శం గూఢం అనుప్రవిష్టం గుహాహితం గహ్వరేష్ఠం పురాణం, అధ్యాత్మయోగాధిగమేన దేవం మత్వా ధీరః హర్షశోకౌ జహాతి. ౧౨

టీక. దుర్దర్శం = (అతిసూక్ష్ముఁడయినవాఁడగుటచేత) చూచుటకు శక్యము కానివాఁడున్నూ, గూఢం = గూఢమయినదానిని, అనుప్రవిష్టం = ప్రవేశించినవాఁడున్నూ, గుహాహితం = ప్రాణులయొక్క బుద్ధిగుహాయందున్నవాఁడున్నూ, గహ్వరేష్ఠం = అతికష్టమైన ప్రదేశమునందున్నవాఁడున్నూ, పురాణం=పురాతనుఁడయినట్టియు, (అగు) దేవం=దేవుని, అధ్యాత్మయోగాధిగమేన = అధ్యాత్మయోగప్రాప్తిచేత, ధీరః = ధీరుఁడయినవాఁడు, మత్వా = తలంచి, హర్షశోకౌ=హర్షశోకములను, జహాతి=వదలుచున్నాఁడు.

తా. నీవు తెలిసికొనఁదలఁచిన ఆత్మనుగూర్చి చెప్పుచున్నారము. అతిసూక్ష్ముఁడగుటచేత దుర్దర్శుఁడును, దుర్దర్శుఁడనఁగా అతికష్టముచేత తెలిసికొనఁదగినవాఁడు, ప్రకృతిసంబంధమయిన శబ్దాదివిషయ వికారవిజ్ఞానములచేత మరుగుపరచబడినవానివలె ఉన్నవాఁడును, ప్రాణులయొక్క బుద్ధిగుహాయందున్నవాఁడును, అనఁగా అచటలభించుటచేత అచ్చట ఉన్నవాఁడుగ పరి

గ్రహించుచున్నారని భావము. విషమమయి అనేకానర్థములకు ఆకరమయిన యీశరీరమునందు ఉన్నవాఁడగుటచేత గహ్వరేష్ఠుఁడును, పురాతనుఁడగుటచేత పురాణుఁడును అగుదేవుని ధీరుఁడయినవాఁడు అధ్యాత్మయోగముచేత—(మనస్సును విషయములనుండి మరలించి ఆత్మయందు ప్రవేశపెట్టుటయే అధ్యాత్మయోగము) తలంచినవాఁడయి ఆత్మకు ఉత్కర్షాపకర్షములు లేక పోవుటచేత హర్షశోకములను వదలుచున్నాఁడు.

వివరణము:—దేహవ్యతిరిక్తమగు ఆత్మనుగూర్చి నీవు ప్రశ్నించినాఁడవు. ఆయాత్మయొక్క పరమార్థస్వరూపవిజ్ఞానమే సంసారనివర్తకమును పరమానందప్రాప్తికి ధర్మ్యమగుసాధనము అగుచున్నది. నీవడిగినదానికంటె వేఱగు శ్రేయస్సాధనములేదు కావున నీవడిగినదానిని చెప్పుచున్నాఁడనని ప్రష్టయొక్కప్రశ్న ప్రశంసింపఁబడినది.

దుర్దర్శమనఁగా:—దుఃఖేన = అత్యంతాయాసేన దర్శన మస్యేతి దుర్దర్శః.

అర్థ. అనఁగా అత్యంతాయాసముచేత తెలిసికొనఁబడునదియని భావము.

గహ్వరేష్ఠశబ్దమునకు—గహ్వరే=విషమే అనేకానర్థసంకటే తిష్ఠతీతి గహ్వరేష్ఠః=అని భాష్యమునందువ్యాఖ్యాతము. దానికి 'అనర్థాః రాగద్వేషాదయః తైః సంకటే అత్యాతాయాసజనకే కార్యకారణసంఘాతే ఇత్యర్థః' అని టీకగలదు. కావున గహ్వరేష్ఠుఁడనఁగా రాగద్వేషాద్యనర్థములచేత అత్యంతాయాసజనకమయిన యీదేహమునందున్నవాఁడని తాత్పర్యము.

౧-వ అధ్యా. ౨-వ వల్లి, ౧౩-వ మంత్రము.

మూ. ఏతచ్ఛ్రుత్వా సంపరిగృహ్య మర్త్యః
ప్రవృహ్య ధర్మ్యమణు మేతమాప్య,
స మోదతే మోదనీయగ్ం హి లబ్ధ్వా
వివృతగ్ం సద్మ నచికేతసం మన్యే. ౧౩

పద. ఏతత్ శ్రుత్వా సంపరిగృహ్యా మర్త్యః ప్రవృహ్య ధర్మ్యం అణుం ఏతం ఆప్య, సః మోదతే మోదనీయం హి లబ్ధ్వా వివృతం సద్మ నచికేతసం మన్యే. ౧౩

టీక. మర్త్యః = మనుష్యుఁడు, ఏతత్ = ఈచెప్పఁబోవునట్టి యాత్మతత్త్వమును, శ్రుత్వా=విని, సంపరిగృహ్యా = ఆత్మభావముతో బాగుగా పరిగ్రహించి, ధర్మ్యం=ధర్మసంబంధమయిన దీనిని, ప్రవృహ్య = శరీరాదికమునుండి వేఱుపఱిచి, అణుం = అతిసూక్ష్మమైన, ఏతం=ఈయాత్మతత్త్వమును, ఆప్య=పొంది, సః = అవిద్వాంసుఁడు, మోదనీయం = సంతసింపఁదగినదానిని, లబ్ధ్వా=పొంది, మోదతేహి=సంతసించుచున్నాఁడుగదా. నచికేతసం = నచికేతునికొఱకు, సద్మ = బ్రహ్మలోకము, వివృతం = తెఱచి యుంచబడినదిగా, మన్యే=నేను తలంచుచున్నాఁడను.

తా. నేను చెప్పఁబోవునట్టి యీయాత్మతత్త్వమును ఆచార్యానుగ్రహముచేత ఆలకించి ఆత్మభావమును పొందిన మనుష్యుఁడు ధర్మ్యమును అతిసూక్ష్మమును అగు నీయాత్మతత్త్వమును శరీరాదికమునుండి వేఱుపఱిచి గ్రహించినవాఁడయి దేనినిపొందుటచేత అవశ్యము సంతోషముకలుగునో అట్టి యాత్మతత్త్వమునుపొంది సంతసించును. ప్రస్తుతము శిష్యుఁడును అగు నచికేతుఁడు అట్టివాఁడగుటచేత ఈనచికేతునకు బ్రహ్మలోకము ద్వారముతెఱచి స్వాగతమొసంగుచున్నది. ఈనచికేతుఁడు మోక్షార్హుఁడని నేను తలంచుచున్నానని భావము.

వివరణము:—ఆచార్య ప్రసాదముచేతనే ఆత్మతత్త్వము గ్రహింపశక్యముకాని స్వయముగా గ్రంథాధ్యయనాదికముచేత బ్రహ్మతత్త్వము అలభ్యమని నివారింపఁబడినది. శాస్త్రాధికారులు సాధారణముగ మనుష్యులే కావున 'మర్త్యః' అని మూలమునందు ప్రయోగింపఁబడినది. నచికేతుఁడు

అర్హుఁడగుటచేత బ్రహ్మము అభిముఖీభూతమయి స్వాగత మొసంగుచున్నదని యెఱుంగునది.

౧-వ అధ్యా. ౨-వ వల్లి, ౧౪-వ మంత్రము.

అవ. యమునివాక్యము నాలకించి నచికేతుఁడిట్లుపలుకుచున్నాఁడు:—

మూ. అన్యత్ర ధర్మాదన్యత్రాధర్మా
దన్యత్రాస్మాత్కృతాకృతాత్,
అన్యత్ర భూతాచ్చ భవ్యాచ్చ
యత్తత్పశ్యసి తద్వద. ౧౪

పద. అన్యత్ర ధర్మాత్ అన్యత్ర అధర్మాత్ అన్యత్ర అస్మాత్ కృతాకృతాత్, అన్యత్ర భూతాత్ చ భవ్యాత్ చ యత్ తత్ పశ్యసి తత్ వద. ౧౪

టీక. ధర్మాత్ =శాస్త్రవిహితమయిన ధర్మముకంటె, అన్యత్ర=వేఱయిన చోట, అధర్మాత్ = అధర్మమునకంటె, అన్యత్ర = వేఱయినచోట, కృతాకృతాత్ =కార్యకారణభూతమయిన. అస్మాత్ =దీనికంటె, అన్యత్ర=వేఱయిన చోట, భూతాచ్చ = జరిగినదానికంటెను, భవ్యాత్ చ = జరుగఁబోవుదాని కంటెను, వర్తమానము అయినదానికంటెను, అన్యత్ర=వేఱయినచోట, యత్ = ఎయ్యదిగలదో, తత్ =దానిని, పశ్యసి = నీవు ఎఱుంగుచున్నాఁడవు. తత్ = దానిని, వద=నీవు పలుకుము.

తా. నేను బ్రహ్మవిద్యోపదేశమునకు యోగ్యుఁడనై యున్నయెడల, నీవు నాయం దనుగ్రహము కలిగియున్నయెడల 'ఎయ్యది శాస్త్రవిహితమయిన ధర్మానుష్ఠానముకంటెను, తత్ఫలముకంటెను, తత్కారకములకంటెను వేఱయినదియో, అధర్మానుష్ఠానముకంటెను, అధర్మానుష్ఠానఫలము కంటెను, తత్కారకములకంటెను వేఱయినదియో, కార్యకారణములకంటెను వేఱయినదియో, భూతభవిష్యద్వర్తమానకాలములకంటె వేఱయినదియో కాల

త్రయముచేతను అపరిచ్ఛిన్నమయినదనునది ఎయ్యదిగలదో సర్వవ్యవహారగోచరమునకు అతీతమయిన అట్టిదానిని నీవెఱింగియున్నాఁడవు, కావున అట్టిదానినే నాకు బోధింపుము.

వివరణము:—"యేయం ప్రేతేవిచికిత్సా మనుష్యే" (కఠ.౧.౧.౨౦) అనుమంత్రమునందు చెప్పఁబడినది. దేహావ్యతిరేకముగ ఆత్మయనునది ఒక్కటి యున్నదా? లేదా? యని యడిగిన ప్రశ్నముయొక్క వివరమేగాని వేఱుగాదని యెఱుంగవలయును.

౧-వ అధ్యా. ౨-వ వల్లి, ౧౫-వ మంత్రము.

అవ. ఈవిధముగా ప్రశ్నమొనర్చిన నచికేతునకు యముఁడు అట్టి వస్తువును సవిశేషణముగ చెప్పఁదలఁచి యిట్లనిచెప్పుచున్నాడు:—

మూ. సర్వే వేదా యత్పదమామనన్తి
తపాగ్ంసి సర్వాణి చ యద్వదంతి,
యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరన్తి
తత్తే పదగ్ం సంగ్రహేణ బ్రవీమ్యోమిత్యేతత్. ౧౫

పద. సర్వే వేదాః యత్ పదం ఆమనన్తి తపాంసి సర్వాణి చ యత్ వదంతి, యత్ ఇచ్ఛంతః బ్రహ్మచర్యం చరంతి తత్ తే పదం సంగ్రహేణ బ్రవీమి ఓం ఇతి ఏతత్. ౧౫

టీక. సర్వే వేదాః=వేదములన్నియు, యత్=ఏవస్తువును, పదం=పొందఁదగినదానినిగ, ఆమనంతి = ఏకగ్రీవముగ పలుకుచున్నవో, సర్వాణి తపాంసి= తపస్సులన్నియు, యత్=దేనిని, వదంతి = చెప్పుచున్నవో, యత్=ఏవస్తువును, ఇచ్ఛంతః=కోరుచున్నవారలయి, బ్రహ్మచర్యం = గురుకులవాసరూపము లేక బ్రహ్మప్రాప్త్యర్థమగుదానిని, చరంతి = చేయుచున్నారో, తత్=అ, పదం = వస్తువును, తే=నీకు, సంగ్రహేణ=సంగ్రహముగ, బ్రవీమి = చెప్పుచున్నాఁ

డను. ఏతత్=నీవెఱుంగఁదలఁచిన యీవస్తువు, ఓం ఇతి=ఓం అని (గ్రహింప వలయును.)

తా. వేదములన్నియు ఏవస్తువుపొందఁదగినదని ఏకగ్రీవముగ చెప్పు చున్నవో, కృచ్ఛ్రచాంద్రాయణాదిరూపములగు తపస్సులన్నియు ఏవస్తువును పొందుటయే ప్రయోజనములుగాఁగలిగి ఆచరింపఁబడుచున్నవో, గురుకుల వాసరూపమును లేక బ్రహ్మప్రాప్త్యర్థమగు ఉపాయాంతరమును దేనిని కోరుచున్నవారై ఆచరించుచున్నారో, నీవేవస్తువు నెఱుఁగవలయునని కోరు చున్నాఁడవో అట్టివస్తువును సంగ్రహముగ చెప్పుచున్నాఁడను. అది, 'ఓం'అని చెప్పఁబడును. నీవెఱుంగఁదలఁచినవస్తువు ఓంకారశబ్దవాచ్యము లేక 'ఓం' శబ్దమే ప్రతీకముగా గలదని గ్రహింపుము.

వివరణము:—గురుకులవాసమనఁగా నైష్ఠికబ్రహ్మచర్యమని యెఱుంగ వలయును. ఇంద్రవిరోచనాఖ్యాయికయందు బ్రహ్మవిద్యాంగముగ మందాధి కారులగువారికి జ్ఞానప్రాప్తిసాధనభూతముగ బ్రహ్మచర్యమొకటి విధింపఁబడి యున్నది కావున అట్టిబ్రహ్మచర్యము నిట గ్రహించునది.

ఓంకారవాచ్యమనఁగా ఏపదము నుచ్చరించుటచేత ఏవస్తువు శ్రోతకు స్ఫురించునో ఆవస్తువు ఆపదమునకు వాచ్యమగును. సమాహితచిత్తునకు ఓంకార ముచ్చరింపబడినయెడల సత్త్వప్రధానమాయావచ్ఛిన్నమగు ఓంకారోపా ధికమగుబ్రహ్మమే స్ఫురించును. కావున బ్రహ్మము 'ఓంకారవాచ్యము' అని గ్రహించునది. మందాధికారియగువాఁడు సాలగ్రామమునందు విష్ణుభావనను చేయునటుల ప్రణవమునందు బ్రహ్మదృష్టి నుంచుచున్నాఁడు, కావున బ్రహ్మము ఓంకారప్రతీకమని యెఱుంగవలయును.

౧-వ అధ్యా. ౨-వ వల్లి, ౧౬-వ మంత్రము.

మూ. ఏతద్ధ్యేవాక్షరం బ్రహ్మ ఏతద్ధ్యేవాక్షరం పరం,
ఏతద్ధ్యేవాక్షరం జ్ఞాత్వా యో యదిచ్ఛతి తస్య తత్. ౧౬

పద. ఏతత్ హి ఏవ అక్షరం బ్రహ్మ ఏతత్ హి ఏవ అక్షరం పరం, ఏతత్ హి ఏవ అక్షరం జ్ఞాత్వా యః యత్ ఇచ్ఛతి తస్య తత్. ౧౬

టీక. ఏతత్ హి అక్షరం ఏవ=ఈయక్షరమే, బ్రహ్మ=అపరబ్రహ్మము, ఏతత్ హి ఏవ అక్షరం=ఈయక్షరమే, పరం = పరబ్రహ్మము. (అనఁగా పర అపరబ్రహ్మలకు ఈ ప్రణవము ప్రతీకము) ఏతత్ = ఈ, అక్షరం ఏవహి=ప్రణవమునే, యః=ఎవ్వఁడు, జ్ఞాత్వా = బ్రహ్మమని ఎఱింగి ఉపాసించునో, యః= ఎవ్వఁడు, యత్ ఇచ్ఛతి = దేనిని కోరుచున్నాఁడో, తస్య = వానికి, తత్ = అయ్యది (సిద్ధించుచున్నది).

తా. (తత్త్వవిచారానధికారులకు ఓంకారోపాసనమును గతమంత్రమునందు శ్రుతి విధించియున్నది. ఈమంత్రమును ఆ ప్రణవోపాసనాఫలమును తెలుపుచు ఓంకారమును శ్రుతి స్తుతించుచున్నది:—) అందువలన—అనఁగా ఓంకారము పర అపరబ్రహ్మవాచకమును, పర అపరబ్రహ్మప్రతీకమును అగుట వలన ఈ ప్రణవమే-ఓంకారమే అపరబ్రహ్మము, ఈఓంకారమే పరబ్రహ్మము. అనఁగా పరాపరబ్రహ్మములకు ప్రణవము—ఓంకారమను అక్షరము ప్రతీకము. ఈ ప్రణవమును-ఓంకారాక్షరమును బ్రహ్మమని ఉపాసించువారలు పరబ్రహ్మమునో, అపరబ్రహ్మమునో, ఎవ్వరు దేనిని కోరుదురో వారి కయ్యది లభించును. అనఁగా పరబ్రహ్మమని తెలిసి ఉపాసించినయెడల తెలిసికొనుచున్నాఁడు. అపరబ్రహ్మమని తెలిసికొని ఉపాసించు నెడల పొందుచున్నాఁడు.

వివరణము.—పరాపరోపాసనలకు బ్రహ్మ ప్రాప్తిఫలమగు నెడల సమ్యక్ జ్ఞానము వ్యర్థమేగదా యనుసంశయము కలుగును. తత్సంశయనిరాసార్థము పరోపాసనమువలన ఉపాస్యమగుపరబ్రహ్మము ఓంకారాలంబనమని తెలిసికొనుటయే ఫలము. అపరోపాసనవలన అపరబ్రహ్మమును పొందుటయేఫలము అని ఫలవిభాగము తెలుపఁబడినది.

౧-వ అధ్యా. ౨-వ వల్లి, ౧౭-వ మంత్రము.

మూ. ఏతదాలంబనగ్ం శ్రేష్ఠమేతదాలంబనం పరం,
ఏతదాలంబనం జ్ఞాత్వా బ్రహ్మలోకే మహీయతే. ౧౭

పద. ఏతత్ ఆలంబనం శ్రేష్ఠం ఏతత్ ఆలంబనం పరం, ఏతత్ ఆలంబనం జ్ఞాత్వా బ్రహ్మలోకే మహీయతే. ౧౭

టీక. ఏతత్=ఈఓంకారరూపమగు, ఆలంబనం = బ్రహ్మ ప్రాప్తిసాధనము, శ్రేష్ఠం = (బ్రహ్మప్రాప్త్యుపాయభూతాలంబనము లన్నిటిలోపల) శ్రేష్ఠమయినది. ఏతత్ ఆలంబనం = ఈయోంకారరూపమగు ఆలంబనమే, పరం = పరాపరబ్రహ్మసంబంధమయినది. ఏతత్ ఆలంబనం = ఈయోంకారరూపమగు ఆలంబనమును, జ్ఞాత్వా=ఎఱింగి, బ్రహ్మలోకే = బ్రహ్మలోకమునందు, మహీయతే=పూజ్యుఁడగుచున్నాఁడు.

తా. ఈయోంకారము పరాపరబ్రహ్మప్రాప్తి సాధనభూతమగుటచేత బ్రహ్మ ప్రాప్త్యాలంబనములన్నిటిలోపల నియ్యది మిక్కిలిశ్రేష్ఠమైనది. ఈయోంకారాలంబనము పరాపరబ్రహ్మప్రాప్తికి సాధనభూతమగుటవలన బ్రహ్మలోకమునందు పూజ్యుఁడగుచున్నాఁడు. పరబ్రహ్మమునందు అపరబ్రహ్మమునందున్నూ బ్రహ్మమువలెనే ఉపాస్యుఁ డగుచున్నాఁడు.

వివరణము:—బ్రహ్మలోకశబ్దమునకు "బ్రహ్మైవలోకః బ్రహ్మలోకః" బ్రహ్మమే లోకము కావున బ్రహ్మలోకము అని టీకయందు వివరింపఁబడినది.

౧-వ అధ్యా. ౨-వ వల్లి, ౧౮-వ మంత్రము.

అవ. 'అన్యత్ర ధర్మాత్' అన్యత్రఅధర్మాత్' (కఠ: వల్లి. ౨. ౧౪.) అనుమంత్రమునందు అశేషవిశేషణరహితముగ అడుగఁబడినఆత్మకు ఆలంబనముగ ప్రతీకముగ ఓంకారము నిర్దేశింపఁబడినది. (అదేవిధముగ) మందమధ్యమాధికారులగువారి యుపయోగార్థము అపరబ్రహ్మమునకు ఆలంబనముగను ప్రతీకముగను ఓంకారము నిర్దేశింపఁబడినది. ఇఁకమీఁదట ఓంకారాలంబనముగు

బ్రహ్మముయొక్క ఉపాసనార్థము తత్స్వరూపమును నిర్ణయించవలయుననుతలం పుతో నీవిషయము చెప్పఁబడుచున్నది:—

మూ. న జాయతే మ్రియతే వా విపశ్చి
న్నాయం కుతశ్చిన్న బభూవ కశ్చిత్,
అజో నిత్యశ్శాశ్వతో ఽయం పురాణో
న హన్యతే హన్యమానే శరీరే. ౧౮

పద. న జాయతే మ్రియతే వా విపశ్చిత్ న అయం కుతః చిత్ న బభూవ కః చిత్, అజః నిత్యః శాశ్వతః అయం పురాణః న హన్యతే హన్యమానే శరీరే. ౧౮

టీక. విపశ్చిత్=సర్వజ్ఞ మగు, అయం=ఈయాత్మ, నజాయతే=పుట్టుట లేదు. నమ్రియతే=చచ్చుటయుం లేదు. కుతః చిత్ = మఱియొకనివల్లనుండి, లేక మఱొక కారణమువల్లనుండి, నబభూవ=కాలేదు. కశ్చిత్ నబభూవ = ఒక్కటి యుం కాలేదు. అయం = ఈయాత్మ, అజః = పుట్టుకలేనిది, నిత్యః=నిత్యమయి నది, శాశ్వతః=అపక్షయవిరహితమయినది, పురాణః = పురాణమయినది, శరీరే =దేహము,హన్యమానే = శస్త్రాదికముచేత కొట్టఁబడుచున్నప్పటికిన్నీ, (అయం =ఈయాత్మ) నహన్యతే=చంపఁబడదు.

తా. ఉత్పత్తిగలవస్తువు అనిత్యము. అట్టిఅనిత్యమయినవస్తువు అనేక వికారగుణములు కలిగియుండును. ఆవికారగుణములలో ఆది, అంతము అను నట్టివిక్రియాగుణములురెండును ఆత్మకులేవనిచెప్పుటకుగానున జాయతే—పుట్టు టలేదు, నమ్రియతే-చచ్చుటలేదని చెప్పఁబడినది. ఈయాత్మఎల్లప్పుడుచైతన్య విశిష్టుఁడయియుండుటవలన సర్వజ్ఞుఁడగుచున్నాఁడు. ఈయాత్మకు కారణభూ తమగు మఱొకవస్తువులేదు, ఈయాత్మవల్లనుండి మఱొకటియేమియుం పుట్టినది లేదు, కావున ఈయాత్మఅజుఁడు, నిత్యుఁడు, శాశ్వతుఁడు—అనఁగా అపక్ష యవర్జితుఁడు. అశాశ్వతమయినది నశించునుగాని శాశ్వతమయినది నశిం

వదు. ఈయాత్మ శాశ్వతమగుటచేత పురాణమే. పురాణమనఁగా పూర్వకాలమయినదైనను నవమయినదే. ఎయ్యది అవయవవృద్ధిచేత నిర్మితమగునో అది ఇప్పుడు కుంభాదికమువలె నవమని చెప్పఁబడును. ఆత్మకుంభాదికమువలె నవము గాక పురాణము—వృద్ధివివర్జితమగుచున్నది. ఆత్మ ఇట్టిదగుటచేత ఖడ్గాద్యాయుధములచేత శరీరము నరుకఁబడుచున్నను ఆశరీరాంతర్భాగమునందున్న ఆత్మ ఆకాశమువలె హింసింపఁబడఁడు.

వివరణము:—ఆత్మ ఇట్టిదగుటవలన అనుటకు భావమేమనఁగా ఆత్మ అజత్వ, నిత్యత్వ, శాశ్వతత్వాదిగుణములుగలది యగుటచేత పుట్టుట పెఱుగుట మున్నగునవి శరీరధర్మములుకాని ఆత్మధర్మములుకాఁజాలవు. శరీరమునకు శస్త్రాఘాతము కలిగినయెడల శరీరమునందు కలసియున్నగర్భమునకుగూడ క్షతి కలుగుట లోకప్రసిద్ధముగదా. అట్లే శరీరాంతర్వర్తియగు ఆత్మకు శరీరాఘాతమువలన క్షతి కలుగవచ్చునను సంశయమునకు! ఆకాశమునకు శస్త్రాదికమువలన క్షతి యెటులలేదో అట్లే ఆత్మకుకూడ క్షతిలేదని సమాధానము.

౧-వ అధ్యా. ౨-వ వల్లి, ౧౯-వ మంత్రము.

మూ. హంతా చేన్మన్యతే హంతుగ్ం హతశ్చేన్మన్యతే హతం,
ఉభౌ తౌ న విజానీతో నాయగ్ం హంతి న హన్యతే.

పద. హంతా చేత్ మన్యతే హంతుం హతః చేత్ మన్యతే హతం, ఉభౌ తౌ న విజానీతః న అయం హంతి న హన్యతే. ౧౯

టీక. హంతా=చంపునట్టివాఁడు, హంతుం = చంపుటకు, మన్యతేచేత్ = తలఁచినయెడల, హతః = చంపఁబడినవాఁడు, హతం = చంపఁబడినవానినిగా, మన్యతేచేత్ = తలంచినయెడల, తౌ ఉభౌ = వారిద్దఱు, న విజానీతః= తెలిసికొనినవారలుగారు, అయం = ఇతఁడు, నహంతి = చంపుటలేదు, నహన్యతే= ఇతరునిచేత చంపఁబడుటయుం లేదు.

తా. అసంగస్వభావుఁడగు నిట్టియాత్మను శరీరమాత్రదృష్టిగలవాఁ డెవ్వఁడైనను నేనుచంపెదనని తలంచినయెడలను, (చంపెదననితలంచువానిని) ఎవ్వఁడు నిషేధించునో, ఎవ్వఁడు తాను చంపఁబడుచున్నటుల తలంచునో వీరు ఆత్మయనఁగా నేమియో తెలియనివారుగా తలంచవలయును. ఏల యనఁగా ఆత్మ ఆకాశమువలె .వికారరహితుఁడగుటచేత ఆత్మ ఒక్కనిచంపుట లేదు, ఒకనిచేత చంపఁబడుటయు లేదు. కనుక ధర్మాధర్మాదిలక్షణమగు సంసార మంతయు అనాత్మజ్ఞవిషయముకాని బ్రహ్మజ్ఞవిషయముమాత్రము కాదు. శ్రుతి ప్రామాణ్యమువల్లను, న్యాయమువల్లను, బ్రహ్మజ్ఞునకు ధర్మాధర్మాదికము కలుగఁ జాలదు.

వివరణము:— ఆత్మ అవిక్రియుఁడయినయెడల ధర్మాచరణమున కధికారి యగువాఁ డుండఁజాలఁడుగదా. అప్పుడు సంసారమే యుండఁజాలదుగదా అను ఆశంకకు సమాధానము ధర్మాధర్మాదిలక్షణమగుసంసారము అనాత్మజ్ఞ విషయము అనిచెప్పఁబడినది. వివేకియగువాఁడు సర్వదాముక్తుఁడుకావున అట్టి వానికి ధర్మాధర్మాద్యాచరణరూపమగు సంసారమే లేదు. ఈవిషయ మిట్లు తెలుపఁ బడినది:—

శ్లో. వివేకీ సర్వదా ముక్తః కుర్వతో నాస్తి కర్తృతా,
ఆలేపవాదమాశ్రిత్య శ్రీకృష్ణజనకౌ యథా. ౧౯

అనాత్మజ్ఞుఁ డనఁగా దేహాదికమునందు తాదాత్మ్యాద్యభిమానముగల వాఁడు.

౧-వ అధ్యా. ౨-వ వల్లి, ౨౦-వ మంత్రము.

అవ. ఆత్మనేవిధముగా తెలిసికొనవలయునో ఆవిషయము చెప్పఁబడు చున్నది:—

మూ. అణోరణీయాన్మహతో మహీయా
నాత్మాఽస్య జంతోర్నిహితో గుహాయాం,

తమక్రతుః పశ్యతి వీతశోకో
ధాతుప్రసాదాన్మహిమానమాత్మనః. ౨౦

పద. అణోః అణీయాన్ మహతః మహీయాన్ ఆత్మా అస్య జంతోః నిహితః గుహాయాం, తం అక్రతుః పశ్యతి వీతశోకః ధాతుప్రసాదాత్ మహిమానం ఆత్మనః. ౨౦

టీక అణోః = సూక్ష్మపరిమాణముగల శ్యామాకాదికముకంటె, అణీయాన్ =మిక్కిలి సూక్ష్మమయినట్టియు, మహతః = మహాపరిమాణముగల పృథివ్యాదికముకంటె, మహీయాన్ = మిక్కిలి గొప్పదైనట్టియు, ఆత్మా = ఆత్మ, అస్య = ఈ బ్రహ్మాదిస్తంబపర్యంతమయిన, జంతోః = ప్రాణిజాతముయొక్క, గుహాయాం = బుద్ధిగుహాయందు, నిహితః = ఉంచబడియున్నాఁడు. తం = అట్టియాత్మను, అక్రతుః = దృష్టాదృష్టబాహ్యవిషయోపరతబుద్ధిగలవాఁడు (చూచుచున్నాఁడు) ధాతుప్రసాదాత్ = మనస్సు మున్నగు ఇంద్రియసముదాయముయొక్క ప్రసన్నత్వమువలన, ఆత్మనః=ఆత్మయొక్క, మహిమానం = మాహాత్మ్యమును, పశ్యతి=చూచుచున్నాఁడు. వీతశోకః=శోకరహితుఁడున్నా (అగుచున్నాఁడు.)

తా. ఆత్మతత్త్వము మిక్కిలి అల్పపరిమాణముగల శ్యామాకాదికముకంటె మిక్కిలి సూక్ష్మమయినది. మిక్కిలి గొప్పపరిణామముగల పృథివ్యాదికముకంటె మిక్కిలి మహత్తరమయినది. అణుపరిమాణమో లేక మహత్పరిమాణమోగల ఏవస్తువు లోకమునందు గనంబడుచున్నదో అది నిత్యమగు ఆత్మచేతనే స్థితిగలది యగుచున్నది. ఆత్మవిరహితమగువస్తువు అసత్తగుచున్నది. ఈయాత్మ సర్వనామరూపవస్తూపాధిక మగుటచేత అణుపరిమాణమయినదానికంటె అణుతరమును, మహాపరిమాణమయినదానికంటె మహత్తరమును అగుచున్నది. అట్టియాత్మ బ్రహ్మాది స్తంబపర్యంతమగు ప్రాణిజాతముయొక్క బుద్ధిగుహాయందు ఆత్మభూతమయి ఉన్నది. దర్శన,

శ్రవణ, మనన, విజ్ఞానములే లింగములుగాఁగల అట్టియాత్మను అక్రతువు— అనఁగా నిష్కాముఁడు — దృష్టాదృష్టబాహ్యవిషయోపరతబుద్ధిగలవాఁడు మాత్రమే గాంచుచున్నాఁడు. ఎప్పు డిట్టిజ్ఞానము లభించునో అప్పుడు ధాతువులు అనఁగా మనస్సు మున్నగుఇంద్రియములు (శరీరమును ధరించుచుండుటచేత యౌగికముగా ధాతుశబ్ద మిట యింద్రియవాచకము) ప్రసన్నము లయియుండుటచేత ఆత్మయొక్క మహిమను—కర్మనిమిత్తమయిన వృద్ధిక్షయరహిత మయినదానిని 'అయ మహ మస్మి' అని సాక్షాత్తుగా నెఱుంగును. ఈవిధముగా నె ...గుటవలన గతించినశోకముగలవాఁ డగుచున్నాఁడు.

వివ... ఒకేవస్తువు అణువున్నూ మహత్తున్నూ అగుట అసంభవము అ... అణుత్వ మహత్త్వములు పరమార్థముగా ఆత్మకు లేవని చెప్పఁబడినది.

ధాతుశబ్దము దేహాంతర్గతశిరాదివాచకమైనను ఇచట యౌగికార్థమును గ్రహించి భాష్యకారులగు శంకరభగవత్పాదులవారు ఇంద్రియవాచకముగ గ్రహించిరి. విద్యారణ్యులవారుకూడ ఇట్లే గ్రహించిరి:—

శ్లో. శ్యామాకాదేరణోరేషోఽణీయాం స్తత్రాణు కల్పనాత్,
మహీయాన్మహతః ఖాదే స్తత్రాకాశాది కల్పనాత్. ౨౯
స్థితో జంతోర్హృద్గుహాయాం తం నిష్కామస్తు పశ్యతి,
ఇంద్రియాణాం ప్రసన్నత్వాద్వీతశోక స్తదా భవేత్. ౩౦
అనుభూతిప్రకాశము. ౧౧-వ అధ్యాయము.

౧-వ అధ్యా. ౨-వ వల్లి ౨౧-వ మంత్రము.

అవ. అట్టి...యెడల ప్రాకృతబుద్ధిగల కాములగు పురుషులచేత ఆత్మ దుర్విజ్ఞేయుఁ డగుచున్నాఁడని చెప్పఁబడుచున్నది. ఏలయనఁగా:—

మూ. ఆసీనో దూరం వ్రజతి శయానో యాతి సర్వతః,
కస్తంమదామదం దేవం మదన్యో జ్ఞాతుమర్హతి. ౨౧

పద. ఆసీనః దూరం వ్రజతి శయానః యాతి సర్వతః, కః తం మదామదం దేవం మదన్యః జ్ఞాతుం అర్హతి. ౨౧

టీక. (ఆయాత్మతత్త్వము) ఆసీనః=ఒక్కచోటనే ఉన్నదై—అచలమయి, దూరం=దూరముగా, వ్రజతి=పోవుచున్నది. శయానః=నిద్రించుచున్నదానివలెఉన్నదై, సర్వతః = అన్నివైపుల, యాతి = పోవుచున్నది. తం=ఆః మదామదం=సంతోషవిషాదాత్మకుఁడగు, దేవం = దేవుని, మదన్యః = నాకంటె అన్యుఁడగు, కః=ఎవ్వఁడు, జ్ఞాతుం=తెలిసికొనుటకు, అర్హతి=తగును ?

తా. ఈయాత్మ ఒక్కచోటనే ఉన్నవాఁడై అచలుఁడై దూరముగా పోవుచున్నాఁడు. శయానుఁడై - పరుండియున్నవాఁడై అంతట వ్యాపించుచున్నాఁడు. ఈవిధముగా నీయాత్మ మదామదుఁడైయున్నాఁడు. మదమనఁగా సంతోషము. అమదమనఁగా దుఃఖము. మదుఁడనఁగా సంతోషము గలవాఁడు. అమదుఁడనఁగా సంతోషరహితుఁడు. సంతోష, తదభావములను విరుద్ధధర్మములు గలవాఁడగుటచేత తెలిసికొనుటకు శక్యముకానట్టి అట్టిదేవుని నాకంటె భిన్నుఁడగు వాఁడెవ్వఁడు తెలిసికొనఁగలఁడు? నావంటివారివలె సూక్ష్మబుద్ధిగలపండితునకే ఆత్మ సువిజ్ఞేయుఁడు. ఈయాత్మ స్థితి, గతి, నిత్య, అనిత్యాది, విరుద్ధానేక ధర్మోపాధికుఁడగుటచేతను, విరుద్ధధర్మములు గలవాఁడగుటచేతను విశ్వరూపునివలెను చింతామణివలెను ప్రకాశించుచున్నాఁడు. కావున నాకంటెవేఱయినవాఁ డెవ్వఁడెఱుంగఁగలఁడు? అని ఆత్మ దుర్విజ్ఞేయుఁడను విషయము ప్రకటింపఁబడినది.

వివరణము:—'ఆసీనో దూరం వ్రజతీ' త్యాదిమంత్రార్థమును అనుభూతిప్రకాశమునందు శ్రీమద్విద్యారణ్యులవారు మనోరంజకముగ నిట్లునిరూపించియున్నారు:—

శ్లో. అంతర్ముఖోఽహం పశ్యామి మత్తోఽన్యో బాహ్యధీః పుమాన్,
జ్ఞాతుమర్హతి కో వా తం విరుద్ధాత్మకభాసినమ్. ౩౧

దూరం గచ్ఛేదివాసీనః శయానో యాతి సర్వతః,
సమదో విమదశ్చాసౌ దుర్లక్ష్యోఽజ్ఞావివేకిభిః. ౩౨
వనే ధ్యాతుం సమాసీనో దేహం సంకల్ప్య మానసం,
తేనైవ నగరం గత్వా కరోతి క్రయవిక్రయౌ. ౩౩
శయానో మంచకేఽశ్లేషు విలీనేషు నిరాకృతిః,
ఆకాశవత్సర్వగతః ఏక స్సుప్తోఽవతిష్ఠతే. ౩౪
ధనవిద్యాదిభిర్మత్తః పాండిత్యం సదసి బ్రువన్,
వైరాగ్యనటనేనాసౌ లక్ష్యతే మదహీనవత్. ౩౫
ఏవం విరుద్ధధర్మత్వాత్ స భావః కోఽస్య వాస్తవః,
ఇతి జ్ఞాతుమశక్యత్వా దంతర్దృష్ట్యైవ మీక్షతామ్. ౩౬

అనుభూతిప్రకాశము. ౧౧-వ అధ్యాయము.

౧-వ అధ్యా. ౨-వ వల్లి, ౨౨-వ మంత్రము.

అవ. ఆ యాత్మవిజ్ఞానమువలననే శోకాత్యయము, శోకనాశనము కలుగునని నిరూపించుచున్నాఁడు:—

మూ. అశరీరగ్ం శరీరేష్వనవస్థేష్వవస్థితం,
మహాంతం విభుమాత్మానం మత్వా ధీరో న శోచతి. ౨౨

పద. అశరీరం శరీరేషు అనవస్థేషు అవస్థితం, మహాంతం విభుం ఆత్మానం మత్వా ధీరః న శోచతి. ౨౨

టీక. ధీరః=బుద్ధిమంతుఁడు, ఆత్మానం=ఆత్మను, అశరీరం = శరీరవిరహితునిగను, అనవస్థేషు=అనిత్యములగు, శరీరేషు= శరీరములందు, అవస్థితం=ఉన్నవానిగను, మహాంతం=గొప్పవానిగను, విభుం=వ్యాపనముగలవానిగను, మత్వా=తలంచి, న శోచతి=దుఃఖింపఁడు.

తా. ఆత్మస్వరూపముచేత ఆకాశతుల్యుఁడు కావున అశరీరి యనం బడుచున్నాఁడు. అనిత్యములగు దేవ, పితృ, మనుష్యాది శరీరములందున్నవాఁ

డును, అనఁగా నిత్యుఁడును, వికారరహితుఁడు నని భావము. గొప్పవానిగను, విభువుగను, సర్వవ్యాపిగను, ఆత్మను (ఇచట ఆత్మశబ్దమును ప్రత్యగాత్మవాచకముగ తలంచుటయే ముఖ్యము) తలంచి అనఁగా "అయం అహం ఇతి= నేనే పరబ్రహ్మమని" తలంచుచున్న విద్వాంసుఁడు శోకింపఁడు. ఇట్టివాఁడయిన ఆత్మవేత్తకు శోకములేదని భావము.

వివరణము:—ఆత్మకు సశరీరత్వము అభిమానికమేగాని స్వాభావికము కాదని ఎఱుంగవలయును.

౧-వ అధ్యా. ౨-వ వల్లి, ౨౩-వ మంత్రము.

అవ. ఆత్మ దుర్విజ్ఞేయమయినను ఉపాయముచేత సువిజ్ఞేయము—సుఖముగా తెలిసికొనుటకు శక్యమే యని చెప్పఁబడుచున్నది:—

మూ. నాయమాత్మా ప్రవచనేన లభ్యో
న మేధయా బహునా శ్రుతేన,
యమేవైష వృణుతే తేన లభ్య
స్తస్యైషఆత్మా వివృణుతే తనూగ్ం స్వామ్. ౨౩

పద. న అయం ఆత్మా ప్రవచనేన లభ్యః న మేధయా బహునా శ్రుతేన, యం ఏవ ఏషః వృణుతే తేన లభ్యః తస్య ఏషః ఆత్మా వివృణుతే తనూం స్వాం. ౨౩

టీక. అయంఆత్మా = ఈయాత్మ, ప్రవచనేన = అనేకవేదాధ్యయనముచేత, న లభ్యః = పొందుటకు వీలయినవాఁడు కాఁడు, మేధయా= గ్రంథార్థధారణాశక్తిరూపమగు మేధచేత, నలభ్యః = పొందుటకు వీలయినవాఁడు కాఁడు. బహునాశ్రుతేన = కేవలమయిన విశేషపాండిత్యముచేత, న లభ్యః = పొందుటకువీలయినవాఁడు కాఁడు. ఏషః = ఈసాధకుఁడు, యంఏవ = ఏయాత్మను, వృణుతే = వరించుచున్నాఁడో, తేన = వానిచేత, లభ్యః = పొందఁదగినవాఁడు. తస్య = ఆత్మకాముఁడగు అట్టివానికి, ఏషఃఆత్మా = ఈ

యాత్మ, స్వాంతనూం = పారమార్థికమగు తనస్వరూపమును, వివృణుతే = ప్రకాశింపఁజేయుచున్నాఁడు.

తా. అనేకవేదముల నధ్యయనమొనర్చుటచే ఆత్మనుపొందుటకు శక్యముకాదు. గ్రంథార్థధారణాశక్తిరూపమగు మేధచేతను ఆత్మప్రాప్తి సాధ్యముకాదు. కేవలమయిన విశేషపాండిత్యముచేతను ఆత్మనుపొందుట సాధ్యముకాదు. ఇఁక దేనిచేత ఆత్మప్రాప్తిలభ్యమగునన సాధకుఁడగువాఁడెవ్వఁడు స్వాత్మభూతుఁడగు ఆత్మను పొందవలయునని కోరునో అట్టివాని చేతనే స్వయముగా ఆత్మ లభ్యుఁడగునని తెలిసికొనవలయును. నిష్కాముఁడయి ఆత్మనుమాత్రమె ప్రార్థించునట్టివానికే ఆత్మలభ్యుఁడని ఎఱుంగవలయును. ఎట్లు లభ్యుఁడగుననఁగా చెప్పఁబడుచున్నది—అట్టి ఆత్మకాముఁడగు సాధకునకు ఈయాత్మయే స్వకీయమయిన పారమార్థికస్వరూపమును ప్రకటింపఁజేయును.

వివరణము;—ఆత్మతత్త్వము ఉపనిషద్విచారవ్యతిరిక్త శాస్త్రాంతరాధ్యయనము చేతగాని, గురూపదేశము, గుర్వనుగ్రహము, ఈశ్వరానుగ్రహము లేని కేవలమయిన ఉపనిషద్విచారణము చేతగాని లభ్యముకాదనియు, ఆచార్య, పరమేశ్వరానుగ్రహపూర్వకమయిన ఉపనిషచ్ఛ్రవణ, మనన, నిదిధ్యాసనముల చేతనే లభించుననియు గ్రహించునది.

౧-వ అధ్యా. ౨-వ వల్లి, ౨౪-వ మంత్రము.

మూ. నావిరతో దుశ్చరితాన్నా శాంతో నాసమాహితః,
నాశాన్తమనసో వాఽపి ప్రజ్ఞానేనైనమాప్నుయాత్.

పద. న అవిరతః దుశ్చరితాత్ న అశాంతః న అసమాహితః, న అశాంతమనసః వా అపి ప్రజ్ఞానేన ఏనం అప్నుయాత్. ౨౪

టీక. దుశ్చరితాత్ = శ్రుతిస్మృత్యావిహితమయినట్టియు నిషిద్ధమయినట్టియు పాపకర్మమునుండి, అవిరతః=విరమింపనివాఁడు, ఏనం=ఈయాత్మను,

న ఆప్నుయాత్ = పొందఁ జాలఁడు. అశాంతః = ఇంద్రియచాపల్యము గల వాఁడు, న ఆప్నుయాత్ = ఈయాత్మను పొందఁజాలఁడు. అసమాహితః = ఏకాగ్రచిత్తములేనివాఁడు - విక్షిప్తమనస్కుఁడు, న ఆప్నుయాత్ = ఈ యాత్మను పొందఁజాలఁడు. అశాంతమానసః వా అపి = బహువిషయము లందు వ్యాప్తమయిన మనస్సుగలవాఁడున్నూ, న ఆప్నుయాత్ = ఈయాత్మను పొందఁజాలఁడు. ప్రజ్ఞానేన = బ్రహ్మవిజ్ఞానముచేతనే, ఏనం = ఈయాత్మను, ఆప్నుయాత్ = పొందును.

తా. దుశ్చరితముగా శ్రుతిస్మృతులందు నిషిద్ధమయినట్టి పాపము. శ్రుతిస్మృతులందు విహితములుకానిదికూడ దుశ్చరితమే. ఇట్టి పాపకర్మమునుండి విర మించనివాఁ డీయాత్మను పొందఁజాలఁడు. ఇంద్రియములకు సంబంధించిన విషయసుఖములనుండి శాంతిని పొందనివానికి ఆత్మప్రాప్తి శక్యము కాదు. ఏకాగ్రచిత్తము లేక అనేకవిషయములందు వ్యాపించిన చిత్తముగలవానికి కూడ ఆత్మప్రాప్తి శక్యము కాదు. సమాహితచిత్తుఁడయినను సమాధాన ఫలార్థి యగువానికికూడ ఆత్మప్రాప్తి శక్యముకాదు. ఇఁక దేనిచేత ఆత్మప్రాప్తి శక్యమగు ననఁగా? ప్రజ్ఞానేన అనఁగా బ్రహ్మవిజ్ఞానముచేతనే ఆత్మప్రాప్తి శక్య మగును. ఎవ్వఁడు శ్రుతిస్మృత్యవిహితమయినట్టియు, శ్రుతిస్మృతి ప్రతిషిద్ధ మయినట్టియు పాపకర్మమునుండి విముఖుఁడగునో, ఎవ్వఁడు ఇంద్రియ చాపల్యవిముఖుఁడో, ఎవ్వఁడు సమాహితచిత్తుఁడో, ఎవ్వఁడు సమాహితచిత్తత్వ మునకు ఫలరూపములగు లోకములనుకూడ అభిలషింపఁడో అట్టివానిచేతనే గుర్వనుగ్రహము చేత ఆత్మప్రాప్తి పొందఁబడుచున్నదని భావము.

వివరణము:—దుశ్చరితమనఁగా కాయికమగు పాపాచరణము.

ఈశ్వరానుగ్రహముచేత లభింపఁదగిన ప్రసాదచిత్తత్వముకలిగి, అనేక విధ సాధనసంపత్తి కలవాఁడు చేతనే ఆత్మపొందుటకు శక్యముకాని తక్కితరులకు ఆత్మప్రాప్తి అశక్యమని భావము.

౧-వ అ. ౨-వ వల్లి, ౨౪-వ మంత్రము.

మూ. యస్య బ్రహ్మచ క్షత్రంచ ఉభే భవత ఓదనః,

మృత్యుర్యస్యోపసేచనం క ఇత్థా వేద యత్ర సః ౨౫

ఇతి కాఠకోపనిషది ప్రథమాధ్యాయే
ద్వితీయా వల్లీ సమాప్తా.

పద. యస్య బ్రహ్మ చ క్షత్రం చ ఉభే భవతః ఓదనః, మృత్యుః యస్య ఉపసేచనం కః ఇత్థా వేద యత్ర సః. ౨౫

ప్రథమాధ్యాయే ద్వితీయా వల్లీ సమాప్తా.

టీక. యస్య=ఏయాత్మకు, బ్రహ్మ చ క్షత్రం చ=బ్రహ్మక్షత్రత్వములు, ఉభే=రెండున్ను, ఓదనః భవతః=అశనముగా అగుచున్నవో, యస్య = ఏయాత్మకు, మృత్యుః=మృత్యువు, ఉపసేచనం=ఉపసేచనమో, యత్ర = ఎచ్చట-ఏస్వమహిమయందు, సః=ఆయాత్మయుండునో. (తం=అట్టియాత్మను), ఇత్థా =ఈవిధముగా, కః=ఎవ్వఁడు, వేద=తెలిసికొనును ?

తా. ఎవఁడు పూర్వోక్తానేకవిధసాధనవిరహితుఁడో, అట్టిప్రాకృత బుద్ధిగలవాఁడు సర్వధర్మవిధారకములును, సర్వరక్షణసమర్థములును అగుబ్రహ్మక్షత్రములు రెండున్ను ఎవనికి అశనము లగుచున్నవో, సర్వసంహారకమగు మృత్యు వెవ్వనికి అన్నభక్షణమునకు సాధనభూతమగు ఉపసేచనమో అట్టియాత్మను సాధనవిశిష్టుఁడగువానివలె ఎఱుంగఁజాలఁడు.

వివరణము;—ఉపసేచనమనఁగా అన్నమునకు సాధనభూతమగుశాకము మున్నగునది. సర్వసంహారకమగు మృత్యువు ఎవ్వనికి అన్నముకూడ కాఁజాలక తదుపసేచనమయి యున్నదో అట్టియాత్మను సాధనసంపత్తిగలవాఁడే ఎఱుంగఁగలఁడు కాని ప్రాకృతబుద్ధిగలవాఁ డెఱుంగఁజాలఁడని భావము.

కఠోపనిషత్తు. ౧-వ అధ్యాయము. ౨-వ వల్లి సమాప్తము.

ఈవల్లికిసంబంధించిన గ్రంథభాగములు:—

అనుభూతిప్రకాశము. ౧౧ అధ్యా. శ్లో. ౭-౪౧.

ఆత్మపురాణము. ౯ అధ్యా. శ్లో. ౨౭౫—౪౫౧.

కఠోపనిషత్తు

ప్రథమాధ్యాయము—తృతీయవల్లి.

౧-వ అధ్యా॰ ౩-వ వల్లి, ౧-వ మంత్రము.

అవ. 'ఋతం పిబంతౌ' అనెడి ఈ ౩-వ వల్లియొక్క సంబంధము చెప్పఁబడుచున్నది. విద్య, అవిద్యయనునది రెండున్నూ పరస్పరవిరుద్ధధర్మములు గలవనిమాత్రమే వెనుకటి రెండువల్లులందు చెప్పఁబడినదికాని స్పష్టముగా వానిని నిరూపింపలేదు. ఆవిషయమును నిరూపించుటకు సులభగ్రహణార్థము రథరూపకల్పనము చేయఁబడుచున్నది. ఆకల్పనానుసారము ప్రాప్తృ, ప్రాప్య, గంతృ, గంతవ్యవివేకార్థము ఆత్మద్వయ ముపన్యసింపఁబడుచున్నది:—

మూ. ఋతం పిబంతౌ సుకృతస్య లోకే
గుహాం ప్రవిష్టౌ పరమే పరార్ధ్యే,
ఛాయాఽఽతపౌ బ్రహ్మవిదో వదంతి
పంచాగ్నయో యే చ త్రిణాచికేతాః. ౧

పద. ఋతం పిబంతౌ సుకృతస్య లోకే గుహాం ప్రవిష్టౌ పరమే పరార్ధ్యే, ఛాయాఽఽతపౌ బ్రహ్మవిదః వదంతి పంచాగ్నయః యే చ త్రిణాచికేతాః.

టీక. యేచ=ఎవ్వరు, త్రిణాచికేతాః = త్రిణాచికేతులో, పంచాగ్నయః=పంచాగ్నులో, తే=అట్టి, బ్రహ్మవిదః = బ్రహ్మవేత్తలు, సుకృతస్య = స్వయంకృతమగుకర్మయొక్క, ఋతం = ఋతమును-ఫలమును, పిబంతౌ = అను

భవించుచున్నవారును, లోకే = శరీరమునందుగల, పరమే=శ్రేష్ఠమయిన, పరార్ధ్యే=బ్రహ్మస్థానమగు, గుహాం=బుద్ధిగుహను, ప్రవిష్టౌ=ప్రవేశించినవారుగను, (ఉన్నఆత్మలను) ఛాయాఽఽతపౌ = నీడయెండలవలె (పరస్పరమువిలక్షణధర్మముగలవారినిగా), వదంతి=(బ్రహ్మవేత్తలు) చెప్పుచున్నారు.

తా. ఋతమనఁగా సత్యము, కర్మఫలము అవశ్యము అనుభవించితీరవలసినది కావున ఋతశబ్దముచేత ఇట కర్మఫలము గ్రహింపఁబడుచున్నది. జీవాత్మపరమాత్మలను వారిద్దఱిలో నొక్కఁడగు జీవాత్మ మాత్రమే కర్మఫలము ననుభవించుచున్నప్పటికిన్నీ జీవాత్మసంబంధముచేత ఛత్రిన్యాయముననుసరించి 'పిబంతౌ' అని ద్వివచనముచెప్పఁబడినది. సుకృతమనఁగా స్వయంకృతమగుకర్మము. ఋతమనఁగా స్వయంకృతమగుకర్మఫలము, దీనినిఅనుభవించుచున్నారని అన్వయము. దేహాశ్రయమగు ఆకాశప్రదేశముకంటె శ్రేష్ఠమయినట్టి బ్రహ్మమునకు స్థానభూతమయిన శరీరమునందుగల బుద్ధిగుహయందు ప్రవేశించినవారిగను, సంసారిత్వ, అసంసారిత్వవిభేదముచేత ఛాయాతపములవలె - నీడయెండలవలె పరస్పరము విలక్షణధర్మములుగలవారిగను జీవాత్మపరమాత్మలను బ్రహ్మవేత్తలగు వారలు పలుకుచున్నారు. ఈవిషయము నీవిధముగా అకర్మకులగు బ్రహ్మవేత్తలు మాత్రమే పలుకుటలేదు. కర్మఠులగు పంచాగ్నులగు గృహస్థులున్నూ, మూఁడు పర్యాయములు నాచికేతాగ్నిచయనము నాచరించుటచేత త్రిణాచికేతులని పిలువంబడుచున్న గృహస్థులున్నూ పైనబ్రహ్మవేత్తలుచెప్పినవిధముగనే చెప్పుచున్నారు.

వివరణము:—మూలమునందు 'ఋతం పిబంతౌ'కర్మఫలముననుభవించునట్టియిద్దఱు అని ద్వివచనముమాత్రమే చెప్పఁబడియుండగా 'జీవేశ్వరులని' వివరణమొనర్చుటకు కారణమేమనఁగా కర్మఫలానుభోక్తయగువాఁడు చేతనుఁడగు జీవుఁడొకఁడని సహజముగానే సిద్ధించుచున్నది. ఇఁక రెండవవానిని గూర్చి విచారించుట యుక్తము. లెక్కకు తీసికొనునప్పుడు పూర్వోక్తునితో

సమానస్వభావముగలవానినే పరిగ్రహించుటయుక్తము కావున సమానస్వభావముగల పరమాత్మయే రెండవవాఁడుగ ప్రకృతానుసారముగ నిట పరిగ్రహింపఁ బడినాఁడని గ్రహించునది.

ప్రాప్తృ, ప్రాప్య, గంతృ, గంతవ్య వివేకమనఁగా:—

ప్రాప్తయనఁగా బ్రహ్మప్రాప్తికి ప్రయత్నించునట్టిజీవుఁడు.
ప్రాప్యమనఁగా పొందఁదగినట్టి బ్రహ్మము.
గంతయనఁగా తెలిసికొనఁదగిన ఆత్మను తెలిసికొనుటకు ప్రయత్నించునట్టి జీవుఁడు.
గంతవ్యమనగా తెలిసికొనఁదగిన లేక పొందఁదగిన బ్రహ్మము.
వైశేషయాన్వయము లివియని తెలిసికొనుటయే ప్రాప్తృ, ప్రాప్య, గంతృ, గంతవ్య వివేకమని యెఱుంగవలయును.

ఛత్రిన్యాయాను సరణమనఁగా:—

ఛత్రధారి యగురాజు సపరివారుఁడయి బోవునప్పుడు 'ఛత్రిణో గచ్ఛంతి' అని ప్రయోగించుచుందురు. ఆసమూహమునందు గొడుగులున్నవారున్నూ లేనివారున్నూ ఉన్నప్పటికిన్నీ అద్వివిధసముదాయమునందున్నూ 'ఛత్రిణః' అనుపదము లోకమునందు ప్రయోగింపఁబడుచున్నది. అదేవిధముగా బుతపానము జీవమాత్రనిష్ఠమైనను అవస్థితిసంబంధముచేత జీవాత్మపరమాత్మలిద్దఱియందును 'పిబంతౌ' అని ద్వివచన మిట ప్రయుక్తమయినదని యెఱుంగునది.

పరార్థమనఁగా—పరస్య బ్రహ్మణః స్థానం పరార్ధం. తస్మిన్ హి పరం బ్రహ్మోపలభ్యతే. అత స్తస్మిన్ పరమే పరార్ధే హార్దాకాశే'యనిభాష్యమునందు వ్యాఖ్యాతమగుటచేత హార్దాకాశము పరార్థశబ్దమునకు వాచ్యమని గ్రహించవలయును. "పరార్ధ్యమ్" అని మూలమునందు పాఠభేదముగలదు.

పంచాగ్నులనఁగా, గార్హపత్య, ఆహవనీయ, దక్షిణాగ్ని, సభ్య, ఆవసథ్యములను ఐదు అగ్నులను వేల్చుచుండువారు. గార్హపత్య, ఆహవనీయ, దక్షిణాగ్నులు త్రేతాగ్నులనంబడును. అగ్నిపంచకము నారాధించువారు పంచాగ్నులనంబడుదురు. అగ్నిత్రయము నారాధించువారు త్రేతాగ్నులనంబడుదురు. వేదమునం దీపక్షద్వయము ప్రతిపాదింపఁబడియున్నది. ఇప్పటివారలు అగ్నిత్రయమును మాత్రమే ఉపాసించుచున్నను, రెండుపక్షములున్నూ శ్రుతిప్రతిపాదితములగుటచేత శ్రుతిప్రతిపాదితమగు పంచాగ్నిపక్షము ననుసరించు వారిని ఇట శ్రుతియుదహరించుచున్నదని ఎఱుంగవలయును.

౧-వ అధ్యా. 3-వ వల్లి, ౨-వ మంత్రము.

మూ. యస్సేతురీజానానా మక్షరం బ్రహ్మ యత్పరం,
అభయం తితీర్షతాం పారం నాచికేతగ్ం శకేమహి. ౨

పద. యః సేతుః ఈజానానాం అక్షరం బ్రహ్మ యత్ పరం, అభయం తితీర్షతాం పారం నాచికేతం శకేమహి.

టీక. యః=ఏనాచికేతాగ్ని, ఈజానానాం=కర్మఠులలయినయజమానులకు, సేతుః = సేతువవలెనుండెనో (అట్టి) నాచికేతం = నాచికేతాగ్నిని, (వయం) శకేమహి = మేము తెలిసికొనుటకున్నూ, చయన మొనర్చుటకున్నూ శక్తిగలవారమైతిమి. అభయం=భయములేనటుల, పారం=సంసారముయొక్క పారమును, తితీర్షతాం=దాటుటకు అభిలషించునట్టిబ్రహ్మవేత్తలకు, (ఆశ్రయభూతమయిన) యత్=ఏ, అక్షరం పరం బ్రహ్మ =,అక్షరమగుపరబ్రహ్మముగలదో (దానిని తెలిసికొనుటకు) శకేమహి=శక్తిగలవారలమైతిమి.

తా. ఏనాచికేతాగ్ని కర్మఠులగు యజమానులకు దుఃఖసంతరణార్థము సేతువుగా నున్నదో, అట్టినాచికేతాగ్నిని తెలిసికొనుటకున్నూ చయన మొనర్చుటకున్నూ మేము సమర్థులమైతిమి. భయములేనటుల సంసారసముద్రముయొక్కపారమును తరింపనిచ్ఛగల బ్రహ్మవేత్తలకు మిక్కిలి ఆశ్రయభూత

మగు నేయక్షరమగు పరబ్రహ్మముగలదో దానిని తెలిసికొనఁగలిగితిమి. కర్మఠులగు బ్రహ్మవేత్తలకు ఆశ్రయభూతములగు పరాపరబ్రహ్మలను రెంటినిన్నీ తెలిసికొనవలయును. 'ఋతంపిబంతౌ' అనువెనుకటిమంత్రమునందు యీపరాపరబ్రహ్మలవిషయమై బోధింపఁబడినది.

వివరణము:—కర్మఠులకు ఆశ్రయము అపరబ్రహ్మమనియు, బ్రహ్మవేత్తలకు ఆశ్రయము పరబ్రహ్మమనియు నెఱుంగవలయును.

౧-వ అధ్యా. 3-వ వల్లి, 3-వ మంత్రము.

మూ. ఆత్మానగ్ం రథినం విద్ధి శరీరగ్ం రథ మేవ తు,
బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహ మేవచ 3

పద. ఆత్మానం రథినం విద్ధి శరీరం రథం ఏవ తు, బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహం ఏవ చ. 3

టీక ఆత్మానం = (శరీరాధిష్ఠితుఁడును, సంసారియునగు) ఆత్మ, రథినం=రథమును అధిష్ఠించియున్నవానినిగ, విద్ధి = తెలిసికొనుము, శరీరం = శరీరమును, రథం ఏవతు=రథమునుగా, (విద్ధి=తెలిసికొనుము), బుద్ధింతు = (అధ్యవసాయలక్షణమగు) బుద్ధిని, సారథిం = సారథినిగా, విద్ధి=తెలిసికొనుము, మనః=మనస్సును. ప్రగ్రహంఏవచ=పగ్గమునుగా ఎఱుంగుము.

తా. వారిలో - అనఁగా అజీవాత్మపరమాత్మలలో ఉపాధికృతుఁడగు సంసారి - జీవుఁడు విద్యావిద్యలకు అధికృతుఁడగుచున్నాఁడు. అట్టిఅధికారియగుజీవునకు మోక్షగమనమునకును సంసారగమనమునకును (ప్రయత్నానుసారము ఉపయోగపడునట్టి) రథము కల్పింపఁబడుచున్నది. ఆరథమునకు ఋతుపుఁడును, సంసారియు, శరీరాధిష్ఠితుఁడును అగుజీవాత్ముని (రథతాదాత్మ్యాభిమానిని) రథస్వామినిగా నెఱుంగుము. రథమునకు కట్టిన అశ్వస్థానీయములగు ఇంద్రియములచేత దేహము నలువైపుల ఆకర్షింపఁబడుచున్నది కావున శరీరమును రథమునుగా నెఱుంగుము. శరీరము బుద్ధినేతృప్రధానమగుటచేత

అధ్యవసాయలక్షణమగుబుద్ధిని (శరీరమనురథమునకు) సారథినిగా తలంపుము. రథము ఎటులసారథి నేతృప్రధానమో (అట్లేశరీరరథముకూడ బుద్ధినేతృప్రధానము) తెలియుచుఁగదేహసంబంధమగు కార్యజాతమంతయుం బుద్ధిచేతనే ఆచరింపఁబడుచుండుట లోకప్రసిద్ధమేగదా. సంకల్పవికల్పాదిలక్షణమగు మనస్సును పగ్గమునుగా నెఱుంగుము. పగ్గములయొక్క ఆకర్షణవికర్షణముల ననుసరించి గుఱ్ఱములెట్లు నడుచుచున్నవో అట్లే శ్రోత్రాదీంద్రియములుకూడా మనస్సుచేత ప్రగృహీతములయి తత్తత్కార్యములందు ప్రవర్తించుచున్నవనువిషయము సుప్రసిద్ధముగదా.

౧-వ అధ్యా. 3-వ వల్లి, ४-వ మంత్రము.

మూ. ఇంద్రియాణి హయానాహుర్విషయాన్ స్తేషు గోచరాన్,
ఆత్మేంద్రియమనోయుక్తం భోక్తేత్యాహుర్మనీషిణః. ४

పద. ఇంద్రియాణి హయాన్ ఆహుః విషయాన్ తేషు గోచరాన్, ఆత్మేంద్రియమనోయుక్తం భోక్తా ఇతి ఆహుః మనీషిణః. ४

టీక. మనీషిణః=వివేకశీలురగుజ్ఞానులు, ఇంద్రియాణి=చక్షురాదీంద్రియములను, హయాన్=గుఱ్ఱములనుగా, ఆహుః = పలుకుదురు, తేషు=ఆనేత్రాదీంద్రియము లందుఁగల, విషయాన్=రూపాదివిషయములను, గోచరాన్ = మార్గములనుగా, ఆహుః = (జ్ఞానులు) పలుకుచున్నారు. ఆత్మేంద్రియమనోయుక్తం=శరీరేంద్రియ మనస్సులతోఁగూడుకొనియున్న ఆత్మను, భోక్తాఇతి= భోక్తయని. ఆహుః=(జ్ఞానులు) చెప్పుదురు.

తా. రథకల్పనమునందు నేర్పరులగువిద్వాంసులు శరీరమను రథమును నలువైపులకు ఆకర్షించుటకు సామర్థ్యముగలవియగుటచేత నేత్రాదీంద్రియములను గుఱ్ఱములని చెప్పుచున్నారు. గుఱ్ఱములనుగా భావించిన ఇంద్రియములందుఁగల రూపాదివిషయములను మార్గములనుగా చెప్పుదురు. శరీరేంద్రియమనస్సహితుఁడగు జీవాత్మను భోక్తయని—సంసారియని వివేకులు పలుకుదురు.

ఆత్మకు భోక్తృత్వమనునది బుద్ధ్యుపాధికృతమేగాని కేవలాత్మకు—అనఁగా బుద్ధ్యుపాధిరహితాత్మకు భోక్తృత్వమే లేదు. 'ధ్యాయతీవ, లేలాయతీవ,' యను బృహదారణ్యకశ్రుతి బుద్ధ్యుపాధిరహితాత్మకు భోక్తృత్వము లేదని నిరూపించుచున్నది. ఇట్లయినప్పుడే—అనఁగా జీవాత్మకు భోక్తృత్వము ఉపాధికృతమయినప్పుడే చెప్పఁబడుచున్న రథకల్పనము ననుసరించి మోక్ష ప్రాప్తి పొందుటకు శక్యమగుచు కాని లేనియెడల—అనఁగా సంసారిత్వ—భోక్తృత్వములే జీవునకు స్వాభావికము లయినయెడల పారమార్థికమగు స్వభావము అనతిక్రమణీయము కావున మోక్షప్రాప్తియే లేకపోవును.

౧-వ అధ్యా. ౩-వ వల్లి, ౫-వ మంత్రము.

మూ. యస్త్వవిజ్ఞానవాన్ భవత్యయుక్తేన మనసా సదా,
తస్యేన్ద్రియాణ్యవశ్యాని దుష్టాశ్వా ఇవ సారథేః. ౫

పద. యః తు అవిజ్ఞానవాన్ భవతి అయుక్తేన మనసా సదా, తస్య ఇన్ద్రియాణి అవశ్యాని దుష్టాశ్వాః ఇవ సారథేః. ౫

టీక. యఃతు=బుద్ధియనెడి ఏసారథి, సదా = ఎల్లప్పుడు, అయుక్తేన= అసమాహితము యిన, మనసా=మనస్సుచేత, అవిజ్ఞానవాన్ భవతి=వివేకహీనుఁడు అగుచున్నాఁడో, తస్య=అట్టిఅవివేకికి, ఇంద్రియాణి = ఇంద్రియములు, సారథేః=(నేర్పరిగాని) సారథికి, దుష్టాశ్వాఃఇవ = దుష్టములయిన గుఱ్ఱములవలె, అవశ్యాని=స్వాధీనములుకానివి (భవంతి=అగుచున్నవి.)

తా. ఇట్లగుటచేత—(అనఁగా ఆత్మకు సంసారిత్వము అస్వాభావిక మగుటచేత ననిభావము) బుద్ధియనెడి సారథి ప్రవృత్తియందుగాని నివృత్తి యందుగాని చక్కనివివేకము లేనివాఁడగునెడల రథమును నడిపించుటయందు నేర్పరితనములేనట్టియు సమాహితచిత్తుఁడు కానట్టియు సారథికి దుష్టాశ్వము లెటుల స్వాధీనములుకావో అదేవిధముగా ఇంద్రియాశ్వములనుకూడ అసమాహితబుద్ధిగలవాఁడు కుమార్గమునుండి మఱలింపఁజాలఁడు.

౧-వ అధ్యా. 3-వ వల్లి, ౬-వ మంత్రము.

మూ. యస్తు విజ్ఞానవాన్ భవతి యుక్తేన మనసా సదా,
తస్యేన్ద్రియాణి వశ్యాని సదశ్వా ఇవ సారథేః. ౬

పద. యః తు విజ్ఞానవాన్ భవతి యుక్తేన మనసా సదా, తస్య ఇన్ద్రియాణి వశ్యాని సదశ్వాః ఇవ సారథేః. ౬

టీక. యః తు = ఏబుద్ధియనెడి సారథి, యుక్తేన = సమాహితమయిన, మనసా=మనస్సుచేత, సదా=ఎల్లప్పుడు, విజ్ఞానవాన్ భవతి = నేర్పరియగుచున్నాఁడో, తస్య=అట్టివానికి, ఇంద్రియాణి=ఇంద్రియములు, సారథేః=(నేర్పరియగు) సారథికి, సదశ్వాః ఇవ=మంచిగుఱ్ఱములవలె, వశ్యాని=స్వాధీనములయినవి. (భవంతి=అగుచున్నవి.)

తా. ఏబుద్ధియనుసారథి వెనుకటివలె వివేకవిహీనుఁడు కాక వివేకియై సర్వదా సమాహితచిత్తుఁడైయుండునో అట్టివానికి అశ్వస్థానీయములగు ఇంద్రియములుకూడ బుద్ధ్యనుసారము ఆయావిషయములందు ప్రవర్తించుటకున్ను నివర్తించుటకున్ను, నేర్పరియగుసారథికి మంచిగుఱ్ఱములువలె అణఁగియుండును.

౧-వ అధ్యా. 3-వ వల్లి, ౭-వ మంత్రము.

అవ. వివేకవిహీనుఁడగు బుద్ధి సారథిగాఁగలవాఁడు పొందెడిఫలము చెప్పఁబడుచున్నది:—

మూ. యస్త్వవిజ్ఞానవాన్ భవత్యమనస్కస్సదా ఽశుచిః,
న స తత్పదమాప్నోతి సంసారం చాధిగచ్ఛతి ౭

పద. యః తు అవిజ్ఞానవాన్ భవతి అమనస్కః సదా అశుచిః, న సః తత్ పదం ఆప్నోతి సంసారం చ అధిగచ్ఛతి.

టీక. యః తు=ఎవ్వఁడయితే, అవిజ్ఞానవాన్ భవతి=వివేక విహీనుఁడు అగుచున్నాఁడో, అమనస్కః = వశపఱుచుకొనని చిత్తముగలవాఁడుగను,

సదా=ఎల్లప్పుడు, అశుచిః=అపవిత్రుఁడుగ నుండునో, సః = అట్టిసారథి, తత్ పదం = అక్షరమగు ఆ మోక్షమనుస్థానమును, న ఆప్నోతి = పొందఁజాలఁడు, సంసారంచ=జననమరణాది లక్షణమగుసంసారమునుకూడ, అధిగచ్ఛతి=పొందు చున్నాఁడు.

తా. ఎవ్వఁడు వివేకవిహీనుఁ డగుచున్నాఁడో అమనస్కుఁడో—ఇంద్రియచాంచల్యమును జయించలేడో కావుననే సర్వదా అపవిత్రుఁడయి యుండునో, అట్టిరథియగువాఁడు అట్టిసారథిసహాయముతో—అనఁగా వివేక విరహితమయినబుద్ధితో కైవల్యమును—మోక్షమును పొందఁడు సరిగదా జన్మ మరణలక్షణమగు సంసారమునకు కూడ పాల్పడును.

వివరణము. అవివేకియగువానికి మనోనిగ్రహములేనియెడల ఇంద్రియ చాపల్యమునకు లోఁబడును. ఇంద్రియచాపల్యమువలన పాపకృత్యముల నాచ రించును. సర్వదా పాపకృత్యచింతనమువలన దూషితాంతఃకరణుఁడు అశుచి యయి జన్మమరణముల నందుచుండుట సుప్రసిద్ధముగదా.

౧-వ అధ్యా. ౩-వ వల్లి, ౮-వ మంత్రము.

మూ. యస్తు విజ్ఞానవా న్భవతి సమనస్కస్సదా శుచిః,
స తు తత్పదమాప్నోతి యస్మా ద్భూయో న జాయతే.

పద. యః తు విజ్ఞానవాన్ భవతి సమనస్కః సదా శుచిః, స తు తత్ పదం ఆప్నోతి యస్మాత్ భూయః న జాయతే. ౮

టీక. యఃతు=ఎవ్వఁడయితే, విజ్ఞానవాన్ = జ్ఞానముగలవాఁడున్నూ, సమనస్కః=యుక్తమయిన మనస్సుగలవాఁడున్నూ, సదా=ఎల్లప్పుడు, శుచిః= పవిత్రుఁడును అగుచున్నాఁడో, సః తు = అట్టివాఁడు, యస్మాత్ =పొందఁబడిన యేస్థానమునుండి, భూయః=మరల, నజాయతే=పుట్టఁజాలఁడో, తత్ పదం=ఆ స్థానమును, ఆప్నోతి=పొందుచున్నాఁడు.

తా. ఎవ్వఁడువిజ్ఞానవంతుఁడో (విజ్ఞానమనఁగా ఇగిచేయఁదగినపని ఇది చేయరానిపని యనిఎఱుంగుట) జ్ఞానముగలసారథితోడఁ గూడియుండునో అట్టిరథికుఁడు అనఁగా విద్వాంసుఁడు మనోనిగ్రహముగలవాఁడు కావుననే సర్వదా శుచియైనా వాఁడు ఏయాత్మపదమును పొందుటవలన మఱల అచటి నుంచి ప్రచ్యుతిలేనివాఁడయి జననమరణరూపసంసారమునందు పుట్టఁజాలఁడో అట్టి మోక్షరూపమయిన స్థానమును పొందును.

౧-వ అధ్యా. ౩-వ వల్లి, ౯-వ మంత్రము.

అవ. ఆపదమేమియో తెలుపఁబడుచున్నది.

మూ. విజ్ఞానసారథి ర్యస్తు మనః ప్రగ్రహవా న్నరః,
సో ఽధ్వనః పార మాప్నోతి తద్విష్ణోః పరమం పదమ్.౯

పద. విజ్ఞానసారథిః యః తు మనః ప్రగ్రహవాన్ నరః, సః అధ్వనః పారం ఆప్నోతి తత్ విష్ణోః పరమం పదమ్. ౯

టీక. యః నరః తు=ఏమనుష్యుఁడయితే, విజ్ఞానసారథిః = వివేకయుక్తమయినబుద్ధియే సారథిగాఁగలవాఁడో, మనః ప్రగ్రహవాన్=మనస్సను పగ్గము గలవాఁడో, అనఁగా స్వాధీనమయిన మనస్సుగలవాఁడో, సః = అట్టిమనుష్యుఁడు, అధ్వనః=మార్గముయొక్క, పారం = పారమును, ఆప్నోతి=పొందుచున్నాఁడు, తత్=అదియే, విష్ణోః = వ్యాపనశీలుఁడగు పరమాత్మయొక్క, పరమం పదం=శ్రేష్ఠమయిన స్థానము.

తా. ఎవ్వఁడు విజ్ఞానసారథియో—అనఁగా వివేకసమన్వితమగుబుద్ధియే సారథిగాఁగలవాఁడో, ఎవ్వఁడు మనస్సును స్వాధీనపఱుచుకొని సమాహితచిత్తుఁడయియుండునో అట్టివిద్వాంసుఁడు సంసారసాగరముయొక్క అవతలి ఒడ్డును-అనఁగా పొందఁదగినట్టి పరబ్రహ్మమును పొందుచున్నాఁడు. సర్వవిధ సంసారబంధములనుండి విముక్తుఁడగుచున్నాఁడు. ఇదియే వ్యాపనశీలుఁడును

వాసుదేవాఖ్యుఁడును అగుపరమాత్మయొక్క శ్రేష్ఠమైనస్థానము అనఁగా స్వరూపము. ఇట్టి ఆత్మస్వరూపమును విద్వాంసుడగువాఁడు పొందుచున్నాఁడు.

వివరణము:—వశీకృతేంద్రియుఁడయి శాస్త్రీయ పదార్థ పరిజ్ఞానమై ఆత్మయందు స్థిరీభూతచిత్తుఁడయి ధ్యానమొనర్చుటవలన నశించినప్రతిబంధకములుకలిగిన శుచి యగు విద్వాంసుఁడే సంసారమార్గాంతర్వ్యాఖ్యానములగు దేవయాన, పితృయాన రూపములగు మార్గములకు అవతలిగట్టువంటి దగు స్థానమును— మోక్షమును పొందుచున్నాఁడు.

మూలమునందుగల విష్ణుశబ్దమునకు వ్యాపకుఁడనియర్థము. భాష్యమునందు వాసుదేవపదము పరమాత్మవాచకముగా ప్రయుక్తము:—

వాసుదేవః=వాసయతి భూతాని స్వస్మిన్ ఇతి వాసుః దీవ్యతిఇతి దేవః స్వప్రకాశః వాసుశ్చాసౌ దేవశ్చ. వాసుదేవః.

అర్థ. సకలప్రాణులను తనయందు నివాసముగలవారినిగా నొనర్చువాఁడు వాసుఁడు. స్వయంప్రకాశమానుఁడు దేవుఁడు. వాసువయిన దేవుఁడు వాసుదేవుఁడు.

ఆత్మస్వరూపమును పొందుటయనునది ఔపచారికము. పరావరబ్రహ్మలిట్టివని తెలిసికొనుటకు వీలుకానట్టి అజ్ఞానావరణము తొలగిపోవుటయే ఇచట ఆత్మప్రాప్తియని యెఱుంగవలయును.

౧-వ అధ్యా. 3-వ వల్లి, ౧౦-వ మంత్రము.

అవ. ఏపరమాత్మతత్త్వము పొందఁదగినదో అట్టిదానిని తెలిసికొనుటకు స్థూలములయిన ఇంద్రియములు మొదలుకొని సూక్ష్మతారతమ్యానుసారముగా ప్రత్యగాత్మగా గ్రహింపవలయునని యీమంత్రము తెలుపఁబడుచున్నది:—

మూ. ఇన్ద్రియేభ్యః పరాహ్యర్థా అర్థేభ్యశ్చపరం మనః,
మనసశ్చ పరా బుద్ధి ర్బుద్ధేరాత్మా మహాన్పరః ౧౦

పద. ఇన్ద్రియేభ్యః పరాః హి అర్థాః అర్థేభ్యః చ పరం మనః, మనసః చ పరాబుద్ధిః బుద్ధేః ఆత్మా మహాన్ పరః.

టీక. అర్థాః = శబ్దాదివిషయములు, ఇంద్రియేభ్యః = ఇంద్రియముల కంటె, పరాః=సూక్ష్మములయినవి, మనః=మనస్సు, అర్థేభ్యఃచ=శబ్దాది విషయములకంటెను, పరం=సూక్ష్మతరమయినది. మనసఃచ=సంకల్ప వికల్ప లక్షణమగు మనస్సుకంటె, బుద్ధిః=అధ్యవసాయాత్మకమగుబుద్ధి, పరా=సూక్ష్మతరమయినది. బుద్ధేః=అధ్యవసాయాత్మక మగుబుద్ధికంటె, మహాన్ ఆత్మా=సర్వమహత్త్వ మగు హిరణ్యగర్భాఖ్యతత్త్వము, పరః=సూక్ష్మతరమయినది.

తా. ఇంద్రియములను ప్రథమమున స్థూలములనుగా గ్రహింపనది. ఈయింద్రియములకు కారణభూతములగు శబ్దాదివిషయములు స్వకార్యము లగు ఇంద్రియములకంటె సూక్ష్మములును ప్రత్యగాత్మభూతములును అగుచున్నవి. ఆశబ్దాదివిషయములకంటె ప్రత్యగాత్మభూతమగు మనస్సు మహత్తైనది. మనస్సనఁగా ఇచట మనస్సునకు ఆరంభకమగుభూతసూక్ష్మమని యెఱుంగవలయును. సంకల్పవికల్పాద్యారంభకమగు మనస్సుకంటె బుద్ధి సూక్ష్మతరము, మహత్తరము ప్రత్యగాత్మభూతమని యెఱుంగవలయును. బుద్ధియనఁగా అధ్యవసాయాద్యారంభకమగు భూతసూక్ష్మము. అట్టిబుద్ధికంటె ఆత్మ సర్వప్రాణిబుద్ధులకు ప్రత్యగాత్మభూత మగుటచేత మహత్తరము. సర్వమహత్త్వమును ప్రథమజాతమును హిరణ్యగర్భనామకమును బోధాబోధాత్మకమును అగుఆత్మ బుద్ధికంటె పరతత్త్వమని గ్రహింపవలయును.

౧-వ అధ్యా. 3-వ వల్లి, ౧౧-వ మంత్రము.

మూ. మహతః పరమవ్యక్తమవ్యక్తాత్పురుషః పరః,
పురుషాన్న పరం కించిత్సా కాష్ఠా సా పరా గతిః ౧౧

పద. మహతః పరం అవ్యక్తం అవ్యక్తాత్ పురుషఃపరః, పురుషాత్ న పరం కించిత్ సా కాష్ఠా సా పరా గతిః.

టీక. మహతః=మహత్తత్త్వముకంటె, అవ్యక్తం = అవ్యక్తము, పరం= మహత్తరమైనది, అవ్యక్తాత్ = ఆయవ్యక్తముకంటె, పురుషః = పురుషుఁడు, పరః=మహత్తరుఁడు, పురుషాత్ =పురుషునికంటె, పరం = మహత్తరమయినది, కించిత్ న=కొంచెమైనను లేదు. సా = అదియే, కాష్ఠా = అంతమైనది. (సా= అదియే,) పరా గతిః=శ్రేష్ఠమయినగతి.

తా. పూర్వమం ప్రోక్తమగు మహత్తత్త్వముకంటె అవ్యక్తము సర్వ మహత్తరమగు ప్రత్యగాత్మభూతము. ఈయవ్యక్తము సర్వజగత్తునకు బీజ భూతము. అవ్యాకృత నామరూపములే స్వరూపముగాఁగలది సర్వకార్య కారణశక్తి సమాహారరూపమయినది. అవ్యక్త, అవ్యాకృత, ఆకాశాది నామ వాచ్యము. వటబీజమునందు వటవృక్షశక్తివలె పరమాత్మయందు ఓతప్రోత భావముచేత ఆశ్రయించి యుండునది. అట్టి అవ్యక్తముకంటె పురుషుఁడు సర్వకారణుఁడగుటచేత పరుఁడును, సూక్ష్మతరుఁడును ప్రత్యగాత్మయును నగుచు న్నాఁడు. సర్వపరిపూరకుఁడగుటచేత పురుషుఁడని చెప్పఁబడుచున్నాఁడు. అతని కంటె వేఱయిన పరుఁడయినవాఁడు లేఁడని నివారించుచున్నాఁడు:—చిన్మాత్ర ఘనుఁడగు అట్టి పురుషునికంటె పరమయిన వస్త్వంతరమే లేదు. కావున సూక్ష్మత్వ, మహత్త్వ, ప్రత్యగాత్మత్వ భూతములయిన వానిలో అదియే పరా కాష్ఠ అనఁగా పర్యవసానభూతమయినది. ఇచట ఇంద్రియములను ప్రారంభించి పురుషపర్యంతము సూక్ష్మత్వను పరిసమాప్తి చేయఁబడినది. కావుననే సర్వవిధ మయినగతిగలసంసారులకు ఈపురుషుఁడే పరాగతి—అనఁగా శ్రేష్ఠమయిన గతి. "యద్గత్వా ననివర్తంతే తద్ధామ పరమం మమ" అను స్మృతివాక్య మీ విషయమునే బోధించుచున్నది.

౧-వ అధ్యా. ౩-వ వల్లి, ౧౨-వ మంత్రము.

మూ. ఏష సర్వేషు భూతేషు గూఢోఽఽత్మాన ప్రకాశతే,
దృశ్యతేత్వగ్ర్యయా బుద్ధ్యాసూక్ష్మయా సూక్ష్మదర్శిభిః.

౧౨. ఏషః సర్వేషు భూతేషు గూఢః ఆత్మా న ప్రకాశతే, దృశ్యతే తు అగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః.

టీః. ఏషః=ఈ, పురుషుఁడు, సర్వేషు భూతేషు = సకలప్రాణులందు, గూఢః=గూఢముగా నున్నవాఁడై, ఆత్మా = ఆత్మగా, న ప్రకాశతే = ప్రకాశించుట లేదు. (ఏషః=ఈపురుషుఁడు) అగ్ర్యయా=ఏకాగ్రత్వము కలిగినటు వంటిన్ని, సూక్ష్మయా = ('ఇంద్రియేభ్యః పరా హ్యర్థాః' అనుమంత్రాను సారము ఇంద్రియాదికముకంటె క్రమముగ) సూక్ష్మమయినవస్తు నిరూపణ పరమయిన, బుద్ధ్యా = బుద్ధితో, సూక్ష్మదర్శిభిః = సూక్ష్మమయిన ఆత్మవస్తువును చూచుటయందు సమర్థులగు పండితులచేతనే, దృశ్యతేతు = చూడఁబడు చున్నాఁడు.

తా. పూర్వ:—వెనుకటిమంత్రములందు "సా కాష్ఠా సా పరాగతిః" 'స తు తత్పదమాప్నోతి' మున్నగునవి చెప్పఁబడియున్నవి. ఎచ్చట గతి యనునదిసంభవించుచున్నదో అచ్చట తప్పక 'ఆగతి' కూడ ఉండితీరవలయును. ఇట్లుండఁగా ("యస్మాద్భూయో న జాయతే. కఠ. ౧-౩-౮) అనిచెప్పుట అసంగతముగదా.

సమా:—పురుషుఁడు—పరమాత్మ సర్వమునకు ప్రత్యగాత్మభూతుఁ డగుటచేత సర్వప్రత్యగాత్మగా అవగతి—అనఁగా ఎఱుఁగుటయే ఇచటగతి యని ఉపచారముగా చెప్పఁబడినది. "ఇంద్రియేభ్యః పరాహ్యర్థాః. కఠ. ౧-౩-౧౦. అనుమంత్రమునందు ఇంద్రియమనోబుద్ధులకుపరుని గా—ప్రత్యగాత్మగా పురుషుని చెప్పియున్నారు. 'అనధ్వగాః అధ్వనుపారయిష్ణవః, మున్నగు శ్రుతు లీయర్థమునే ప్రకటించుచున్నవి. సర్వమునకు నీపురుషుఁడే ప్రత్యగాత్మభూతుఁడనువిషయము తెలుపఁబడుచున్నది. బ్రహ్మాది స్తంబపర్యంతములగు సకలప్రాణులందు గూఢముగా నున్నవాఁడై దర్శనశ్రవణాదికర్మగలవాఁడై అవిద్యామాయాచ్ఛన్నుఁడయి ఆత్మగా నెవ్వనికి ప్రకాశించుటలేదు. మాయా

వైచిత్ర్యము అతిగంభీరమై తెలిసికొనుటకు అశక్యమయి విచిత్రముగానున్నది గదా. ఏమియాశ్చర్యము. లోకమునందుఁగల ప్రాణిజాతమంతయుఁ వాస్తవముఁనకు పరమార్థస్వరూపమైనను "అహం పరమాత్మా = నేనేపరమాత్మస్వరూపుఁడను" అని బోధింపఁబడుచున్నప్పటికిన్ని ఆత్మను గ్రహించుటలేదు. ఘటాదికమువలె గనంబడుచున్న దేహేంద్రియాదిసంఘాతమును ఆత్మగా గ్రహించుచు చెప్పకపోయినప్పటికిన్ని 'నేను యజ్ఞదత్తుని పౌత్రుఁడను, దేవదత్తుని పుత్త్రుఁడను' అని గ్రహించుచున్నది. +నిజముగా ఆపరాత్పరుని మాయచేతనే మోహితమయి ప్రాణిజాతమంతయుఁ నిటులపరిభ్రమణమొనర్చుచున్నది. ఈ విషయము నే

స్మృతి:—నాహం ప్రకాశస్సర్వస్య యోగమాయాసమావృతః

(అర్థ. యోగమాయచేత కప్పివేయఁబడిన నేనందఱకుఁ గనంబడుట లేదు.)

అని స్మృతి ప్రకటించుచున్నది.

పూర్వ:—మీరుచెప్పుచున్నది పరస్పర విరుద్ధముగనున్నది.

'మహాంతం విభుమాత్మానం మత్వా ధీరో న శోచతి. (కఠ ౧ ౨-౨౨)

అని యొకచోట

ఏష సర్వేషు భూతేషు గూఢోత్మా న ప్రకాశతే.|(కఠ.౧-౩-౧౨)

అని మఱొకచోట చెప్పుట ఉచితముగా లేదు.

సమా:—ఈవిషయము మీరుతలఁచినట్లు పరస్పరవిరుద్ధముగలది కాదు. అసంస్కృతచిత్తునకు అవిజ్ఞేయమగుటచేత 'న ప్రకాశతే' యని చెప్పఁబడినది, సంస్కృతమైనట్టియుఁ, ఏకాగ్రతకలిగినట్టియుఁ, సూక్ష్మవస్తునిరూపణపరమయినట్టియుఁ బుద్ధిచేత "ఇంద్రియేభ్యః పరా హ్యర్థాః" అనుక్రమము ననుసరించి పరమయినట్టియును సూక్ష్మమయినట్టియుఁ బ్రహ్మము నెఱుంగుటయే ఎవ్వరుస్వభావముగాఁ గలిగియున్నారో అట్టిసూక్ష్మదర్శులగువారిచేత చూచుటకు శక్యమగుటచేత 'ధీరో న శోచతి' అని చెప్పఁబడియున్నది.

౧-వ అధ్యా. ౩-వ వల్లి, ౧౩-వ మంత్రము.

అవ. ఆత్మప్రాప్త్యుపాయము చెప్పఁబడుచున్నది:—

మూ. యచ్ఛేద్వాఙ్మనసి ప్రాజ్ఞస్తద్యచ్ఛేత్ జ్ఞాన ఆత్మని,
జ్ఞానమాత్మని మహతి నియచ్ఛేత్తద్యచ్ఛేచ్ఛాన్త ఆత్మని.

పద. యచ్ఛేత్ వాక్ మనసి ప్రాజ్ఞః తత్ యచ్ఛేత్ జ్ఞానే ఆత్మని జ్ఞానం ఆత్మని మహతి నియచ్ఛేత్ తత్ యచ్ఛేత్ శాన్తే ఆత్మని.

టీక. ప్రాజ్ఞః = పండితుఁడు, వాక్ = వాగాదిసకలేంద్రియ వ్యాపారమును, మనసి=మనస్సునందు, యచ్ఛేత్=ఉపసంహారము చేయవలయును. తత్ =ఆమనస్సును, జ్ఞానే = ప్రకాశస్వరూపమగు, ఆత్మని = బుద్ధ్యాత్మయందు, యచ్ఛేత్=నియమింపవలయును. జ్ఞానం = ప్రకాశస్వరూపమగుబుద్ధిని, మహతి ఆత్మని = మహదాత్మకుఁడగు ఆత్మయందు-ప్రథమజుఁడగు హిరణ్యగర్భుని యందు, నియచ్ఛేత్ = నియమింపవలయును. తత్ = ఆహిరణ్యగర్భబుద్ధిని, శాంతే=సర్వవికారశూన్యమగు, ఆత్మని=ముఖ్యాత్మయందు-పరబ్రహ్మమునందు, యచ్ఛేత్=నియమింపవలయును.

తా. వివేకియగువాఁడు వాగాదిజ్ఞానకర్మేంద్రియవ్యాపారసహితముగ ఇంద్రియాత్మను సంకల్పవికల్పాత్మకమగు మనస్సునందు ఉపసంహరించ వలయును. మూలమునందుగల 'వాక్' అనుపదమును ఉపలక్షణముగా గ్రహించ వలయును. కావున సవ్యాపారములగు సకలేంద్రియములను గ్రహించవల యును. అట్టిమనస్సును ప్రకాశస్వరూపమగు బుద్ధ్యాత్మయందు ఉపసంహరించ వలయును. 'ఆప్నోతీతి ఆత్మా' యను వ్యుత్పత్తి ననుసరించి మనస్సు మున్నగు కరణములను పొందియుండును కావున ఆత్మశబ్ద మిట బుద్ధివాచకము. అట్టి బుద్ధిని మహత్తగుఆత్మయందు అనఁగా ప్రథమజుఁడగు హిరణ్యగర్భునియందు ఉపసంహరించవలయును. అనఁగా హిరణ్యగర్భునియొక్క స్వచ్ఛస్వభావమగు విజ్ఞానమువలె ఆత్మయొక్క విజ్ఞానము నొనర్పవలయునని భావము. అట్టిమహా

ణాత్మక ఆత్మను సర్వవిశేషశూన్యమును వికారరహితమును సర్వాంతరమును సర్వప్రత్యయసాక్షియు నగు ముఖ్యాత్మయందు - పరమాత్మయందు ఉపసంహరింపవలయును.

౧-వ అధ్యా. ౩-వ వల్లి, ౧౪-వ మంత్రము.

మూ. ఉత్తిష్ఠత జాగ్రత
ప్రాప్య వరాన్నిబోధత,
క్షురస్య ధారా నిశితా దురత్యయా
దుర్గం పథ స్తత్కవయో వదన్తి. ౧౪

పద. ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్య వరాన్ నిబోధత, క్షురస్య ధారా నిశితా దురత్యయా దుర్గం పథః తత్ కవయః వదన్తి.

టీక. (ఆదిలేని అవిద్యయందు నిద్రించుచున్న ఓప్రాణులారా! మీరు) ఉత్తిష్ఠత = లెండు, జాగ్రత = (అజ్ఞాననిద్రనుండి) మేల్కొనుఁడు, వరాన్ = శ్రేష్ఠులగుగురువులను, ప్రాప్య = పొంది, నిబోధత = తెలిసికొనుఁడు. యథా = ఏ ప్రకారము, క్షురస్య = కత్తియొక్క, నిశితా = పదునుగల, ధారా = ధార, దురత్యయా = (పాదములచేత) పొందుటకు శక్యముకానిదో, తథా = అదేవిధముగా, తత్ పథః = ఆయాత్మతత్త్వస్వరూపభూతమగుమార్గము, దుర్గం = దుర్గముగా - దుఃఖముచేత పొందఁదగినదిగా, కవయః = విద్వాంసులు, వదంతి = పలుకుచున్నారు.

తా. వెనుకటి మంత్రమునందు ఇంద్రియములను మనస్సునందు, మనస్సును బుద్ధియందు, బుద్ధిని మహత్తత్త్వమునందు, మహదాత్మను నిర్గుణాత్మయందు ప్రవిలాపము చేయవలసిన క్రమ ముపదేశింపఁబడియున్నది. మరీచ్యుదక, రజ్జుసర్ప, ఆకాశమలినములు, మరీచి, రజ్జు, ఆకాశస్వరూప పరిజ్ఞానముచేత ఎటుల నశించుచున్నవో అట్లే క్రియాకారక ఫలలక్షణమును, నామరూపకర్మాశ్రయమును, మిథ్యాజ్ఞాన విజృంభితమును అగు సర్వప్రపంచమును స్వాత్మ

యథార్థజ్ఞానముచేత పురుషశబ్దవాచ్యుఁడగు ఆత్మయందు లయింపఁజేసిన వాఁడు స్వస్థుఁడును, ప్రశాంతాత్ముఁడును కృతకృత్యుఁడును అగుచున్నాఁడు. కావున అట్టియథార్థాత్మ సందర్శనార్థము అనాద్యవిద్యయందు నిద్రించుచున్న ఓ ప్రాణులారా! మీరు మేల్కొనుఁడు—అనఁగా ఆత్మజ్ఞానాభిముఖులుకండు. మేల్కొనుఁడు. అనఁగా సర్వానర్థములకు బీజభూతమును, ఘోరరూపమును అగు అజ్ఞానమనెడి నిద్రనుండి మేల్కొనుఁడు-అజ్ఞాననిద్రను పోఁగొట్టుకొనుఁడు. అజ్ఞాననిద్రను పోఁగొట్టుకొనుటకు మార్గమును చెప్పుచున్నాము:—స్వాత్మానుభవముగల గురువర్యులనాశ్రయించి వారిచేత ఉపదేశింపఁబడిన సర్వాంతరభూతుఁడగు ఆత్మను 'అయమహమస్మి' యని తెలిసికొనుఁడు. ఉపేక్షించి కాలము గడుపుచుండవలదని భగవతియగు శ్రుతి దయగల తల్లివలె యుపదేశించుచున్నది. జ్ఞేయమగువస్తువు—అనఁగా తెలిసికొనవలసిన ఆత్మవస్తువు అతిసూక్ష్మమగు బుద్ధికి మాత్రమే విషయమగునది యగుటచేత ఎటులసూక్ష్మభూతమో దృష్టాంతపురస్సరముగఁ జెప్పఁబడుచున్నది. పదునుగలకత్తియొక్క అంచుయొక్క పైభాగమునందు పాదములతో నడచుటయనఁగా ఎంతకష్టమో అదేవిధముగా తత్త్వజ్ఞానమునకు సంబంధించినమార్గముకూడ అంతకష్టముగా ఉన్నది అని మేధావంతులు పల్కుచున్నారు. అనఁగా తెలిసికొనవలసిన ఆత్మతత్త్వము అతిసూక్ష్మమగునది అగుటచేత ఆ సూక్ష్మతత్త్వము నెఱుంగుటకు యోగ్యమయిన జ్ఞానమార్గమును సంపాదించుటయే చాలకష్టమని యభిప్రాయము.

౧-వ అధ్యా. 3-వ వల్లి, ౧౫-వ మంత్రము.

అవ. అతిసూక్ష్మమగు ఆయాత్మను ఎఱుంగుట యెట్లను విషయము చెప్పఁబడుచున్నది. శబ్దస్పర్శరూపరసగంధాత్మకమును, సర్వేంద్రియ విషయభూతమును అగు నీభూమి స్థూలమయినది. అదేవిధముగ ఈశరీరమున్నూ; జలాగ్ని వాయ్వాకాశములందు గంధాదికములగు ఒక్కొకగుణము తగ్గియుం

డుటచేత సూక్ష్మత్వ మహత్త్వ విశుద్ధత్వ నిత్యత్వాదులందు తారతమ్యము గనంబడుచున్నది. గంధాదిశబ్దాంతములగు స్థూలత్వాది వికారములలో ఒక్కటియైనను ఎచ్చటలేదో అట్టివస్తువు నిరతిశయ సూక్ష్మమయినదని శ్రుతియే చెప్పుచున్నది;—

మూ. అశబ్దమస్పర్శ మరూప మవ్యయం
తథాఽరసం నిత్యమగన్ధవచ్చయత్,
అనాద్యనంతం మహతః పరం ధ్రువం
నిచాయ్య తం మృత్యుముఖా త్ప్రముచ్యతే. ౧౫

పద. అశబ్దం అస్పర్శం అరూపం అవ్యయం తథా అరసం నిత్యం అగన్ధవత్ చ యత్, అనాది అనన్తం మహతః పరం ధ్రువం నిచాయ్య తం మృత్యుముఖాత్ ప్రముచ్యతే. ౧౫

టీక. యత్ =ఏయాత్మతత్త్వము, అశబ్దం = శబ్దరహితమును, అస్పర్శం=స్పర్శరహితమును, అరూపం = రూపరహితమును, అవ్యయం=నాశరహితమును, తథా=అదేవిధముగా, అరసం = రసరహితమును, అగంధవచ్చ = గంధరహితమును, నిత్యం=నిత్యమును, అనాది = ఆదిలేనిదియును, అనంతం=అంతములేనిదియును, మహతః=బుద్ధియను పేరుగలమహత్తత్త్వముకంటె, పరం=విలక్షణమయినదియును (గలదో), తం = అట్టియాత్మతత్త్వమును, ధ్రువం=శాశ్వతమయినదానినిగా, నిచాయ్య=ఎఱింగి, మృత్యుముఖాత్ = అవిద్యాకామకర్మలక్షణమగు మృత్యుముఖమునుండి, ప్రముచ్యతే = వదలఁబడుచున్నాఁడు.

తా. బ్రహ్మము, అశబ్దము, అస్పర్శము, అరూపము, అవ్యయము, అరసము, అగంధము, నిత్యము అగుచున్నది. లోకమునందు శబ్దాదిమత్త్వమయినపదార్థము వ్యయమగుచున్నది. వ్యేతి=క్షీయత ఇతి వ్యయం న వ్యయం అవ్యయం అని శబ్దార్థము. కావుననే అవ్యయ మనఁగా నిత్య మయినదని

భావము. మఱియుం అనాది "అవిద్యమానం ఆదిః కారణం యస్య తదిదం అనాది" యని అనాదిశబ్దార్థమగుటచేత ఎయ్యది ఆదిమత్తో—అనఁగా ఆది గలదో, అది కార్యమగుటచేత అకార్యము దానికి కారణమయినదానియందు లయించిపోవును. పృథివ్యాదికమువలె అని దృష్టాంతము. ఈబ్రహ్మము సర్వమునకు కారణభూతమగుటచేత అకార్యము—అనఁగా ఏదో ఒకకారణము యొక్క కార్యము కాఁజాలదు. అకార్యమగుటచేత నిత్యము, కారణములేనిదగుటచేత కారణభూతమగు దానియందు లయించుటయుం లేదు. ఆదేవిధముగా అనంతము. 'అవిద్యమానః అంతః కార్య మస్య తదనంతం' కార్యభూతమయిన మఱొకవస్త్వంతరములేదు కావున అనంతమని చెప్పఁబడుచున్నది. లోకమునందు కదళ్యాదికమునకు ఫలాది కార్యోత్పాదనమును చూచి, అనిత్యత్వమును మనము తలంచుచున్నాము. అట్టి అంతవత్త్వముకూడా బ్రహ్మమునకు లేదు కావున నిత్యము అని చెప్పఁబడుచున్నది. బ్రహ్మము నిత్యవిజ్ఞప్తిస్వరూపమగుటచేత బుద్ధియనుపేరుగల మహత్తత్త్వముకంటె విలక్షణమయినదియుం సర్వభూతాత్మక మగుటవలన సర్వసాక్షియుం నగుచున్నది. "ఏష సర్వేషు భూతేషు" (కఠ. ౧. ౩. ౧౨) అనుశ్రుతి యీయర్థమునే వివరించుచున్నది గదా. పృథివ్యాదికమువలె ఆపేక్షిక నిత్యముకాక కూటస్థనిత్యమయిన బ్రహ్మమును ఈవిధముగా 'నెఱింగినయెడల' అవిద్యాకామకర్మాదిలక్షణమగు మృత్యుముఖమునుండి వదలఁబడుచున్నాఁడు.

౧-వ అధ్యా. ౩-వ వల్లి, ౧౬-వ మంత్రము.

ఆవ. శ్రుతి ఆత్మవిజ్ఞానమును స్తుతించుచున్నది:—

మూ. నాచికేతముపాఖ్యానం మృత్యుప్రోక్తగ్ం సనాతనమ్,
ఉక్త్వా శ్రుత్వా చ మేధావీ బ్రహ్మలోకే మహీయతే.

పద. నాచికేతం ఉపాఖ్యానం మృత్యుప్రోక్తం సనాతనం, ఉక్త్వా శ్రుత్వా చ మేధావీ బ్రహ్మలోకే మహీయతే.

టీక. నాచికేతం = నచికేతునివలన పొందఁబడినదియు, మృత్యుప్రోక్తం=వైవస్వతునివలన ఉపదేశింపఁబడినట్టియు, సనాతనం = వైదికమగుటచేత చిరంతనమునునగు, ఉపాఖ్యానం=వల్లీత్రయసమన్వితమగు ఈఉపాఖ్యానమును, ఉక్త్వా=బ్రాహ్మణులకు ఉపదేశించి, శ్రుత్వాచ=ఆచార్యునివలన వినియు, బ్రహ్మలోకే = బ్రహ్మమనులోకమునందు, మహీయతే = ఆత్మభూతుఁడయి ఉపాస్యుఁడగుచున్నాఁడు.

తా. నచికేతునివలన పొందఁబడినట్టియు, మృత్యుదేవునిచేత ఉపదేశింపఁబడినట్టియు, వైదికమగుటచేత పురాతనమైనట్టియు, వల్లీత్రయసమన్వితమయినట్టియు ఈయుపాఖ్యానమును యోగ్యులగు బ్రాహ్మణులకు ఉపదేశించినవాఁడున్ను, సదాచార్యునివల్లనుండి ఉపదేశమునుపొందినవాఁడున్ను బ్రహ్మలోకమునందు పూజనీయులయి వెలయుదురు.

వివరణము:—ఈమంత్రమునందు 'బ్రహ్మైవ లోకః' బ్రహ్మలోకః అని సమాసముగాని 'బ్రహ్మణః లోకః=బ్రహ్మలోకః' అనిసమాసము మాత్రముగాదు అని భాష్యమునందు వ్యాఖ్యాతమైనది.

౧-వ అధ్యా. ౩-వ వల్లి, ౧౭ -వ మంత్రము.

మూ. య ఇమం పరమం గుహ్యం శ్రావయే ద్బ్రహ్మసంసది,
ప్రయత శ్శ్రాద్ధకాలే వా తదానన్త్యాయ కల్పతే.
తదానన్త్యాయ కల్పతఇతి. ౧౭

పద. యః ఇమం పరమం గుహ్యం శ్రావయేత్ బ్రహ్మసంసది, ప్రయతః శ్రాద్ధకాలే వా తత్ ఆనన్త్యాయ కల్పతే. తత్ ఆనన్త్యాయ కల్పతే ఇతి.

ఇతి కాఠకోపనిషది ప్రథమాధ్యాయే
తృతీయావల్లీ సమాప్తా.

టీక. యః=ఎవ్వఁడు? పరమం=శ్రేష్ఠమయినట్టియు, గుహ్యం=గోపనీయమయినట్టియు, ఇమం=ఈగ్రంథమును, బ్రహ్మసంసది=బ్రాహ్మణసభయందు,

శ్రావయేత్ = వినిపించునో, ప్రయతః=శుచియై, శ్రాద్ధకాలేవా=శ్రాద్ధకాలము నందు (బ్రాహ్మణభోజనసమయమునందు వినిపించునో,) తత్ = అటుల బ్రాహ్మణులకు వినిపించుట, ఆనన్త్యాయ=అనంతమయిన ఫలము నొసంగుటకు, కల్పతే= సమర్థమగును. తత్ = అటుల సభయందును, శ్రాద్ధకాలమునందును బ్రాహ్మణులకు వినిపించుట, ఆనన్త్యాయ=అనంతమయినఫలమునొసంగుటకు, కల్పతే= సమర్థమగును.

తా. ఎవ్వఁడు శ్రేష్ఠమయినట్టియు రహస్యమైనట్టియు నాచికేతోపాఖ్యానమునుఅర్థపురస్సరముగఁగాని గ్రంథముగఁగాని బ్రాహ్మణసభయందో, లేక శ్రాద్ధకాలమునందు బ్రాహ్మణభోజనసమయమునందో శుచియై వినిపించునో అట్లు వినిపించుటవలన ఆశ్రాద్ధము అనంతఫలప్రదమగును. 'తదానంత్యాయ కల్పతే తదానంత్యాయ కల్పతే' అని రెండుపర్యాయములుచెప్పుట అధ్యాయపరిసమాప్తిసూచకము.

కఠోపనిషత్తు. ౧-వ అధ్యాయము. 3-వ వల్లి సమాప్తము.

ప్రథమాధ్యాయము సమాప్తము.

అనుభూతిప్రకాశము ౧౧-వ అధ్యాయమునందు, ఆత్మపురాణము ౯-వ అధ్యాయమునందును, ఈవల్లియొక్క వివరణముగలదు.

కఠోపనిషత్తు.

ద్వితీయాధ్యాయము—ప్రథమవల్లి.

(గ్రంథాదిపరిగణము ననుసరించి చతుర్థవల్లి.)

౨-వ అధ్యా. ౧.వ వల్లి, ౧-వ మంత్రము.

అవ. "ఏష సర్వేషు భూతేషు గూఢోఽత్మా న ప్రకాశతే, దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః." కఠ. ౧-౩-౧౨. అని ప్రథమాధ్యాయ తృతీయవల్లియందు ఆత్మతత్త్వమునుగూర్చి చెప్పఁబడినది. సూక్ష్మబుద్ధితో ఆత్మనుగాంచుటకు శక్యమయినయెడల అట్లేచూడవచ్చునుగదా. అట్లు చూడకపోవుటకు ప్రతిబంధకమేమి? యను ప్రశ్న ముదయించుచున్నది కావున శ్రేయస్సును అడ్డుపెట్టునట్టి కారణమిదియని తెలిసికొనినయెడల అట్టి యడ్డును తొలఁగించుకొనుటకు శక్యమగును. లేనియెడల శ్రేయః ప్రతిబంధ కారణ మట్లే నిలిచియుండును కావున ఆత్మను చూడకుండుటకుఁ గల ప్రతిబంధక కారణమును తెలుపుటకై యీవల్లి ఆరంభింపఁబడినది:—

మూ. పరాఞ్చి ఖాని వ్యతృణత్స్వయంభూ
స్తస్మాత్పరాఙ్ పశ్యతి నాన్తరాత్మన్,
కశ్చి ద్ధీరః ప్రత్యగాత్మాన మైక్ష
దావృత్తచక్షు రమృతత్వ మిచ్ఛన్. ౧

పద. పరాఞ్చి ఖాని వ్యతృణత్ స్వయంభూః తస్మాత్ పరాఙ్ పశ్యతి న అన్తరాత్మన్, కః చిత్ ధీరః ప్రత్యగాత్మానం ఐక్షత్ ఆవృత్త చక్షుః అమృతత్వం ఇచ్ఛన్. ౧

టీక. స్వయంభూః=పరమేశ్వరుఁడు, ఖాని=ఇంద్రియములను, పరాంచి =పరాగ్విషయాభిముఖ స్వభావముగలవానినిగా, వ్యతృణత్ = హింసించెను. తస్మాత్ =అందువలన (ఆయింద్రియములు), పరాఙ్ పశ్యతి = శబ్దాదివిషయజాతమునే గాంచుచున్నవి. అంతరాత్మన్=అంతరాత్మను, న=చూచుటలేదు. కశ్చిత్ ధీరః=ఒకానొకవివేకి, అమృతత్వం=మోక్షమును, ఇచ్ఛన్ =కోరుచున్నవాఁడయి, ఆవృత్తచక్షుః=(విషయములనుండి) మఱలింపఁబడిన ఇంద్రియసమూహముగలవాఁడై, ప్రత్యగాత్మానం = పరమాత్మను, ఐక్షత్ = చూచెను.

తా. శ్రోత్రాదీంద్రియసమూహము శబ్దాదివిషయములను ప్రకాశింపఁజేయుటకే ప్రవర్తించుచున్నది. ఈశ్రోత్రాదీంద్రియములను పరమేశ్వరుఁడిట్టి స్వభావముగలవానినిగా నిర్మించెను కావున వానిని హింసించినట్లే యగుచున్నది కాని వేఱుకాదుగదా. ఇట్టినిర్ణయమునొనర్చినవాఁడు స్వయంభువు. అనఁగా సర్వదా తానే స్వతంత్రుఁడుగానుండి ఒకప్పుడైనను పరతంత్రుఁడుగాని పరమాత్మయే. కావుననే ఆయింద్రియములు అనాత్మభూతములగు శబ్దాదివిషయములనే పొందుచున్నవిగాని అంతరాత్మను గాంచుటలేదు. లోకమునం దిట్టి ప్రవర్తనము సహజమయినను ఉపాయశాలియగువాఁడు ధీరుఁడయినవాఁడునదీప్రవాహమున కెదురీదినటుల వివేకియగువాఁడు గొప్పప్రయత్నముచేత ఇంద్రియములయొక్క స్వాభావికప్రవృత్తిని నిరోధించినవాఁడై అనఁగా ఆయింద్రియప్రవృత్తిని ఆత్మాభిముఖముగా నొనర్చినవాఁడయి ప్రత్యగాత్మను గాంచుచున్నాడు. ప్రత్యగాత్మశబ్దము నిచట పరమాత్మవాచకముగా గ్రహించవలయును. ఆత్మశబ్దముయొక్క వ్యుత్పత్తికూడ నీవిషయమునే దృఢపఱచును:—

శ్లో. యచ్చాప్నోతి యదాదత్తే యచ్చాత్తి విషయా నిహ,
యచ్చాస్య సంతతో భావః తస్మాదాత్మేతి కీర్త్యతే.

'ఐక్షత్', అను లకారము భూతకాలికమయినను వైదికప్రయోగ మగుటచేత నిట వర్తమానార్థముగా గ్రహింపఁబడినది.

బాహ్యవిషయములందు ప్రవర్తించుచుండుట ప్రత్యగాత్మనుగాంచుట యనువిషయముల నొక్కఁడాచరింపఁజాలఁడు కావున బాహ్యమగు జ్ఞాన కర్మేంద్రియవిషయజాతమునుండి విముఖుఁడయి అంతర్ముఖుఁడయి మహాయాస పూర్వకమగు ప్రయత్నముతో నదీప్రవాహమున కెదురీదినటుల ప్రవర్తించు నట్టివానికే అమృతత్వప్రాప్తి-మోక్షప్రాప్తికాని తదితరులకు లేదనిభావము.

౨-వ అధ్యా, ౧-వ వల్లి, ౨-వ మంత్రము.

మూ. పరాచః కామా ననుయన్తి బాలా
స్తే మృత్యో ర్యన్తి వితతస్య పాశమ్,
అథ ధీరా అమృతత్వం విదిత్వా
ధ్రువమధ్రువేష్విహ న ప్రార్థయన్తే. ౨

పద. పరాచః కామాన్ అనుయన్తి బాలాః తే మృత్యోః యన్తి వితతస్య పాశం, అథ ధీరాః అమృతత్వం విదిత్వా ధ్రువం అధ్రువేషు ఇహ న ప్రార్థయన్తే.

టీక. బాలాః=అల్పప్రజ్ఞులు, పరాచః=బహిర్గతములగు, కామాన్ = కోరఁదగినవిషయములను, అనుయంతి = అనుసరించుచున్నారు. తే = (ఆవిధ ముగా బహిర్గతకామవిషయాభిలాషగల) వారు, వితతస్య=అంతటవ్యాపించి యున్న, మృత్యోః=మృత్యువుయొక్క, పాశం=(సంసారలక్షణమగు) పాశ మును, యంతి = పొందుచున్నారు. అథ=అందువలన, ధీరాః=వివేకవంతులు, అమృతత్వం = ప్రత్యగాత్మావస్థాన లక్షణమగు ముక్తిని, ధ్రువం = శాశ్వత మయినదానినిగ, విదిత్వా=ఎఱింగి, ఇహ = ఈసంసారమునందుగల, అధ్రు వేషు=అనిత్యపదార్థములందు (కించిత్ అపి=కొంచెమైనను) న ప్రార్థయంతే= ప్రార్థింపరు.

తా. ఆత్మదర్శనమునకు అనభిముఖముగానుండుటయే లోకస్వభావ ముగానున్నది. అటుల ఆత్మదర్శనమునకు ప్రతిబంధకారణము అవిద్య. అవిద్యా

సంబంధములయిన దృష్టాదృష్టభోగములందు ఆసక్తికలుగుట. తృష్ణ, అల్ప ప్రజ్ఞగలవారలు ఇట్టి యవిద్యాతృష్ణలవలన ప్రతిబద్ధమయిన ఆత్మదర్శనము గలవారలయి బహిర్గతములయిన కామ్యవిషయములనే కోరుచుందురు. అట్టి ప్రజ్ఞావిహీనులు అవిద్యాకామ కర్మసముదాయరూపమగు మృత్యువుయొక్క సర్వవ్యాప్తమయిన పాశమునకు గురియగుచున్నారు. ఇచట పాశమనఁగా దేహేంద్రియాది సంయోగవియోగలక్షణమని ఎఱుంగవలయును. జనన మరణములని భావము. నిరంతరము జన్మజరామరణ రోగాద్యనేకానర్థ పరం పరలకు లోనగుచుందురు. అవిద్యాతృష్ణాసంబంధ మిట్టిదుఃఖములకు కారణ మనియెఱిఁగిన వివేకవంతులు ప్రత్యగాత్మావస్థానలక్షణమగుముక్తియే శాశ్వత మనియెఱింగినవారలయి ఇంద్రత్వాదిపదవులుకూడ అధ్రువములనియు ప్రత్య గాత్మావస్థాన లక్షణరూపమగుముక్తి "నకర్మణా వర్ధతే నో కనీయాన్" (అర్థ. కర్మలచేత పెఱుగుటగాని తగ్గుటగానిలేదు) అనిశ్రుతి కావున ఇదియే ధ్రువ మనియు, కూటస్థమనియు, అచంచలమనియు తెలిసికొన్నవారలయి ఈసంసా రమునందుగల సర్వపదార్థములను అనిత్యములని ఎఱింగినవారలయి సంసారము నందున్న ఏపదార్థమునుగాని ప్రత్యగాత్మదర్శనమునకు ప్రతికూలమనుతలం పుతో కోరుటలేదు. అనఁగా దారేషణ, ధనేషణ, పుత్రేషణలను ఈషణాత్ర యమును విసర్జించి బ్రహ్మవిద్యాభిలాషు లగుచున్నారు.

౨-వ అధ్యా. ౧-వ వల్లి, 3-వ మంత్రము.

అవ. బ్రహ్మవేత్తలగువారలు దేనిని ఎఱుంగుటవలన మఱొక్కదానిని దేనిని కోరరో అట్టిదానిని పొందుట యెట్లు? అనువిషయము చెప్పఁబడు చున్నది:—

మూ. యేన రూపం రసం గన్ధం
శబ్దాన్ స్పర్శాగ్ శ్చ మైథునాన్,
ఏతేనైవ విజానాతి
కిమత్ర పరిశిష్యతే; ఏత ద్వై తత్. 3

పద. యేన రూపం రసం గంధం శబ్దాన్ స్పర్శాన్ చ మైథునాన్, ఏతేన ఏవ విజానాతి కిం అత్ర పరిశిష్యతే, ఏతత్ వై తత్. 3

టీక. యేన=విజ్ఞానమేస్వభావముగాఁగల ఏ, ఏతేన ఏవ = దేహాదివ్యతిరిక్తమయిన యీఆత్మ యనుసాధనముచేతనే, (సర్వః లోకః=ప్రాణిసముదాయమంతయుం) రూపం=రూపమును, రసం=రసమును, గంధం=గంధమును, శబ్దాన్=శబ్దములను, స్పర్శాన్ = స్పర్శములను, మైథునాన్ = సంభోగవిషయకసౌఖ్యములను, విజానాతి=చక్కఁగా తెలుసుకొనుచున్నది. అత్ర=ఈప్రపంచమునందు, కింపరిశిష్యతే=ఏమిమిగిలియుండును? విజ్ఞానస్వభావముగల ఆత్మచేత తెలిసికొనుటకు శక్యముకానిది ఏదియు మిగిలియుండలేదనిభావము.) తత్ =అది (అనఁగా ధర్మాధర్మాదికముకంటె భిన్నమయినట్టి ఆత్మతత్త్వమును నాకుపదేశింపుము అని నచికేతుఁ డడిగినదియుం, దేవతలందఱు దేనిస్వరూపమిట్టిదని తెలిసికొనఁజాలక సంశయించుచుండిరో అది), ఏతత్ వై = ఇదియే (అని ఎఱుంగవలయును.)

తా. విజ్ఞానమే స్వభావముగాఁ గలిగినట్టియు, దేహేంద్రియాదులకు విలక్షణమయినట్టియు ఏయాత్మయను సాధనముచేత ప్రపంచమునందుఁగల ప్రాణిసమూహమంతయు, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధ సంభోగాదివిషయజాతమును చక్కఁగా తెలిసికొనుచున్నదో అదియే ఆత్మ. ధర్మాధర్మాదికముకంటె భిన్నమయినది ఎయ్యది? అని నచికేతుఁడు ప్రశ్నించినదియు, దేవతలు సైతము తెలిసికొనవలయునని విచారించుచున్నదియు, పరమపదమని లోకమునందు వ్యవహరింపఁబడుచున్నదియు అది ఇదియే యని యెఱుంగవలయును.

పూర్వ:—దేహాదివిలక్షణమయినఆత్మచేత శబ్ద స్పర్శ రూప రస గంధానందములను విషయములను అనుభవించుచున్నామని లోకమునం

దెవ్వరు తలంచుటలేదు. అనఁగా దేహాదిలక్షణమయిన ఆత్మచేతనే శబ్దాదివిష యములను తెలిసికొనుచున్నామని తలంచుట లోకప్రసిద్ధి.

సమాధానము:—అట్లనరాదు. దేహాదిసంఘాతమెట్లో అట్లే శబ్దాది విషయములున్నూ దృశ్యము లగుటచేత విజ్ఞేయములేగాని విజ్ఞాతృత్వమని చెప్పుట యుక్తముకాదు. దేహాదిసంఘాతము రూపాద్యాత్మకమయి రూపాదుల నెఱుంగునెడల బాహ్యములయిన రూపాదులుకూడ అన్యోన్యము తమ స్వస్వరూపము నెఱుంగవలయును. కాని ఇట్లెఱుంగుటలేదు. కనుక దేహాది లక్షణములగు రూపాదికములను దేహాది వ్యతిరిక్తమయినట్టియు, విజ్ఞానస్వభావ మయినట్టియు ఆత్మచేతనే జనులందఱు తెలిసికొనుచున్నారు. ఈప్రపంచ మునందు దేహాదిసంఘాతమునకు విలక్షణుఁడగు విజ్ఞానస్వభావుఁడగు ఆత్మకు తెలిసికొనుట శక్యముకానిది ఎయ్యదియు మిగిలియుండఁజాలదు. ప్రపంచ మునం దున్నదంతయు ఆత్మకు విజ్ఞేయము-అనఁగా: తెలిసికొనుటకు వీలయినదే గాని శక్యముకానిది ఏదియులేదు. ఏయాత్మకు అవిజ్ఞేయమయినది లోకము నందేదియులేదో అట్టియాత్మయే సర్వజ్ఞుఁడుగదా. ఇదియే అది.

'అన్యత్ర ధర్మా దన్యత్రాధర్మాత్' (కఠ. ౧-౨. ౧౪) అని నచికేతుఁడు ప్రశ్నించినట్టియు;

'దేవైరత్రాపి విచికిత్సితం' కిల (కఠ. ౧. ౧. ౨౧.) అనిదేవతలకుకూడ తెలిసికొనఁదగినది అయినట్టియు;

'సోఽధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః పరమంపదం' (కఠ. ౧. ౩. ౯) అని వ్యాపనశీలుఁడగుటచేత విష్ణువని వ్యవహరింపఁబడుచున్న ఆత్మకు పరమపద మనియు;

'యస్మాత్ పరం నాపర మస్తి కించిత్' అని వేదాంతశాస్త్రములం దుప దిష్టమయినదియును అగుఆత్మతత్త్వము ఇదియే.

౨-వ అధ్యా. ౧-వ వల్లి, ౪-వ మంత్రము.

అవ. ఆత్మతత్త్వము అతిసూక్ష్మమగుటచేత దుర్విజ్ఞేయము కావున చెప్పినవిషయమే ప్రకారాంతరముగా మఱల నిరూపింపఁబడుచున్నది:—

మూ. స్వప్నాన్తం జాగరితాన్తం చోభౌ యేనానుపశ్యతి,
మహాన్తం విభు మాత్మానం మత్వా ధీరో న శోచతి. ౪

పద. స్వప్నాన్తం జాగరితాన్తం చ ఉభౌ యేన అనుపశ్యతి, మహాన్తం విభుం ఆత్మానం మత్వా ధీరః న శోచతి. ౪

టీక. స్వప్నాంతం=స్వప్నమధ్యమును - అనఁగా స్వప్నవిజ్ఞేయమును, జాగరితాంతంచ=జాగరితమధ్యమును-అనఁగా జాగరితవిజ్ఞేయమును, ఉభౌ=ఈరెంటిని, యేన=ఏఈ (విజ్ఞానస్వభావమయినట్టి దేహాది విలక్షణమయినట్టి) ఆత్మచేత (లోకః=ప్రాణిసమూహము), అనుపశ్యతి=చూచుచున్నదో (తం=అట్టియాత్మను), మహాంతం=గొప్పవానిగను, విభుం=సర్వవ్యాపునిగను, ధీరః=జ్ఞానియగువాఁడు, మత్వా = తలంచి (అనఁగా ఆత్మభావముచేత నేనే అట్టియాత్మయనియెఱింగి), న శోచతి=దుఃఖింపఁడు.

తా. (వెనుకటిమంత్రమునందు ఆత్మతత్త్వ మిట్టిదని చెప్పినప్పటికిన్ని విషయము దుర్విజ్ఞేయమగుటచేత ౯-వ మంత్రము దనుక ప్రకారాంతరములతో ఆయాత్మతత్త్వమే మఱల నిరూపింపఁబడుచున్నది;—) ప్రపంచమునందుఁగల ప్రాణిజాతము స్వప్నాంతమును-అనఁగా స్వప్నమునందు తెలిసికొనఁదగిన విషయమును, జాగరితాంతమును—అనఁగా జాగరితమునందు తెలిసికొనఁదగిన విషయమును—అనఁగా రెండైన స్వప్నజాగరితాంతములను-స్వప్నజాగరిత విజ్ఞేయములను దేహేంద్రియాది విలక్షణమయినట్టియు విజ్ఞానస్వభావమయినట్టియు ఏఆత్మచేత తెలిసికొనుచున్నదో, 'అట్టియాత్మతత్త్వమును గొప్పవానిగను, సర్వవ్యాపిగను' తెలిసికొన్నజ్ఞాని అట్టియాత్మయే సాక్షాత్తుగ నేనగుచున్నాను, నేనేపరమాత్మను అనితలంచువాఁడు (సాక్షాత్కారరూపమగు ధైర్యముగలవాఁడు కావున) శోకింపఁడు.

౨-వ అధ్యా. ౧-వ వల్లి. ౫-వ మంత్రము.

మూ. య ఇమం మధ్వదం వేద
ఆత్మానం జీవమన్తికాత్,
ఈశానం భూతభవ్యస్య
న తతో విజుగుప్సతే; ఏతద్వైతత్. ౫

పద. యః ఇమం మధ్వదం వేద ఆత్మానం జీవం అన్తికాత్, ఈశానం భూతభవ్యస్య న తతః విజుగుప్సతే, ఏతత్ వై తత్.

టీక. యః = ఎవ్వడు? మధ్వదం = కర్మఫలమును అనుభవించుచున్న ఇమం=ఈ, జీవం=జీవస్వరూపుఁడగు, ఆత్మానం=ఆత్మను, అంతికాత్ = సమీపమునందు, భూతభవ్యస్య=కాలత్రయమునకు, ఈశానం=నియామకునిగా, వేద=తెలిసికొనుచున్నాఁడో, తతః=అందువలన, నవిజుగుప్సతే = సంరక్షించుకొనుటకుకోరఁడు, ఏతత్ = ఇదియే, తత్=అది. (అనఁగా నీవడిగిన యాత్మయే ఇది.)

తా. కర్మఫలభోక్త యగునట్టియుం ప్రాణాదిసమూహమునకు ధారకుఁడయినట్టియుం జీవుని నిత్యసన్నిహితునిగను, కాలత్రయ నియామకునిగను ఎవ్వఁడెఱుంగునో అట్టివాఁడు, తద్విజ్ఞానానంతరము ఇతరులనుండి తనకు భయముకలుగఁగలదను తలంపుతో ఇతరులనుండి తన్ను సంరక్షించుకొనుటకయి ప్రయత్నింపఁడు. ఎంతవఱకు తాను భయపడవలసిన అవసరము గలదనియుం, తాను అనిత్యుఁడననియుం తలంచుకొనుచుండునో అంతవఱకు ఇతరులనుండి తన్ను కాపాడుకొనుచుండుట లోకస్వభావమయి యున్నది. ఎప్పుడయితే ఆత్మను అద్వయునిగను, నిత్యునిగను తెలిసికొనుచున్నాఁడో అప్పుడు రెండవవాఁడు లేనేలేదను దృఢవిశ్వాసము కలుగుటచేత భయంపడవలసిన యవసరమే లేదుగదా.

౨-వ అధ్యా, ౧-వ వల్లి, ౬-వ మంత్రము.

అవ. ఏ ప్రత్యగాత్మ ఈశ్వరభావముచేత నిర్దేశింపఁబడెనో అతఁడే సర్వాత్మయనువిషయ మీమంత్రమునందు తెలుపఁబడుచున్నది:—

మూ. యః పూర్వం తపసో జాత
మద్భ్యః పూర్వ మజాయత,
గుహాం ప్రవిశ్య తిష్ఠంతం
యో భూతేభి ర్వ్యపశ్యత. ఏత ద్వై తత్. ౬

పద. యః పూర్వం తపసః జాతం అద్భ్యః పూర్వం అజాయత, గుహాం ప్రవిశ్య తిష్ఠంతం యః భూతేభిః వ్యపశ్యత. ఏతత్ వై తత్. ౬

టీక. యః=ఏముముక్షువు, పూర్వం=ముందుగా, తపసః = జ్ఞానాది లక్షణమగు బ్రహ్మమువల్లనుండి, అద్భ్యః = జలములతోఁ గూడిన పంచభూతములకంటె, పూర్వం=ముందుగా, అజాయత = ఉద్భవించెనో (అటుల ఉత్పన్నుఁడయి దేవాదిశరీరములను నిర్మించి ఆప్రాణులయొక్క), గుహాం=హృదయాకాశమును, ప్రవిశ్య=ప్రవేశించి, తిష్ఠంతం = ఉన్నట్టియు, భూతేభిః = కార్యకారణలక్షణములగు భూతములతోటి, తిష్ఠంతం=ఉన్నట్టి బ్రహ్మమును, యః=ఎవ్వఁడు? వ్యపశ్యత=చూచెనో (ఎవ్వఁ డిటుల చూచుచున్నాఁడో అట్టివాఁడు చూచునట్టి), తత్ = ఆ బ్రహ్మము, ఏతత్ వై=ఇదియే గదా.

తా. జ్ఞానాదిలక్షణమగు బ్రహ్మమునుండి పంచభూతసృష్టికంటె ముందుగా హిరణ్యగర్భుఁ డనుపేర ఎవ్వఁడు జన్మించెనో, ప్రథముఁడగు ఏహిరణ్యగర్భుఁడు దేవాదిశరీరముల నిర్మించి వానియొక్క హృదయగుహ నాశ్రయించియున్నాఁడో, ఎవ్వఁడు కార్యకారణలక్షణభూతములగు పంచభూతములతోడ కలసియున్నటుల చూడఁబడుచున్నాఁడో - అతఁడే యాత్మ, అనఁగా అతఁడు చూచుచున్నట్టి యాత్మయే నీవు తెలిసికొనవలయునని ప్రశ్నించిన యాత్మ.

వివరణము:—లోకమునందు బంగారుతో చేయఁబడిన కుండలాద్యలంకారములు బంగారమే అగుచున్నటుల బ్రహ్మమువల్లనుండి పుట్టిన హిరణ్యాగర్భుఁడుకూడ బ్రహ్మాత్మకుఁడే యని తలంచవలయును.

౨-వ అధ్యా, ౧-వ వల్లి, ౭-వ మంత్రము.

మూ. యా ప్రాణేన సంభవ
త్యదితి ర్దేవతామయీ,
గుహాం ప్రవిశ్య తిష్ఠన్తీ
యా భూతేభి ర్వ్య జాయత. ఏత ద్వై తత్. ౭

పద. యా ప్రాణేన సంభవతి అదితిః దేవతామయీ, గుహాం ప్రవిశ్య తిష్ఠన్తీ యా భూతేభిః వ్యజాయత. ఏతత్ వై తత్.

టీక. అదితిః = శబ్దాదిసర్వకర్మలను అనుభవించుటచేత అదితియని చెప్పఁబడుచున్నట్టియు, దేవతామయీ = సర్వదేవతాస్వరూపిణియు నగు, యా=ఎయ్యది? ప్రాణేన=హిరణ్యగర్భునితోడ, సంభవతి=పరబ్రహ్మమువల్లనుండి పుట్టుచున్నదో, (ఏశక్తి) భూతేభిః=భూతములతోడ, వ్యజాయత=పుట్టెనో, యా=ఎయ్యది? గుహాం = ప్రాణులయొక్క హృదయాకాశమును, ప్రవిశ్య = ప్రవేశించి, తిష్ఠంతీ=ఉంటున్నదో, ఏతత్ = ఇది, తద్వై = అదియేగదా.

తా. సర్వదేవతాస్వరూపిణియగు నెయ్యది హిరణ్యగర్భరూపముతో పరబ్రహ్మమునుండి పుట్టుచున్నదో, సర్వకర్మఫలమును భక్షించుచుండుటచేత ఎయ్యది అదితి యని పిలువఁబడుచున్నదో, ఎయ్యది భూతములతో కలిసినదై పుట్టెనో, ఎయ్యది ప్రాణులయొక్క బుద్ధిగుహాయందు ప్రవేశించియుంటున్నదో అదియే-అశక్తియే యీయాత్మతత్త్వము.

౨-వ అధ్యా, ౧-వ వల్లి, ౮-వ మంత్రము.

మూ. అరణ్యో ర్నిహితో జాతవేదా
గర్భ ఇవ సుభృతో గర్భిణీభిః,

దివేదివ ఈడ్యో జాగృవద్భి
ర్హవిష్మద్భి ర్మనుష్యేభి రగ్నిః. ఏత ద్వై తత్. ౮

పద. అరణ్యోః నిహితః జాతవేదాః గర్భః ఇవ సుభృతః గర్భిణీభిః, దివేదివే ఈడ్యః జాగృవద్భిః హవిష్మద్భిః మనుష్యేభిః అగ్నిః. ఏతత్ వై తత్. ౮

టీక. గర్భిణీభిః=గర్భిణీస్త్రీలచేత, సుభృతః=బాగుగా కాపాడఁబడుచున్న, గర్భః ఇవ=గర్భమువలె, యః=ఏ, జాతవేదాః=అగ్ని, అరణ్యోః=అరణులందు, నిహితః=ఉంటున్నదో, అగ్నిః=ఏయగ్ని, దివేదివే=ప్రతిదినము, జాగృవద్భిః=జాగరణశీలురైనట్టియు, హవిష్మద్భిః=హవిస్సుకలిగినట్టియు, మనుష్యేభిః=మనుష్యులచేత, ఈడ్యః = కొనియాడఁదగియున్నాఁడో, ఏతత్ = ఈ అగ్నియే, తద్వై=ఆబ్రహ్మముగదా.

తా. గర్భిణీస్త్రీలు తమగర్భమునందుండు శిశువున కెట్టిఅపాయము రాకుండుటకయి శుచిహితమితాహారముల నొనర్చుచు నెటులకాపాడెదరో ఆవిధముగా అధియజ్ఞుఁడగు ఈఅగ్నియు, ఉత్తరారణి, అధరారణులందు కాపాడఁబడుచున్నాఁడు. ఈయగ్నియే సర్వహవిస్సులకు భోక్త. అధియజ్ఞుఁడగు అగ్నిని ఋత్విక్కు లిటుల కాపాడుచుందురు. అధ్యాత్ముఁడగు జాతరాగ్నిని యోగులు అనిందితాన్నపానాదికము చేత కాపాడుచుందురు. ఇట్టి అధియజ్ఞాగ్నిని ప్రతినిత్యము కర్తలగు యజమానులు ఋత్విక్కులు కొనియాడుచు, ఆజ్యాదిహవిస్సుల నొసంగుచు కాపాడుచుందురు. అధ్యాత్మాగ్నిని యోగులయినవారలు అప్రమత్తులయి పూజించుచుందురు. ఇట్టిఅగ్నియే బ్రహ్మము.

వివరణము—విరాడ్రూపమున అగ్నిగానుండెడి అపరబ్రహ్మమున్నూ తత్కారణభూతమగు పరబ్రహ్మమున్నూ ఒక్కటియేయని భావము.

౨-వ అధ్యా, ౧-వ వల్లి, ౯-వ మంత్రము

మూ. యత శ్చోదేతి సూర్యో
అస్తం యత్ర చ గచ్ఛతి,
తం దేవా స్సర్వేఽర్పితా
స్తదు నాత్యేతి కశ్చన. ఏత ద్వై తత్. ౯

పద. యతః చ ఉదేతి సూర్యః అస్తం యత్ర చ గచ్ఛతి, తం దేవాః సర్వే అర్పితాః తత్ ఉ న అత్యేతి కః చన, ఏతత్ వై తత్.

టీక. సూర్యః = సూర్యుఁడు, యతః చ=ప్రాణాత్మకుఁడగు ఏహిరణ్యగర్భునివల్లనుండి, ఉదేతి=ఉదయించుచున్నాడో, (సూర్యః = సూర్యుఁడు) అస్తం=లయమును, యత్రచ = ఏహిరణ్యగర్భునియందు, గచ్ఛతి = పొందుచున్నాఁడో, సర్వే దేవాః = దేవతలందఱు, తం = అట్టి హిరణ్యగర్భునిగూర్చి, అర్పితాః (ఇవ) =అర్పించబడినవారివలె ఉంటున్నారో, కఃచన = ఒక్కఁడున్నూ, తత్ ఉ = ఆహిరణ్యగర్భుని, నఅత్యేతి = అతిక్రమించియుండఁజాలఁడో, ఏతత్ =అట్టి ఇదియే, తత్ వై =ఆబ్రహ్మతత్త్వముగదా.

తా. ప్రాణుఁ డనుపేరుగల ఏహిరణ్యగర్భునివల్లనుండి సూర్యుఁ డుదయించుచున్నాఁడో, అట్లే ఏహిరణ్యగర్భునియందు ప్రతినిత్యము అస్తమించుచున్నాఁడో, ప్రాణనామకుఁడగు ఏహిరణ్యగర్భునియందు రథచక్రమునందు అరములువలె సకలదేవతలు ప్రతిష్ఠితులయి యున్నారో, అతఁడే బ్రహ్మము, అతఁడే సర్వాత్మకుఁడగు బ్రహ్మము. ఇంతకంటె భిన్నమయినది మఱొకటి యుండఁజాలదు. ఇదియే నీవడిగిన బ్రహ్మతత్త్వము. అధిదైవుఁడగు హిరణ్యగర్భునియంధు అగ్న్యాదిసర్వదేవతలు రథనాభియందు అరములు-బండిఆకులు అర్పితములయియున్నటుల అధ్యాత్ముఁడగు హిరణ్యగర్భునియందు వాగాదీంద్రియసమూహము అర్పితమయి యున్నదని గ్రహించవలయును.

౨-వ అధ్యా, ౧-వ వల్లి, ౧౦-వ మంత్రము.

అవ. బ్రహ్మాదిస్థావరాంతమగు ప్రాణిజాతమునందు ఉన్నట్టియు, ఆయా యుపాధిసంబంధముచేత బ్రహ్మముకంటె భిన్నముగ భాసించుచున్నట్టియుం సంసారి పరబ్రహ్మముకంటె భిన్నమయినదని ఎవ్వరయినతలఁచెదరేమో యని యీక్రిందివిషయము చెప్పఁబడుచున్నది:—

మూ. యదేవేహ తదముత్ర యదముత్ర తదన్విహ,
మృత్యోస్స మృత్యుమాప్నోతి య ఇహ నానేవ పశ్యతి.

పద. యత్ ఏవ ఇహ తత్ అముత్ర యత్ అముత్ర తత్ అను ఇహ, మృత్యోః సః మృత్యుం ఆప్నోతి యః ఇహ నానా ఇవ పశ్యతి. ౧౦

టీక. ఇహ=ఇచ్చట, యత్ ఏవ=ఎయ్యదిగలదో, తత్ = అయ్యదియే, అముత్ర=అచ్చటనుగలదు. యత్=ఎయ్యది? అముత్ర=అచ్చటగలదో, ఇహ =ఇచ్చట, తత్ అను=అదియుంగలదు. యః=ఎవ్వఁడు? ఇహ = ఇచ్చట, నానా ఇవ=అనేకమువలె, పశ్యతి = చూచుచున్నాఁడో, సః = వాఁడు, మృత్యోః= మృత్యువువల్లనుండి, మృత్యుం=మరణమును (అనగా మాటిమాటికి పుట్టుట చచ్చుచుండుట యనుసంసారమును), పశ్యతి= చూచుచున్నాఁడు.

తా. కార్యకారణోపాధిసమన్వితమయి అవివేకులకు సంసారధర్మములుం గలదానివలె ఎయ్యదిగనంబడుచున్నదో ఏతత్త్వమిచటయీజీవునియందుగలదో ఆతత్త్వమే నిత్యవిజ్ఞానఘనస్వభావుఁడును, సర్వసంసారధర్మవివర్జితుఁడును అగు ఆత్మయందు గలదు. ఏతత్త్వము ఈయాత్మతత్త్వమునందుగలదో ఆతత్త్వమే నామరూపకార్యకారణోపాధికుఁడగు జీవునియందున్నూ వెలయుచున్నదేగాని వేఱుగానేమియు లేదు. వస్తుస్థితియిట్లుండఁగా ఉపాధిస్వభావభేదలక్షణమగు అవిద్యచేత మోహితుఁడయినవాఁడయి అద్వితీయమయిన బ్రహ్మమునందు "నేను పరబ్రహ్మముకంటె వేఱయినవాఁడను, బ్రహ్మము నాకంటెవేఱయినది" అని భిన్నముగా నెవ్వఁడు చూచుచుండునో అట్టివాఁడు మృత్యువువల్లనుండి

మృత్యువును-అనఁగా మాటిమాటికి పుట్టుట చచ్చుటయనుసంసారమును పొందు చున్నాఁడు కావున అట్టిభేదదృష్టితో చూడవలదు. విజ్ఞానైకరసమును, నిరంతరముగ ఆకాశమువలె సర్వత్ర పరిపూర్ణమును అగు బ్రహ్మమే నేననుదృష్టితో దనే చూడవలయునని మంత్రార్థము.

౨-వ అధ్యా, ౧-వ వల్లి, ౧౧-వ మంత్రము.

మూ. మనసై వేదమాప్తవ్యం నేహ నానాఽస్తి కించన,
మృత్యోస్స మృత్యుం గచ్ఛతి య ఇహ నానేవ పశ్యతి.

పద. మనసా ఏవ ఇదం ఆప్తవ్యం న ఇహ నానా అస్తి కించన, మృత్యోః సః మృత్యుం గచ్ఛతి యః ఇహ నానా ఇవ పశ్యతి. ౧౧

టీక. ఇదం=ఈబ్రహ్మము, మనసాఏవ = మనస్సుచేతనే, ఆప్తవ్యం = పొందఁదగినది, ఇహ=ఈబ్రహ్మమునందు, నానా = భేదము. (అనేకత్వము) కించన=కొంచెమైనను, న అస్తి=లేదు. యః=ఎవ్వఁడు? ఇహ = ఈబ్రహ్మమునందు, నానాఇవ=అనేకముఉన్నదానివలె, పశ్యతి = చూచుచున్నాఁడో, సః =వాఁడు, మృత్యోః = మృత్యువువల్లనుండి, మృత్యుం = (పునఃపునర్జన్మమరణరూపసంసారలక్షణమగు) మరణమును, గచ్ఛతి=పొందుచున్నాఁడు.

తా. బ్రహ్మైకత్వవిజ్ఞానముకంటె పూర్వమునందు సదాచార్యోపదేశశాస్త్రసంస్కృతమయిన మనస్సుచేతనే ఏకరసమయినబ్రహ్మమెయుంగఁదగినది. అనఁగా బ్రహ్మమొక్కటే వాస్తవమయినది, తద్భిన్నముగ నేమియు లేదు. అట్టి బ్రహ్మైకత్వవినిశ్చయబుద్ధిప్రాప్తమయినదగుచుండఁగా నానాత్వబుద్ధిని స్ఫురింపఁ జేయునట్టి అవిద్య నివర్తించిపోవుచున్నది కావున బ్రహ్మమునం దణుమాత్రమైనను నానాత్వముండఁజాలదు. వస్తుస్థితి యిట్లుండఁగా అవిద్యాతిమిరదృష్టితో బ్రహ్మమునందు నానాత్వదృష్టి నెవ్వఁడు చూచుచుండునో అట్టివాఁడు అణుమాత్రపుభేదదృష్టిని గాంచినను పునఃపునఃజన్మమరణరూపమగు సంసారమునకు గురి యగుచుండును.

వివరణము:—బ్రహ్మము ఏకరసమగుటయే వాస్తవమగునెడల జ్ఞాతృజ్ఞేయభావము అనుపపన్నముగదా యనుసంశయమునకు అయ్యది—అనఁగా జ్ఞాతృజ్ఞేయభావము అజ్ఞునకు విషయము సుగమముగ బోధించుటకుఁగాను కల్పితమని సమాధానము. వస్తుస్థితియందు జ్ఞాతృజ్ఞేయవిభాగముఅనుపపన్నమే.

౨-వ అధ్యా, ౧-వ వల్లి, ౧౨-వ మంత్రము.

అవ. మఱల ప్రకృతమగుబ్రహ్మమే భంగ్యంతరముగ నిర్దేశింపఁబడుచున్నది:—

మూ. అఙ్గుష్ఠమాత్రః పురుషో మధ్య ఆత్మని తిష్ఠతి,
ఈశానం భూతభవ్యస్య నతతో విజుగుప్సతే. ఏతద్వై తత్.

పద. అఙ్గుష్ఠమాత్రః పురుషః మధ్యే ఆత్మని తిష్ఠతి, ఈశానం భూతభవ్యస్య న తతః విజుగుప్సతే. ఏతత్ వై తత్. ౧౨

టీక. అంగుష్ఠమాత్రః=అంగుష్ఠపరిమాణముగల, పురుషః = పురుషుఁడు, మధ్యేఆత్మని=శరీరమధ్యభాగమునందు, తిష్ఠతి = ఉంటున్నాఁడు. (తం=అట్టి యాత్మను) భూతభవ్యస్య = కాలత్రయమునకు, ఈశానం = నియామకునిగా, విదిత్వా = ఎఱింగి, తతః = అతనివల్లనుండి, నవిజుగుప్సతే=రక్షించుకొనుటకు కోరఁడు. ఏతత్=ఇదియే, తద్వై=ఆబ్రహ్మతత్త్వముగదా.

తా. అంగుష్ఠమాత్రుఁడనఁగా అంగుష్ఠపరిమాణముగలవాఁడు. హృదయకమలము అంగుష్ఠపరిమాణముగలది. ఆహృదయఛిద్రస్థమగు ఆకాశముకూడ అంగుష్ఠపరిమాణముగలది. అట్టియంతఃకరణోపాధిగల పురుషుఁడు - జీవుఁడు అంగుష్ఠమాత్రుఁడనంబడును. పురుషుఁడనఁగా 'పూర్ణ మనేనసర్వం ఇతి పురుషః' అను వ్యుత్పత్తిచేత అంతట నిండియున్నాఁడని చెప్పఁబడుచున్నాఁడు. ఇట్టి పురుషుఁడు శరీరమధ్యభాగమునం దుంటున్నాఁడు. ఈపురుషుఁడే కాలత్రయమునకు నియామకుఁడు. ఇట్టిపురుషుఁడే కాలత్రయమునకు నియామకుఁడనువిషయము నెఱింగినవాఁడు. అట్టి యాత్మభూతుఁడగు పురుషునివల్లనుండి తనకు

భయము రాఁగలదని తలంపఁడు కావున అట్టివానినుండి రక్షణమును కోరఁడు. ఇట్టిపురుషుఁడే నీవు తెలిసికొనఁదలఁచిన బ్రహ్మతత్త్వము.

౨-వ అధ్యా, ౧-వ వల్లి, ౧౩-వ మంత్రము.

మూ. అఙ్గుష్ఠమాత్రః పురుషో జ్యోతిరివాధూమకః,
ఈశానో భూతభవ్యస్య సఏవాద్య స ఉశ్వః, ఏత ద్వైతత్.

పద. అఙ్గుష్ఠమాత్రః పురుషః జ్యోతిః ఇవ అధూమకః, ఈశానః భూత భవ్యస్య సః ఏవ అద్య సః ఉ శ్వః. ఏతత్ వై తత్. ౧౩

టీక. అంగుష్ఠమాత్రః=అంగుష్ఠపరిమాణముగల, పురుషః=పురుషుఁడు జ్యోతిః ఇవ=జ్యోతిస్సువలె, అధూమకః = ధూమములేనివాఁడు, సః=ఆపురుషుఁడే, భూతభవ్యస్య=కాలత్రయమునకు, ఈశానః=ప్రభువు, నియామకుఁడు. అద్య=నేఁడు (ఉన్నప్రాణులందుండువాఁడు) సః ఏవ = ఆపురుషుఁడే, శ్వః=రేపు, (ఉండఁగలప్రాణులందుండువాఁడున్నూ) సఃఏవ=ఆపురుషుఁడే. ఏతత్=ఈపురుషుఁడే, తత్ వై=నీవుకోరిన ఆబ్రహ్మము గదా.

తా. అంగుష్ఠపరిమాణముగలవాఁడుగా ప్రతిపాదింపఁబడినపురుషుఁడు జ్యోతిస్సువలె ధూమములేనివాఁడు. ఏపురుషుఁడు ఇటుల హృదయాకాశాంతర్గతచ్ఛిద్రాంతర్వర్తియనియు, కాలత్రయనియామకుఁడనియు యోగీశ్వరులచేత గురూపదేశాగమానుభవములచేత లక్షింపఁబడుచున్నాఁడో ఆపురుషుఁడే నిత్యుఁడు, కూటస్థుఁడు. ఈవర్తమానకాలమునందున్న ప్రాణులందున్నవాఁడా పురుషుఁడే, భవిష్యత్కాలమునందుండఁబోవు ప్రాణులందుండఁగలవాడున్నూ ఆపురుషుఁడే. అతనితో సమానుఁడగువాఁడొక్కఁడు పుట్టఁబోవునది లేదు. ఇట్లు చెప్పుటచేత 'నాయమస్తీత్యేకే' (అనఁగా దేహాభిన్నముగ ఆత్మయనువాఁడొకఁడు లేఁడు) అనుపక్షము న్యాయానుసారము ప్రాప్తింపకపోయినను శ్రుతియే స్వరూపముగా ఆపక్షమునున్నూ క్షణభంగవాదమునున్నూ నిషేధించుచున్నది.

వివరణము:—ఆదియందు నచికేతుఁడు "యేయం ప్రేతే విచికిత్సా మనుష్యే అస్తీత్యేకే నాయమస్తీత్యేకే" అనిపక్షద్వయమును ప్రశ్నించి యున్నాఁడు. ఆపక్షద్వయమునందు 'అస్తీత్యేకే' యనుపక్షమునసరించి 'యేనరూపం రసంగంధం' అను ౨. ౧. ౩. మంత్రము మొదలుకొని అంగుష్ఠ మాత్రఃపురుషో మధ్యఆత్మని తిష్ఠతి. కఠ ౨.౧.౧౨ మంత్రమువఱకుఁగల ౧౦ మంత్రములందు వివరింపఁబడినది. ఈమంత్రమునందు 'నాయమస్తీత్యేకే' అనువారి పక్షము అసంగతమని నిరాకరింపఁబడినదని యెఱుంగవలయును.

౨-వ అధ్యా, ౧-వ వల్లి, ౧౪-వ మంత్రము.

అవ. బ్రహ్మము భేదదర్శనమునకు విరుద్ధమని నిరూపించుచున్నాఁడు.—

మూ. యథోదకం దుర్గే వృష్టం పర్వతేషు విధావతి,
ఏవం ధర్మాన్ పృథక్ పశ్యం స్తానేవానువిధావతి. ౧౪

పద. యథా ఉదకం దుర్గే వృష్టం పర్వతేషు విధావతి, ఏవం ధర్మాన్ పృథక్ పశ్యన్ తాన్ ఏవ అను విధావతి. ౧౪

టీక. దుర్గే=దుర్గమమయిన పర్వతాద్యుచ్చప్రదేశమునందు, వృష్టం = కురిసిన, ఉదకం=జలము,పర్వతేషు=పర్వతనిమ్నప్రదేశములందు, యథా=ఎట్లు, విధావతి=ప్రవహించుచున్నదో, ఏవం=ఈవిధముగా, ధర్మాన్=ఆత్మకంటెభిన్న ములగు,ధర్మములను, పృథక్=వేఱువేఱుగా, పశ్యన్ = చూచుచున్నవాఁడై, తాన్ ఏవ=ఆశరీరభేదములనే, అనువిధావతి=అనుసరించుచున్నాఁడు.

తా. దుర్గమములయినపర్వతాద్యుచ్చప్రదేశములందు వర్షించినయుదకము పర్వతగతములగు నిమ్నప్రదేశములకు ప్రవహించుచున్నదై అభిన్నమై యెట్టులకలసిపోవుచున్నదో అదేవిధముగా ఆత్మకంటెభిన్నములయినధర్మములను ప్రతిశరీరమునందు వేఱువేఱుగా చూచుచున్నవాఁడయి ఆధర్మములనే అనుసరించుచున్నాఁడు. అనఁగా శరీరభేదమునే మాటిమాటికి పొందుచున్నాఁడు.

౨-వ అధ్యా, ౧-వ వల్లి, ౧౫-వ మంత్రము.

అవ. ఉపాధికృతమగు భేదదృష్టి నశించినట్టియుఁ, విశుద్ధవిజ్ఞాన రసైకఘనుఁడగు అద్వయాత్మదర్శనము కలిగినట్టియు, విద్యావంతుఁడయి నట్టియు, మననశీలుఁడయినట్టియు జ్ఞానికి ఆత్మస్వరూప మేవిధముగా ప్రాప్తించు ననువిషయము తెలుపఁబడుచున్నది:—

మూ. యథోదకం శుద్ధే శుద్ధమాసిక్తం తాదృగేవ భవతి,
ఏవం మునే ర్విజానత ఆత్మా భవతి గౌతమ. ౧౫

పద. యథా ఉదకం శుద్ధే శుద్ధం ఆసిక్తం తాదృక్ ఏవ భవతి, ఏవం మునేః విజానత ఆత్మా భవతి గౌతమ. ౧౫

కాఠకోపనిషత్తు ద్వితీయాధ్యాయమునందు
ప్రథమవల్లి సమాప్తము.

టీక. గౌతమ=ఓనచికేతుఁడా! శుద్ధే = పరిశుద్ధమయిన జలమునందు, ఆసిక్తం = పోయఁబడిన, ఉదకం = ఉదకము, తాదృక్ఏవ = అదేవిధముగా పరిశుద్ధమయినది, యథాభవతి = ఏవిధముగా అగుచున్నదో, ఏవం = అదేవిధముగా, విజానతః = జ్ఞానియగు, మునేః = మననశీలునియొక్క, ఆత్మా=ఆత్మ, భవతి=నిర్మలమయినది అగుచున్నది.

తా. పరిశుద్ధమయిన నీటియందు పరిశుద్ధమయిన నీటినిపోసినయెడల ఆజల మేవిధముగా నిర్మలముగా ఏకవిధముగా నుంటున్నదో, అదేవిధముగా మననశీలుఁడయిన ఏకత్వవిజ్ఞానముగల జ్ఞానియొక్కఆత్మయు ఏకరసమయి యుండునని భావము. కావున కుతార్కికులయొక్క భేదదృష్టిని, నాస్తిక దృష్టినివదలి మనయొక్కమాతాపితృసహస్రులకంటె అధికముగ మనహితమును అభిలషించుచున్న వేదముచేత ఉపదేశింపఁబడిన ఆత్మైకత్వదర్శనమును నిరహంకారులయి ఆదరించవలయునని భావము.

వివరణము:—లోకమునందు ఇతరాపేక్షచేత తల్లితండ్రులకే తమ సంతానమునందు ప్రీతికలిగియుండుట సర్వానుభవసిద్ధము. ఎయ్యది ప్రాణులకు హితమో, ఎయ్యది అహితమో అనువిషయము నెఱుంగుటకు సామర్థ్యము శ్రుతికంటె తద్భిన్నుల కుండఁజాలదు. తల్లితండ్రులకంటె వేయిరెట్లధికముగ సకలప్రాణులయందు వేదము హితము కలిగియున్నది కావున అట్టివేదమాత యుపదేశమును నిరసించుట శుభావహముకాదని భావము.

కాఠకోపనిషత్తునందు ఆంధ్రటీకాతాత్పర్యవివరణసహితమగు
ద్వితీయాధ్యాయమునందు ప్రథమవల్లి సమాప్తము.

ప్రథమాదిపరిగణనముచేత చతుర్థవల్లి సమాప్తము.

ఈవల్లికిసంబంధించిన వివరణగ్రంథభాగము
అనుభూతిప్రకాశము-౧౧ అధ్యాయము.
ఆత్మపురాణము-౫ అధ్యాయము.

కఠోపనిషత్తు

ద్వితీయాధ్యాయము—ద్వితీయవల్లి.

(ప్రథమాదిపరిగణనముచేత పంచమవల్లి)

౨-వ అధ్యా, ౨-వ వల్లి, ౧-వ మంత్రము.

అవ. బ్రహ్మతత్త్వము తెలిసికొనుట అధికకష్టమగుటచేత మఱల ప్రకారాంతరముగ నీయధ్యాయమునందు నిరూపింపఁబడుచున్నది:—

మూ. పురమేకాదశద్వార
మజస్యావక్రచేతసః,
అనుష్ఠాయ న శోచతి
విముక్తశ్చ విముచ్యతే. ఏతద్వైతత్. ౧

పద. పురం ఏకాదశద్వారం అజస్య అవక్రచేతసః, అనుష్ఠాయ న శోచతి విముక్తః చ విముచ్యతే. ఏతత్ వై తత్. ౧

టీక. ఏకాదశద్వారం=పదునొకండు ద్వారములుఁగల, పురం=నగరము, అవక్రచేతసః = అకుటిలమయిన - ఏకరూపమయిన విజ్ఞానముగల, అజస్య = ఏపరమాత్మకుఁగలదో (అట్టిపరమాత్మను), అనుష్ఠాయ = ధ్యానించి, నశోచతి= దుఃఖింపఁడు. విముక్తఃచ=రాగద్వేషాదికముచేత వినిర్ముక్తుఁడయి, విముచ్యతే =సంసారబంధమునుండి విముక్తుఁడగుచున్నాఁడు. ఏతత్=ఈమంత్రోక్తమయిన తత్త్వము, తత్ వై=నీవుప్రశ్నించిన ఆయాత్మతత్త్వమే.

తా. పురమనఁగా ఇచట శరీరమని గ్రహించవలయును. ఈశరీరమునకు పురమునకు సమానధర్మములు చాలగలవు. పురమునకు ద్వారములు, ద్వార

పాలకులు, పురాధ్యక్షుఁడు మున్నగు అనేకోపకరణము లుండును. అట్లే ఈ శరీరమునకుకూడ ద్వారములు, ద్వారపాలకులు, అధ్యక్షుఁడు మున్నగు అనేకోపకరణములుండుటచేత దీనిని పురమని చెప్పుటయం దనుపపత్తి యేమియును లేదు. లోకమునందుఁగల ఉపకరణసమన్వితమగు పురసామాన్యము పురమున కంటె భిన్నుఁడగు అధిపతియొక్క అనుభవార్థమనుట ఎట్లు లోకానుభవప్రసిద్ధమో అట్లే పురమువలెనే అనేకోపకరణసమన్వితమగు ఈశరీరముకూడ శరీరవిభిన్నుఁడును, రాజస్థానీయుఁడును అగు అధిపత్యర్థమేయనుట యుక్తమగుచున్నది. అనఁగా శరీరమనెడి యీపురము ఏకాదశద్వారములు కలిగియున్నది. శీర్షణ్యములగు ౭ సప్తద్వారములును, నాభితోకలసి అధోభాగమునందుగల ౩ ద్వారత్రయమును, శిరస్సునం ౧ దొకటియుఁగలసి ౧౧ ద్వారము లగుచున్నవి. ఈపురము రాజస్థానీయుఁడును, జన్మాదివిక్రియారహితుఁడును, పురధర్మ విలక్షణుఁడును అగు ఆత్మకు సంబంధించినదని యెఱుంగవలయును. 'అవక్రచేతసః' అనువిశేషణపదమునకు అర్థాంతరముచెప్పఁబడుచున్నది. అవక్రమనఁగా కుటిలముకానిది--స్వాభావికమయినదని భావము. సూర్యప్రకాశమువలె స్వాభావికము—నిత్యమయిన చేతస్సు—అనఁగా ఏకరూపమయిన విజ్ఞానముగల రాజస్థానీయుఁడగు ఆత్మయొక్క అని గ్రహించవలయును. ఏయాత్మకు ఇట్టి ఏకాదశద్వారములు గలపురము గలదో అట్టిపురమునకు అధిపతియగు పరమేశ్వరుని ధ్యానించి—అనఁగా సమ్యక్ జ్ఞానపూర్వముగా ధ్యానించి సర్వైషణావిరహితుఁడయి ఆట్టిపరమాత్మను సమునిగను, సర్వభూతస్థునిగను తలంచునట్టివాఁడు శోకింపఁడు. పరమార్థవిజ్ఞానమువలన అభయప్రాప్తి కలుగుచున్నది. అభయప్రతిష్ఠ కలిగినప్పుడు శోకావసరముగాని భయదర్శనముగాని కలుగఁజాలదు. ఈశరీరావస్థానసమయమునందే అవిద్యాకృతకామకర్మబంధనములచేత విముక్తుఁడగుచున్నాఁడు. ఇటుల అవిద్యాకృత కామకర్మబంధనములవల్లనుండి విముక్తుఁడయి మఱల శరీరమును ధరింపఁడు. జన్మరాహిత్యమగు మోక్షమును పొందుచున్నాఁడని భావము.

వివరణము:— ఆత్మతత్త్వమునుగూర్చి యిదివఱకు ఎన్నియో విధములుగా నిరూపింపఁబడియున్నదిగదా, మఱల ఆత్మతత్త్వమునుగూర్చియే యీ వల్లియందు యేల వివరింపవలయునని సంశయము కలుగవచ్చునుకాని 'భూయోఽపి పథ్యం వక్తవ్యం' అనున్యాయముననుసరించి మంచివిషయమును గూర్చి చెప్పునప్పుడు ఆవిషయమును సులభముగా గ్రహించుటకు తగినరీతిగా బోధించవలయునేగాని పునరుక్తిదోషము మున్నగువానిని పాటించుట అనావశ్యకమని న్యాయజ్ఞులు తలంచుచున్నారుకావున భంగ్యంతరముగ నిర్దేశింపఁబడుచున్నది.

ఏకాదశద్వారముల వివరణము:—

శీర్షణ్యములు ౭;—నేత్రద్వారములు ౨; శ్రోత్రద్వారములు ౨; నాసికాద్వారములు ౨; ముఖద్వారము ౧=మొత్తము. ౭

నాభితోడ అధోద్వారములు ౩:—నాభి ౧. గుదము ౧. ఉపస్థ ౧. మొత్తము ౩.

బ్రహ్మకపాలము. ౧.

అన్నియుంకలసి మొత్తము ౧౧ ద్వారములని యెఱుంగునది.

శరీరమునకున్నూ శరీరాధిష్ఠితునకున్నూ గల సంబంధము పుర, పురస్వాములకుఁ గలసంబంధమువంటిదని చెప్పుటచేత పురముయొక్క వృద్ధిక్షయముల వలన పురస్వామికి వృద్ధిక్షయము లెటులకలుగఁజాలవో అట్లే శరీరముయొక్క వృద్ధిక్షయములవలన శరీరాధ్యక్షునకుకూడ ఉపచయాపచయములు కలుగఁజాలవని గ్రహించవలయును.

శరీరాధిష్ఠితుఁడు జీవుఁడుగదా, అతనిని ఈశ్వరునిగా నిర్దేశించిచెప్పుట అసంగతముగదా యని సంశయముకలుగవచ్చునుకాని, ఇచట పురస్వామియగు జీవునిగూర్చిచెప్పునప్పుడు 'అజస్య, అవక్రచేతసః' అను ఈశ్వరత్వధర్మములను ర్దేశించిచెప్పుటచేత ప్రత్యగభిన్నుఁడగు ఈశ్వరునకు పురస్వామిత్వముకూడ

సంగతమేయగుచున్న దనుతలంపుతో చెప్పఁబడినది. మూలమునందు 'విముక్తశ్చవిముచ్యతే' అని పునరుక్తిగా చెప్పఁబడినటుల తోఁచుచున్నది. కాని తత్పునరుక్త్యాభాసపరిహారార్థము భాష్యమునందు "ఇహైవావిద్యాకృత కామకర్మబంధనైః విముక్తో భవతి; విముక్తశ్చసన్ విముచ్యతే=పునఃశరీరం న గృహ్ణాతీత్యర్థః" అని పదద్వయమునకు అర్థభేదము పరిగ్రహింపఁబడినది.

౨-వ అధ్యా, ౨-వ వల్లి, ౨-వ మంత్రము.

అవ. ఆయాత్మ పురశబ్దవాచ్యమగు నీదేహమునందుమాత్రమే యుండుట లేదు. ఇఁకనేమనఁగా సర్వపురవర్తియనువిషయమే యీమంత్రమునందు ప్రతిపాదింపఁబడుచున్నది.

మూ. హగ్ంస శ్శుచిష ద్వసు రన్తరిక్షస
ద్ధోతా వేదిష దతిథి ర్దురోణసత్,
నృష ద్వరస దృతస ద్వ్యోమస
దబ్జా గోజా ఋతజా అద్రిజా ఋతం బృహత్. ౨

పద. హంసః శుచిషత్ వసుః అన్తరిక్షసత్ హోతా వేదిషత్ అతిథిః దురోణసత్, నృషత్ వరసత్ ఋతసత్ వ్యోమసత్ అబ్జాః గోజాః ఋతజాః అద్రిజాః ఋతం బృహత్. ౨

టీ. శుచిషత్ = నిష్కళంకమయిన ఆకాశమునందున్నట్టి, హంసః = ఆదిత్యుఁడును, అంతరిక్ష సత్ = అంతరిక్షమునందుండువాఁడును, వేదిషత్ = అగ్నిహోత్రవేదియందున్న, లేక పృథివియందున్న, హోతా=అగ్నిస్వరూపుఁడును, దురోణసత్=ద్రోణకలశమునందున్న, అతిథిః=సోమరసస్వరూపుఁడును, లేక దురోణసత్ = గృహములందు, అతిథిః = అతిథియయిన బ్రాహ్మణుఁడుగా వచ్చినవాఁడును, నృషత్=మనుష్యులందు అంతర్యామిస్వరూపుఁడుగా నుండువాఁడును, వరసత్ = దేవతలం దంతర్యామిస్వరూపుఁడుగా నుండువాఁడును, ఋతసత్ = సత్యమునందు లేక యజ్ఞమునం దధిష్ఠితుఁడయియుండువాఁడును.

వ్యోమసత్ = ఆకాశమునందుండువాఁడును, అబ్జాః = శంఖశుక్తి మకరాదిరూపమున జలములం దుద్భవించువాఁడును, గోజాః = భూమియందు వ్రీహియవాదిరూపమున జనించువాఁడును, ఋతజాః = యజ్ఞాంగరూపమున జన్మించువాఁడును, అద్రిజాః = పర్వతములనుండి నద్యాదిరూపమున జన్మించువాఁడును, ఋతం = సర్వాత్మకుఁడయ్యును అవితథస్వభావుఁడును, బృహాత్ = సర్వకారణుఁ డగుటచేత అందఱికంటె గొప్పవాఁడును, (పైయాత్మ అగుచున్నాఁడు.)

తా. శుచియనఁగా నిర్మలము, అట్టిప్రదేశమునందుండు ఆదిత్యస్వరూపముతో చరించువాఁడు శుచిషత్తు - హంసస్వరూపుఁడు. వసువనఁగా అంతట నివసించువాఁడు, లేక అందఱకు నివాసభూతుఁడు. వాయుస్వరూపమున అంతరిక్షమున చరించువాఁడు అంతరిక్షసత్తు. వేదియనఁగా అగ్నిహోత్రవేది, లేక భూభాగము, అచటనుండువాఁడు వేదిషత్తుహోత యనఁగా అగ్ని. శ్రు. 'అగ్నిర్వైహోతా; వేదిర్వైపరోఽంతఃపృథివ్యాః' అని శ్రుతిప్రమాణ మిట గ్రహించునది. దురోణమనఁగా ద్రోణకలశము, అట్టిద్రోణకలశమునందు సోమరసరూపముననుండువాఁడు దురోణసత్తనంబడును. లేక దురోణమనఁగా గృహము. గృహమునకు అతిథిస్వరూపమున వచ్చినబ్రాహ్మణస్వరూపుఁడు. మనుష్యులం దంతర్యామిస్వరూపముననుండువాఁడు నృషత్తనంబడును. వరులనఁగా మనుష్యులకంటె శ్రేష్ఠులయిన దేవతలు, వారియం దంతర్యామిస్వరూపముననుండువాఁడు వరసత్తనంబడును. ఋతమనఁగా సత్యము లేక యజ్ఞము, దానియందుండువాఁడు ఋతసత్తనంబడును. వ్యోమమనఁగా ఆకాశము, అచటనుండువాఁడు వ్యోమసత్తనంబడును. అప్పులనఁగా జలములు అట్టి అప్పులందు శంఖ, శుక్తి, మకరాదిరూపమున జన్మించువాఁడు అబ్జుఁడనంబడును. గోవనఁగా భూమియందు వ్రీహియవాదిరూపమున జన్మించువాఁడు గోజుఁడనంబడును. ఋతమనఁగా యజ్ఞాంగము, తద్రూపమున జన్మించువాఁడు ఋతజుఁడనంబడును. అద్రులనఁగా పర్వతములు, అట్టిపర్వతములనుండు

వాఁడు వ్యోమసత్తనంబడును. అప్పు లనఁగా జలములు. అట్టి అప్పులందు శంఖ, శుక్తి, మకరాదిరూపమున జన్మించువాఁడు అబ్జుఁ డనంబడును. గో వనఁగా భూమి, ఆభూమియందు వ్రీహియవాదిరూపమున జన్మించువాఁడు గోజుఁడనంబడును. ఋతమనఁగా యజ్ఞాంగము, తద్రూపమున జన్మించువాఁడు ఋతజుఁ డనంబడును. అద్రు లనఁగా పర్వతములు, అట్టి పర్వతములనుండి నద్యాదిస్వరూపమున జన్మించువాఁడు అద్రిజుఁ డనంబడును. ఇట్లు సర్వాత్మకుఁ డగుటయేగాక ఋత మనఁగా అవితథము—అనఁగా సత్యము, అట్టి స్వభావముగలవాఁడు. బృహత్తనఁగా సర్వమునకు కారణభూతుఁ డగుటచేత బృహత్తనంబడును.

ఈమంత్రమునకు వ్యాఖ్యానభూతమగు బ్రాహ్మణమునందు "అసౌ వా ఆదిత్యో హంస శ్శుచిషత్" అని ఆదిత్యపరముగా అర్థము ప్రతిపాదింపఁబడియున్నదిగదా. ఆత్మపరముగా నిచట వ్యాఖ్యానమొనర్చుట యుక్తమేనా? అని కొందఱనుచెడల అట్లయినను మేముచెప్పినవిషయమునం దసంగత మేమియుం లేదు. ఆత్మ సర్వస్వరూపుఁడనియే మేము చెప్పుచున్నారము కావున ఆత్మస్వరూపుఁడగు ఆదిత్యునిగూర్చియే యీమంత్రమునందు వివరింపఁబడినదని తలంచవచ్చును. జగత్తునందు సర్వవ్యాపియగు ఆత్మ యొక్కఁడేకాని ఆత్మభేదముమాత్రము లేదని మంత్రార్థము.

వివరణము:—యజ్ఞమునందు సోమరసమునుంచునట్టి పాత్రవిశేషమునకు ద్రోణకలశ మని పేరు. దురోణమను మూలపదమునకు 'ద్రోణ' మని యర్థాంతరము ఆచార్యులవారిచేత గైకొనఁబడినది.

౨-వ అధ్యా, ౨-వ వల్లి, 3-వ మంత్రము.

అవ. ఆత్మస్వరూపప్రాప్తికి తగినసాధనము చెప్పఁబడుచున్నది:—

మూ. ఊర్ధ్వం ప్రాణ ముస్నయత్యపానం ప్రత్యగస్యతి,
మధ్యే వామనమాసీనం విశ్వేదేవా ఉపాసతే. 3

పద. ఊర్ధ్వం ప్రాణం ఉన్నయతి అపానం ప్రత్యక్ అస్యతి, మధ్యే వామనం ఆసీనం విశ్వే దేవాః ఉపాసతే.

టీక. (యః=ఎవ్వఁడు), ప్రాణం=ప్రాణవృత్తిని, ఊర్ధ్వం=హృదయము కంటె ఊర్ధ్వముగా, ఉన్నయతి = పొందించుచున్నాఁడో, (అదేవిధముగా) అపానం = అపానవృత్తిని, ప్రత్యక్ అస్యతి = అధోభాగమునకు నెట్టివేయుచున్నాఁడో, మధ్యే=హృదయకమలముయొక్క మధ్యభాగమునందు, ఆసీనం= ఉన్నవాఁడున్నూ, వామనం=అందఱిచేత పొందఁదగిన (తం=అట్టియాత్మను), విశ్వేదేవాః=దేవతలందఱు, ఉపాసతే=ఉపాసించుచున్నారు.

తా. ఏఆత్మ హృదయకమలమునుండి ప్రాణవృత్తిని ఊర్ధ్వభాగమును పొందించుచున్నాడో, అదేవిధముగా అపానవృత్తిని అధోభాగమునకు పొందించుచున్నాడో అట్టియాత్మ హృదయకమలాంతర్వర్తియగు దహరాకాశమునందు నివసించుచున్నాఁడు. ఆయాత్మ అందఱకు సేవింపఁదగినవాఁడు. అట్టియాత్మనే దేవతలందఱు ఉపాసించుచున్నారు. ఇది అధిదేవార్థము. అధ్యాత్మపరము—దేవతలనఁగా చక్షురాదీంద్రియములు (సామాన్యజనులు సార్వభౌముని కానుకలను చేతియందుంచుకొని యెటుల సేవించుచున్నారో అదే విధముగా) రూపాదివిజ్ఞానరూప మగు బలిని ఆత్మకు సమర్పించుచున్నవై సర్వదా సేవించుచున్నవి. దీనివలన రూపాదివిజ్ఞానకర్తకంటె భిన్నుఁడయి ఆత్మ ప్రకాశించుచున్నాఁడని సిద్ధించుచున్నది.

౨-వ అధ్యా, ౨-వ వల్లి, ౪-వ మంత్రము.

మూ. అస్య విస్రంసమానస్య శరీరస్థస్య దేహినః,
దేహా ద్విముచ్యమానస్య కి మత్ర పరిశిష్యతే.
ఏతద్వై తత్.

పద. అస్య విస్రంసమానస్య శరీరస్థస్య దేహినః, దేహాత్ విముచ్యమానస్య కిం అత్ర పరిశిష్యతే, ఏతత్ వై తత్.

టీక. దేహినః=దేహముగలవాఁడై, శరీరస్థస్య=దేహమునందున్నవాఁడై, విస్రంసమానస్య=దేహమునుండి జారిపోవుచున్న, అస్య=ఈయాత్మ, దేహాత్=దేహమునుండి, విముచ్యమానస్య (సతః) = విడువఁబడుచుండఁగా, అత్ర=ఈ దేహమునందు, కిం పరిశిష్యతే=ఏమి మిగిలియుండును. ఏతత్=ఇది, తత్ వై= అదియేగదా.

తా. ఈదేహము నాశ్రయించియున్న యాత్మ యీదేహమును వదలి పోయినపిదప యీదేహమునందు మఱేమి నిలిచియుండును? ఏమియు నిలిచి యుండఁజాలదని భావము. ఆపత్సమయమునందు నగరాధ్యక్షుఁడగు రాజు నగరమునువిడిచి పారిపోయినాఁడను విషయము తెలిసినవెంటనే నగరవాసులగు ప్రజలందఱును భయంపడి యెటులపారిపోవుచున్నారో ఆదేవిధముగా దేహము నగరమునకు అధిపతియగు ఆత్మ దేహమును వదలిపోవుచుండగనే కార్యకరణ కలాపరూపమగు ప్రాణాదికమంతయు హతబలమయి కూలిపోవు చున్నదని యెఱుంగవలయును. దీనివలన ప్రాణాదికముకంటె ఆత్మ అన్యుఁడని సిద్ధించుచున్నది.

౨-వ అధ్యా, ౨-వ వల్లి, ౫-వ మంత్రము.

మూ. న ప్రాణేన నాపానేన మర్త్యో జీవతి కశ్చన,
ఇతరేణ తు జీవన్తి యస్మిన్నేతావుపాశ్రితౌ. ౫

పద. న ప్రాణేన న అపానేన మర్త్యః జీవతి కః చ న, ఇతరేణ తు జీవన్తి యస్మిన్ ఏతౌ ఉపాశ్రితౌ.

టీక. ప్రాణేన = ప్రాణముచేతఁగాని, అపానేన = అపానముచేతఁగాని, కశ్చనమర్త్యః=ఒకానొకమనుష్యుఁడున్ను, నజీవతి=జీవించుటలేదు. యస్మిన్ = ఏయాత్మయుండఁగా, ఏతౌ = ఈప్రాణాపానములు, ఉపాశ్రితౌ = ఆశ్రయించియున్నవో, (అట్టి) ఇతరేణతు=ప్రాణాపానవ్యతిరిక్తమయిన ఆత్మచేతనే, జీవంతి=(మర్త్యులు) ప్రాణములను ధరించుచున్నారు.

తా. లోకమునందు ప్రాణులెవ్వరు, ప్రాణవాయువుచేతగాని లేక అపానవాయువుచేతగాని లేక చక్షురాదీంద్రియములచేతగాని జీవించుటలేదు. పరార్థము కలసియున్న ప్రాణాపానచక్షురాదిక మెప్పుడును జీవనహేతుకము కాఁజాలదు. సంఘాతమయిన గృహాదికము పరప్రేరితముగ లోకమునందు గనంబడుచున్నదేగాని స్వతంత్రముగ నెచ్చటను గనంబడుచుండుటలేదు. కావున అదేవిధముగా సంఘాతములయిన ప్రాణాపానచక్షురాదికములుకూడ ప్రాణాదికముకంటె విభిన్నుఁడగు ఆత్మచేతనే జీవించుచున్నవి. ప్రాణాపానచక్షురాది విలక్షణుఁడగు ఏయాత్మయుండుటచేతనే ప్రాణాపానాదికములు చక్షురాదిసంహతమునందు చేరి ఈ సంఘాతమునందు చేరని ఆత్మను స్వస్వవ్యాపారములతో సేవించుచున్నవో అట్టియాత్మ యీసంఘాతముకంటె విభిన్నుఁడను విషయము స్పష్టముగనే సిద్ధించుచున్నదిగదా.

౨-వ అధ్యా, ౨-వ వల్లి, ౬-వ మంత్రము.

మూ. హన్త త ఇదం ప్రవక్ష్యామి గుహ్యం బ్రహ్మ సనాతనం,
యథా చ మరణం ప్రాప్య ఆత్మా భవతి గౌతమ.

పద. హన్త త ఇదం ప్రవక్ష్యామి గుహ్యం బ్రహ్మ సనాతనం, యథా చ మరణం ప్రాప్య ఆత్మా భవతి గౌతమ.

టీక. గౌతమ = ఓనచికేతుఁడా! (ఏబ్రహ్మతత్త్వమును తెలిసికొనని యెడల) మరణం = మరణమును, ప్రాప్య=పొంది, ఆత్మా = దేహము, యథా= ఏవిధముగా, భవతి=కలుగుచున్నదో, (తథా=అట్టి.) సనాతనం = అతిప్రాచీనమును, గుహ్యం=అతిరహస్యమునుఅగు, ఇదం=ఈ, బ్రహ్మ=బ్రహ్మమునుగూర్చి, హంత=ఇప్పుడు, తే=నీకు ప్రవక్ష్యామి=చెప్పఁగలను.

తా. ఓగౌతముఁడా! ఏబ్రహ్మమును ఎఱింగినయెడల సంసారము యొక్క ఉపరతి కలుగుచున్నదో, ఏబ్రహ్మము నెఱుంగనియెడల మరణమును పొంది జననమరణరూపమగు సంసారమును నిరంతరము పొందుచుండునో.

అట్టి అతిప్రాచీనమును అతిరహస్యమును అగు బ్రహ్మమును నీకు బోధింపఁగలను.

వివరణము:—'యేయం ప్రేతే విచికిత్సా మనుష్యే' అని ప్రశ్నించినప్పుడు పరలోకాస్తిత్వవిషయమై నచికేతునకు సంశయము కలిగియుండెను. తత్సంశయనిరాసార్థ మీమంత్రము చెప్పఁబడినది.

౨-వ అధ్యా, ౨-వ వల్లి, ౭-వ మంత్రము.

మూ. యోనిమన్యే ప్రపద్యన్తే శరీరత్వాయ దేహినః,
స్థాణుమన్యేఽనుసంయన్తి యథాకర్మ యథాశ్రుతమ్.

పద. యోనిం అన్యే ప్రపద్యన్తే శరీరత్వాయ దేహినః, స్థాణుం అన్యే అను సంయన్తి యథాకర్మ యథాశ్రుతం.

టీక. యథాకర్మ = వారువారు జన్మాంతరములందుచేసిన పుణ్యపాపకర్మము ననుసరించియును, యథాశ్రుతం = వారువారుపొందిన విజ్ఞానము ననుసరించియు, అన్యేదేహినః=కొందఱుజీవులు, శరీరత్వాయ=శరీరగ్రహణార్థము, యోనిం ప్రపద్యంతే=గర్భవాసమును పొందుచున్నారు. అన్యే దేహినః=కొందఱు జీవులు, స్థాణుం=వృక్షాదిస్థావరభావమును, అనుసంయంతి=పొందుచున్నారు.

తా. పూర్వజన్మమునం దెవ్వరెట్టి కర్మల నాచరించిరో, ఎవ్వరెట్టి ఉపాసనాదికము నాచరించిరో అట్టిప్రాణులు తాము జన్మాంతరములం దొనర్చిన పుణ్యపాపకర్మలకు ఉపాసనలకు తగినటుల తిరిగి శరీరమును పొందుటకయి మాతా పితృ గర్భవాసము ననుభవించి (మనుష్యాదులుగనో పశుపక్ష్యాదులుగనో) పుట్టుచున్నారు. అధములయినవారలు వృక్షాదిస్థావరభావమును పొందుచున్నారు. 'యథా ప్రజ్ఞం హి సంభవాః' అను శ్రుత్యంతరముకూడ ఈవిషయమునే ప్రతిపాదించుచున్నది.

వివరణము:—౧ శ్రు. తద్య ఇహ రమణీయచరణాః అభ్యాశోహ యత్తే రమణీయాం యోని మాపద్యేరన్ బ్రాహ్మణయోనిం వా క్షత్రియ

యోనింవా వైశ్యయోనిం వాఽథ య ఇహ కపూయచరణా అభ్యాశోహ యత్తే కపూయాం యోని మాపద్యేరన్ శ్వయోనిం వా సూకరయోనిం వా చాండాలయోనిం వా. ఛాందో ౫. ౧౦. ౭.

౨. శ్రు. తం విద్యాకర్మణీ సమన్వారభేతే పూర్వప్రజ్ఞా చ.

3. స్మృతి:—వర్ణా ఆశ్రమాశ్చ స్వకర్మనిష్ఠాః ప్రేత్య కర్మఫల మనుభూయ తతశ్శేషేణ విశిష్టదేశ జాతికులరూపాయుశ్శ్రుతవృత్త విత్త సుఖమేధసో జన్మ ప్రతిపద్యంతే. గౌతమధర్మ సూత్ర. ౨. ౧౧. ౨౯.

మున్నగు శ్రుతిస్మృతు లనేకము లీయర్థమును అనువదించుచున్నవి.

పాపములు ౧. వాచికములు, ౨. మానసములు, 3. శారీరకములు అని త్రివిధములు. అందులో శరీరసంబంధములయిన పాపకార్యములను అధికముగా నొనర్చినయెడల స్థావరజన్మమును, వాచికపాపాధిక్యము చేత పక్షిమృగాదిజన్మమును, మానసపాపాధిక్యము చేత అంత్యజాతిత్వమును పొందునని మనుస్మృతియం దిట్లు చెప్పఁబడినది:—

శ్లో. శరీరజైః కర్మదోషైః యాతి స్థావరతాం నరః,
వాచికైః పక్షిమృగతాం మానసై రన్త్యజాతితామ్.

(మనుస్మృతి. ౧౨. ౯)

౨-వ అధ్యా, ౨-వ వల్లి, ౮-వ మంత్రము.

అవ. "గుహ్యం బ్రహ్మ ప్రవక్ష్యామి" యని ౬-వ మంత్రమునందు చేసినప్రతిజ్ఞ ననుసరించి ఆబ్రహ్మమునుగూర్చి చెప్పుచున్నారు:—

మూ. య ఏష సుప్తేషు జాగర్తి
కామం కామం పురుషో నిర్మిమాణః,
త దేవ శుక్రం తద్బ్రహ్మ
తదేవామృతముచ్యతే,

తస్మింల్లోకా శ్రితా స్సర్వే
తదు నాత్యేతి కశ్చన. ఏతద్వైతత్

పద. యః ఏషః సుప్తేషు జాగర్తి కామం కామం పురుషః నిర్మిమాణః, తత్ ఏవ శుక్రం తత్ బ్రహ్మ తత్ ఏవ అమృతం ఉచ్యతే, తస్మిన్ లోకాః శ్రితాః సర్వే తత్ ఉ న అత్యేతి కః చ న, ఏతత్ వై తత్.

టీక. సుప్తేషు = (అంతఃకరణవ్యతిరిక్తములయిన ప్రాణాదిసకలేంద్రియములు) నిద్రించిన వగుచుండఁగా, కామంకామం=అయాకామములను, నిర్మిమాణః=నిర్మించుచు, యః=ఏ, ఏషః=ఈ, పురుషః=పురుషుఁడు, జాగర్తి =మేల్కొనుచున్నాఁడో, (తానుమాత్రము నిద్రింపఁడో) తదేవ = ఆపురుషుఁడే, శుక్రం=పరిశుద్ధమయిన, తత్ బ్రహ్మ=ఆబ్రహ్మము, తత్ ఏవ = అదియే (ఆబ్రహ్మమే), అమృతం=అమృతమని, ఉచ్యతే=చెప్పఁబడుచున్నది. తస్మిన్= ఆబ్రహ్మమునందే, సర్వేలోకాః=పృథివ్యాదిలోకములన్నియు, శ్రితాః=ఆశ్రయించియున్నవి, కశ్చన=ఒకఁటియుఁను, తత్ = దానిని, న అత్యేతి ఉ = అతిక్రమింపఁజాలదుగదా. ఏతత్=ఇది, తద్వై=నీవడిగిన ఆబ్రహ్మమేగదా.

తా. అంతఃకరణ వ్యతిరిక్తములగు ప్రాణాదీంద్రియములు నిద్రించుచుండఁగా తానుమాత్రము నిద్రింపక జాగరూకుఁడయి అవిద్యచేత ప్రకల్పించిన వనితాద్యభీష్టజాతమును ఏపురుషుఁడు నిర్మించుచున్నాఁడో అతఁడే పరిశుద్ధమయినట్టియు నిగూఢమయినట్టియు పరబ్రహ్మము, ఇంతకంటె భిన్నముగ బ్రహ్మమనునది లేదు. ఇదియే అమృతము—అనఁగా వినాశరహితమని సర్వశాస్త్రములందు చెప్పఁబడుచున్నది. పృథివ్యాది సకలలోకములు సర్వలోకములకు కారణభూతుఁడగు ఆబ్రహ్మమునందే ఆశ్రయించియున్నవి. అట్టి బ్రహ్మముకంటె భిన్నముగనుండునట్టి వస్తువే లేదు. ఇదియే నీవడిగిన బ్రహ్మము.

౨-వ అధ్యా, ౨-వ వల్లి, ౮-వ మంత్రము.

అవ. ఆత్మైకత్వవిజ్ఞానమునుగూర్చి ఇదివఱకు బోధించియున్నను కుతార్కికులగువారలు వచించెడి యుక్త్యాభాసములచేత సంశయితచిత్తులగు

వారినిమిత్తమయి బ్రహ్మైకత్వవిజ్ఞానమును పునరుక్తిదోషమును పాటింపక పలుసారులు బోధించవలయునని కుతూహలముగల భగవతియగు శ్రుతి మఱల ఆత్మైకత్వవిజ్ఞానమును యీ క్రిందిమంత్రములతో ప్రతిపాదించుచున్నది:—

మూ. అగ్ని ర్యథైకో భువనం ప్రవిష్టో
రూపం రూపం ప్రతిరూపో బభూవ,
ఏక స్తథా సర్వభూతా న్తరాత్మా
రూపం రూపం ప్రతిరూపో బహిశ్చ. ౯

పద. అగ్నిః యథా ఏకః భువనం ప్రవిష్టః రూపం రూపం ప్రతిరూపః బభూవ, ఏకః తథా సర్వభూతాన్తరాత్మా రూపం రూపం ప్రతిరూపః బహిః చ.

టీక. యథా=ఏవిధముగా, ఏకః=ఒక్కఁడైన, అగ్నిః=అగ్ని, భువనం=లోకమును, ప్రవిష్టః=ప్రవేశించినదై, రూపంరూపం = దాహ్యమగు ప్రతిదార్వాది భేదమునుగూర్చి, ప్రతిరూపః = ఆయాదాహ్యమునకుతగిన రూపమును గలది, బభూవ = ఆయెనో, తథా = ఆదేవిధముగా, ఏకః=ఏకవిధుఁడగుపురుషుఁడే, సర్వభూతాంతరాత్మా = సర్వభూతములకు అంతరాత్మయై, బహిఃచ=వెలుపలనున్నా, రూపంరూపం = ప్రతిరూపమునుగూర్చి, ప్రతిరూపః=సమానమయిన రూపముగలవాఁడు, (బభూవ=ఆయెను.)

తా. ప్రకాశస్వభావుఁడగు అగ్నియొక్కఁడే లోకమునందుగల దాహ్యమగు దార్వాదికమును ప్రవేశించి ఆయాదాహ్య పదార్థమునకుఁదగిన రూపముగలవాఁ డెట్లగుచున్నాఁడో-అనఁగా ఎట్టికాష్ఠమును కాల్చునో ఆకాష్ఠముయొక్క వక్రత్వాదికము ననుసరించి అగ్నికూడ వక్రత్వాదిగుణములు కలిగియున్నటుల యెటులగనంబడుచుండునో, అదేవిధముగా ఒక్కఁడే అయిన ఆత్మయే సర్వభూతములందు సర్వదేహములందు అతిసూక్ష్మరూపమున అంతరాత్మభూతుఁడయి ప్రవేశించి ఆయాదేహములకు తగినరూపముగల

వాఁడు అగుచున్నాఁడు. ఆకాశమువలె వికారరహితుఁడయి లోపలవెలుపల ప్రకాశించుచున్నాఁడు.

౨-వ అధ్యా, ౨-వ వల్లి, ౧౦-వ మంత్రము.

అవ. మఱొకదృష్టాంతము చెప్పఁబడుచున్నది:—

మూ. వాయు ర్యథైకో భువనం ప్రవిష్టో
రూపం రూపం ప్రతిరూపో బభూవ,
ఏక స్తథా సర్వ భూతా న్తరాత్మా
రూపం రూపం ప్రతిరూపో బహిశ్చ. ౧౦

పద. వాయుః యథా ఏకః భువనం ప్రవిష్టః రూపం రూపం ప్రతిరూపః బభూవ, ఏకః తథా సర్వభూతా న్తరాత్మా రూపం రూపం ప్రతిరూపః బహిః చ. ౧౦

టీక. యథా = ఏవిధముగా, ఏకఃవాయుః = ఒక్కటియగువాయువు, భువనంప్రవిష్టః=లోకమును ప్రవేశించినదై, రూపంరూపం = ప్రతిదేహమును గూర్చి, ప్రతిరూపః = సమానమయినరూపముగలది, బభూవ = ఆయెనో, తథా=అదేవిధముగా, ఏకః = ఒక్కఁడయిన ఆత్మయే, సర్వభూతాంతరాత్మా= అంతరాత్మస్వరూపముతో సర్వభూతము లందున్నవాఁడయి, బహిఃచ = వెలుపలను ఉన్నవాఁడయి, ప్రతిరూపః = సమానమయిన రూపముగలవాఁడు, బభూవ=ఆయెను.

తా. ఓనచికేతుఁడా! ఒక్కటియగువాయువు, ప్రాణాత్మకముచేత సకలప్రాణుల దేహమునందు ప్రవేశించి ఆయాప్రాణులకు తగినటుల ఆయా రూపములు గలిగి యెటుల నున్నదో ఆదేవిధముగా ఒక్కఁడేయగుఆత్మయు సకలభూతాంతరాత్మయై వెలయుచు లోపలవెలుపల ఆయారూపములకు తగిన రూపములు గలవానివలె ప్రకాశించుచున్నాఁడు.

౨-వ అధ్యా, ౨-వ వల్లి, ౧౧-వ మంత్రము.

అవ. ఒక్కఁడే సర్వాత్మకుఁడయినయెడల అప్పుడు సంసారిత్వము దుఃఖిత్వము పరుఁడగు పురుషునకే సంభవించునని సిద్ధించుచున్నదిగదాయని సంశయించి అట్టిదిలేదనుటకుగాను యీమంత్రము చెప్పఁబడుచున్నది:—

మూ. సూర్యో యథా సర్వలోకస్య చక్షుః
నలిప్యతే చాక్షుషై ర్బాహ్యదోషైః,
ఏక స్తథా సర్వభూతా న్తరాత్మా
న లిప్యతే లోకదుఃఖేన బాహ్యః.

పద. సూర్యః యథా సర్వలోకస్య చక్షుః న లిప్యతే చాక్షుషైః బాహ్యదోషైః, ఏకః తథా సర్వభూతా న్తరాత్మా న లిప్యతే లోకదుఃఖేన బాహ్యః.

టీక. సూర్యః=సూర్యుఁడు, సర్వలోకస్య = సకలప్రాణులకు, చక్షుః = నేత్రభూతుఁడైనను, చాక్షుషైః = నేత్రసంబంధములయిన, బాహ్యదోషైః = అశుచ్యాది పదార్థదర్శనసంబంధములగు బాహ్యదోషములచేత, యథా = ఏవిధముగా, నలిప్యతే=తాఁకఁబడఁడో, తథా = అదేవిధముగా, ఏకః=ఒక్కఁడగు, సర్వభూతాంతరాత్మా=సర్వభూతములం దంతరాత్మస్వరూపమున నుండు పురుషుఁడు, లోకదుఃఖేన = లోకసంబంధమయిన దుఃఖము చేత, నలిప్యతే = స్పృశింపఁబడఁడు. (సః=ఆదుఃఖము) బాహ్యః = వెలుపలిది (బ్రహ్మమునకు సంబంధించినది కాదనుట.)

తా. సూర్యుఁడు ప్రాణిసమూహముయొక్క చక్షురింద్రియమునకు దర్శనోపకారము నొనర్చుచున్నవాఁడయి అపవిత్రపదార్థములగు మూత్రపురీషాదులనుకూడ గాంచుచున్నను అశుచ్యాదిదర్శననిమిత్త దోషములచేత నెటులతాఁకబడుటలేదో అదేవిధముఁగా ఒక్కఁడయిన ఆత్మ సర్వభూతాంతర్వర్తియైనను లోకదుఃఖముచేత స్పృశింపఁబడుటలేదు. ఈలోకదుఃఖము

బాహ్యముగాని ఆత్మకు సంబంధించినదికాదు. లోకమునందుగల ప్రాణిసమూహము అవిద్యావిమోహితమయి కామకర్మోద్భవమగు దుఃఖమును తనయందారోపించుకొని దుఃఖించుచున్నది. నిజముగా పరమాత్మకు దుఃఖమనునది లేదు. రజ్జువునందు సర్పమున్నూ, ముత్తెపుచిప్పయందు వెండియున్నూ, మరుమరీచికలందు ఉదకమున్నూ, ఆకాశమునందు కమలమున్నూ వాస్తవముగా లేకపోయినప్పటికిన్ని అవిద్యానిమిత్తమయిన విపరీతబుద్ధిచేత ఆయాసర్పాదికమున్నటుల అజ్ఞులచేత భావింపఁబడుచున్నది. ఆవిపరీత బుద్ధ్యధ్యస్తములయిన సర్పాదులచేత రజ్జ్వాదికములకు సంభవించిన దోషమేమియుం లేదు. సర్పాద్యధ్యాసము బాహ్యమేగాని రజ్జ్వాదినిష్ఠముగాదు. అదేవిధముగా నిర్వికారుఁడును నిర్మలుఁడును అగుఆత్మయందు అజ్ఞానవిమోహితమగు లోకమంతయుం క్రియాకారక ఫలాత్మకమును సర్పాదిస్థానీయమును అగువిజ్ఞానమును, విపరీతముగ తన్నిమిత్తముగా జన్మజరామరణాది దుఃఖమును అనుభవించుచున్నది. ఆత్మ సర్వలోకములకు స్వరూపభూతుఁడయినను విపరీతాధ్యారోపనిమిత్తమగు లోకదుఃఖముచేత స్పృశింపఁబడఁడు. ఏలయనఁగా ఈలోకదుఃఖము బాహ్యమేగాని ఆత్మసంబంధముకాదు. రజ్జ్వాదికమునందు విపరీతబుద్ధిచేత కల్పితమయిన సర్పాదికము రజ్జుసంబంధముగాక రజ్జువుకంటె బాహ్యమెటుల యగుచున్నదో అట్లే లోకదుఃఖము బాహ్యమేగాని ఆత్మకు సంబంధించినదికాదు.

౨-వ అధ్యా, ౨-వ వల్లి, ౧౨-వ మంత్రము.

మూ. ఏకో వశీ సర్వభూతాన్తరాత్మా
ఏకం రూపం బహుధా యః కరోతి,
తమాత్మస్థం యే ఽనుపశ్యన్తి ధీరా
స్తేషాం సుఖం శాశ్వతం నేతరేషామ్.

౧౨. ఏకః వశీ సర్వభూతాన్తరాత్మా ఏకం రూపం బహుధా యః కరోతి, తం ఆత్మస్థం యే అనుపశ్యంతి ధీరాః తేషాం సుఖం శాశ్వతం న ఇతరేషామ్.

టీక. ఏకః = (తనకంటె అల్పుఁడును, అధికుఁడును, తనతో సమానుఁడును అగువాఁడు) మఱొక్కఁడు లేనివాఁడును, వశీ=సర్వజగత్తు స్వాధీనముగాఁ గలవాఁడును, సర్వభూతాంతరాత్మా = సర్వభూతములకు అంతరాత్మస్వరూపుఁడును (అగు) యః=ఏయాత్మ, ఏకంరూపం=శుద్ధవిజ్ఞానఘనరూపుని, బహుధా = అనేకవిధములుగలవానినిగా, కరోతి = చేయుచున్నాఁడో, యే ధీరాః=ఏవిద్వాంసులు, ఆత్మస్థం = స్వశరీరహృదయాకాశాంతర్గతమగు, బుద్ధిగుహాయందున్న, తం=ఆయాత్మను, అనుపశ్యంతి = చూచుచున్నారో, తేషాం =వారికే, శాశ్వతం సుఖం=శాశ్వతమయిన సుఖము, ఇతరేషాం = ఇతరులకు, న=అట్టిసుఖము లేదు.

తా. ఆపరమేశ్వరుఁడు సర్వగతుఁడు, స్వతంత్రుఁడు, అతనికి సముఁడుగాని అతనికంటె అధికుఁడుగాని అల్పుఁడుగాని మఱొక్కఁడు లేఁడు. అతని యధీనమునందే సకలజగత్తు గలదు. ఏలయనఁగా అతఁడు సర్వభూతములకు అంతరాత్మభూతుఁడగుటచేత, అతఁడు తాను విశుద్ధవిజ్ఞానఘనస్వరూపముతో అద్వితీయుఁడైనను నామరూపాద్యశుద్ధోపాధిసంబంధముచేత అనేకప్రకారములుగా నొనర్చుచున్నాఁడు. ఇటుల అతఁడొనర్చుట తనయొక్క అచింత్యమహిమచేతనేగాని సాధనాంతరసహాయముచేత మాత్రముగాదు. స్వశరీరహృదయాకాశము నందుండువానిని - అనఁగా బుద్ధియందు చైతన్యాకారముతో వెలయువానిని, ఆత్మ ఆకాశమువలె అమూర్తగుణము గలవాఁడగుటచేత ఆత్మకు శరీరము ఆధారమనిచెప్పుట యుక్తముకాదుగదా. ఇందులకు దృష్టాంతము 'ఆదర్శస్థం ముఖం' అనఁగా అద్దమునందు ముఖమున్నది. అట్టియీఆత్మను ధీరులయినఏవిద్వాంసులు బాహ్యవిషయములనుండి విముఖములయిన ఇంద్రియవృత్తులుగలవారలయి ఆచార్య, శాస్త్రోపదేశ,

స్వానుభవములతోఁ గాంచుచున్నారో, ఈశ్వరతుల్యులగు అట్టివిద్వాంసులగు వారికే శాశ్వతసుఖము—అనఁగా ఆత్మానందలక్షణమగు సుఖము కలుగునుగాని తదితరులకు అనఁగా బాహ్యవిషయాసక్తబుద్ధులగు అవివేకులకు శాశ్వతసుఖము స్వాత్మభూతమయినప్పటికిన్ని అవిద్యా వ్యవధానమువలన కలుగఁజాలదు.

౨-వ అధ్యా, ౨-వ వల్లి, ౧౩-వ మంత్రము.

మూ. నిత్యోఽనిత్యానాం చేతనశ్చేతనానా
మేకో బహూనాం యో విదధాతి కామాన్,
త మాత్మస్థం యేఽను పశ్యన్తి ధీరా
స్తేషాం శాన్తి శ్శాశ్వతీ నేతరేషామ్. ౧౩

పద. నిత్యః నిత్యానాం చేతనః చేతనానాం ఏకః బహూనాం యః విదధాతి కామాన్, తం ఆత్మస్థం యే అనుపశ్యన్తి ధీరాః తేషాం శాన్తిః శాశ్వతీ న ఇతరేషామ్. ౧౩

టీక. ఏకః=ఒక్కఁడగు, యః=ఏపరమేశ్వరుఁడు, బహూనాం = అనేకులకు, కామాన్ = (వారివారి కర్మలకు తగిన) ఫలములను, విదధాతి = ఇచ్చుచున్నాఁడో, సః = ఆపరమేశ్వరుఁడు, నిత్యానాం = అవినాశులయిన వానిలోపల, నిత్యః=నిత్యమైనటువంటివాఁడు, చేతనానాం=చైతన్యముగల బ్రహ్మాదిస్తంబపర్యంతము గలప్రాణులలోపల, చేతనః = చేతనస్వరూపుఁడు. ఆత్మస్థం= ఆత్మ యనఁగా స్వశరీర హృదయాకాశాంతరస్థబుద్ధిగుహాయందు అభివ్యక్తిగల, తం = ఆయాత్మను, యేధీరాః = ఏవిద్వాంసులు, అనుపశ్యంతి=చూచుచున్నారో, తేషాం = అట్టివారికే, శాశ్వతీశాంతిః = నిత్యమయిన శాంతిసుఖము, ఇతరేషాం = తద్భిన్నులయినవారికి, న = అట్టి శాశ్వతమయినశాంతిసుఖములేదు.

తా. ఆపరమేశ్వరుఁడు వినాశరహితములగు పదార్థములలోపల నిత్యుఁడు, చైతన్యముగల బ్రహ్మాదిప్రాణులకు చేతనభూతుఁడు. అగ్నిభిన్నములగు ఉద

కాదికములకు ఉష్ణత్వము, అగ్నినిమిత్తము అని ఎట్లుసిద్ధించుచున్నదో అట్లే బ్రహ్మావిభిన్నము లగుపదార్థములకు చైతన్యత్వము ఆత్మచైతన్యనిమిత్తమేయని యెఱుంగవలయును. ఆపరమేశ్వరుఁడు, సర్వజ్ఞుఁడు, సర్వేశ్వరుఁడు. అతఁడు తానొక్కఁడే యయ్యును అనేకులగు సంసారులకు వారివారి కర్మలకుతగినఫలమును - స్వానుగ్రహానిమిత్తమయినదానిని అనాయాసముగా ఇచ్చుచుండును. హృదయాకాశాంతస్థుఁడగు అట్టియాత్మను ఏవిద్వాంసులు స్వానుభవపూర్వకముగ గురుశాస్త్రోపదేశసహాయమున నెఱుంగుదురో అట్టివారికే శాశ్వతానందముగాని తద్భిన్నులకు శాశ్వతానందము లేదని భావము.

౨-వ అధ్యా, ౨-వ వల్లి, ౧౪-వ మంత్రము.

మూ. తదేతదితి మన్యన్తే ఽనిర్దేశ్యం పరమం సుఖం,
కథన్నుతద్విజానీయాం కిము భాతి విభాతి వా.

పద. తత్ ఏతత్ ఇతి మన్యన్తే అనిర్దేశ్యం పరమం సుఖం, కథం ను తత్ విజానీయాం కిం ఉ భాతి విభాతి వా.

టీక. అనిర్దేశ్యం=ఇట్టిదని నిర్ణయించిచెప్పుటకు శక్యముకాని, పరమం=శ్రేష్ఠమయిన, సుఖం=సుఖమనునది ఎయ్యదిగలదో, తత్=ఆసుఖము, ఏతత్ ఇతి=ఇయ్యది అని, మన్యంతే = (బ్రహ్మవేత్తలు) తలంచుచున్నారు. తత్ = అది, భాతివాకిము = ప్రకాశించుచున్నదా? విభాతివాకిము = అస్మదాది బుద్ధిగోచరముగా స్పష్టముగా ప్రకాశించుచున్నదా? (అనువిషయమును) కథంను=ఏప్రకారముగా, విజానీయాం=నేను తెలిసికొనఁగలను ?

తా. ఈయాత్మవిజ్ఞానమను సుఖము ఇట్టిదని నిర్ణయించిచెప్పుటకు శక్యమయినదికాదు. మఱియు మిక్కిలిశ్రేష్ఠమయినది. ఇది ప్రాకృతపురుషులకు అవాఙ్మానసగోచరమైనను బాహ్యవిషయములనుండి మఱలింపఁబడిన ఇంద్రియవృత్తులు గలవారగుటచేత ఈషణాత్రయవివర్జితులయిన బ్రహ్మవేత్తలకుమాత్రము కరతలామలకమువలె ప్రత్యక్షముగ గోచరీభూతమగు

చున్నది. అట్టి నిరతిశయసుఖమును నేనెట్లుపొందఁగలను ? అనఁగా ఈషణా త్రయవిరహితులగు బ్రహ్మవేత్తలు అట్టి శాశ్వతసుఖము ఇట్టిదని స్వానుభవ పూర్వకముగా నెట్లెఱింగిరో అట్టి స్వాత్మానుభవము నాకెట్లు ప్రాప్తించును ? ప్రకాశాత్మకమగుటచేత అది ప్రకాశించుచునే యుండుట సహజమేగాని అయ్యది సాధారణుఁడనగు నాయొక్కబుద్ధికి గోచరమగునది ఎట్లు ? లేక నావంటివానిబుద్ధికి ప్రకాశింపదా?

౨-వ అధ్యా, ౨-వ వల్లి, ౧౫-వ మంత్రము.

అవ:—వెనుకయడిగిన ప్రశ్నమునకు 'భాతి, విభాతిచ' యని ఉత్తరము చెప్పఁబడుచున్నది. ఎట్లనఁగా:—

మూ. న తత్ర సూర్యో భాతి న చన్ద్రతారకం
నేమా విద్యుతో భాన్తి కుతో౽యమగ్నిః,
తమేవ భాన్త మనుభాతి సర్వం
తస్య భాసా సర్వమిదం విభాతి.

పద. న తత్ర సూర్యః భాతి న చన్ద్రతారకం న ఇమాః విద్యుతః భాన్తి కుతః అయం అగ్నిః, తం ఏవ భాన్తం అనుభాతి సర్వం తస్య భాసా సర్వం ఇదం విభాతి.

కాఠకోపనిషత్తు ద్వితీయాధ్యాయమునందు

ద్వితీయవల్లి సమాప్తము.

టీక. తత్ర = స్వాత్మభూతమగు ఆపరబ్రహ్మమునందు, సూర్యః = సూర్యుఁడు, న భాతి=ప్రకాశించుటలేదు. చంద్రతారకం=చంద్రుఁడు నక్షత్రములు, నభాతి=ప్రకాశించుటలేదు. ఇమాః విద్యుతః=ఈమెరుపులు, నభాంతి= ప్రకాశించుటలేదు. అయం అగ్నిః=ఈయగ్ని, కుతః = ఎట్లు ప్రకాశించును ? సర్వం=సూర్యచంద్రాగ్న్యాది సర్వతేజస్సు, భాంతం = ప్రకాశించుచున్న, తం ఏవ = ఆపరబ్రహ్మమునే, అనుభాతి = అనుసరించి ప్రకాశించుచున్నది. తస్య

భాసా=ఆబ్రహ్మముయొక్క కాంతిచేతనే, ఇదంసర్వం=ఈసూర్యచంద్రాది తేజస్సమూహమంతయు, విభాతి=మిక్కుటముగ ప్రకాశించుచున్నది.

తా. ఓగౌతమా! స్వాత్మభూతుఁడగు ఆబ్రహ్మమునందు ప్రపంచమునందుగల సకలపదార్థములను ప్రకాశింపఁజేయు సామర్థ్యముగల సూర్యుఁడు ప్రకాశించుటలేదు. అనఁగా బ్రహ్మమును సూర్యుఁడు ప్రకాశింపఁజేయఁజాలఁడు. అదేవిధముగా చంద్రుఁడుగాని. నక్షత్రములుగాని, మెరుపులుగాని ఆత్మను ప్రకాశింపఁజేయఁజాలవు. ఇఁక మనదృష్టిగోచరమునందున్న అగ్ని ఎట్లు ప్రకాశింపఁజేయఁగలఁడు? విశేషించిచెప్పుటవలన ప్రయోజనమేమిగాని సూర్యచంద్ర నక్షత్రాదికమెయ్యది ప్రకాశించుచున్నటుల మనకు గోచరమగుచున్నదో అయ్యది ఆపరమేశ్వరుని అనుసరించియే ప్రకాశించుచున్నది. ఆపరమేశ్వరుని ప్రకాశముచేతనే సూర్యాదితేజస్సమూహము ప్రకాశించుచున్నది. కావుననే ఆబ్రహ్మము 'భాతి విభాతి' అని చెప్పఁబడుచున్నది. అనఁగా కార్యగతమయిన వివిధప్రకాశముచేత బ్రహ్మముయొక్క ప్రకాశరూపత్వము స్వయముగా తెలియఁబడుచున్నది. తనకు స్వయముగా ప్రకాశించు సామర్థ్యములేనివాఁడు ఇకరునకు ప్రకాశమునొసంగుటకు సాధ్యము కాదుగదా. లోకమునందుకూడ ప్రకాశనస్వరూపములగు ఆదిత్యాదులకు భాసనరూపము గనంబడుచున్నదిగాని ఘటాదికమునకు అన్యావభాసకత్వము గనంబడుటలేదు.

ఆంధ్రటీకాతాత్పర్యవివరణసహితమగు కాఠకోపనిషత్తునందు
ద్వితీయాధ్యాయమునందు ద్వితీయవల్లి సమాప్తము.
ప్రథమాదిపరిగణనము చేత పంచమవల్లి సమాప్తము.
ఈవల్లికిసంబంధించిన వివరణగ్రంథభాగము
అనుభూతిప్రకాశము-౧౧వ అధ్యాయము. శ్లో. ౭౦-౯౪.
ఆత్మపురాణము-౯వ అధ్యాయము. శ్లోకము. ౬౫౦-౭౪3.

శ్రీగురుభ్యోనమః.

కఠోపనిషత్తు

ద్వితీయాధ్యాయము—తృతీయవల్లి.

(ప్రథమాదిపరిగణనముచేత షష్ఠవల్లి.)

౨-వ అధ్యా, 3-వ వల్లి, ౧-వ మంత్రము.

అవ. బూరగచెట్టు మున్నగు వృక్షజాతముయొక్క మూలమును-మూవి పింజను చూచి తద్వృక్షబీజము నేత్రేంద్రియగోచరము కాకపోయినను అవృక్షమునకు బీజమున్నదని లోకమునందు లోకులెట్లు నిర్ణయించుకొనుచున్నారో అదేవిధముగా సంసారకార్య వృక్షావధారణముచేత తత్సంసారమునకు మూలమయిన బ్రహ్మముయొక్క స్వరూపమును నిర్ణయించుతలంపుతో నీయాఱవవల్లి ప్రారంభింపఁబడుచున్నది:—

మూ. ఊర్ధ్వమూలో అవాక్ శాఖ ఏషో ఽశ్వత్థ స్సనాతనః,
తదేవ శుక్రం తద్బ్రహ్మ తదేవామృతముచ్యతే.
తస్మిఁల్లోకా శ్శ్రితా స్సర్వే తదు నాత్యేతి కశ్చన.
ఏతద్వైతత్.

పద. ఊర్ధ్వమూలః అవాక్ శాఖః ఏషః అశ్వత్థః సనాతనః, తత్ ఏవ శుక్రం తత్ బ్రహ్మ తత్ ఏవ అమృతం ఉచ్యతే, తస్మిన్ లోకాః శ్రితాః సర్వే తత్ ఉ న అత్యేతి కః చ న, ఏతత్ వై తత్. ౧

టీ. ఊర్ధ్వమూలః = సర్వశ్రేష్ఠమయిన బ్రహ్మమే మూలముగాఁ గలిగినట్టియుం, అవాక్ శాఖః = స్వర్గనరకాదులను అడ్డముగా వ్యాపించినశాఖలుగల

దియు, ఏషః=ఈ, అశ్వత్థః = సంసారమను అశ్వత్థవృక్షము, (న శ్వః అపి స్థాస్యతీతి-అశ్వత్థః=రేపునిలుచుట యనునది లేదు కావున అశ్వత్థమనంబడును.) తత్ ఏవ = ఆసంసారాశ్వత్థవృక్షమునకు మూలమయినదియే, శుక్రం = పరిశుద్ధము, తత్ ఏవ=అదియే, బ్రహ్మ=బ్రహ్మము, తత్ ఏవ = అయ్యదియే, అమృతం=అమృతము (అని), ఉచ్యతే=చెప్పఁబడుచున్నది. తస్మిన్=ఆసంసారాశ్వత్థవృక్షమునకు మూలమయిన బ్రహ్మమునందే, సర్వేలోకాః = లోకములన్నియు, శ్రితాః=ఆశ్రయించియున్నవి, కశ్చన=ఒక్కటియు, తత్=దానిని, న అత్యేతి ఉ=అతిక్రమింపఁజాలదు. ఏతత్=ఇదియే, తత్=ఆ నీవడిగిన బ్రహ్మము.

తా. అవ్యక్తాదిస్థావరాంతమగు సంసారమను అశ్వత్థవృక్షము ఊర్ధ్వమూలము. ఊర్ధ్వమనఁగా 'తద్విష్ణోః పరమం పదం' అని ప్రతిపాదింపఁబడిన బ్రహ్మమే మూలముగాఁగలది. జ్ఞానఖడ్గముచేత ఛేదింపఁదగినదగుటచేత వృక్షత్వమిట యుక్తమే యగుచున్నది. ఈసంసారమును అశ్వత్థవృక్షముతోఁ బోల్చుటకు మఱికొన్ని హేతువులుకూడఁగలవు. ఆ హేతువు లివి:—

జన్మ జరా మరణ శోకాద్యనేకానర్థ పరంపరలతో సర్వదా గూడికొనియుండునది క్షణక్షణమునకు మారుచుండు స్వభావముకలది, ఇంద్రజాలము, ఎండమావులనీరు, గంధర్వనగరము మున్నగువానివలె కనంబడుచున్నటుల తోఁచి నశించిపోవునది, చివరకు వృక్షమువలె అభావాత్మకము, కదళీస్తంభము, (అరటిచెట్టు)వలె సారవిహీనము, వేలకొలదిగానుండు పాషండులయినవారిచేత స్వస్వబుద్ధ్యనుసారము నిర్ణీతమగుచున్నదియు, తత్త్వజిజ్ఞాసువు లగు వారలకుఁగూడ ఇట్టిదని నిర్ణయించుటకు వీలుకానిదియు, వేదాంతము (ఉపనిషత్తు) లందు నిర్ధారితమయిన బ్రహ్మమే మూలసారముగాఁగలదియు, అవిద్యా కామబీజా వ్యక్తబీజముచేత పుట్టినదియు, అపరబ్రహ్మ (విజ్ఞానక్రియాశక్తి ద్వయాత్మకుఁడగు హిరణ్యగర్భుఁడు) అంకురముగాఁగలదియు, సర్వప్రాణుల లింగశరీరములే స్కంధములుగాఁగలదియు, తృష్ణయను నీరునుపోసి పెంచుటచేత ఎదుపుగా పెఱుగుచున్నదియు, బుద్ధీంద్రియవిషయ

ములను చిగురుటాకులుగలదియు, శ్రుతిస్మృతి న్యాయవిద్యోపదేశములను ఆకులుగలదియు, యజ్ఞము దానము తపస్సు మున్నగు అనేకసత్క్రియలే పుష్పములుగాఁగలదియు, సుఖదుఃఖసంవేదనలు రసముగాఁగలదియు, ప్రాణ్యుప జీవ్యంత ఫలములుగలదియు, ఆప్రాణులయొక్క తృష్ణయను నీరుపోయుటచేత బాగుగా ఎదిగి పెనవేసికొని బిగిసిపోయిన కర్మవాసనాదికములను అవాంతర మూలములుగలదియు, సత్యనామాది సప్తలోకములును, బ్రహ్మాదిభూతగణము అనియెడి పక్షిసమూహములకు నివాసభూతమయినదియు, ఆయా ప్రాణిజాత ములు సుఖదుఃఖానుభవసమయములందు చేసెడి హర్షశోక జాత నృత్యగీత వాదిత్ర క్ష్వేళితా స్ఫోటిత హసితాకృష్ట రుదితహాహా ముంచ ముంచేత్యాద్యనేక విధశబ్దకృత తుములీభూతమహారావముగలదియు, (అనఁగా సంతోషమువచ్చి నప్పుడు సంతోషసూచకముగ నృత్యగీతాద్యాడంబరములు, దుఃఖము సంభ వించినప్పుడు 'హయ్యో మొఱ్ఱో' యని దుఃఖించి ఏడ్చుచుండుట మున్నగునవి) ఉపనిషత్ప్రతిపాదితమగు బ్రహ్మాత్మదర్శనమను అసంగశస్త్రముచేత తెగనఱుక బడఁదగినదియునై ఈసంసారాశ్వత్థవృక్షము వెలయుచున్నది. ఈసంసారమే అశ్వత్థవృక్షముగా నిట నిరూపింపఁబడినది. ఈసంసారమను అశ్వత్థవృక్షము కామకర్మలను గాలిచేత కంపితమయి నిత్యప్రచలిత స్వభావమైయున్నది. స్వర్గనరకతిర్యక్ప్రేతాదులను శాఖోపశాఖలు కలిగియున్నది. సనాతనము— అనఁగా అనాదియగుటచేత చిరప్రవృత్తమయినది. ఇట్టి యీసంసారవృక్షము నకు మూలమెయ్యదియో అదే శుద్ధమయినది. చైతన్యాత్మజ్యోతిస్స్వభావ మయినది. అదియే అన్నిటికంటె మహత్తైనదగుటవలన బ్రహ్మమని చెప్పఁబడు చున్నది. అదియే అవినాశిస్వభావము కలదియగుటచేత అమృతమని చెప్పఁ బడుచున్నది. 'వాచాఽఽరంభణం వికారో నామధేయ మనృత మన్యదతో మర్త్యం' అను శ్రుతిననుసరించి పరమార్థసత్యభూతుఁడగు బ్రహ్మమునందు లోకములు గంధర్వనగర, మరుమరీచ్యుదక, మాయాసమములయి పరమార్థ దర్శనము లేకపోవుటచేత ఉత్పత్తిస్థితిలయములు గలవానివలెఁ గనంబడు

చుండును. ఘటాదికార్యము మృదాదికారణమును అతిక్రమించి యెటుల యుండఁజాలదో అదేవిధముగ ఒక్కటి అయినను ఆబ్రహ్మము నతిక్రమించి యుండఁజాలదు. ఈబ్రహ్మమునే నీవు తెలుసుకొనవలయునని న న్నడిగి నాఁడవు.

వివరణము:—భగవద్గీత సర్వోపనిషత్సార భూతమయినను కఠోప నిషత్తునకు చాలసన్నిహితసంబంధము కలిగియున్నది. ఈయుపనిషత్తునందుఁగల చాలమంత్రము లున్నవిఉన్నట్లే భగవద్గీతయందు మఱల పఠింపఁబడియున్నవి. భగవద్గీతయొక్క ౧౮ అధ్యాయములలో 'పురుషోత్తమప్రాప్తియోగము' అను పేరుగల ౧౫-వ అధ్యాయము చాలగౌరవము కలిగియున్నది. ౧౮ అధ్యా యములు పారాయణముచేయుటకు అవకాశములేనివా రీ ౧౫-వ అధ్యా యమునైనను తప్పక పారాయణము చేయుదురు. ఈ 'ఊర్ధ్వమూలో౽వాక్శాఖ' అను మంత్రముయొక్క వివరణము భగవద్గీత ౧౫-వ అధ్యాయము నందు మొదటి నాలుగుశ్లోకములం దిట్లు గలదు:—

శ్రీ భగవానువాచ:—

శ్లో. ఊర్ధ్వమూలమధశ్శాఖ మశ్వత్థం ప్రాహురవ్యయం,
ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్. ౧
అధశ్చోర్ధ్వం ప్రసృతాస్తస్య శాఖా గుణప్రవృద్ధా విషయప్రవాలాః,
అధశ్చమూలా న్యనుసంతతాని కర్మానుబంధీని మనుష్యలోకే. ౨
న రూపమస్యేహ తథోపలభ్యతే నాంతో న చాదిర్నచ సంప్రతిష్ఠా,
అశ్వత్థమేనం సువిరూఢమూలమసంగశస్త్రేణ దృఢేన ఛిత్వా. 3
తతః పదం తత్పరిమార్గితవ్యం యస్మిన్గతా న నివర్తంతి భూయః,
తమేవ చాద్యం పురుషం ప్రపద్యే యతః ప్రవృత్తిః ప్రసృతా పురాణీ. ౪
నిర్మానమోహా జితసంగదోషా
అధ్యాత్మదృష్ట్యా వినివృత్తకామాః,

ద్వంద్వై ర్విముక్తా స్సుఖ దుఃఖ సంజ్ఞై
ర్గచ్ఛంత్యమూఢాః పద మవ్యయం తత్. ౫

భగవద్గీత. ౧౫-వ అధ్యాయము.

శ్రీమచ్ఛంకరభగవత్పాదాచార్యులవారు ఈ మంత్రభాష్యమునందు ఈగీతాశ్లోకములయొక్క అర్థమునుకూడ చాలవఱకు అనువదించియున్నారు. భగవద్గీతాభాష్యమునం దిట్లు వ్రాసియున్నారు:—

పురాణేచ—

శ్లో. అవ్యక్త మూల ప్రభవ స్తస్యైవానుగ్రహోత్థితః,
బుద్ధిస్కంధమయశ్చైవ ఇంద్రియాంతర కోటరః.
మహాభూత విశాఖశ్చ విషయైః పత్రవాం స్తథా,
ధర్మాధర్మ సుపుష్పశ్చ సుఖదుఃఖ ఫలోదయః.
ఆజీవ్య స్సర్వభూతానాం బ్రహ్మవృక్ష స్సనాతనః,
ఏతద్బ్రహ్మవనం చైవ బ్రహ్మా చరతి నిత్యశః.
ఏతచ్ఛిత్వా చ భిత్వా చ జ్ఞానేన పరమాసినా,
తత శ్చాత్మరతిం ప్రాప్య యస్మాన్నావర్తతే పునః. ఇత్యాది.

వేదాంతముక్తావళి యను పేరుతో శ్రీ బెల్లంకొండ రామారాయ కవీంద్రులవారొనర్చిన శ్లోకరూపమగు ఉపనిషద్వివరణ గ్రంథమునందు కఠోపనిషద్వివరణము శ్లో. ౧౮—౫౯ లందుఁ గలదు. అం దీమంత్రార్థము భాష్యగత వివరణముతోడ చేర్చి లలితమయిన శైలియందు మననయోగ్యముగ గ్రథితమయినది. పాఠకులకు హృదయంగమముగ నుండునను తలంపుతో ఏతన్మంత్రార్థమును ప్రతిపాదించిన శ్లోకద్వయము నుదహరించుచున్నాఁడను:—

శ్లో. మాయాబీజభవ స్సప్రహాంబుకలితో బ్రహ్మాంకురః ప్రాణభృ
ల్లింగస్కంధధరః స్సురాదిమ తనూశాఖ స్త్రయీపత్రభృత్,

సైకాత్మా విషయప్రవాళకలితో యజ్ఞాదిపుష్ప స్సుఖై
ర్దుఃఖై శ్చాపి ఫలై ర్యుతో ఽఖిల జగన్నీడశ్చ భూతాండజః. ౪౭
నానాశబ్ద సమాగమాతి తుములధ్వానశ్చ కర్మానిలై
ర్నున్న శ్చంచల ఏష సంసృతిమహీజో ఽస్త్యేహ్యాభావాత్మకః,
సమ్యక్ జ్ఞానమయాసినా సుకరణీయోచ్ఛేద ఏతస్య త
న్మూలం బ్రహ్మ సదేవ శుక్రమమృతం మిత్యైష మర్త్యః పురః. ౪౮

౨-వ అధ్యా, ౩-వ వల్లి, ౨-వ మంత్రము.

మూ. యదిదం కిం చ జగత్సర్వం
ప్రాణ ఏజతి నిస్సృతం,
మహద్భయం వజ్రముద్యతం
య ఏత ద్విదు రమృతా స్తే భవన్తి. ౨

పద. యత్ ఇదం కించ జగత్ సర్వం ప్రాణే ఏజతి నిస్సృతమ్, మహ-ద్భయం వజ్రం ఉద్యతం యే ఏతత్ విదుః అమృతాః తే భవన్తి.

టీక. యత్కించ=స్వల్పమగు, ఇదం=ఈ, సర్వంజగత్=జగత్తంతయు, ప్రాణే=పరమాత్మయందే, నిస్సృతం=బయలువెడలినది. ఏజతి = ఆబ్రహ్మమును గాంచి భయంపడుచున్నది. (ఆబ్రహ్మము,) ఉద్యతం వజ్రం=వజ్రాయుధమును ఎత్తి చేతియందు ధరించినవాని(వలె), మహత్ భయం=గొప్పభయమునుకలుగఁ జేయుచున్నది. యే=ఎవ్వరు? ఏతత్ = దీనిని, విదుః = తెలిసికొనుచున్నారో (తే=వారు), అమృతాః=మరణరహితులు, భవంతి=అగుచున్నారు.

తా. "ఏబ్రహ్మము నెఱుంగుటవలన అమృతత్వమును పొందుచున్నారని చెప్పఁబడియున్నదో అట్టి జగత్తునకు మూలమయిన బ్రహ్మమనునది లేనే లేదు, ఈప్రపంచము అసత్తునుండియే పుట్టుచున్నది" అని వాదించువారిపక్షము అప్రామాణికమని నిరసించి జగన్మూలము బ్రహ్మమనువిషయ మీమంత్రమునందు

స్థాపింపఁబడుచున్నది. దృగ్గోచరమగు బ్రహ్మాదిస్థావరాంతమగు నీప్రపంచమంతయుం అపరబ్రహ్మముచేత సృష్టమయి అపరమేశ్వరుని యస్తిత్వము ననుసరించియే స్థితికలిగి వెలయుచున్నది. ఆపరమేశ్వరునియాజ్ఞకు భయంపడియే నియమముగ నడచుచున్నది. కావుననే జగదుత్పత్తి స్థితిలయములకు కారణమగు బ్రహ్మము వజ్రధారియగు ప్రభువు సేవకులకువలె జగత్తునకంతయుం భయకారణము—అనఁగా వజ్రధరుఁడయిన ప్రభువును గాంచి సేవకులు సభయులయి తదాజ్ఞ నెటుల నియమముగనిర్వర్తించెదరో అదేవిధముగా సూర్యచంద్రగ్రహనక్షత్రతారకాది సమన్వితమగు జగత్తు ఈశ్వరాధిష్ఠిత మగుటచేతనే నియమముగా క్షణకాలమయినను విశ్రాంతిలేక తమతమ కృత్యజాతమును నిర్వహించుచున్నది. ప్రపంచమునకంతయుం ఇటుల సాక్షిభూతమయిన బ్రహ్మము అనునది ఒక్కటికలదను విషయము నెఱిఁగినవారలు అమృతులు. అనఁగా మోక్షము నందినవార లగుచున్నారు.

౨-వ అధ్యా, 3-వ వల్లి, 3-వ మంత్రము.

అవ. పరమేశ్వరుని భయమువలన జగత్తెటుల ప్రవర్తించుచున్నది చెప్పఁబడుచున్నది:—

మూ. భయాదస్యాగ్నిస్తపతి భయాత్తపతి సూర్యః,
భయా దిన్ద్రశ్చ వాయుశ్చ మృత్యుర్ధావతి పఞ్చమః.

పద. భయాత్ అస్య అగ్నిః తపతి భయాత్ తపతి సూర్యః,భయాత్ ఇన్ద్రః చ వాయుః చ మృత్యుః ధావతి పఞ్చమః. 3

టీక. అస్య=ఈపరమేశ్వరునియొక్క, భయాత్=భయమువలన, అగ్నిః =అగ్నిహోత్రుఁడు, తపతి=దహించుచున్నాఁడు. భయాత్=ఈపరమేశ్వరుని యొక్క భయమువల్లనుండియే, సూర్యః = సూర్యుఁడు, తపతి = ప్రకాశించుచున్నాఁడు. ఇంద్రశ్చ=ఇంద్రుఁడున్నూ, వాయుశ్చ = వాయువున్నూ, పంచమః=ఐదవవాఁడగు, మృత్యుశ్చ = మృత్యువున్నూ, భయాత్ చ=ఈపరమేశ్వ

రునియొక్క భయమువల్లనుండియే, ధావతి=స్వస్వవ్యాపారనిర్వహణమునందు నియతముగ ప్రవర్తించుచున్నారు.

తా. ఓనచికేతుఁడా! ఆపరమేశ్వరునియొక్క భయమునుండియే అగ్ని ఆయాపదార్థములను దహించుచున్నాఁడు. సూర్యుఁడు తపించుచున్నాఁడు. ఇంద్రుఁడు దేవలోకమును పరిపాలించుచున్నాఁడు. వాయువు వీచుచున్నాఁడు. మృత్యువు శరీరధారులను వారివారి కాలనియత్యనంతరము యమలోకమును పొందించుచున్నాఁడు. సమర్థులయిన లోకపాలకులు తమకు పైన ప్రభువను వాఁడొకఁడు దండహస్తుఁడయియుండుటచేతనే తమకు తమకు విహితములయియున్న కృత్యములను సేవకులవలె భయంపడి నియతముగ నిర్వహించుచున్నారు కాని లేనియెడల జగత్ప్రవృత్తి నియతముగ నుండఁజాలదని భావము.

౨-వ అధ్యా, 3-వ వల్లి, ౪-వ మంత్రము.

మూ. ఇహచే దశకద్బోద్ధుం ప్రాక్ఛరీరస్య విస్రసః,
తత స్సర్గేషు లోకేషు శరీరత్వాయ కల్పతే. ౪

పద. ఇహ చేత్ అశకత్ బోద్ధుం ప్రాక్ శరీరస్య విస్రసః, తతః సర్గేషు లోకేషు శరీరత్వాయ కల్పతే. ౪

టీక. (తత్=అట్టిబ్రహ్మమును) శరీరస్య = దేహముయొక్క, విస్రసః ప్రాక్=పడిపోవుటకంటెముందు, ఇహ=ఈలోకమునందే, బోద్ధుం=తెలిసికొనుటకు, అశకత్ చేత్ = అసమర్థుఁడయినయెడల, సర్గేషు లోకేషు = పృథివ్యాదిలోకములందు, శరీరత్వాయ = శరీరభావముకొఱకు, కల్పతే = సమర్థుఁడగుచున్నాఁడు. (అనఁగా జన్మించుచున్నాఁడు.)

తా. అగ్ని, సూర్య, ఇంద్ర, వాయ్వాది సకలదేవతాసమూహమునకు భయకారణమయిన బ్రహ్మమును ఈశరీరము పడిపోవుటకంటె ముందే యీ లోకమునందే తెలిసికొన్నయెడల అట్టివాఁడు సంసారబంధమునుండి విముక్తుఁ

డగును. ఆట్టిశరీరపాతమునకులోపల సకలదేవతలకుకూడ భయకారణమగు బ్రహ్మమును తెలిసికొననియెడల ఆట్టివాఁడు పృథివ్యాదిలోకములందు మఱల మఱల పుట్టుచుగిట్టుచు సంసారబంధమునందు తగుల్కొనును కావున పాంచభౌతికమగు నీశరీరము పడిపోవుటకుముందే ఆత్మావబోధప్రయత్నము చేయఁదగినదని భావము.

వివరణము:—సర్గములనఁగా పృథివ్యాదిలోకములని చెప్పఁబడినది. సర్గశబ్దమునకు వ్యుత్పత్తి భాష్యమునం దిట్లు చెప్పఁబడినది:—

'సృజ్యంతే యేషు స్రష్టవ్యాః ప్రాణిన ఇతి సర్గాః పృథివ్యాదయో లోకాః.'

అర్థ. వేనియందు సృజింపఁదగినట్టి ప్రాణులు సృజింపఁబడుచున్నారో అట్టి పృథివ్యాదిలోకములు సర్గములనంబడును.

౨-వ అధ్యా, 3-వ వల్లి, ౫-వ మంత్రము.

అవ. ఈభూలోకమునందే అద్దమునందు తనముఖము స్పష్టముగాఁగనంబడినట్లు ఆత్మయొక్క దర్శనము సుకరముగాని బ్రహ్మలోకముకంటె విభిన్నములయిన దేవగంధర్వాది లోకములందు ఆత్మదర్శనము స్పష్టముగా కాదు. బ్రహ్మలోకమునందు ఆత్మదర్శనము సులభముగా సంభవించునుగాని అట్టిబ్రహ్మలోకము దుష్ప్రాపము అనువిషయ మీమంత్రమునందు చెప్పఁబడుచున్నది:—

మూ. యథాఽఽదర్శే తథాఽఽత్మని యథా
స్వప్నే తథా పితృలోకే,
యథాఽప్సుపరీవదదృశే తథా
గన్ధర్వలోకే ఛాయాఽఽతపయో రివ బ్రహ్మలోకే. ౫

పద. యథా ఆదర్శే తథా ఆత్మని యథా స్వప్నే తథా పితృలోకే, యథా అప్సు పరి ఇవ దదృశే తథా గన్ధర్వలోకే ఛాయాఽఽతపయోః ఇవ బ్రహ్మలోకే. ౫

టీక. యథా=ఏవిధముగా, ఆదర్శే = అద్దమునందు (తన ప్రతిబింబము స్పష్టముగాఁ గనంబడుచున్నదో), తథా=అదేవిధముగా, ఆత్మని=నిర్మలమయిన తనబుద్ధియందు (ఈభూలోకమునందు ఆత్మదర్శనము సులభముగాఅగుచున్నది), యథా = ఏవిధముగా, స్వప్నే=స్వప్నమునందో (అనఁగా జాగ్రద్వాసనానుభూతమయిన పదార్థము స్వప్నమునందు ఏవిధముగా చూడఁబడుచున్నదో, తథా=అదేవిధముగా), పితృలోకే=పితృలోకమునందు (ఆత్మదర్శనము అస్పష్టముగఁ గనంబడుచున్నది), అప్సు = జలములందు, యథా = ఏవిధముగా (తన ప్రతిబింబము స్పష్టముగాని సంకీర్ణమయిన అవయవములుగలదిగా), పరిఇవ దృశ్యతే = అంతటచూడఁబడుచున్నదో, తథా=అదేవిధముగా, గంధర్వలోకే= గంధర్వలోకమునందు, పరిదృశ్యతే=చూడఁబడుచున్నది. బ్రహ్మలోకే=బ్రహ్మలోకమునందు, ఛాయాఽఽతపయోః ఇవ = నీడయెండలయందువలె, (ఆత్మదర్శనము స్పష్టముగాఁ గనంబడుచున్నది.)

తా. అద్దమునందు తనముఖముయొక్క ప్రతిబింబమును స్పష్టముగా జను లెట్లుచూచుచున్నారో అదేవిధముగా ఈభూలోకమునందు నిర్మలీభూతమయిన తనబుద్ధియందు సాధకుఁడగువాఁడు ఆత్మదర్శనమును స్పష్టముగాఁ గాంచును. జాగ్రద్వాసనోద్భూతమగు స్వప్నమునందు జాగ్రద్వాసనలను అస్పష్టముగ నెట్లు గాంచుచున్నాఁడో అట్లే పితృలోకమునందు ఆత్మదర్శనము స్పష్టముగఁ గలుగజాలదు. ఏలయనఁగా పితృలోకమునందు జీవుఁడు కర్మఫలోపభోగాసక్తుఁ డయియుండును. నీటియందు తనముఖప్రతిబింబము స్పష్టముగాఁ దెలియక అవిభక్తావయవము యెట్లు గనంబడుచుండునో అట్లే గంధర్వలోకమునందుకూడ ఆత్మదర్శనము స్పష్టముగాఁ గలుగఁజాలదు. పితృ, గంధర్వాది లోకములందు ఆత్మదర్శన మిట్లుండునని శాస్త్రప్రమాణమువలన తెలియవచ్చుచున్నది. ఒక్క బ్రహ్మలోకమునందే ఛాయాఽఽతపములవలె బ్రహ్మదర్శనము స్పష్టముగాఁ గనంబడునుగాని అట్టిబ్రహ్మలోకము అతిశ్రేష్ఠమయిన కర్మోపాసనాజ్ఞాన ఫలసాధ్యముగాని సామాన్యమయిన కర్మోపాసనల

చేత లభ్యముకాదు. కావున ఆత్మదర్శనార్థ మీజన్మమునందే ప్రయత్నవిశేషము నొనర్పవలయును.

వివరణము:—ఈమంత్రార్థమును శతాధికగ్రంథకర్తలును, సర్వతంత్ర స్వతంత్రులును, హయగ్రీవపాదారవిందధ్యానతత్పరులును, బ్రహ్మణ్యులును అగు శ్రీబెల్లంకొండ రామారాయకవీంద్రులవారు వేదాంతముక్తావళియను పేర తామొనర్చిన ఉపనిషదర్థవివరణరూప శ్లోకరూపగ్రంథమునం దిట్లు ప్రతిపాదించియున్నారు:—

శ్లో. ఏతత్సాధ్వసకారణం కలయితుం ప్రాగ్దేహపాతాద్బుధ
శ్చేచ్ఛక్నోతి విముచ్యతే న యది హా సర్గేష్వధీ ర్జాయతే,
ఆదర్శే ముఖమీక్షతే హి పురుషః స్పష్టం న తోయే పున
స్తద్వ న్మానవజన్మని స్ఫుటతరం నాన్యత్ర సద్దర్శనమ్. ౫౧

వేదాంతముక్తావళి, పూర్వార్ధము.

౨-వ అధ్యా, 3-వ వల్లి, ౬-వ మంత్రము.

అవ. ఆయాత్మ నెట్లెఱుంగవలయును, అతనిని తెలిసికొనుటవలన కలిగెడి ప్రయోజనమేమి? యను విషయము చెప్పఁబడుచున్నది.—

మూ. ఇన్ద్రియాణాం పృథగ్భావ
మదయాస్తమయౌ చ యత్,
పృథగుత్పద్యమానానాం
మత్వా ధీరో న శోచతి.

పద. ఇన్ద్రియాణాం పృథగ్భావం ఉదయాస్తమయౌ చ యత్, పృథక్ ఉత్పద్యమానానాం మత్వా ధీరః న శోచతి. ౬

టీక. ధీరః=జ్ఞానియగువాఁడు, పృథక్ ఉత్పద్యమానానాం = వేఱుగా పుట్టియున్న, ఇంద్రియాణాం = ఇంద్రియములయొక్క, పృథగ్భావం=భిన్న

భావమును, ఉదయాస్తమయౌచ=ఉత్పత్తివినాశములను, మత్వా=తెలిసికొని, న శోచతి=దుఃఖింపఁడు.

తా. స్వస్వవిషయగ్రహణప్రయోజనార్థము స్వస్వకారణములగు ఆకాశాదికములవల్లనుండి వేఱుగా పుట్టింపఁబడిన శ్రోత్రాదీంద్రియములు అత్యంత విశుద్ధుఁడు చిన్మాత్రుఁడు కేవలుఁడు అగు ఆత్మకంటె వేఱయినవనియు, ఉత్పత్తి ప్రళయములు జాగ్రత్స్వప్నములు ఇంద్రియములకేగాని ఆత్మకులేవనియు వివేకముతో నెఱింగిన ధీరుఁడు శోకింపఁడు. నిత్యైకస్వభావుఁడగు ఆత్మ యెల్లప్పుడు ఒక్కవిధముగనేయుండుటవలన శోకమునకు కారణమే లేదు.

శ్రుతి. "తరతి శోకమాత్మవిత్". అను శ్రుతి యీవిషయమునే ప్రతిపాదించుచున్నది.

౨-వ అధ్యా, 3-వ వల్లి, 2-వ మంత్రము.

అవ. ఆత్మ ఇంద్రియములకంటె విభిన్నుఁడని చెప్పఁబడినది కావునను ఇతఁడు అందఱకు ప్రత్యగాత్మ కావునను వెలుపలను పొందఁజాలఁడు గదా! అట్టియాత్మను పొందుట యెట్లను విషయము చెప్పఁబడుచున్నది:—

మూ. ఇన్ద్రియేభ్యః పరం మనో మనసస్సత్వముత్తమం,
సత్వా దధి మహా నాత్మా మహతోఽవ్యక్తముత్తమమ్.

పద. ఇన్ద్రియేభ్యః పరం మనః మనసః సత్వం ఉత్తమం, సత్వాత్ అధి మహాన్ ఆత్మా మహతః అవ్యక్తం ఉత్తమమ్. 2

టీక. ఇంద్రియేభ్యః = ఇంద్రియములకంటె, మనః=మనస్సు, పరం=శ్రేష్ఠమయినది, మనసః=మనస్సుకంటె, సత్వం=బుద్ధి, ఉత్తమం = శ్రేష్ఠమయినది, సత్వాత్=బుద్ధికంటె, మహాన్ ఆత్మా = మహత్తను ఆత్మ, అధి=అధికము, మహతః=మహత్స్వరూపమగు ఆత్మకంటె, అవ్యక్తం=అవ్యక్తము, ఉత్తమం=శ్రేష్ఠమయినది.

తా. ఇంద్రియములకంటె మనస్సు శ్రేష్ఠమయినది, ఆమనస్సుకంటె సత్త్వము-అనఁగా బుద్ధి శ్రేష్ఠమయినది. ఆబుద్ధికంటె మహదాత్మ శ్రేష్ఠమయినది. ఆమహదాత్మకంటె సర్వకారణమగు అవ్యక్తము శ్రేష్ఠమయినది. ఇచట ఇంద్రియముల తరువాత విషయములను గుఱించి చెప్పుట యుక్తముకాని విషయములు ఇంద్రియసమానజాతీయము లగుటచేత ఇంద్రియగ్రహణముచేతనే విషయములుకూడ గ్రహింపఁబడినట్లే యనుతలంపుతో ఉపేక్షింపఁబడినది.

వివరణము:—ఏతత్సమానార్థకమగు మంత్ర మీయుపనిషత్తునందే ౧ అధ్యా-3 వల్లి. ౧౦-వ మంత్రముగా నిట్లుగలదు:—

మం. ఇంద్రియేభ్యః పరా హ్యర్థా అర్థేభ్యశ్చపరం మనః,
మనసస్తు పరా బుద్ధి ర్బుద్ధే రాత్మా మహా న్పరః.

ఇచట ఇంద్రియములతర్వాత అర్థములు—విషయములు చెప్పఁబడినవి. ఈవల్లియందు విషయము లుపేక్షితములని యెఱుంగునది.

౨-వ అధ్యా, 3-వ వల్లి, ౮-వ మంత్రము.

మూ. అవ్యక్తాత్తు పరః పురుషో వ్యాపకో ఽలిఙ్గ ఏవ చ,
యజ్జ్ఞాత్వా ముచ్యతే జన్తు రమృతత్వం చ గచ్ఛతి.

పద. అవ్యక్తాత్ తు పరః పురుషః వ్యాపకః అలిఙ్గః ఏవ చ, యత్ జ్ఞాత్వా ముచ్యతే జన్తుః అమృతత్వం చ గచ్ఛతి. ౮

టీక. జంతుః=మానవుఁడు, యత్ = ఏయాత్మపురుషుని, జ్ఞాత్వా = తెలిసికొని, ముచ్యతే=అవిద్యావిలసితమగు సంసారబంధమునుండి, విముచ్యతే= వదలఁబడుచున్నాఁడో, అమృతత్వంచ=అమృతత్వమునున్నూ, గచ్ఛతి=పొందుచున్నాఁడో, (అట్టి) పురుషః=పురుషుఁడు, అవ్యక్తాత్ తు=అవ్యక్తముకంటె, పరః=శ్రేష్ఠుఁడు, వ్యాపకః = సర్వవ్యాపకుఁడు, అలింగః ఏవచ=లింగవిరహితుఁడున్నూ అగుచున్నాఁడు.

తా. ఓనచికేతుఁడా ! అవ్యక్తముకంటె పురుషుఁడు శ్రేష్ఠుఁడు. ఈ పురుషుఁడే సర్వమునకు కారణభూతుఁడగుటవలన వ్యాపకమయిన ఆకాశాదికముకంటె వ్యాపకుఁడు. మఱియు అలింగుఁడు-లింగవిరహితుఁడు, అనఁగా సర్వసంసారధర్మవివర్జితుఁడని భావము. సర్వసంసారధర్మవివర్జితుఁడగు ఈపురుషుని ఆచార్యశాస్త్రసహాయమువలన తెలిసికొన్నవాఁడు శరీరముతోఁడ జీవించియున్నప్పుడే అవిద్యాదిహృదయగ్రంథులనుండి విముక్తుఁడగుచున్నాఁడు. దేహపాతానంతరము అమృతత్వమును అనఁగా పునరావృత్తిరహితమగు విదేహకైవల్యమును పొందుచున్నాఁడు.

౨-వ అధ్యా, 3-వ వల్లి, ౯-వ మంత్రము.

అవ. అలింగుఁడగు పురుషుని దర్శించుట యెట్లనువిషయము చెప్పఁబడుచున్నది.——

మూ. న సందృశే తిష్ఠతి రూపమస్య
న చక్షుషా పశ్యతి కశ్చనైనం,
హృదా మనీషా మనసాఽభిక్లృప్తో
య ఏతద్విదు రమృతాస్తే భవన్తి. ౯

పద. న సందృశే తిష్ఠతి రూపం అస్య న చక్షుషా పశ్యతి కః చ న ఏనం, హృదా మనీషా మనసా అభిక్లృప్తః యే ఏతత్ విదుః అమృతాః తే భవన్తి. ౯

టీక. అస్య = ఈప్రత్యగాత్మయొక్క, రూపం=రూపము, సందృశే = దర్శనవిషయమునందు, నతిష్ఠతి=ఉండదు. కశ్చన = ఒక్కఁడున్నూ, ఏనం=ఈ పురుషుని, చక్షుషా=నేత్రముచేత, నపశ్యతి=చూడఁడు. మనసా = మననరూపమయిన, మనీషా=సంకల్పాదిరూపమయిన మనస్సును నియమించునట్టి, హృదా= హృదయమునందుండు బుద్ధిచేత, అభిక్లృప్తః = (ఆయాత్మ) సందర్శింపఁబడును. యే=ఎవ్వరు? ఏతత్ = ఈపరమాత్మను, విదుః = తెలిసికొనుచున్నారో, తే = వారు, అమృతాః భవంతి=మరణవిరహితులగుచున్నారు.

తా. ప్రత్యగాత్మయగు ఈపురుషునియొక్క స్వరూపము నేత్రాదీంద్రియగణమునకు గోచరము కాఁజాలదు. ఇచట చక్షుర్గ్రహణ ముపలక్షణము. ఒక్కఁడున్నూ యీయాత్మతత్త్వమును ఇంద్రియములతో గ్రహింపఁజాలఁడు. ఇఁక ఆ యాత్మను గాంచువిధాన మెట్లనఁగా సంకల్పాదికమును నియమించుటచేత వికల్పరహితమయినట్టి మననరూపమయిన హృదయస్థమయిన బుద్ధిచేతనే ఆత్మస్వరూపము అభిప్రకాశితమగును. ఇట్టియాత్మను-బ్రహ్మమును ఎవ్వరెఱుంగుదురో అట్టివారు అమృతులు-మరణరహితులు అయ్యెదరు.

౨-వ అధ్యా, ౩-వ వల్లి, ౧౦-వ మంత్రము.

అవ. శ్రవణమననముల చేత ఆత్మతత్త్వము పరిజ్ఞాతమయినప్పటికిన్నీ చిత్తమునకు ఏకాగ్రత్వము లేనియెడల తదనుభవము శూన్యమగుచున్నది కావున తదర్థము యోగ ముపదేశింపఁబడుచున్నది:—

మూ. యదా పఞ్చావతిష్ఠన్తే జ్ఞానాని మనసా సహ,
బుద్ధిశ్చ న విచేష్టతే తామాహుః పరమాం గతిమ్.

పద. యదా పఞ్చ అవతిష్ఠన్తే జ్ఞానాని మనసా సహ, బుద్ధిః చ న విచేష్టతే తాం ఆహుః పరమాం గతిమ్. ౧౦

టీక. యదా=ఏకాలమునందు, పంచ జ్ఞానాని=ఐదైన జ్ఞానేంద్రియములు, మనసాసహ=మనస్సుతోకూడా, అవతిష్ఠంతే = (ఆత్మయందే) ఉంటున్నవో, బుద్ధిశ్చ=అధ్యవసాయాత్మకమగుబుద్ధియున్ను, నవిచేష్టతే = వ్యాపారాంతరములందు చలింపదో, తాం=అట్టిస్థితిని, పరమాంగతిం=శ్రేష్ఠమయిన గతినిగా, ఆహుః=బ్రహ్మవేత్తలు పలుకుదురు.

తా. ఏకాలమునందు శ్రోత్రాదిజ్ఞానేంద్రియములు స్వవిషయముల నుండి మఱలినవై సంకల్పవికల్పవిముఖమయిన మనస్సుతోడ ఆత్మయందే నిలిచి యుండునో, ఎప్పుడు అధ్యవసాయలక్షణాత్మకమగు బుద్ధి స్వవ్యాపారమునుండి

విముఖమయి చేష్టావిరహితమయియుండునో అట్టిస్థితియే ఉత్కృష్టఫలసాధన మయిన దగుటచేత పరమగతియని విద్వాంసులు పల్కుదురు.

౨-వ అధ్యా, 3-వ వల్లి, ౧౧-వ మంత్రము.

మూ. తాం యోగమితి మన్యన్తే స్థిరామింద్రియధారణాం,
అప్రమత్తస్తదా భవతి యోగోహి ప్రభవాప్యయౌ.

పద. తాం యోగం ఇతి మన్యన్తే స్థిరాం ఇంద్రియధారణాం, అప్రమత్తః తదా భవతి యోగః హి ప్రభవాప్యయౌ. ౧౧

టీక. స్థిరాం=స్థిరమయిన, తాం=ఆ, ఇంద్రియధారణాం = బాహ్యాంతరింద్రియధారణను, యోగంఇతి = యోగమని, మన్యంతే = (విద్వాంసులు) తలంచుచున్నారు. తదా=ఆకాలమునందు-అనఁగా యోగప్రవృత్తుఁడైనప్పుడు, అప్రమత్తః=ప్రమాదములేనివాఁడు, భవతి=అగుచున్నాఁడు. యోగః=యోగమనఁగా, ప్రభవాప్యయౌ హి=జననాపాయధర్మములు గలదిగదా.

తా. స్థిరమయిన బాహ్యాంతరింద్రియముల ధారణను యోగమని పెద్దలు పలుకుచున్నారు. సర్వానర్థసమూహము యోగాభ్యాసముచేత నిరాకృతమగుచున్నది. ఇట్టియోగావస్థయందు ఆత్మయందు అవిద్యచేత ఆధ్యారోపితమయిన అనృతస్వరూపములు నశించును కావున ఆత్మ పరిశుద్ధుఁడయియుండును. యోగాభ్యాసకాలమునందు ప్రమాదవిరహితుఁడయి సమాధినిమిత్తము ప్రయత్నశీలుఁడయి యుండవలయును. బుద్ధ్యాదికము చేష్టావిరహిత మయియున్నయెడల ప్రమాదము కలుగఁజాలదు. యోగసిద్ధిసమయమునందు బుద్ధ్యాదికము చేష్టావిరహితమయియుండును కావున అప్రమాదత్వము సిద్ధించుచునేయున్నది. లేక ఇంద్రియములకు స్థిరమయినధారణ యెప్పుడుకలుగునో అప్పుడే అప్రమత్తత్వము తప్పక కలుగుచున్నది. ఏలయనఁగా యోగము ప్రభవాప్యయములు-అనఁగా ఉపజనాపాయ ధర్మములు గలది కావున అపాయపరిహారార్థము ప్రమాదరహితుఁడయి యుండవలయునని యభిప్రాయము.

వివరణము:—ఉపజనాపాయధర్మములు గలది యనఁగా ఉపజన మనఁగా పుట్టుక, అపాయమనఁగా నాశము అను ధర్మములుగలది. యోగాభ్యాసమువలన అంతకుముందు శరీరమునందున్న రాగద్వేషచిత్తవిక్షేపాది దుష్టగుణములు నశించుటయు, సత్వశుద్ధి, చిత్తవిక్షేపరాహిత్యము మున్నగు సత్వగుణములు పుటుటయుం కలుగును కావున యోగము ఉపజనాపాయధర్మములు గలదని పేర్కొనఁబడినది.

౨-వ అధ్యా, 3-వ వల్లి, ౧౨-వ మంత్రము.

అవ. బ్రహ్మము 'ఇది అది' యని బుద్ధ్యాదికమునకు విషయమగునెడల గ్రహించుటకు శక్యమగును. బుద్ధ్యాదిక ముపరతమయినపిదప గ్రహణకారణము లేదు కావున బ్రహ్మము పొందఁబడఁజాలదు కావున బ్రహ్మమును లేనట్లే తలంచవలయును. లోకమునందు కారణగోచరమగునదియే ఉన్నదని ప్రసిద్ధి కలిగియుంటున్నది. కారణగోచరముకాని దానికి అసత్తనియే ప్రసిద్ధి కావున యోగము నిష్ప్రయోజనము. బుద్ధ్యాదికమునకు లభింపనందువల్ల బ్రహ్మమును నది లేదనుటయే యుక్తమని సిద్ధించుచుండుటచేత తన్నిరాసార్థ మిట్లు చెప్పఁబడుచున్నది:—

మూ. నైవ వాచా న మనసా ప్రాప్తుం శక్యో న చక్షుషా,
అస్తీతి బ్రువతోఽన్యత్ర కథం తదుపలభ్యతే. ౧౨

పద. న ఏవ వాచా న మనసా ప్రాప్తుం శక్యః న చక్షుషా, అస్తి ఇతి బ్రువతః అన్యత్ర కథం తత్ ఉపలభ్యతే. ౧౨

టీక. ఆత్మా=ఆత్మ, వాచా=వాక్కుచేత, ప్రాప్తుం శక్యః = పొందుటకు తగినవాఁడు, న ఏవ=కాఁడు. మనసా న=మనస్సుచేతపొందుటకు శక్యమయిన వాఁడుకాఁడు. నచక్షుషా=నేత్రముచేతపొందుటకు శక్యమయినవాఁడుకాఁడు, అస్తిఇతి బ్రువతః=ఉన్నాఁడు అని చెప్పువానివలన (పొందుటకు శక్యమగును),

అన్యత్ర=ఉన్నాఁడని చెప్పువానికంటె వేఱయినవానిచేత, అనఁగా నాస్తికుని చేత, తత్=ఆబ్రహ్మము, కథం ఉపలభ్యతే=ఎట్లు పొందఁబడును.

తా. బ్రహ్మము వాక్కుచేతఁగాని మనస్సుచేతఁగాని నేత్రముచేతఁగాని లేక ఇతరేంద్రియములచేతఁగాని పొందుటకు శక్యమయినదికాదు. బ్రహ్మమిట్లు సర్వవిశేష విరహితమయినదయ్యును జగత్తునకు మూలమని తెలియవచ్చుచుండుటచేత కార్యప్రవిలాపనముచేత నెఱుంగవచ్చును. నిజముగా జగత్తునకు మూలమే లేనియెడల ఈకార్యముకూడా అసత్తనియే పిలువఁబడుచుండును. ఇట్లుగాక సత్తనియే - ఉన్నదనియే లోకమునందు వ్యవహారముకలుగుచున్నది. మృత్కార్యమగు ఘటాదికము మృదాదిసమన్వితముగనే చూడఁబడుచున్నది. కావున జగత్తునకు మూలభూతమగు ఆత్మ యనువాఁడు కలఁడనియే. మనము గ్రహించితీరవలయును. ఏలయనఁగా శాస్త్రానుసారముగ ఆత్మయనువాఁడున్నాఁడని పలికెడి ఆస్తికునికంటె భిన్నుఁడగునాస్తికుఁడు జగత్తునకు మూలభూతుఁడగు ఆత్మ లేఁడనియు, ఈకార్యమగు ప్రపంచము అభావాంతముగా విలయమందుననియుం తలంచును కావున అట్టివిపరీతదర్శికి బ్రహ్మము వాస్తవముగాఁ గనంబడఁజాలదని భావము.

౨-వ అధ్యా, 3-వ వల్లి, ౧3-వ మంత్రము.

మూ. అస్తీత్యేవోపలబ్ధవ్య స్తత్త్వభావేన చోభయోః,
అస్తీత్యేవోపలబ్ధస్య తత్త్వభావః ప్రసీదతి. ౧3

పద. అస్తి ఇతి ఏవ ఉపలబ్ధవ్యః తత్త్వభావేన చ ఉభయోః, అస్తి ఇతి ఏవ ఉపలబ్ధస్య తత్త్వభావః ప్రసీదతి. ౧3

టీ. ఉభయోః = అస్తిత్వ నాస్తిత్వ భావములు రెంటిలోపల, తత్త్వభావేన=తత్త్వభావముచేత, అస్తి ఇతి ఏవ=ఉన్నదనియే, ఉపలబ్ధవ్యః=పొందఁదగినది. అస్తిఇతి=ఉన్నాఁడని, ఉపలబ్ధస్యైవ = నిర్ణయమునుపొందినవానికే, తత్త్వభావః=తత్త్వభావము, ప్రసీదతి=ప్రసన్నమగుచున్నది.

తా. పూర్వమంత్రమునందు చెప్పఁబడిన పక్షద్వయమునందు అసురమగు నాస్తికవాదమును వదలి అస్తిత్వవాదమునే ఆశ్రయించవలయును. సత్కార్యమునందు బుద్ధ్యాదికము ఉపాధిగా గ్రహింపఁబడుచున్నది. ఎప్పుడు ఉపాధిరహితుఁడో అప్పుడు ఆత్మ వికారరహితుఁడనియు, కార్యము కారణవ్యతిరేకముగా లేదనియు, నిరుపాధికమును అలింగమును సర్వకారణమును సదసదాది ప్రత్యయవర్జితమును అగు ఆత్మయొక్క తత్త్వము స్ఫురించును. అట్టి రూపముచేతనే ఆత్మతత్త్వము పొందఁదగినదని సిద్ధించుచున్నది. ఇచటగల 'ఉభయోః' అనుపదము సోపాధిక, నిరుపాధికములగు అస్తిత్వతత్త్వభావములయొక్క నిర్ధారణార్థమని యెఱుంగునది. పూర్వమునందు 'అస్తి' అని పొందఁబడిన ఆత్మకే—అనఁగా సత్కార్యమయిన ఉపాధికృతమయిన జ్ఞానముచేత పొందఁబడిన ఆత్మకే పిమ్మట నశించిన నామరూపోపాధులుగల ఆత్మయొక్క తత్త్వభావము స్ఫురించును. ఈతత్త్వభావము వెనుక చెప్పినవిధముగా విదితావిదితములకంటె వేఱయినది, అద్వయస్వభావమయినది. 'నేతి నేతి' (ఇదిగాదు, ఇదిగాదు) 'అస్థూలం, అనణు, అహ్రస్వం' మున్నగుశ్రుతులచేత నిర్ణీతమయినది అభిమతమగును. తత్పూర్వము 'అస్తి' యను జ్ఞానమును పొందినదే ఆత్మతత్త్వము ప్రకాశించునుగాని తద్భిన్నునకు ఆత్మతత్త్వము ప్రకాశింపదు.

౨-వ అధ్యా, ౩-వ వల్లి, ౧౪-వ మంత్రము.

మూ. యదా సర్వే ప్రముచ్యన్తే కామా యేఽస్య హృది శ్రితాః,
అథ మర్త్యోఽమృతో భవత్యత్ర బ్రహ్మ సమశ్నుతే. ౧౪

పద. యదా సర్వే ప్రముచ్యన్తే కామాః యే అస్య హృది శ్రితాః, అథ మర్త్యః అమృతః భవతి అత్ర బ్రహ్మ సమశ్నుతే. ౧౪

టీక. యదా=ఏకాలమునందు, అస్య=ఈబ్రహ్మవేత్తయొక్క, హృది=హృదయమునందు, శ్రితాః = ఆశ్రయించియున్న, యే=ఏ, కామాఃసర్వే=

కోరికలన్నియు, ప్రముచ్యంతే = వదలిపోవుచున్నవో, అథ=పిమ్మట, మర్త్యః= మనుష్యుఁడు, అమృతఃభవతి=మరణరహితుఁడగుచున్నాఁడు, అత్ర=ఇచ్చటనే, బ్రహ్మ=బ్రహ్మమును, సమశ్నుతే=పొందుచున్నాఁడు.

తా. పరమార్థదర్శియగు విద్వాంసునియొక్క సమస్తమయిన కామములు ఆత్మప్రబోధమునకు ముందు విద్వాంసునియొక్క బుద్ధియందు ఆశ్రయించియున్నవి. ఆత్మప్రబోధానంతరము కోరఁదగిన అన్యపదార్థము లేకపోవుటచేత స్వయముగా ఆకామములు బుద్ధిని వదలిపోవుచున్నవి. 'కామః సంకల్పః' అను శ్రుత్యంతరమువలన కామాదికమునకు ఆశ్రయము బుద్ధిగాని ఆత్మ కాదు. ఆత్మ విజ్ఞానప్రబోధముకంటె ముందు మరణధర్ముఁడు అయినను అట్టిఆత్మయే విజ్ఞానప్రబోధానంతరము అవిద్యాకామకర్మలక్షణమగుమృత్యువు నశించుటచేత అమృతుఁడు-మరణరహితుఁడగుచున్నాఁడు. గమనప్రయోజకమయిన మృత్యువు నశించిపోవుటచేత ఆత్మవేత్తకు అన్యత్రగమనము అనుపపన్నము అగుచున్నది. దీపము ఉన్నచోటనే చల్లారిపోవునటుల సర్వబంధములు నశించుటచేత ఇచ్చటనే బ్రహ్మస్వరూపుఁడగుచున్నాఁడు.

౨-వ అధ్యా, ౩-వ వల్లి, ౧౫-వ మంత్రము.

అవ. కామములకు సమూలవినాశ మెప్పు డనువిషయము చెప్పఁబడుచున్నది:—

మూ. యదా సర్వే ప్రభిద్యన్తే హృదయస్యేహ గ్రన్థయః,
అథ మర్త్యో ఽమృతో భవత్యేతావదనుశాసనమ్. ౧౫

పద. యదా సర్వే ప్రభిద్యన్తే హృదయస్య ఇహ గ్రన్థయః, అథ మర్త్యః అమృతః భవతి ఏతావత్ అనుశాసనమ్. ౧౫

టీక. యదా=ఎప్పుడు, ఇహ=ఇచటజీవించియుండఁగనే, హృదయస్య గ్రంథయః=హృదయగ్రంథులు, సర్వే=అన్నియు, ప్రభిద్యంతే=నశించిపోవు

చున్నవో, అథ=పిమ్మట, మర్త్యః=మనుష్యుఁడు, అమృతః భవతి=మరణరహితుఁ డగుచున్నాఁడు. ఏతావత్=ఇదియే, అనుశాసనం=సర్వవేదాంతములయొక్క ఉపదేశము, లేక ఆజ్ఞ.

తా. ఓ నచికేతుఁడా! ఈశరీరము నేను, ఈధనాదికము నాది, నేను సుఖిని, దుఃఖిని, ప్రభువును అని తలంచుట మున్నగునవి అవిద్యాగ్రంథులు, "నేను శరీరముగాను బ్రహ్మాత్మభూతుఁడను, అఖండాత్మస్వరూపుఁడను, అసంసారిని" అను దృఢభావనకలుగుటతోడనే పూర్వోక్తములయిన అవిద్యాగ్రంథులు అన్నియుం ఈశరీరమునందే జీవించియుండఁగనే నశించిపోవును. అవిద్యాగ్రంథులు నశించినవెంటనే అవిద్యాగ్రంథులే నిమిత్తములుగాఁగల కామములుకూడ సమూలముగ నశించును. కామములన్నియుం నశించినవెంటనే మరణధర్ముఁడయిన జీవుఁడు అమృతుఁడు అగుచున్నాఁడు. ఉపనిషత్తులు అనుశాసించునది - ఆజ్ఞాపించునది ఇంతియ. అనుశాసనమనఁగా అనుశిష్టి—ఉపదేశము. సర్వోపనిషత్తులం దుపదేశింపఁబడినతత్త్వ మిదియే యనిభావము.

వివరణము:—సర్వకామములు నశించుటయే అమృతత్వమయినయెడల అట్టి సర్వకామప్రవిలాపము—నాశనము సుషుప్తియందుఁగూడ సంభవించుచున్నది కావున ఆసుషుప్తస్థితినిగూడ అమృతత్వ మనవలసివచ్చును, కాని అట్లనఁగూడదనియుం బ్రహ్మాత్మైకత్వవిజ్ఞానముచేత అవిద్యాగ్రంథులు నశించుటయే అమృతత్వమనియు ఇట ప్రతిపాదింపఁబడినది.

౨-వ అధ్యా, 3-వ వల్లి, ౧౬-వ మంత్రము.

అవ. అఖండ బ్రహ్మైకత్వప్రాప్తివలన అవిద్యా వికల్పితహృదయ గ్రంథులన్నియుం నశించిపోవుటచేత ఈదేహమునందు జీవించియున్నప్పుడే బ్రహ్మీభూతుఁడయిన విద్వాంసునకు లోకవ్యవహారగోచరమగు మరణకాలము

నందు ఇతరులకువలె ప్రాణములకు అన్యత్రగతియనునది లేదనియుం 'అత్ర బ్రహ్మ సమశ్నుతే. కఠ. ౩-౬-౧౪.' అని చెప్పఁబడినది. 'నతస్యప్రాణా ఉత్క్రామంతి; బ్రహ్మైవసన్ బ్రహ్మాప్యేతి. బృహ-౪-౪-౬' మున్నగు శ్రుతులుకూడా యీవిషయమునే బలపఱుచుచున్నవి. ఇఁక ఎవ్వరు 'అత్ర బ్రహ్మ సమశ్నుతే' అను మంత్రార్థమునకు గోచరులగు ఉత్తమాధికారులుకాక ఎవ్వరు మందాధికారులో లేక ఉపాసనాదులచేత బ్రహ్మలోకమును పొందుచున్నారో; లేక ఎవ్వరు తద్విపరీతులయి సంసారభాక్కులో వారివారికి రాఁబోవుగతి విశేషము ఉత్తమమధ్యమాది బ్రహ్మవిద్యాఫలప్రాప్తి స్తుతినిమిత్తము చెప్పఁబడుచున్నది. ఇవియును గాక అగ్నివిద్యనుగూర్చి నచికేతుఁడు ప్రశ్నించియున్నాఁడు. తద్విద్యయొక్క ఫలప్రాప్తిప్రకారముకూడ యీమంత్రమునందు చెప్పఁబడుచున్నది:—

మూ. శతం చైకా చ హృదయస్య నాడ్య
స్తాసాం మూర్ధానమభి నిస్సృతైకా,
తయోర్ధ్వమాయన్నమృతత్వమేతి
విష్వఙ్ఙన్యా ఉత్క్రమణే భవన్తి. ౧౬

పద. శతం చ ఏకా చ హృదయస్య నాడ్యః తాసాం మూర్ధానం అభినిస్సృతా ఏకా, తయా ఊర్ధ్వం ఆయన్ అమృతత్వం ఏతి విష్వఙ్ అన్యాః ఉత్క్రమణే భవన్తి. ౧౬

టీక. హృదయస్య=హృదయముయొక్క, నాడ్యః=నాడులు, శతంచ ఏకాచ = నూటయొక్కటి, తాసాం = ఆనూటయొక్కనాడులలో, ఏకా = ఒక్కటియగు సుషుమ్నయనునాడి, మూర్ధానం = మూర్ధముగూర్చి, అభినిస్సృతా = బయలువెడలినది, తయా = ఆసుషుమ్నానాడిచేత, ఊర్ధ్వం=ఊర్ధ్వమునుగూర్చి, ఆయన్ = వచ్చినవాఁడయి, అమృతత్వం = అమృతత్వమును, ఏతి=పొందుచున్నాఁడు. అన్యాః=ఇతరనాడులు, ఉత్క్రమణే = ఉత్క్రమ

ణమునందు నిమిత్తములయినయెడల, విష్వఙ్ = నానావిధగతులు, భవంతి = అగుచున్నవి.

తా. (ఇతరులకంటె యోగాభ్యాసపరుఁడగువానికి ప్రాణోత్క్రమణ సమయము ముందుగా తెలియును. కావున అతఁడా సమయమునందు చేయవలసినవిధాన మిటచెప్పఁబడుచున్నది:—) హృదయమునందు నాడులు నూటయొకసంఖ్య గలిగియున్నవి. ఆ నూటయొక్క నాడులలో సుషుమ్నయను ఒక్క నాడి హృదయమునుండి బయలువెడలి శిరస్సును పొందుచున్నది. అవసానకాలమునందు శిరస్సువఱకు వ్యాపించియున్న ఆసుషుమ్నానాడీమార్గముగా హృదయమునందు ఆత్మను వశీకారము చేసుకొని ఊర్ధ్వమార్గముగా బ్రహ్మరంధ్రమునుండి ప్రాణములు వెలుపలికిపోవునటుల చేయవలయును. ఇటుల చేసినయెడల ఆదిత్యమార్గముగా అమృతత్వముఁబొందును. ఇచట అమృతత్వమనుది ఆపేక్షికము. 'ఆభూతసంప్లవం స్థానం అమృతత్వం హి భాష్యతే' యని స్మృతిచెప్పుచున్నది. బ్రహ్మలోకమునందు బ్రహ్మదేవునితోడ నిరుపమానభోగముల ననుభవించుచు ఆ బ్రహ్మతోడ కాలాంతరమునందు ముఖ్యమయిన అమృతత్వమును పొందుచున్నాఁడు. ఇతరనాడులద్వారా ప్రాణోత్క్రమణమయిన యెడల నానావిధమయిన సంసారగతులనుపొందును.

వివరణము:—''ఇచటచెప్పఁబడిన సుషుమ్నానాడీమార్గముగా ప్రాణోత్క్రమణమును పొందుట, దానివలన అమృతత్వమును పొందుట మున్నగునది మంద బ్రహ్మవిద్యాధికారుల విషయమని భాష్యకారులవారు చెప్పిరి. కాని ఇట్లుచెప్పుట అసంగతమనియు, ప్రకరణమననుసరించి ఇది ముఖ్యబ్రహ్మవేత్తకు సంబంధించినదేయనియు భాస్కరుఁడు చెప్పినాడు. కాని ఆభాస్కరునిమతము యుక్తియుక్తము కాదు. ఏలయందురా? గమనము చెప్పఁబడుటచేత; గమనమనునది పరిచ్ఛిన్నమయిన ప్రదేశమున కగునుగాని సార్వత్రికము కాఁజాలదు. నాడ్యంతరములగతియు బ్రహ్మవేత్తకు సంబంధించినదిగా ప్రకరణము ననుసరించి చెప్పవచ్చును. అది శ్రుతివిరుద్ధమయిన అతిప్రసంగము కావున ప్రబల

మయిన లింగముచేత ఇచట దుర్బలమగు ప్రకరణము నిరాకృతమని యెఱుంగ వలయును. యోగాభ్యాసరహితుఁ డగుపురుషుఁడు తనయిష్టానుసారము సుషుమ్నా నాడీమార్గముగా ప్రాణములను బ్రహ్మరంధ్రమునుండి బయటికి వెడలింపఁ జేయఁజాలఁడుకావున ప్రయాణకాలముకంటె పూర్వము తప్పక యోగాభ్యాసమును సాధించుట కర్తవ్యమనియుం సూచితమగుచున్నది.

౨-వ అధ్యా, 3-వ వల్లి, ౧౭-వ మంత్రము.

అవ. ఇప్పుడు సర్వవల్లులయందు ప్రతిపాదింపఁబడిన విషయ మంత సంహరింపఁబడుచున్నది:—

మూ. అఙ్గుష్ఠమాత్రః పురుషోఽన్తరాత్మా
సదా జనానాం హృదయే సన్నివిష్టః,
తం స్వాచ్ఛరీరా త్ప్రవృహే
న్ముఞ్జాదివేషీకాం ధైర్యేణ
తం విద్యాచ్ఛుక్ర మమృతం
తం విద్యాచ్ఛుక్ర మమృతమితి. ౧౭

పద. అఙ్గుష్ఠమాత్రః పురుషః అన్తరాత్మా సదా జనానాం హృదయే సన్నివిష్టః, తం స్వాత్ శరీరాత్ ప్రవృహేత్ ముఞ్జాత్ ఇవ ఇషీకాం ధైర్యేణ, తం విద్యాత్ శుక్రం అమృతం తం విద్యాత్ శుక్రం అమృతం ఇతి. ౧౭

టీక. అంగుష్ఠమాత్రః=అంగుష్ఠపరిమాణముగల, పురుషః=పురుషుఁడు, అన్తరాత్మాసన్ = అంతరాత్మస్వరూపుఁడయి, సదా=ఎల్లప్పుడు, జనానాం = జనులయొక్క, హృదయే=హృదయమునందు, సన్నివిష్టః=ప్రవేశించియున్నాఁడు. తం =చిన్మాత్రుఁడగు అట్టియాత్మను, ముంజాత్ = ముంజయనుతృణవిశేషమునుండి, ఇషీకాంఇవ = ఆముంజయొక్క మధ్యభాగమునందుండు ఇషీకను

(గడ్డిపరకను) వలె, ధైర్యేణ = ప్రమాదవిరహితమయిన జ్ఞానముచేత, స్వాత్ శరీరాత్ =స్వకీయమయిన దేహమునుండి, ప్రవృహేత్ = వేఱుపరచవలయును. తం=ఆచిన్మాత్రుఁడగు ఆత్మను, శుక్రం=శుద్ధమయిన, అమృతం=బ్రహ్మమునుగా, విద్యాత్ = తెలిసికొనవలయును. తం=ఆయాత్మనే, శుక్రం అమృతం=శుద్ధమయిన బ్రహ్మము, ఇతి=అని, విద్యాత్ = తెలిసికొనవలయును. ఇచట ద్విరుక్తి ఉపనిషత్సమాప్తిసూచకము.

తా॥ అంగుష్ఠమాత్రపరిమాణముగల హృదయకమల ఛిద్రాంతర్గతాంతఃకరణోపాధియగు పురుషుఁడు అంగుష్ఠమాత్రుఁ డనంబడును. అట్టియాత్మ సర్వకాలసర్వావస్థలయందు ప్రాణులయొక్క హృదయమునందు సన్నిహితుఁడయియుంటున్నాఁడనువిషయ మిదివఱకు చక్కఁగా ప్రతిపాదింపఁబడినది. అట్టి యంగుష్ఠమాత్రపురుషుని ముంజ యను తృణవిశేషమునుండి తదంతర్గతమగు ఇషీకను-పరకను వెలుపలకులాగునటుల స్వశరీరమునుండి ప్రమాదరహితమయిన జ్ఞానముచేత వేఱుపఱచవలయును. శరీరమునుండి వేఱుపఱచిన చిన్మాత్రుఁడగు ఆయాత్మనే శుద్ధమయిన బ్రహ్మమునుగా నెఱుంగవలయును. అతనినే పరిశుద్ధమయిన బ్రహ్మమునుగా నెఱుంగవలయును. ఈద్విరుక్తి ఉపనిషత్సమాప్తిద్యోతకము.

వివరణము:—ఈమంత్రమునందు గ్రంథసమాప్తిసూచకమగు ద్విరుక్తియుం, ఇతికరణము చెప్పఁబడినది. అయినను మఱొకమంత్రము తర్వాత చెప్పఁబడియున్నది. ఆమంత్రము ఫలశ్రుతియగుటచేతను, ఉపనిష దుపదేశ మీమంత్రముతోనే సమాప్తమగుచుండుటచేతను ఇట ద్విరుక్తి సమంజసమే యగుచున్నది.

౨-వ అధ్యా, 3-వ వల్లి, ౧౮-వ మంత్రము.

అవ. విద్యాస్తుత్యర్థము ఆఖ్యాయికోపసంహార మిప్పుడు చెప్పఁబడుచున్నది:—

మూ. మృత్యుప్రోక్తాం నచికేతో ఽథ లబ్ధ్వా
విద్యామేతాం యోగవిధిం చ కృత్స్నం,
బ్రహ్మప్రాప్తో విరజో ఽభూ ద్విమృత్యు
రన్యో ఽ ప్యేవం యో వి దధ్యాత్మమేవ. ౧౮

పద. మృత్యుప్రోక్తాం నచికేతః అథ లబ్ధ్వా విద్యాం ఏతాం యోగ విధిం చ కృత్స్నం, బ్రహ్మ ప్రాప్తః విరజః అభూత్ విమృత్యుః అన్యః అపి ఏవం యః విత్ అధ్యాత్మం ఏవ. ౧౮

టీక. నచికేతః = నచికేతుఁడు, మృత్యుప్రోక్తాం = యమధర్మరాజు చేత ఉపదేశింపఁబడిన, ఏతాం = ఈ, విద్యాం = బ్రహ్మవిద్యను, కృత్స్నం= సోపకరణమయిన, యోగవిధించ = యోగవిధిని, లబ్ధ్వా = పొంది, విరజః = పాపవిరహితుఁడయి, విమృత్యుః = కామావిద్యాదిరూపమగు మృత్యువిరహితుఁడయి, బ్రహ్మ=బ్రహ్మమును, ప్రాప్తః=పొందెను. ఏవం=ఈవిధముగా, అన్యః= ఇతరుఁడు, యఃఅపి=ఎవ్వఁడయినను, అధ్యాత్మంఏవ=ఆత్మనే, విత్=ఎఱుంగుచున్నాఁడో, సఃఅపి = వాఁడున్నూ, విరజుఁడున్నూ విమృత్యువున్నూ అయి బ్రహ్మమును పొందుచున్నాఁడు.

తా. ఈవిధముగా యమధర్మరాజు బోధించిన బ్రహ్మవిద్యను సోపకరణమగు యోగవిధిని వరప్రదానపూర్వకముగా నచికేతుఁడు పొందినవాఁడయి పిమ్మట విద్యాప్రాప్తిచేత ధర్మాధర్మవిరహితుఁడయి పాపరహితుఁడై కామావిద్యాత్మకమృత్యువిరహితుఁడయి బ్రహ్మమును పొందినవాఁడాయెను. అనఁగా ముక్తుఁడయ్యెను. ఇట్టిబ్రహ్మవిద్యవలన నచికేతుఁడొక్కఁడే ముక్తుఁడగుటకాదు. నచికేతునివలె ఇతరుఁడుకూడ ఎవ్వఁడు పూర్వోక్తప్రకారముగా అధ్యాత్మస్వరూపుఁడగు ఆత్మనెఱుంగునో అట్టివాఁడుకూడ విరజుఁడు పాపరహితుఁడును, విమృత్యువున్నూ మరణరహితుఁడున్నూ అయి ముక్తుఁడగుచున్నాఁడు.

వివరణము:—అధ్యాత్మస్వరూపుఁడగు బ్రహ్మము నెఱింగినవాఁడే విముక్తుఁడగునుగాని అన్యరూపుఁడగుబ్రహ్మమును - అనఁగా అర్చిరాదిమార్గగమ్యుఁడగు బ్రహ్మమును పొందినవాఁడు విముక్తుఁడు కాఁజాలఁడనిభావము.

ఈవల్లికి సంబంధించిన ఇతరగ్రంథభాగము.

అనుభూతిప్రకాశము:—౧౧-అధ్యాయము. శ్లోకము ౯౫-౧౨౦.

ఆత్మపురాణము:—౯-అధ్యాయము. శ్లోకము ౭౪౪-౮౪౮.

౨-వ అధ్యా, ౩-వ వల్లి, ౧౯-వ మంత్రము.

ఉత్తరశాంతిపాఠమంత్రము.

ఓమ్. సహనావవతు, సహనౌభునక్తు, సహవీర్యం కరవావహై, తేజస్వి నా వధీతమస్తు, మావిద్విషావహై.

ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః.

హరిః ఓమ్ ఓం తత్సత్.

పద. సః హ నౌ అవతు, సహ నౌ భునక్తు, సహ వీర్యం కరవావహై, తేజస్వినౌ అధీతం అస్తు, మా విద్విషావహై,

ఓం శాన్తిః శాన్తిః శాన్తిః.

ఇతి కఠోపనిషది ద్వితీయాధ్యాయే

తృతీయావల్లీ (షష్ఠీవల్లీ) సమాప్తా.

కఠవల్ల్యుపనిషత్సమాప్తా.

టీక. ఉత్తరశాంతిపాఠముయొక్క టీకాతాత్పర్యములను ఉపనిష దాదియందుగల పూర్వశాంతిపాఠ మంత్రములకువలెనే యని యెఱుంగ వలయును.

కఠోపనిషత్తు ద్వితీయాధ్యాయము తృతీయవల్లిసమాప్తము.

ఆంధ్రటీకాతాత్పర్యవివరణసమన్వితమగు కఠవల్ల్యుపనిషత్తు

సర్వము సమాప్తము.

శ్రీ గురుభ్యో నమః.

అనుభూతిప్రకాశే

కఠవల్ల్యుపనిషద్వివరణరూపః.

ఏకాదశోఽధ్యాయః.

శ్లో. యాజుష్యాం కఠశాఖాయాం విద్యాం యాం నచికేతసే, యమః ప్రోవాచ తాం సర్వాం సంగ్రహేణ బ్రవీమ్యహమ్. ౧. నచికేతాః కుమార స్సన్ స్వపిత్రా ప్రేషితో యమం, గత్వా తం తోషయిత్వాఽఽత్మజ్ఞానం వర మయాచత. ౨. ప్రేతే మనుష్యే సందేహో భూయా న్మతవిభేదతః, పారలౌకిక ఆత్మాఽస్తి నాస్తి వా నిర్ణయం వద. ౩. చార్వాకా దేహ మేవాహుః కర్మిణః స్వర్గగామినం, ముముక్షవో ముచ్యమాన మిత్యేకో గురు రాహ తమ్. ౪. దుర్విజ్ఞేయ మణుత్వా త్త ద్దేవైశ్చ విచికిత్సితం, త్యక్త్వైవత త్పుత్రవిత్తాదీన్వృణీష్వేత్యుక్త ఆహ తమ్. ౫. పుత్రాద్యా నశ్వరాః క్లేశ హేతవ శ్చాత్మ దుర్గమం, తత్త్వం వక్తుం త్వాదృశో ఽన్యో నేత్యాత్మైవ త్వయోచ్యతామ్. ౬. శృణు ప్రియం హితం చేతి పురుషై రర్థ్యతే ద్వయమ్.

ప్రథమాధ్యాయము - ద్వితీయవల్లియొక్క వివరణము.

ప్రియాః పుత్రాదయ స్త్వాత్మా హితో దుఃఖవివర్జితః. ౭. అవివేక వివేకౌ ద్వౌ మార్గౌ తత్రావివేకినః, ప్రియార్థిన స్త్వంతు నైవం మత్వో జ్ఞానం హితం భజ. ౮. మూఢాతిమూఢౌ న సహా త్వయాఽత్యంతవివేకినా, మూఢ స్త్వవిద్వివేకీ స స్స్వర్గ మిచ్ఛతి నైహికమ్. ౯. తద్గురుశ్చ తథైతౌ

ద్వా వంధనీతాంధవ త్తిష్ఠతే, ఆత్మతత్త్వానభిజ్ఞత్వా దవిద్యాభ్యంతరే స్థితే. ౧౦. అతిమూఢో ధనార్థీ స న్ప్రష్టామాత్యాదికాన్యపి, కరోతి పరలోక స్తు న తస్య ప్రతిభాసతే. ౧౧. చార్వాకైః కర్మిభి శ్చాత్మా శ్రవణాయాపి దుర్లభః, ముముక్షవో ఽపి బహవః శ్శృణ్వంతో ఽపి న జానతే. ౧౨. హవి ర్భుజాం హి దేవానామప్రియం మర్త్యవేదనం, మర్త్యా స్తత్త్వం న జానంతి విఘ్నై ర్దేవకృతై ర్హతాః. ౧౩. ఆచార్యశిష్యయో ర్దోషా ద్వైవా ఉత్పాదయంతి హి, వాగ్దోషా ద్బుద్ధిదోషా ద్వా వక్తుం శక్నోతి నో గురుః. ౧౪. అవిశ్వాసా త్కుతర్కా ద్వా శిష్యో బోద్ధుం న శక్నుయాత్, ఈశ్వ రానుగ్రహా ద్దేవా విహంతుం శక్నువంతి నో. ౧౫. సహనావిత్యాదిశాంతి జపేనేశప్రసాదతః, నిర్విఘ్నా గురుశిష్యా స్త స్తాదృశా దుర్లభా ఖలు. ౧౬. శబ్దార్థజ్ఞః స్వాత్మతత్త్వానుభవీ చ గురు ర్ద్విధా, ఆద్యో నరో న తు బ్రహ్మ నరత్వభ్రాంత్యనాశనాత్. ౧౭. తేనోక్తే సంశయా ఏవ స్యు ర్వాచా బహు యోజనాత్, బ్రహ్మైవానుభవీ తేన బ్రహ్మ ప్రోక్తం విబుధ్యతే. ౧౮. కుతర్కా న్నశ్యతే విద్యా తార్కికో న గురు స్తతః, ఆగమే చానుభూతే చ కుశలో ఽత్ర గురు ర్భవేత్. ౧౯. శిష్యో బహిర్ముఖో న స్యాదధ్యాత్మం యోగమాచరన్, దుర్దర్శత్వాఽసంయుక్తమప్యాత్మానం ప్రపశ్యతి. ౨౦. బాహ్యేంద్రియైర్న దృశ్యోఽయం గూఢస్థానప్రవేశతః, పంచకోశగుహాం తస్థో గహ్వరే తమసి స్థితః. ౨౧. యోగేనాంతర్ముఖా బుద్ధి స్తమో నాశ యతే తతః, దేవం జ్ఞాత్వా హర్షశోకౌ త్యజే త్తద్యోగ్యతా ఽస్తి తే. ౨౨. యోగ్యోఽహం చే త్తర్హి తత్త్వరహస్యం యత్త్వమీక్షసే, తద్బ్రూహి సర్వ సంసారగుణాతీతం విముక్తయే. ౨౩. ధర్మాధర్మౌ కార్యహేతూ తథా భూత భవిష్యతీ, అన్యచ్చ సర్వం నో యత్ర తదేవాపేక్షితం మమ. ౨౪. సర్వ వేదేషు యద్వేద్యం తపాంసి యదవాప్తయే, బ్రహ్మచర్యం చ తద్వస్తు ప్రణ వేనాభిధీయతే. ౨౫. ప్రణవో వాచక స్తస్య స్యాత్ప్రతీక ముపాప్తయే, తేన బోద్ధు ర్భవే న్ముక్తి ర్బ్రహ్మలోకో ఽప్యుపాసితుః. ౨౬. న జాయతే న

మ్రియతే ప్రణవాన్థ శ్చిదాత్మకః, పురాణోఽసౌ వజత్యేవ నిత్య స్స్యా దమృతత్వతః. ౨౭. కారణం నాస్య కార్యం వా దేహఘాతే ఽపి నో హతిః, దేహో దేహాంతరం హంతి న చి ద్ధంతి న హన్యతే. ౨౮. శ్యామాకాదే రణో రేషోఽణీయాం స్తత్రాణుకల్పనాత్, మహీయాన్మహతః ఖాదే స్తత్రాకాశాదికల్పనాత్. ౨౯. స్థితో జంతో ర్హృద్గుహాయాం తం నిష్కామ స్తు పశ్యతి, ఇంద్రియాణాం ప్రసన్నత్వా ద్వీతశోక స్తదా భవేత్. ౩౦. అంతర్ముఖోఽహం పశ్యామి మత్తో ఽన్యో బాహ్యధీః పుమాన్, జ్ఞాతు మర్హతి కో వా తం విరుద్ధాత్మత్వభాసినమ్. ౩౧. దూరం గచ్ఛేదిహాసీనః శయానో యాతి సర్వతః, సమదో విమద శ్చాఽతో దుర్జ్ఞేయో హ్యవివేకిభిః. ౩౨. వనే ధ్యాతుం సమాసీనో దేహం సంకల్ప్య మానసం, తేనైవ నగరం గత్వా కరోతి క్రయవిక్రయౌ. ౩౩. శయానో మంచకే ఽక్షేషు విలీనేషు నిరాకృతిః, ఆకాశవ త్సర్వగత ఏకః స్పష్టో ఽవతిష్ఠతే. ౩౪. ధనవిద్యాదిభి ర్మత్తః పాండిత్యం సదసి బ్రువన్, వైరాగ్యనటనేనాసౌ లక్ష్యతే మదహీనవత్. ౩౫. ఏవం విరుద్ధధర్మత్వాత్ స భావః కోఽస్య వాస్తవః, ఇతి జ్ఞాతు మశక్యత్వా దంతర్దృష్ట్యైవ వీక్షితమ్. ౩౬. అశరీరం శరీరేష్వనవస్థేష్వవస్థితం, సర్వగం బహుభావాధిష్ఠానం మత్వా న శోచతి. ౩౭. నాయమాత్మా బహోః పాఠా ద్బహు శ్రుత్వా చ మేధయా, లభ్యో బహిర్ముఖస్యాస్య నేశ్వరానుగ్రహే యతః. ౩౮. యమంతర్ముఖ ఏవైషో ఽనుగృహ్ణీతే తేన లభ్యతే, తస్యైశః స్వాత్మనో రూపం భాసయత్యఖిలం స్ఫుటమ్. ౩౯. పాపం క్రోధమనైకాగ్ర్యం యోగసిద్ధిం చ నైతి యః, త మీశ్వరో న గృహ్ణాతి స జ్ఞానేనైన మాప్నుయాత్. ౪౦. బ్రాహ్మణాదిజగన్మృత్యుసహితం యస్తు సంహరేత్, సోఽయముగ్రః కథం బోద్ధుం శక్యస్స్యాన్నియతిం వినా. ౪౧.

ప్రథమాధ్యాయము - తృతీయవల్లియొక్క వివరణము.

కో బోద్ధా కశ్చ బోద్ధవ్య ఇతిచే త్తా వుభౌ శృణు, బుద్ధిప్రవిష్టౌ జీవేశౌ బోద్ధృబోద్ధవ్యతాం గతౌ. ౪౨. అవచ్ఛిన్నో భవే జ్జీవో ఽనవచ్ఛిన్నో మహేశ్వరః, రథస్వామీ చ గంతవ్యదేశో యద్వ దుభౌ యథా. ౪౩. జీవం తం రథినం విద్ధి శరీరం రథ మేవ తు, జీవోపాధి మహంకారం సారథిం ప్రగ్రహం మనః. ౪౪. ఇంద్రియాణి హయా జ్ఞేయా విషయా గమ్యభూమయః, సారథ్యధీనా స్సర్వత్ర రథినః స్సదసద్గతిః. ౪౫. కర్తా సారథి రక్షాణి నియమ్య మనసా క్రమాత్, గచ్ఛ న్నంతర్ముఖో మార్గపారం విష్ణుపదం వ్రజేత్. ౪౬. ఇంద్రియాది ర్విష్ణుతత్త్వపర్యంతో వ్యాంతరక్రమః, ఇంద్రియేభ్యో భౌతికేభ్యో భూతేష్వాంతరతా స్థితా. ౪౭. తద్భూతేభ్యః సూక్ష్మభూతకార్యత్వా న్మన ఆంతరం, తతో ఽతిసూక్ష్మకార్యత్వా త్కర్తృత్వోపాధి రాంతరః. ౪౮. సమష్టికర్తృతోపాధి రాంతరో వ్యష్టికర్తృకః, సమష్ట్యాఖ్యమహత్త్వా త్తద్ధేత్వవ్యక్త మాంతరమ్. ౪౯. మాయాఖ్యా ఽవ్యక్తతో ఽప్యస్యాధారః పురుష ఆంతరః, పురుషా న్నపరం కించి త్సర్వం తేనైవ పూరితమ్. ౫౦. సద్రూపః పురుష స్తస్య సత్త్వే నాన్యత్ర పూరణాత్, అస్తీతి నిఖిలం భాతి పూరకః పురుషో మతః. ౫౧. వస్తుతత్త్వవిచారో ఽతః పురుషే ఽస్మి న్సమాప్యతే, గంతవ్యతత్త్వసీమత్వా ద్రథీ గచ్ఛతి తం క్రమాత్. ౫౨. రథినో వాస్తవం రూపం పూర్ణత్వం తదబోధతః, అవచ్ఛిన్నత్వ మేతచ్చ తద్బోధేన నివర్తతే. ౫౩. ఆత్మా సర్వేషు దేహేషు భ్రాంత్యా గూఢో న భాసతే, ఏకాగ్రయా సూక్ష్మయైతం పశ్యే త్తాచ్ఛీల్యవాన్ ధియా. ౫౪. ధియ స్తథాత్వం యోగీస్స్యా ద్యోగో భూమిచతుష్కవాన్, వాగ్ధీకర్తృసమష్టీనాం నిరోధా ద్భూమయో ఽభవన్. ౫౫. వాగాదికం బాహ్యమక్షం నిరుంధన్ శోషయే న్మనః, మనో నిరుంధ న్కర్తారం శోషయే ద్వ్యష్టిరూపిణమ్. ౫౬. సవికల్పక మేతచ్చ నిరుంధ న్నిర్వికల్పకం, ఆస్మీత్యేతస్మాత్మరూపం మహాంత మవశేషయత్. ౫౭. త మప్యంతే నిరుంధ్యాథ

శాంతాత్మా శిష్యతే స్వయం, క్షురధారేవ విషమో యోగో మందమతే రయమ్. ౧౮. క్షురో ఽతిలగ్నో దేహఘ్నో న లగ్న శ్ఛే ద్వపేత నో, సమాహితం మనో ఽప్యేవం నిద్రాం కుర్యా ద్బహి ర్వ్రజేత్. ౧౯. కౌశలం యోగినో ఽపేక్ష్యం నాపితస్య యథా క్షురే, నివార్య లయవిక్షేపౌ సమా దధ్యా త్పరాత్మని. ౨౦. శబ్దస్పర్శాదిహీనాత్మా సౌక్ష్మ్యా త్సౌక్ష్మ్యధియేక్ష్యతే, ఖంవాయ్వగ్ని జలోర్వీణాం స్థౌల్యం శబ్దాదిమత్త్వతః. ౨౧. శబ్దస్పర్శౌ రూప రసౌ గంధా భూతగుణా ఇమే, ఏకద్విత్రిచతుఃపంచగుణా వ్యోమాదయః క్రమాత్. ౨౨. గుణాధిక్యే స్థౌల్యవృద్ధి స్సౌక్ష్మ్యవృద్ధి ర్గుణక్షయాత్, నిర్గుణం చాతిసూక్ష్మత్వా దతిసూక్ష్మధియేక్ష్యతే. ౨౩. విద్యాయోగౌ యమేనోక్తౌ వైరాగ్యం నచికేతసే, స్వతఏవాస్త్వ్యుపాఖ్యానం నాచికేత మిదం శుభమ్. ౨౪.

ద్వితీయాధ్యాయము - ప్రథమ (చతుర్థ)వల్లియొక్క వివరణము.

ఏతదేవాతివిస్పష్టం పునశ్చాత్ర ప్రపంచ్యతే, శ్రూయతాం నచికేతో ఽత్ర విద్యాయాః ప్రతిబంధకమ్. ౨౫. ఇంద్రియాణి బహిర్ద్రష్టుం ససృజే పరమేశ్వరః, అత స్తైః ప్రత్యగాత్మానం న కశ్చి దపి వీక్షతే. ౨౬. సకామం చ మన స్తద్వ న్నిష్కామం చాత్మశుద్ధయే, సృష్టం తయో ర్యోగయుక్త మనసాఽఽత్మాఽవలోక్యతే. ౨౭. యచ్చైతన్యానుగ్రహేణ రూపాదీ నింద్రియైః పుమాన్, జానాతి యేన స్వప్నాది దృశ్యతే తద్వివిచ్యతామ్. ౨౮. చైతన్యేన జడం జ్ఞేయ మిత్యుక్తే శిష్యతే ఽత్ర కిం, అజ్ఞానం నిఖిలం ప్రజ్ఞం చైతన్యం బ్రహ్మవస్తు హి. ౨౯. యద్వేదై రపి సందిగ్ధం య త్పృష్టం నచికేతసా, ధర్మాధర్మాద్యతీతం య త్తదిదం బ్రహ్మ వర్ణితమ్. ౩౦. యః కర్మఫలభోక్తా ఽస్తి జీవః ప్రాణాదిధారకః, ఉపాధితో వివిచ్యైతం జ్ఞాత్వే శం న జుగుప్సతే. ౩౧. జుగుప్సా యోనిసంప్రాప్తి ర్నాఽసా వేతస్య విద్యతే,

జగత్కర్తృతయా లక్ష్య ఈశోఽయం తస్య కా జనిః. ౨౨. యద్దేహేఽస్తి తదేవైష వేదేషు బ్రహ్మ గీయతే, మృత్యోస్స మృత్యు మాప్నోతి యోఽత్ర నానేవ పశ్యతి. ౨౩. మనసైవేద మాప్తవ్య మేకాగ్రేణచ జీవయోః, తత్త్వ మద్వైత మేతస్మి న్యోగభేదం న పశ్యతి. ౨౪. హృన్నిష్ఠో బుద్ధ్యవచ్ఛిన్నో జీవో హ్యంగుష్ఠమాత్రకః, ఉపాధ్యపగమే సోఽయ మీశానో భూతభవ్యయోః. ౨౫. వృష్టం జలం పర్వతాగ్రే బహుధాఽధోగతిం వ్రజేత్, జీవేశభేదదృక్చైవం బహుయోనిషు జాయతే. ౨౬. వృష్టంతు నిర్మలే కూపే సుస్థితం పీయతేఽమృతం, తథైవ బ్రహ్మతాం స్వస్య విజాన న్ముచ్యతే సుధీః.

ద్వితీయాధ్యాయము-ద్వితీయ (పంచమ) వల్లీవివరణము.

పురమేకాదశద్వారం నాభిమూర్ధన్యసంయుతం, దేహాఖ్యం యస్య తం దృష్ట్వా విముక్త స్స న్విముచ్యతే. ౨౭. జీవ స్త్వవిద్యా కామాదిబంధైర్ముక్తోఽమృతః పునః, శరీరగ్రహణాభావా ద్విదేహస్స న్విముచ్యతే. ౨౮. ప్రాణ మూర్ధ్వం నయత్యాత్మాఽపానవాయుం నయత్యధః, తస్యైవకా శ్చక్షురాద్యా లింగేనాత్మాఽనుమీయతామ్. ౩౦. సకర్తృకాః ప్రాణచక్షురాద్యాః స్యుస్సాధనత్వతః, కుఠారవ త్తతో నాయ మస్తీత్యేత న్నిరాకృతమ్. ౩౧. ప్రాణాపానవశా ద్దేహీ జీవతీతి యదుచ్యతే, త న్న ప్రాణాద్యాశ్రయో యః కర్తా తేనైవ జీవతి. ౩౨. స కర్తాఽస్మి న్మృతే దేహే స్వకర్మవశతః పునః, విప్రాదియోనిమాప్నోతి లతావృక్షాదివా మతః. ౩౩. దేహా నీచోత్తమా తాదృక్కర్మ కర్తృపురస్సరా, నీచోత్తమత్వా త్ప్రాసాదపర్ణశాలా యథాతథా. ౩౪. సుప్తేష్వక్షేషు యః స్వప్నే కామం కామం సృజత్యయం, దేహాతిరిక్త స్తం కో వా నిరాకర్తుం ప్రభు ర్భవేత్? ౩౫. జీవాత్మానం ప్రసాద్యైవం తస్యైవోపాధ్యుపాయతః, బ్రహ్మతాం వేత్తి జగత ఆధారత్వేన లక్షితామ్. ౩౬. అగ్ని ర్యథైకః కాష్ఠేషు ప్రవిశ్య బహుధా భవేత్, తథాఽఽత్మా త్వేక ఏవైష దేహేషు బహుధోచ్యతే.

౮౭.వాయుశ్చైకోఽపి దేహేషు ప్రవిశ్య ప్రాణరూపతః, బహుధా భాత్యేవ మాత్రా ప్రత్యుపాధి పృథ గ్భవేత్. ౮౮. సర్వచక్షుఃస్థరూపోఽపి న రవి ర్నేత్రరోగభాక్, సర్వాత్మత్వేఽపి తద్బ్రహ్మ తథా దుఃఖైర్న లిప్యతే. ౮౯. సర్వభూతాంతరాత్మైకః స్వతంత్రో మాయయాఽఽవృతః, ఏకం స్వం బహుధా కుర్యా ద్బహురూపో యథా నటః. ౯౦. మాయోపాధిక ఈశో ఽయం బుద్ధ్యుపాధిమతాం నృణాం, కర్మానుసారిణః కామా న్విదధాత్యుప భుక్తయే. ౯౧. స్వచిత్తస్థం సాక్షిరూప మీశం పశ్యంతి యే నరాః, తేషాం నిత్యా దుఃఖశాంతి ర్బ్రహ్మానందశ్చ శాశ్వతః. ౯౨. అనిర్దేశ్యం తమానందం ప్రత్యక్షం మన్వతే బుధాః, సదృశో వా స్వప్రకాశ ఇతిచే న్నస దృశ్యతే. ౯౩. న భాసయంతి సూర్యాద్యా బుద్ధ్యాద్యా శ్చ స్వయంప్రభం, కింతు భాంతం త మన్వేతే భాంతి భాసా తదీయయా. ౯౪.

ద్వితీయాధ్యాయము-తృతీయ (షష్ఠ) వల్లీవివరణము.

